

KAVYAKUSUMAVALI

(ORIGINAL TELUGU POEMS ON VARIOUS SUBJECTS)

PART I.

BY

VENKATA PARVATEESWARA KAVULU

WITH A FOREWORD BY

T. RAJAGOPALA RAO GARU, B.A. L.T., M.R.A.S., (LOND.)

Superintendent of Vernacular Studies, Madras Christian College, and Member, Telugu Board of Studies, Madras University, Member of the University Senate, Chairman, Government Telugu Text Book Committee, etc., etc.

ANDHRA PRACHARINEE GRANTHA NILAYAM,
COCANADA.

KAVYAKUSUMAVALI

(ORIGINAL TELUGU POEMS ON VARIOUS SUBJECTS)

PART I.

BY

VENKATA PARVATEESWARA KAVULU

WITH A FOREWORD BY

T. RAJAGOPALA RAO GARU, B.A. L.T., M.R.A.S., (LOND.)

Superintendent of Vernacular Studies, Madras Christian College, and Member, Telugu Board of Studies, Madras University, Member of the University Senate, Chairman, Government Telugu Text Book Committee, etc., etc.

ANDHRA PRACHARINEE GRANTHA NILAYAM,
COCANADA.

FOREWORD.

When the famous Venkata Parvateesvara Kavulu asked me to write a foreword to these poems, I had to consent to it with some reluctance, as I felt that the task ought to have fallen into worthier hands. The present age in the Telugu literary world may fitly be called the age of Venkata Parvateesvara Kavalu for to them the Telugu novel owes its present day perfection, and Telugu poetry is by them made to run into new phases and ways of thought that it had never reached before. Theirs is an epoch in the history of Telugu literature that can never be forgotten. Within a space of fifteen years, these great poets produced more than a hundred volumes in Telugu, and nearly a lakh of thier books are now in circulation in the Telugu country eagerly sought out, read and enjoyed. And one should naturally feel nervous to write a foreword to the writings of such authors.

Venkata Parvateesvara Kavalu are poets by nature, that had to take to prose writing because of the great need for it in the Telugu language. Much of their prose, however, is really poetry, for, as a great writer had remarked, there is much poetry in what is

really prosaic, and there is much prose, which is markedly poetical. In an age like the present, when a new culture has opened up its treasures before us, it is impossible to resist its influence on human thought and activity, and the new age of Renaissance that began with my great Guru, Rao Bahadur K Veeresalingam Pantulu, received its present day perfection alike in prose as in poetry in the voluminous productions of these ourpoets. There was a time when Sanskrit exerted its influence on our language, and the venerable roll of poets from Nannaya onwards has bequeathed to us a glorious literature which echoes the genius of our language and of our ancient race, through the ideals that Sanskrit had presented to us. But oriental culture had its limitations, and would not outgrow its conventions. A stage of progress has thus been reached in the history of our language, beyond which it would not develop, and the Telugu poetry of our later period thus became purely conventional, and had no new phases and walks of thought to exhibit. The life of our nation as of our literature soon became dull and monotonous and it was therefore necessary to put new force into it, if only to arrest old age and decay. Such are the epochs in history, when great heroes are born, but in Telugu literature, it was to a new culture, the culture of the west, that the fresh life has been due. The march from the oriental into the

western lines of thought is a march from the marked artificialities of the east into the real and the natural. Here, we no longer indulge in the pompous hyperboles and in the highly artificial *utprekshas,* but look into life as it is truly lived, and into nature as it really presents itself to us. And it is this culture,—completely *Indianised* - that in the two Volumes now before us our authors have attempted to delineate. Kavya Kusumavali has thus the glory of being the first production, of any considerable length, in the Telugu language, that exhibits this harmonised culture, in poetry.

And what is western poetry? It is as Mathew Arnold tells us a criticism of life, under the conditions fixed for such a criticism by the laws of poetic truth and poetic beauty. A book in poetry is not merely a rhymed treatise intended to impart knowledge; it must yield æsthetic satisfaction.It involves the intellectual, the emotional and the imaginative elements, as also the technical element called style. As Carlyle puts it, style is not the coat of a writer, but his skin and as Hudson has it, sincerity is the foundation principle of all true style. Style is the real essence of the author's personality and cannot be produced by artificial means. It is an echo of the life and feeling of the writer. Poetry is thus a fine art intended to yield

æsthetic pleasure and involves the intellectual elements of precision, lucidity and propriety, the emotional elements of force, energy, and suggestiveness, and the æsthetic elements of music, grace, beauty and charm. As an English writer puts it "it is the one characteristic of poetry then, that whatever it touches in life, it relates to our feelings and passions, while at the same time, by the exercise of imaginative power it both transfigures existing realities and gives to airy nothing a local habitation and a name." Fidelity to nature, not perversion of it in the name of a figure of speech, is one of the main essentials of poetry. It is a purely subjective process of dealing with nature; it is not misrepresentation or distortion of it; not pathetic fallacy, as Ruskin puts it; nor sympathetic illusion, as Holmes expresses it.

"The objects of the poet's thought are everywhere," says Wordsworth, but the emotionalisation of them constitutes his true genius. He has the 'vision and the faculty divine,' by which he leads you through sensuous beauties to their spiritual meanings. The poet shows us and makes us know, what in real nature we so often see and yet know not. Nature is called into service in poetry for a variety of reasons. It may be for the simple delight of it, or for the sensuous love of its beauty. It is used metaphorically as a source of imagery and for illustration. It may serve as a background to emotion or action or to revive our thoughts

of an event through association. It may on the contrary be set against man's life and his littleness and imperfection. The indifference of nature to life, or its sympathy and fellowship and the boundless spiritual meanings, that it suggests are likewise used by the poet in his feelings, emotions, and thoughts, and these constitute the subjective element of such poetry.

These in brief are some of the characteristics of western poetry. Though Indian poetry is considered to be highly artificial, it cannot be said that the natural is unknown to it. The purely artificial can never make poetry. Poetry is enjoyed in so far it is in tune with nature; not where it is unnatural and entirely out of touch with human mentality. No poetry can live that is divorced from nature. And some of our Telugu Poets like Nannechoda, Tikkana, Nachana Somanatha Kavi, Pingali Surana, Potana and others have more of this power of depicting nature and of touching our minds than some others. If the glories of western culture are seen so richly depicted in the poems of these poets, one naturally wonders, how they that have not much English education were capable of enriching our literature so vastly. The truth is that the natural in Telugu poetry appealed to them more than the artificial, and some of the best productions of English poetry seen by them in original

or in their translation, or brought to their kno wledge by conversations with English-knowing men so awakened their natural feelings, as to choose for them their future career. It was so early as 1904, long before the name of Sir Rabindranath was known that some of their earlier poems were published. The thought of the natural developed gradually in them as time went on and we may perhaps note its regular development in these poems in the Saguna form of prayer that begins the first volume and in the strikingly natural poetry that the thanksgiving in the second volume presents. By the time the poetry of Rabindranath began to show its influences in the Telugu country, our authors had gained a distinct individuality of their own, as the study of these poems in their chronological order amply indicates, and the new ebullition of poetic thought of the type of Rabindranath, now seen in the Telugu press, is only of a later date still in its infancy.

What then is the source of this enrapturing poetry of these authors? Why are we led to think that we are reading a Gray, a Thompson, a Wordsworth, or a Keats, when we are reading some of these poems? How have our authors been able to depict the glories of western thought, though they are not themselves masters of the English language? The answer is easy to fin l. Their poetry is the harmonious blending

of the east with the west;—not that the west is imported wholesale into the east, but that the ideals of the west have been taken to be goal of all natural poetry. A poet is one that feels and says, not he who merely conveys ideas. Of a natural bent of mind, our poets lived and moved and had their being in the natural in Telugu poetry, and by constant thought, and application, by true love and feeling, by life itself with all the currents of its activity, they became the bards of nature and the enjoyers in their souls of a heaven that is the *own* of a poet of nature. If the west gave them the ideals, the east gave them the life their own, and eastern life on the most natural ideals of western poetry is the achievement of their inner experience. Thus have the east and the west harmonised themselves in the inner souls of these famous poets, and the poetry that we see in these volumes is the ebullition of this heavenly harmony that has opened up a new culture for the Andhras.

The passion roused by such life and experience has with these poets grown into a religion. Their *Ekantaseva* not included in these volumes is the most glorious production of the age that through nature spiritualises, and places us before the feet of God, in a heaven that these poets have given to man on earth. This spiritual aspect of natural poetry is not a mere borrowing, but real life, actually felt, and it

nature is uniform, the highest that it can give us whether in Europe or in India cannot but be the same.

The poetry of Venkata Parvateesvara Kavulu is thus the natural poetry of the east and the west, in its best Indianised form. The eastern ideal has here gone a step farther towards the spiritual, while the western ideal has been felt even as an Indian poet can feel it in his most natural Indian way, so as to reach the end that the west has set for it.

With these remarks, I commend these poems to the public and if the reader has seen in them the essential features of western culture as are indicated in these lines, I have no hesitation in saying that a new age has dawned for poetry in the Andhra, *viz.*, the age of Venkata Paravateesvara Kavulu.

T. RAJAGOPALA RAO,

ఓం.

కావ్యకుసుమావళి.

ప్రథమభాగము.

వేంకటరామకృష్ణకవులు.

ద్వితీయకూర్పు 500 ప్రతులు.

1924.

పద్యపాదసూచ్యసంకలితము.] [వెల రు 1-12-0.

వలయువారు :—

మేనేజరు, ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము,

కాకినాడ.

పిఠాపురము.

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల.

1924.

ఆమోదము.

" సరసాశ్రయం బైన సురసాలమం బైనఁ గలికింతి వినుమాఁగలదె చూడ
మనురాభిమతఫల మందారమం బైన సకిఁ గాని నిపుణాకృతులఁ గలదె చూడ
సర్వోత్తమం బైన సంతానమం బైన నెలఁతనేఁటి విరిసేయఁగఁ గలదె చూడఁ
గామితార్థప్రద కల్పకం బం బైనఁ జిలుకఁ దీయనిఫలంబులఁ గలదె చూడఁ
గాని సర్వపదార్థసంకలితకావ్య
పారిజాతంబుఁ గని పల్లవప్రసూన
పరిమళమరంద పరిపక్వఫలరసములు
నన్నిటిఁ గనస్తుఁ [illegible] "

స్వభావసిద్ధ మగుప్రకృతిసౌందర్యమును గాంచువాఁడు కవి. స్వభావానురూప మగుసౌందర్యమును సృష్టించువాఁడు కవి. సహజసౌందర్యమున స్వాదుమాధుర్యము ననుభవించువాఁడు కవి. విశ్వసౌందర్యవిశిష్టమూర్తియే కవి.

బ్రహ్మసృష్టి యంతయును సౌందర్యమయ మైనదియే. కాని కవిబ్రహ్మసృష్టి సౌందర్యమయ మైనదియు మనోహర మైనదియు నగుచున్నది. బ్రహ్మ కేవలము ప్రకృతిసౌందర్య ప్రదర్శకుఁడు మాత్రమే. కవిబ్రహ్మ ప్రదర్శకుఁడును బోధకుఁడును గూడ నై యున్నాఁడు.

సౌందర్యము హృదయాకర్షక మైనది. కవిబ్రహ్మ యిట్టి పరమోత్కృష్టసౌందర్యమును సృష్టించి దానిమూలమున మానవహృదయకమలములను వికసింపఁజేసి పవిత్రసౌరభముల నెల్లెడల వెల్లివిరియఁ జేయుచున్నాఁడు. మఱియుఁ దనకావించిన పవిత్రసృష్టిసౌందర్యమునం దనురాగమును గల్పించి మానవ హృదయములనుండి యపవిత్రభావములను దొలఁగించుచు నాతఁడు నిజధర్మమును నెఱవేర్చుకొనుచున్నాఁడు.

కేవలము నీతిని బోధించుటయే కవికృత్యము గాదు. కాని, నీతిబోధకునకును, గవికిని గలపరమోద్దేశముమాత్ర మొక్కటియే. కవి యనినఁ, బ్రబలశాసకుఁడు గానిప్రభువు; తీవ్రోపదేశకుఁడు గానిదేశికుఁడు. హితచింతకుఁడగుమిత్రుఁడు ను, బ్రియకల్పకుఁడగుబంధుఁడును గవియే. మిత్రత్వశత్రుత్వ ములును, రాగద్వేషములును లేని నిత్యనిర్మలజీవనుఁడు కవి.

కవి తనకవితామృతరససేచనమున నిర్జీవపదార్థములకు జీవకళలను, జీవలోకమునకు దివ్యతేజమును గల్పించుచు జగ త్కల్యాణముంగూర్చుచున్న నీతివేత్తకంటెను, ధర్మబోధకుని కంటెను, మతకర్తకంటెను, దండశాసకునికంటెను, మండలేశ్వ రునికంటెను మానవసమాజమునఁ బ్రధానుఁ డగుచున్నాఁడు.

కవిత్వము దైవదత్తమగుదివ్యశక్తి. కావుననే యది నశ్వరంబు లగుపదార్థములకు శాశ్వతత్వమును బ్రసాదింపఁ గలుగుచున్నది. నిత్యమును, నిశ్చలము నగుకవితాశక్తి యెదుట

క్షణక్షణపరిణామశీలమును, జంచలమును నగుకాలశక్తి యెంత మాత్రమును దనపరాక్రమమును జూపఁజాలదు. సర్వకాలముల యందును, సకలదేశములయందును, సమస్తపాత్రములయందును గవితాశక్తి తనసంపూర్ణాకారమును బ్రవర్తింపఁ జేయుచు సకలంబునకును నిత్యనూతనవికాసముం గల్పించుచుండును.

కవితాగానమునం దమృతమాధుర్యము కలదు. సర్వజీవహృదయసంతాపనివారణకారణం బగునమ్మధురగానమున సమ్మోహనాకర్షణశక్తులు రెండును మూర్తీభవించియుండును. ఆదివ్యసంగీతశ్రవణమాత్రముననే మానవహృదయకుసుమములు వికసించి ప్రశాంతోదారభావపరిమళములచే విలసిల్లుచుండును. ఆగానామృతరసతరంగములు తమయందుఁ బ్రతిబింబించుచున్న యమృతమయుండగు సర్వేశ్వరుని యానందకళలను స్ఫురింపఁజేయుచు దుఃఖమయంబులగు మానవజీవితంబులకుఁ గూడ సుఖానుభవముం గూర్చుచుండును. జగదానందదాయకంబగునమ్మోహనసంగీతమువలన మానవహృదయంబులును, మానవశరీరంబులునుగూడ వినిర్మలవికాససౌందర్యమయంబులగుచుండును.

ఆగానామృతమాధుర్యము నిత్యనూతనమైనది. ఆగానామృతతరంగనినాదము నిత్యానందదాయకమైనది. ఆగానామృతవిమలతేజము నిత్యజగత్ప్రకాశకమైనది. మహర్షియగువాల్మీకి

శ్రీరామనామముతోడను, భగవానుడగు బాదరాయణుడు శ్రీకృష్ణనామముతోడను, కవిరాజశిఖామణి యగునన్నెచోడమహారాజు గురుపరమేశ్వరనామంబుతోడను, కవిబ్రహ్మయగుతిక్కనసోమయాజియు, నవీనగుణసనాథుండగునాచనసోమనాథుండును హరిహరాద్వైతనామంబుతోడను నాకోమలమధురమోహనగానమునే, ఆలాపించి—ఆలాపించి—యనవరతసాంద్రానందామృతతరంగమాలికలలో మానవహృదయకమలముల నోలలాడించియున్నారు.—ఓలలాడించుచున్నారు.

ఆమధురామృతగానమే కవితాగానపరవశులగు చి॥ మావేంకటపార్వతీశ్వరుల కాదర్శమైన దని నేను గర్వించుచున్నాను. ఈయిరువురును నా కాత్మీయులు; బాల్యమునుండియు నాకఱపుల నెఱింగినవారు; నాచనవున మెలంగినవారు. ఇక్కవిద్వయమునందు చి॥ బాలాంత్రపు వేంకటరావునకు "మల్లాము" గ్రామమును, చి॥ ఓలేటి పార్వతీశమునకు "తామరగిరి" గ్రామమును జన్మస్థానము లై వెలయుచున్నవి. ఈరెండుగ్రామములును గోదావరీమండలాంతర్గతమగు మా పీఠికాపురసంస్థానములోనివి. వీరిరువురును వరుసగా విక్రమ చిత్రభానువత్సరములయందు జనియించిరి.

షడ్జపంచమములవలె భిన్నైక్యసంబంధమునఁ గలసి, శబ్దార్థములవలె నవినాభావసంబంధమున వెలయుచున్న యిక్కవిద్వయభావసమ్మేళనమూలాధారమునుండి కవితామృతరస

వాహిని వెలువడి నానాముఖములఁ బ్రవహించుచున్నది. చిర కాలమునుండి యాంధ్రలోక మాదరముతో నందులనుధారస ము నాస్వాదించుచునేయున్నది. ఈసమ్మేళనమే వంగభాషా కవితాసౌందర్యము నాంధ్రలోకమునకుఁ బరిచితముంగావించి నది. ఈసమ్మేళనమే యాంధ్రకవితాకల్పకోద్యానవనవాటిక యందు 'ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము' అను సరస్వతీ విలాసమందిరమును నెలకొలిపి వివిధవిజ్ఞానకళలను వెలయించు టకు హేతుభూతమైనది. ఈసమ్మేళనమే యాంధ్రభాషామతల్లికి వినూత్నంబును, మనోజ్ఞంబు నగు 'కావ్యకుసుమావళి'అను నీ "అష్టోత్తరశతపారిజాతప్రసూనమాలిక" ను సమర్పించినది.

కావ్యకుసుమావళియందు దరవికసితంబులును, బరిపూ ర్ణతావిలసితంబులును, మృదులతాకలితంబులును, బరాగలలి తంబులును, సౌరభోచ్ఛ్వసితంబులును, మరందపరిపూరితంబు లును,బహువర్ణవిభాసితంబులునగువివిధకుసుమములు విరాజిల్లు చున్నవి. వానిసౌందర్యసౌకుమార్యసౌరభమాధుర్యములు స రసజనహృదయాహ్లాదకరవిమలనుమమాధుర్యములై యొసలారు చున్నవి. ఆంధ్రభాషాసరస్వతి నధిక భక్తిపూర్వకముగ నర్పిం చుచున్న యిక్కవిద్వితయమనోజ్ఞభావప్రసూనముల క్రమక్రమ పరిణామ మిందు విస్పష్టముగఁ గానవచ్చుచున్నది.

కవితాగానపారవశ్యమున నానందవిహారము గావించు చున్న కవిభావనందనోద్యాన మనందగు నీకావ్యమునఁ బ్రి

ప్రథమమున " అక్షర " కుసుమము గానంబడుచున్నది. ఇందు పదసంపత్తి లలితంబయ్యును విన్నాణంపుజిగిబిగి యింకను గుబురుకొనలేదు :—

" ఒక్కొక్క తైల మొక్కొక్క రూపు నొండొంటిఁ గలసి
వేఱుపోలిక నందుచు విశ్వగతుల
వలన వివిధాకృతులఁ దాల్చి వఱలుచుండు
నట్టి యనశ్వరత్వంబు నరయవలెను."

ప్ర. భా. 4 పుట.

అర్థగౌరవము పరిపూర్ణంబయ్యును విశదంపుమిసిమియింకను నెలకొనలేదు :—

" ఆత్మనిర్వృతికో, పరమాత్మ దేవు
నరయుటకో, పరమార్థ తానగుటకో యకో
సంచరింపంగఁ బరిపక్వజ్ఞానమునకు
సాధనంబైన పెల్ల యక్షరము కాదె,"

ప్ర. భా. 6 పుట.

భావసౌందర్యము మనోజ్ఞంబయ్యును బరువంపునెఱతనమింకను విరియఁబాఱలేదు—

" ప్రకృతిశక్తులలోన విశ్వమునివెనుక
నిలువఁబడియున్న మానవకులము నెల్ల
నెలమిఁ బై మెట్టు నెక్కింపఁగలుగుటకును
సాధనంబైన పక్షరజ్ఞానమొకటె !"

ప్ర. భా. 6 పుట.

ఈయుపగీత మొక్కవోనికవితాకల్పవల్లికి భవిష్యదభ్యు

తఫలోదయసూచకము దరవికసితకుసుమము. ఐనను, దిగంత వ్యాప్తములై జగదామోదదాయకములై శాంతములగునభినవకవితావిలాససంపూర్ణసౌరభములను వెలయింపఁజాలుపరాగలేశములును, నిత్యనూతనములై నిరంతరాస్వాదమధురములై నిర్మలములగు శాశ్వతకావ్యానందరసమకరందధారలఁజాల్వఁజేయు రసశీకరంబులును నీయరవిరికుసుమమునఁ గానవచ్చుచునే యున్నవి.

> " ఎంచఁగారానిశబ్దప్రపంచమందు
> వేలువేలురూపంబుల వెలయునీదు
> విమలపదముల నాత్మ భావించుచుందు
> పునితమును మాకుఁ దోఁప్పడు మధురంబ"
>
> ప్రి. భా. 3 పుట.

అను 1910 సంవత్సరమునాఁటి యీయరవిరికుసుమము 1921 సంవత్సరమునాఁటికి—

> " అన్యూనసురభిళమృదులకాంతములతోడ
> అన్యూనపరిపక్వఫలగుళుచ్ఛములతోడ
> అన్యూనసమాధురీమూర్తి వైననిన్నుఁ
> గంటిమోతల్లి ! సుకవితాకల్పవల్లి !"
>
> ద్వి. భా. 174 పుట.

అను లలితమృదులవికచసురభిళమధురప్రసూనముగాఁ బరిణమించినది.

ఇాందీయమధురగీతము మొదలు గురుభక్తివలఁకునుగల పదియాఁటుకుసుమములు నించుమించుగ దరవికసితకుసుమము

లే యని చెప్పవచ్చును.

పదునేడవకుసుమమగు "చందమామ" పున్నమచంద మామవలెనే గడిదేఱిన పరిపూర్ణవిలసితకుసుమము. ఈ "చందమామ"—

"చెట్లకొమ్మలసందులచెంతఁ జేరి
యారినచిగుళ్ళలో మంచునీరు వోసి
యెన్నియో ముత్తియములఁ గాపించుచుండె" ను.

ప్ర. భా. 85 పుట.

మఱియు—

"సరిగ లేఁజిగురాకులసందులందు
నెన్నియో వెండిపూలఁ జేయించుచుండఁ
గనుమఱపి చూడ మింటికిఁ గంటి కొకట
వెండితీఁగ లెన్నెన్నొ గల్పించుచుండె"ను.

ప్ర. భా. 85 పుట.

ఇంతటినుండి కవితాచంద్రిక కవులలేఖినినుండి చెలువంపువెన్నెల వెలయింపఁదొడంగినది. ఈచిన్నెలవన్నెలచెలువంపులేఖిని విమలసుధారసముతో వెలఁది వెన్నెలలను జిత్రించినది; అవ్యక్తమధురస్వరముతోఁ గోకిలగానము నాలాపింపఁ జేసినది; చిత్రగతులచేఁ జిన్నిబిడ్డల

"ఆరుబైటవెన్నెలకుప్పలు... ... ...
"చిట్టిమిరియంబులును జిప్పచిప్పగోళ్లు
చెన్నుచెక్కులు— ... ...'

ప్ర. భా. 79 పుట.

మొదలగు లీలాఖేలనములను బ్రదర్శించినది. మఱియును

ముద్దులొలుకు జిలిబిలిపలుకులతో—

"* * * మాతల్లి! జాబిల్లిఁజూచినావె * * *
అల్లరులఁజేయ కాటల నాడుచుండు;
మంకుపిల్లలఁ గూడఁడు మంచివాఁడు
బుద్ధిమంతుఁడు కొండపైఁ బోవుచుండు;
చల్లఁదనమిచ్చు వెన్నెలఁ జాలనిచ్చు
నేఁడునాతల్లి! నినుఁజూచినాఁడితండు
బువ్వదినకున్న జాబిల్లినవ్వునమ్మ!"

ప్ర. భా. 80 పుట.

అను ప్రేమమయియగుతల్లి బిడ్డను బుజ్జగించుమాటలను,

"అమ్మ! యీచిన్నిజాబిల్లి కమ్మయెవరు?
ఈతనికి బువ్వపెట్టువా రెవ్వరమ్మ
* * * * * * *
పోరుపెట్టఁడె కొండపైఁ బోవలేక
భయమువేయదె క్రిందికిఁబడునో యేమొ?"

ప్ర. భా. 81 పుట.

అను ముద్దులబిడ్డ ముగ్ధాలాపములను వినిపించినది. కాని—

"రాత్రియైనను నింటికిరాక బయలఁ
దెల్లవాఱినదాఁకను దిరుగునేమొ?"

ప్ర. భా. 82 పుట.

అను నీచిన్నిబిడ్డపలుకులో మాతృప్రేమ కవిగాననగుచున్నాఁడు.

ప్రకృతిరామణీయకసందర్శనమునఁ గవిహృదయ మిప్ప టి కింతవఱకు వికసించినది. "చందమామ" మొదలు "* * తేపు" వఱకునుగల నాలుగుకుసుమములు నించు

మించుగా నొకరకములోనివే.

ఇరువదియొకటవకుసుమము ప్రణయకోపము. ఇది పరిపూర్ణవికాసమృదులతాకలితము. ఇందుపోతనామాత్యుని శబ్దార్థసమ్మేళనసౌందర్యమును, ముక్కుతిమ్మనార్యునిరసభావసమాకలనప్రాచుర్యమును బొడసూపుచున్నది. రాధాకృష్ణుల యీచిన్నసంఘటనమున వారిస్వరూపస్వభావములతోఁ బ్రణయకోపతత్త్వము మనోహరముగా వెల్లడింపఁబడినది.

"ఎదురుకొనుకొలందిని గోప మెచ్చుచుండు
నెడసిచనుకొలందిని బ్రేమ హెచ్చుచుండు"

ప్రి. భా. 101 పుట.

అని ప్రణయకోపతత్త్వమును గవులొక్కమాటలో నిర్వచించియున్నారు. బాహ్యప్రకృతి సహజసౌందర్యమును, భావనాప్రకృతి సంసృష్టసౌందర్యము నిందు హృదయంగమముగఁ బ్రదర్శింపఁబడినవి.

ఇందు గవితాకన్య, యలరుమొగంబునఁ జిఱునవ్వులొలుకుచుండియును వాలికచూపుల నెలయించుచున్నట్లును, మనసువిచ్చి ప్రేమమధురభావమును వెలువరించుచుండియును బలుకరింపకయున్నట్లును, మనోహరోచితవసనాలంకారవిభూషితయై హొయలుమెఱయ నెట్టయెదుట సాక్షాత్కరించియును కవులకునించుక యెడముగ నిలిచియున్నట్లును దోఁచుచున్నది.

దీనితరువాత "మణికము, భాగ్యము, ఆత్మసఖుఁడు"

అను మూఁడుకుసుమములు గలవు. ఇరువదియైదవకుసుమము రాజభక్తి. ఇది మన కేలికయగు జార్జిసార్వభౌముని భారతరాజ్యపట్టాభిషేకశుభసమయమునం దర్పింపఁబడిన ప్రభుభక్తిసూచకమగు కుసుమరాజము. ఇందుఁ బ్రభుప్రకృతుల యన్యోన్యానుబంధావశ్యకతంగూర్చిన యభివర్ణనము వెలయుచున్నది.

26, 27 కుసుమములు కవికావ్యగీతములు. ఇప్పటికిఁ గవులకు సుస్థిరాదర్శ మేర్పడినది. కవితాసరస్వతిసుప్రసన్నవదనముతోఁ, బ్రేమపూరితహృదయముతో, నమృతమధురవచనములతో "కవీంద్రా!" అని పరమానుగ్రహమునఁ బలుకరింపఁ బ్రారంభించినది; ప్రకృతిరామణీయకమును బ్రదర్శించుచుఁ బ్రకృతిరహస్యములను వెల్లడించుచుఁ, బరతత్త్వజ్ఞానము నుపదేశించి—

"విమలనవనీతమృదులశబ్దములఁగూర్చి
రమ్యభావప్రబోధకార్థములఁగూర్చి
* * * * *
మహితమై మానితంబైనమననుతోడ
దివ్యమై ధీయుతంబైనదృష్టితోడ
* * * * *
భావముగరంచు దృశ్యకావ్యములనైనఁ
జవులఁబుట్టించు శ్రవ్యకోశములనైన
మహితగతి వ్రాయుమా! వ్రాయుమా! కవీంద్ర!"

ప్ర. భా. 158 పుట.

అని హెచ్చరించుచుఁ గవితాతత్త్వమును బ్రబోధించినది.

మఱియు—

"ప్రకృతి నీతోడ మనీషవై పలుకుచుండ
స్వస్థచిత్తతగల దంతె చాలు నీకుఁ
గ్రాహ్యనిర్దేశములఁ బరికరములరసి
చూచుకొననేల? కవిత నీసొమ్ము కాదె?"

ప్ర. భా. 159 పుట.

అని యనుగ్రహించి ప్రకృతిని వశవర్తినిం గావించి యుత్సాహముం గల్పించి

"జగతి నీమాట మీఁదుగా జరుగుచుండు
జగతి నీచేత సంస్కృతమగుచునుండు
జగతి నీచూపుత్రోవనే చనుచునుండు
జగతి ధన్యంబనఁగ నీవె సత్కవీంద్ర!"

పరి. భా. 164 పుట.

అని యాశీర్వదించినది.

ప్రేమస్వరూపిణియు దివ్యతేజోమయియు నగునా దేవీ మూర్తి సాక్షాత్కారసుప్రబోధశుభాశీర్వాదమహిమవలన నా తత్కవిద్వయవిజ్ఞాననయనచతుష్కము వికసించి

"అరసి చూడ నిరర్థకమగునయేని
సక్షరసమష్టియే పదమనఁగరాదు;
లోకహితలక్షణయుతంబు గాకయున్నఁ
బద్యగద్యాత్మకంబె కావ్యంబుగాదు;
ఉచితగతి రసభావంబులొప్పకున్నఁ
గవులు వ్రాసినదంతయుఁ గవితగాదు"

ప్ర. భా. 170 పుట.

అను సత్యమును గ్రహింపఁజాలినది. ఇంతటినుండి కవితాకుసుమములకు భావసౌరభ మభ్యుదయింపఁదొరఁకొనినది.

28, 29, 30 కుసుమములలోఁ బ్రేమతత్త్వనిర్వేదకాతుకభావములు గుబాళించినవి.

31 కుసుమము రాధ. ఈచిన్నికుసుమమునందుఁ బ్రేమతన్మయ మగుకవిహృదయములోనియీశ్వరహృదయపరిశీలనలాలసత యనియెడిసౌరభతరంగము తులలింగలించినది:

"అంజమునకును బ్రేమింతువా మహాత్మ!" అని—

ప్ర. భా. 180 పుట.

32 కుసుమము ప్రకృతిప్రబంధకర్త. ఇది భగవల్లీలలను గానముచేయునత్యుత్తమగీతములజాతిలోనిది.ఇందుసరస్వతీసముపదేశమహిమంబున సంపూర్ణవికాసముంగాంచిన కవిహృదయము బాహ్యప్రకృతి నతిక్రమించి, భావనాప్రకృతి నుత్తరించి, దివ్యపథము నధిగమించి దివ్యతేజస్సందర్శనేచ్ఛాపారవశ్యమున :—

"దేవదేవ ! మహాత్మ! త్వదీయదివ్య
భావబోధకవిశ్వప్రబంధమందు
నెచట శ్రీరామ చుట్టితి వెచటఁ జిత్త
గింపవలె నని వ్రాసి ముగించినావు ?"

ప్ర. భా. 180 పుట.

అని యుచ్చైస్స్వనంబున దివ్యగానముం గావించినది. ఈమధురకవిగానమున విశ్వ మంతయును "ఎప్పటికప్పుడే యభినవ

ము ను, నతిమనోహరమును, సురసాశ్రయమును, సత్యమును, సార్థకమును, సమధికమును, సర్వజనసమ్మతమును, సలలితము” నగుమహాకావ్యమైపోయినది. అవ్విశ్వమునకుఁ గర్తయగు “దేవతాసార్వభౌముఁడు” సమానాధికరహితుఁ డగు “కవి రాజచక్రవర్తి” యైపోయినాఁడు.

కవిచక్రవర్తిమహిమ కన్నులఁ బడినంతనే మనకవిద్వయమునుండి :—

“ మేము నీకృతిఁ జూచుచున్నాము గాని
మేముఁ దన్మయలీల నున్నాము గాని
తెలిసిన ట్లుండి యేమియుఁ దెలియకుండెఁ
దెలియ కుండియు నంతయుఁ దెలిసినట్లు
నటనమును జేయుచుంటి వనాథనాథ ”

ప్ర. భా. 184 పుట.

అనుతమయల్పజ్ఞతాదైన్యసూచక మగుప్రార్థనాగానము తారస్వరమున మిన్నుముట్టినది. ఆయావేశములోఁ గవులయహంభావావగుంఠనము తొలఁగిపోయినది. సత్యతత్త్వము చక్షుర్గోచరమైనది. అప్పుడు :—

“ నేను దరియించు తెరు వనునియతి గాని
యాత్మశక్తిని బ్రకటించునాస గాని
లోకములు మెచ్చునవెడిలోలుపత గాని
నాకు యశ మబ్బు నని చింతనమునఁ గాని
యర్థసంగ్రహణాపేక్ష నంది గాని ”

ప్ర. భా. 184 పుట.

మహాకావ్యమును రచియిం”పని “సచ్చిదానందమూర్తి” యగు “కవిరాజచంద్రుఁడు” కవుల కాదర్శకుఁ డైనాఁడు. ఆ యాదర్శమే పరమోద్దేశముగాఁ గవు లప్పటినుండియిప్పటివఱకు నామనోహరగానమును సరసగతుల నాలాపించుచునే యున్నారు.

ఏమహాకావ్యమును బఠియించునప్పు
డామహాకావ్యకర్తపై ననుపమాన
భక్తిగౌరవప్రేమముల్ ప్రబలుచుండు
నదిగదా యుత్తమోత్తమ మైనసుకృతి !

ప్ర. భా. 188 పుట.

ఈవిధముగా నీముప్పదిరెండవకుసుమము సంపూర్ణపదదళవికాసంబును, సరసార్థసౌందర్యమార్దవంబును, రుచిరాలంకారపరాగలాలిత్యంబును, మనోజ్ఞభావసౌరభోచ్ఛ్వాసనంబును గాంచి విరాజిల్లుచున్నది.

దీనితరువాతఁ దొమ్మిదికుసుమములు సరసకవితాగానమును సెలపుచున్నవి. 42 కుసుమము గోగీతము. ఇది యనంతామాత్యునిభోజరాజీయములోనికథ ననుసరించి బాలురకును వేద్యమగునట్టిసులభశైలిని వ్రాయఁబడినది. 43 వకుసుమ మగులక్ష్మీవిలాసము శుక్రవారవ్రతకథ ననుసరించి వ్రాయఁబడిన హృద్య మగుచిన్నరూపకము. ఇవి రెండు నానందవాచకములఁ గానంబడుచున్నవి.

ద్వితీయసంపుటమున నేఁబదిమైదుకుసుమములుగలవు.

ఇవి వికాసాదివిమలగుణవిశిష్టంబులును, బరిమళమరందరస పరిపుష్టంబులు నై యున్నవి.

ఇందు గవులకవిత మనోహరపరిపాకమునకు వచ్చి ప్రౌఢతనము గానుపించుచున్నది. కవులకు భాషాజ్ఞానము క్రమాభివృద్ధిం గాంచినది. ఉచితములగుమధురపదములు లేఖన్యగ్రమున విచ్చలవిడి సరసగతుల నటనముచేయుచున్నవి. అర్థంపుసొంపులమృతమధురంబులై నవరసంబులఁ జిలుకరించుచున్నవి. భావము లుదారములై హృదయముల నాకర్షించుచున్నవి. శైలి ధారాళమై గంగావాహినింబోలి సహస్రముఖములఁ బ్రవహించుచున్నది. ఈవిధముగా "అమృతసురభిళమృదులతాంతములతోడ, అమృతమధుపక్వఫలగుళుచ్ఛములతోడ, అమృతరసమాధురీమూర్తి" యైనకవితాకల్పవల్లి యిక్కవులకుఁ బెరటికల్పకమైనది.

II

ఇందులయొక్కొక్కకుసుమమును బ్రత్యేకముగ విమర్శింపఁదగియున్నను గావ్యముకంటె విమర్శమే విపులమగునను వెఱపున నీఁక నిక్కావ్యస్వరూపస్వభావాదులను గూర్చి సమష్టిసమాలోచనముం గావించెదను.

ఇందు శైలి, రీతి, నిర్మాణము మొదలగువానిలోఁ

పూర్వకవుల మేలిపోకడలకళలు గానంబడుచున్నను గావ్యపద్ధతిమాత్రము మనయాంధ్రభాషకు నూతనమై వెలయుచున్నది. పురాణేతిహాసములయందును, నిబంధనములననుసరించిన ప్రబంధములయందును పురనగాదివర్ణనములు గానంబడుచున్నవి గాని యీపద్ధతిననుసరించినవి మనభాషయందు మృగ్యములై యున్నవి.

దేశకాలపాత్రములననుసరించి సాంఘికనైతిక రాజకీయాది వివిధవిషయములయం దభిరుచులు మాఱుచున్నట్లే కవితయందును మార్పులు గానఁబడుచుండును. వేంకటపార్వతీశ్వరకవుల కాంగ్లేయభాషాపరిచయము లేకపోయినను పాశ్చాత్యవిజ్ఞానవాతావరణముగల ప్రకృతి నాశ్రయించి వీరిసహజప్రతిభ పాశ్చాత్యపద్ధతిని బ్రాచ్యకళయందుఁ గూర్చి యీనూత్నకావ్యమును సృష్టించినది. ఆంధ్రభాషయం దీదృశకావ్యసృష్టికిదియే ప్రథమంబైనను మనోహరాకృతిం దాల్చియున్నది.

వీరికవితాకన్య తఱచుగఁ బ్రకృతిలోని మనోహరపదార్థములనే సందర్శించుచుండును. ఒకప్పుడు పసిఁడి 'పంజర' ములకడ సౌమ్యాకారముగ నిలిచి చిలుకలను బలుకరించుచుండును. 'వసంతకోకిల'లయవ్యక్తమధురగానములతో గానము సేయుచుండును. ఒకప్పుడు "చందమామ" వెన్నెలలకు వన్నెలు దిద్దుచుండును. ప్రభాతవాతపోతములు నుయ్యెల లూచుచుండును. "ఆనందమందిర"ముల మెలఁగుచు విందులుగూర్చుచుం

డును. "చుక్క"ల చక్కందనమును లెక్కించుచుండును. "మల్లెపూవు"ల జడవేసికొనుచు, "జలజమాలిక"ల గళమున సవరించుకొనుచు, "వసంత"డోలికల నుయ్యెల లూఁగుచుఁ "గలువకన్నె"లతోఁ గలసిమెలసి "విహంగవిమానము"ల విహరించుచు వివిధగతుల "లక్ష్మీవిలాసము"ను నెఱపుచుండును.

కాని, ప్రకృతిసౌందర్యమును దిలకించుపట్టున వీరి కవితాకన్య యప్పుడప్పుడు ముగ్ధయై పైమెఱుంగుల కాసపడి పదములఁ బవిలపఱుచుకొని రంగులువెట్టుకొనుచు మెఱుఁగుసొమ్ముల మేనునిండించుకొనుచు, నడకల కొయ్యారము నలవరించుకొనుచు దిద్దుకొనుచుండును. చిన్నభావమునుగూడ నొక్కొకయెడ సహజముగ వెల్లడింపక ముద్దులొలుకుపలుకులతో మురిపంపుగతులతో వివిధరీతుల విస్తరించి యాలాపించి గానముచేయుట యిక్కవితాకన్య కలవాటు. మోహనప్రకృతిసౌందర్యమునకు ముగ్ధయై, ప్రకృతితత్త్వాన్వేషణమున నిమగ్నయై, సర్వేశ్వరసాక్షాత్కారలీలానుభవలాలసయగుచున్న యిక్కవితాకన్య మానవప్రకృతినిగూర్చి గానముసేయుట మఱచిపోయినట్లగపడుచున్నది. దానంజేసి రసానుభవప్రకటనమే కాని రసోదయకల్పన మంతగా వికసింపలేదు. ఇక్కవితయందు భావము సహజమైనను, సత్యమైనను, పవిత్రమైనను, ఆవేశపూరితమైనను, మృదుమధురపదార్థసంఘటితమైనను నచ్చటచ్చటఁ గొంతవఱకు గభీరయవనికాభ్యంతరమునమఱుఁగుపడియున్నది.

ఈకవితలోని ఛందోవ్యాకరణాదివిషయములు పూర్వాంధ్రకవుల నియమములకు భిన్నముగా యున్నను నుత్తరాంధ్రకవుల ప్రయోగములకు సరిపడుచున్నవి.

ఇందలికవిత్వము చాలవఱకు ధ్వనిప్రధానముగా నున్నది. ఇక్కావ్యకర్తలు ప్రణయసౌందర్యలీలామయియగు ప్రకృతిని ప్రేమించుచు, ధ్యానించుచు, నారాధించుచుండగా నిత్యపరిచితమైన యీసహజప్రకృతి భావనాప్రకృతిలో విలీనమగుచున్నది. ఆబాహ్యభావనాప్రకృతులసమ్మేళనమున :— “పండువెన్నెలతోటలో వెన్నపూస” వెలువడుచున్నది. “బాలభానునికరములఁ బసిఁడిచేరు” పట్టుపడుచున్నది. “కొమ్మనిమ్మనీచాయలోఁ గుందనపుబొమ్మ” కొమగుమగులుచున్నది. “కలవిహంగమమధురగానలహరి” కలకలలాడుచున్నది. ప్రకృతిప్రతిబింబమునందగు భావనాప్రకృతిలోని యీ “కవితాకల్పవల్లి” యందును “పుట్టుమున్నటిచిగురుపంగఁ బెట్టు పట్టుగొమ్మలును “ఈశ్వరస్వప్నకామదోహములు నాల్గునకు రాకృతిం”గన్న “యాకులు”ను “అమృతసురభిళమృదులకాంతము”లును “జన్మజన్మాంతరానురాగవాసనలుజిందు” “దివ్యకుసుమపరీమళ”ములును, “అమృతమధువర్షఫలగుళుచ్ఛము”లును, “శృంగారరసనవకం బసంతరసమయుతఁ గాంచిన” ఫలరసమును గానవచ్చుచు భావసృష్టిని బ్రస్ఫుటము సేయుచున్నవి.

అగోచరమగుభావమునకు మనోహరాకృతిం గూర్చుచ

ట్టున నిక్కమగు "విప్రలంభులందు సంభోగులఁ జెలులుగనిచే యుం డటకు నందించు" చున్నది. "ప్రావృట్కాలములోనఁ బ్రోషితనాయక రసంబునుంచి యుండఁజాలు వర్షించు" చున్నది.

మఱియు యథాహాపముగఁ బ్రకృతిసౌందర్యమును, బ్రకృతివిశిష్టమగు భావసౌందర్యమును, భావసంకల్పితమగు ప్రకృతిసౌందర్యమును, భావప్రకృతిలోని భావసౌందర్యమును జిత్రించినభాగము లీకావ్యమున నెక్కుచోట్లఁ గానంబడుచున్నవి. ఇదియునుగాక నిత్యసత్యతత్త్వాన్వేషణపరవశ యగు నిక్కవిత ద్వంద్వభావవిశిష్టమగు ప్రకృతియందుఁ బ్రణయలీలలను సదానందతేజోవిశిష్టంబగు దివ్యప్రకృతియందు భగవల్లీలలను సర్వత్ర సందర్శించుచున్న ట్లగపడుచున్నది.

వేంకటపార్వతీశ్వరకవుల కవితావల్లికలకు మూలకారణంబులగునమృతబీజములు కవిరాజశిఖామణియగునన్నెచోడనియుఁ, గవిబ్రహ్మయగుతిక్కనసోమయాజియు, సర్వజ్ఞుండగు నాచనసోమనాథుఁడును నచ్చరకోశములందుఁ గానంబడుచున్నవి.

"సీ. ఎలమి నైనైవిగ నెలకొన్న సుకుమార
నానందలక్ష్మీ సాంద్రోసరించి
మకరంద నిజవాహ్నినుంచకవిహారించు
భావానకందాలఁ బాఱఁజోఁచి—"

సీ. "జ్ఞానదీపంబు ప్రజ్వలింపంబులోఁ దాన
దీపియగా నేఁడుఁ నే ప్రవాహము

వలిపేక వసుమతీవలయంబు నవరత్న
వలపలంబుగా నిడ వలయుఁ బ్రాఁక
భారతిఁ దమమోముఁ బసిఁడిమాడుపుఁగోన
నిలువేల్పుగా నిల్పఁదలఁచువారు
సణిమాదిగుణమణిహారష్టు లురమున
హారంబుగా నిడఁగోరువారు
వెలయ మత్కృతి చదువుఁడు, వినుఁడు,—"

నన్నెచోడదేవుఁడు.

"ఒకటిఁగొని రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి
మూఁటి నాల్గింటఁ గడువశ్యములుగఁ జేసి
యేనిటిని గెల్చి యాఱింటి నెఱిఁగి యేడు
విడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు—"

* * * * *

"వరుచూడ్కి ముద్దియవదనంబుపైఁ బాఱి
తివుటమై నునుఁగాంతి తీపుఁ గ్రోలు
* * * * *"

"కరుణారసము వొంగి తొరఁగెడుచాడ్పున
శశిరేఖ నమృతంబు జాలువాఱ
* * * * *"

"గుఱియైనచెలువున వెలసినలోకర
క్షణ మనంగ గళంబుచాయ దోఁప
* * * * *"

"* * * తొడి, పూసి, కట్టి, పన్ని—"

తిక్కనసోమయాజి.

సీ. "తొలుకారుమెఱుఁగులతోఁటలో నాడెడు
రాయంచకొదమతో రాయఁజాలి
ఇరులబండారంపుటింటికిఁ బెట్టిన
బొండుమల్లెలకోటఁ బోర గెలిచి
బలుమంచుఁ గంబాల బలసి రాఁజుట్టిన
క్రొత్తమంజిడిబాగుఁ గొఱఁత చేసి
పాలపెన్నురువుగుబ్బలిమీఁద నెలకొన్న
నిండువెన్నెలమ్రుగ్గునిగ్గుఁ జెఱిచి
జడలఁ గ్రొన్నెల, మెడఁ బాఁపసరము, దొడలఁ
బొడలతో, త్మైన వెలిమిడిపూఁత మించఁ
బొడమి ప్రేఁఖణిముంపటఁ బొడవుసూపెఁ
బొడువులందెల్లఁ బొడువైనబోటువేల్పు."

నాచనసోమనాథుఁడు.

ఇక్కవులు దివ్యప్రణయలీలావిలసితమగు "ఏకాంత సేవ" అను నొకయపూర్వపద్యకావ్యమును, "శ్రీరామరాజనీతి" అనునైతికపద్యకావ్యమును బదివేలపుటలకు మించిన వివిధగద్యకావ్యములను రచించి యాంధ్రలోకమున భాషాభిమానుల యాదరమును గాంచియున్నారు.

ఈవిధముగా వేంకటపార్వతీశ్వరులు తమకవితావల్లికలను నలుదెసలఁ బ్రాఁకించుచు "పొన్నపూఁగొమ్మను పొగడయున్నదియొ, పొగడయేయున్నదో పొన్నపూఁగొమ్మ, ఊహింపరాకుండ నొకరీతినుండి, యిరువురిపరిమళంబిదె యిదియనుచు విభజింపరాకుండ విలసిల్లుచుండి——గానమును శ్రుతియుంగల

సిన సరసమోహనకలస్వనముంబోలి, రాగమును గళయుం గలసిన శాంతసుందరవిలాసముంబోలి, స్వరమును లయయుఁ గలసిన సురుచిరామోదవిస్ఫురణంబోలి, భావమును ధ్వనియు నుగలసిన నవనవానందవైభవముంబోలి " కవితాపురాణిని " దమచూపులోఁ బాపఁగాఁ జేసికొని సమస్వరమున గానము సేయుచు,

" కవితామృతాబ్ధిలోఁ గల్పప్రసూనముల్
తేనెచిందకయుండఁ దేల్చితెచ్చి
జ్ఞానవల్లికలలో స్వర్ణపుష్పంబులు
చెలువుగందకయుండఁ జేర్చితెచ్చి
గానస్రవంతిలోఁ గనకారవిందముల్
పుప్పొడిచెడకుండఁ బొదివితెచ్చి
ఆనందవనములో నమృతలతాంతముల్
దళములొత్తకయుండ దాఁచితెచ్చి"

ఆంధ్రకవితాసరస్వతికి ' అమ్లానపూజాపుష్పహారము ' గను,

" తిన్నని సన్నని తెల్లని యెనలేని
మొగ్గలలోనుండి నిగ్గుఁదీసి
చక్కని చిక్కని సరిలేని కమ్మని
పూవులలోనుండి ప్రోవుఁజేసి
విఱుగని తఱుఁగని వెలలేని తీయని
తేనియలోనుండి తేటఁదీసి
నలఁగని తలఁగని నలిలేని తొలిలేని
చివురాకుదొన్నెల సేకరించి—

సరసకవితావిలాసరసాయనమును ప్రేమరసమునఁగూర్చి యాంధ్రలోకమునకు 'అమృతపానీయము'గను నర్పించియున్నారు—అర్పించుచున్నారు. ఇంకను వీర లనేకోత్కృష్టమధుర కావ్యరచనలచే నభివృద్ధిఁ గాంచుచు, దీర్ఘాయుష్మంతులై, యితోధికయశస్వంతులై వెలయుచుండునట్లు పరమేశ్వరుఁ డనుగ్రహించునుగాక యని యానందపూర్వకముగ నాశీర్వదించుచున్నాను.

సీ. సకలజీవానందసంజీవనము లైన
యమృతధారాప్రవాహములతోడ
సర్వార్థసముదారసంపత్ప్రదము లైన
కమనీయగతివిశేషములతోడ
అతిలోకపావనశ్రుతిమనోజ్ఞము లైన
కలకలధ్వనితరంగములతోడ
సుశ్లోకమాధురీసుప్రసన్నము లైన
శాంతలీలావిలాసములతోడ
పృథివిఁ దనియించుగోదావరీస్రవంతిఁ
గాంచి పులకించి తపము ఫలించె ననుచు
స్వాంతముననుబ్బుగౌతమసంయమీంద్రు
సమ్యగామోదవిభవంబు సంస్మరింతు.

పిఠాపురము.
5-10-1924.

సహకుదుటి వీరరాజు.

అవతారిక.

కవితాసరస్వతీసాక్షాత్కారము మాకు లభించినసమయమునందే మానయనములకు నూతనప్రేమసౌందర్యసందర్శనానుభవంబును, మాహృదయములకు నూతనానందభావానుభవంబును, మావాక్కులకు నూతనమధురామృతరసానుభవంబును లభించిన ట్లయ్యెను.

అప్పుడప్పు డనుభవంబగుచున్నయయ్యానందపారవశ్యమునందే పందొమ్మిదివందలతొమ్మిదవవత్సరమునకు ముందే యారంభముగా ననేకవిషయములంగూర్చినగీతములును, వృత్తములును మాలేఖినినుండి వెలువడి యాంధ్రపత్రికల నలంకరించుచువచ్చినవి.

క్రొత్తక్రొత్తగ వెలువడుచున్న వానిం దిలకించి మా పురోభివృద్ధిం గోరినసహృదయులును, సదాశయులును, సరసగుణగ్రహణపారీణులును, స్వభాషాభిమానులు నగువిద్యాధికులు మాకెల్లవిధములఁ బ్రోత్సాహముం గూర్చుచుండుటచే మాకవితాలత యిట్లభినవరూపమున సక్రమవికాసముం గాంచఁ గలిగినది.

ఏధరణీఖండము మాయిరువురకును జన్మస్థానమో యట్టి పీఠికాపురసంస్థానమునకుఁ బ్రభువులును, విద్వత్ప్రభువులును, భాషాపోషకులును, సత్కార్యప్రోత్సాహకులు నగు శ్రీ శ్రీ మహారాజా శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహదరువారు ప్రప్రథమమునందే మమ్ము గౌరవించి, మా కమూల్యసాహాయ్యముగా ముద్రాయంత్రమును బ్రసాదించి మాయుద్యమమున కనుకూలావకాశముం గల్పించి మమ్ముఁ గృతార్థులుగఁ జేసి యున్నారు.

ఆరాజేంద్రునకు గురుసమానులై, యయ్యాస్థానరాజ కార్యనిర్వహణమునందుఁ బ్రధానులై, యాంధ్రభాషాభిమానులయం దగ్రగణ్యులై, సుప్రసిద్ధులైన కీ. శే. మొక్కపాటి సుబ్బారాయఁడుగారు మాయందధికవాత్సల్యము గలవారును మాకత్యంతాప్తులు నగుటంజేసి యప్పుడప్పుడు మాకవితాగానము నాలకించుచుండువారు గావున మాపురోభివృద్ధి నాకాంక్షించుచు వారొకప్పుడు దయాపూర్వకముగా—

"పిఠాపురము

18-2-13

అయ్యా!

ఆంధ్రపరిషత్పత్రికలోఁ బ్రచురింపఁబడినకవిగీతమును జదివి బ్రహ్మానందనిమగ్నుఁడ నైతిని. నేను కవిని గాను. కాని,

కవిధర్మము, కావ్యప్రయోజనము వీనినిగూర్చి మీరు వ్యక్తపఱచినయభిప్రాయమే వాస్తవ మనియు, సర్వజనావలంబనీయ మనియుఁ దలఁచువారిలో నేనొకఁడను. కావ్యరచన చేయఁ గడఁగువా రందఱు నీయాదర్శము ననుసరింతురుగాక !

విధేయుఁడు

భాషాభిమాని ”

అని సువర్ణవిలసితం బగు లేఖామూలంబున మమ్ము హెచ్చరించి మాకుత్సాహముం గల్పించి యున్నారు.

ఆకారణముచేతనే మేమప్పటికి వ్రాసియున్న పద్యమాలికల నన్నిటిని “హారావళి” యనునామమునఁ బ్రకటించితిమి. వాని నాలోకించి మాకవితయందును, మాయందును బరిపూర్ణాభిమానవాత్సల్యములు గల బ్రహ్మశ్రీ మహారాజశ్రీ కూచి నరసింహముపంతులవారు—

“ మీరు దయాపూర్వకముగాఁ బంపించిన ‘హారావళి’ యనుగ్రంథమును జూచినాఁడను. ఇదివఱకే యందలిపద్యములు పత్రికలలోఁ జదివి యానందించితిని. ఇప్పుడు మఱియొకసారి చదివి యాసంతోషమును మడించుకొంటిని. స్వభావసిద్ధములై, చదువరులకు మనసు గరఁగించుసద్యఃఫలదాయకములైనభావనలతో, మధురములైనసుబోధము లగుజిలిబిలితే

లుఁగుపదములకూర్పుతో, నిండ్లలో సాధారణముగ వాడుకొనంబడునానుడులతో నిండి. మీగ్రంథము గడు హృదయంగమంబై యున్నది.

గ్రామ్యభాషావలంబులు మీపుస్తక మొక్కటియు విలాసార్థమైనఁ జదివిరేని గ్రాంథికభాషలో వ్యాకరణావిరుద్ధముగ బాలురకు సులభముగఁ దెలియునట్లు వ్రాయుట—అందులోఁ బద్యకావ్యము వ్రాయుట—అసాధ్య మని యిఁకముందెన్నఁ డనరని నేననుకొనియెద.

రసికులును, పండితులును, భాషాభిమానులును, నిష్పక్షపాతవిమర్శకులు నగుతెలుఁగువారే చాలమంది యిప్పుడు పాఠశాలావిద్యార్థులయాంధ్రపఠనీయగ్రంథముల నేర్పఱుచువారై నట్లు తెలియవచ్చుచున్నది. కావున వారచిరకాలమున మీచక్కనిపుస్తకముఁ బాఠశాలలలోఁ బఠింప ననుజ్ఞయిచ్చి మీకు న్యాయమైనప్రోత్సాహము గావింతు రని నేను దృఢముగా నమ్ముచున్నాను.

ఉ. పంకరుహాక్షి శారదవిపంచికమంజురవంబు లల్లఁ గో
ర్వంకలముద్దుఁబల్కు లెలఁ బ్రాయపుబిత్తరి కుల్కుచిల్కుత
త్కంకణనూపురంబులచొకారపుమవ్వపుఁదియ్యమ్రోఁతలున్
వేంకటపార్వతీశ్వరకవిప్రవరోదితహృద్యపద్యముల్.

క. హీరావళి ముక్తావళి
చారుతరా శ్వేతలనిశాభూషణవత్

తారావళి మీరంపిన
"హారావళి" సుకవితాధనాధికులారా!

పిఠాపురము. } విధేయుఁడు,
13-6-13. } కూచి నరసింహము."

అని ప్రేమపూర్వకం బగులేఖామూలమున మాకానందమును వర్ధిల్లఁజేసి మా ప్రయత్నమున మాకు సంపూర్ణవిశ్వాసము గలుగునట్లు ప్రోత్సహించి యున్నారు.

అదృష్టవశంబున మాకీవిధముగా స్వస్థానమునందుఁ జిరమాదరము లభించుటంజేసి మేము మాకవితాగానమును వివిధగతుల నాలాపించుచు నాంధ్రలోక మంతటను విచ్చలవిడిగా విహారము సేయుచుండుటకు సమర్థులము గాఁగలిగితిమి. "ఇంట గెల్చి రచ్చ గెలువవలయు" ననునుడికారమునం దొకభాగము మాకిట్లనుకూల మైనది.

క్రమముగా మహారాజులును, రాజులును, జమీందారులును, భాషాభిమాను లగువిద్యాధికులును మాకవిత ననేకవిధములుగా నాదరించుచు మాకెల్లవిధములఁ బ్రోత్సాహముం గూర్చుచుండుటచే మేమిప్పటికి రచ్చఁగూడ గెలువఁగలిగితిమని యుత్సాహపడుచున్నాము.

ఎందఱెందఱేయేవిధముగా మమ్మాదరించినను మేమారాధించుచున్న సరస్వతీమాతృదేవత సన్నిధానమున—త

త్సకోన్నతపాదపీఠసామీప్యమున—మేము పసిబిడ్డలమే—మే మెల్లప్పుడు నిక్కే మాతల్లియొడిలో నుండి యమృతమధురంబు లగునామెమాటలతో మాటలాడుచు, నామెపాటలతోఁ బాటలఁ బాడుచు, నవ్యాజవాత్సల్యంబున నాదరించుచున్న యామెతో నాడుచుఁ బాడుచు, మాతృప్రేమామృతరసతరంగములలో నిరతానందపారవశ్యమున నోలలాడుచుండవలయు ననియే మాకోరిక ! " జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" యనుమాట నేఁటిమాట గాదు గదా !—

అనేకవత్సరములనుండి, యిట్లనేకవిధంబుల ననంత లీలానందస్వరూపిణి యగుమాతృభాషాసరస్వతి నారాధించుచున్నమే మెప్పటికప్పు డీయభినవపూజాకుసుమమాలికల నద్దేవి కంఠహారములుగా సమర్పించుకొనుచునే యున్నారము. అవి యన్నియు నాసరస్వతీపీఠంబుల నలంకరించుటచే నిత్యనూతనంబులగుతమభావపరిమళంబులచేతను, నిత్యవిలసితంబు లగు తమరామణీయకవికసనంబులచేతను నాంధ్రలోకమున నామోదమును గల్పించుచునే యున్నవి.

మేమిప్పు డాపూజాకుసుమముల నన్నిటిని 'సరస్వతీ స్వర్గ' పీఠమునుండియుఁ, 'బరిషత్పీ'ఠమునుండియు, 'భారతీ' పీఠమునుండియుఁ, 'గవితా' 'సర్వస్వ' పీఠములనుండియుఁ, 'గల్పలతా' పీఠమునుండియు, మఱియు ననేకవిద్యా

పీఠములనుండియు నేర్చి సమకూర్చి కల్యాణసంధాయకంబులు గావునఁ గ్రమపత్రసంపుటములం జేర్చి కావించినయిక్కావ్యకుసుమావళిని శుభాశీర్వాదపూర్వకంబుగా మాపీఠికాపురసంస్థానయువరాజచంద్రు లగుమహారాజరాజశ్రీ శ్రీ శ్రీ రాజా రావు వేంకటమహీపతి గంగాధరరామారావు బహదరువారికి వారిపదునాల్గవజన్మదినమహోత్సవసమయమున నభ్యుదయపరంపరాభివృద్ధిం గోరి యుపాయనముగా నర్పించుకొని కృతార్థులమైతిమి.

కాకినాడ
ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము.

వేంకటపార్వతీశ్వరకవులు,
15-9-1924.

కృతజ్ఞతాభివందనము.

ఈగ్రంథ మాంధ్రలోకమునకు సుపరిచితమగునట్లుగా సవిస్తృముగ నాంధ్రభాషయందు "పీఠికను" వ్రాసియిచ్చిన మద్గురుస్వరూపులును, పితృసమానులును, సుప్రసిద్ధకవిశేఖరులును, బహుగ్రంథవిమర్శకులును, భాషాభిమానధనులును, పండితమాననీయులును, నాంధ్రప్రపంచమునకుఁ జిరపరిచితులును, మాకత్యంతాప్తులును, నాత్మీయులును నగు మ. రా. రా. శ్రీ నడకుదుటి వీరరాజుపంతులవారికి మేమనేకాభివందనంబులాచరించుచు వారికి మాయెడలం గలపుత్త్రాధికవాత్సల్యమునకు మేమెంతయుఁగృతజ్ఞులమైయున్నారము.

మఱియు నీగ్రంథ మాంగ్లవిద్యాధికులగు నాంధ్రుల దృష్టిపథంబునఁ బ్రచారంబుగాంచుటకును, నాంధ్రభాషాపరిచయములేని యాంగ్లవిద్యాధికులకుఁగూడ నీయాంధ్రగ్రంథ పరిచయము గలిగించుటకును ననుకూలముగా దీని కాంగ్లభాషయం దుపోద్ఘాతమును వ్రాసి యొసంగిన మామిత్త్రులును, బహుభాషాగ్రంథపరిశోధకులును, చెన్నపురిక్రైస్తవకళాశాలయందు దేశభాషావిచారణాధికారులును, బరనీయగ్రంథనిర్ణాయకసభాధ్యక్షులును, నాంగ్లాంధ్రభాషాసమానసాహితీవిలసితులును, మాకవితయందును మాయందును విశేషాదరాభిమానప్రపూర్ణులునగు మ. రా. రా. శ్రీ చేకుమళ్ల రాజగోపాలరావు పంతులు బి. యే. యల్. టి. గారికి మాకృతజ్ఞతాపూర్వక ప్రణామంబు లర్పించుచున్నారము.

15-9-24. వేంకటపార్వతీశ్వరకవులు.

విషయసూచిక.

ప్రథమభాగము.

నివేదనము.

శ్రీలీల వెలయింపఁజాలియున్న విసుమీ
నవ్యసువర్ణపూర్ణములుగాన,
ఇష్టసిద్ధి ఘటింప నెనసియున్న విసుమీ
సుమధురరసమనోజ్ఞములుగాన,
అనురాగ మెలయింప నమరియున్న విసుమీ
రమణీయరుచిరవృత్తములుగాన,
ఆమోద మొదవింప నలరియున్న విసుమీ
పావనభావగోప్యములుగానఁ

గాన మామానసానందఘనతరంగ
మాలికాడోలికాజాలఖేల దమృత
లలితశతపత్త్రిముల వీని నెలమిఁ గనుచు
రమణ విహరింపవే నీవు రాజహంస!

ఆశీర్వాదపంచరత్నములు.

శ్రీలీల రత్నాలఁ జిత్రించుచేతనే
చిగురుటాకుల వన్నెఁ జిలుకువాఁడు
తూరుపుమలఁ బైఁడి నీరానుకలశినే
పువ్వుపువ్వునఁ దేనెఁ బోయువాఁడు
నెలవంక నమృతంబు నిండించుగిండినే
బాలెంతలకుఁ బాలు పంచువాఁడు
వేదాంతమున వెల్గు వెలయించుదివ్వెనే
పసిపాపలకు జ్యోతి పట్టువాఁడు

అణువు బ్రహ్మాండముగఁ జేయునట్టివాఁడు
చిరతరాయురారోగ్యసుశ్రీలొసంగి
చిరకృపాలీల నిన్ను రక్షించుఁగాక!
చారుగుణసాంద్ర! రాజకుమారచంద్ర!

ఆశీర్వాదము.

సీ. నీలాలమేడలో నెలబాలకునిరీతిఁ
జిఱునవ్వువెన్నెలల్ చిలికికొనుచు,
పగడాలచిగురులోఁ బసిమిమొగ్గను బోలి
సొనరుఁగ్రొందేనియల్ నించికొనుచు,
రతనాలకొలనిలో రాయంచకొదమలా
గలరుఁదమ్ములఁ గూడి యాడికొనుచు,
పచ్చలతోఁటలోఁ బారిజాతములీల
నిచ్చవచ్చుఫలంబు లిచ్చికొనుచు,

తల్లిదండ్రులహృదయంబు లుల్లసిల్ల
నెల్లవారలచిత్తముల్ పల్లవింప
దినదినాభ్యుదయంబులఁ దనరుమయ్య!
రావుసూర్యగంగాధర రామరాయ!

ఆశీర్వాదము.

సీ. ప్రేమస్వరూపుతొ పితరులఁ బూజించి
పూజించు ప్రజలను బ్రోవ నెఱిఁగి
విద్యాస్వరూపుతొ విబుధుల మన్నించి
మన్నించుబంధుల మనుప నెఱిఁగి
శాంతస్వరూపుతొ సాధుల సేవించి
సేవించుభృత్యులఁ గావ నెఱిఁగి
సుగుణస్వరూపుతొ సుజనుల దర్శించి
దర్శించు నర్థులఁ దనుప నెఱిఁగి

వరుస నొకయేఁటి కొకయేఁడు వన్నెమీఱ
నాయురారోగ్యభోగభాగ్యములఁ గాంచి
దినదినాభ్యుదయమున వర్ధిల్లు మయ్య
చారుగుణసాంద్ర! రాజకుమారచంద్ర!

ఆశీర్వాదము.

సీ. ఇంద్రుని మించు రాజేంద్రుఁడౌ నీతాత
పేరునకును వన్నెఁ బెట్టుకొనుచు
జనకుని మించు నందనుఁడైన నీతండ్రి
సూచించుత్రోవలఁ జూచుకొనుచు
జనకనందన మించు సాధ్వియౌ నీతల్లి
కడుపుచల్లఁగ మేలుఁ గాంచుకొనుచు
కలశాబ్ధి మించు నిర్మలమైన నీవంశ
సురుచిరమర్యాద లెఱిఁగికొనుచు

సత్యమును దెల్పుచదువులఁ జదువుకొనుచు
నిత్యనిర్మలధర్మముల్ నేర్చుకొనుచు
ధరణి జైవాతృకుండవై వఱలుమయ్య
రాజనిభతేజ! యువరాజ! రామరాజ!

ఆశీర్వాదము.

సీ. కవితామృతాబ్ధిలోఁ గల్పప్రసూనముల్
తేనె చిందకయుండఁ దేల్చి తెచ్చి
జ్ఞానవల్లికలలో స్వర్ణపుష్పంబులు
చెలువు గందకయుండఁ జేర్చి తెచ్చి
గానస్రవంతిలోఁ గనకారవిందముల్
పుప్పొడి చెడకుండఁ బొదివి తెచ్చి
ఆనందవనములో నమృతలతాంతముల్
దళము లొత్తకయుండ దాఁచి తెచ్చి

సరసు లనిశంబు నీకు నొసంగుచుండు
హారములు నవతంసంబు లందుకొనుచు
దేవదేవునికరుణ వర్ధిల్లుమయ్య!
ప్రణయరససాంద్ర! శ్రీయువరాజచంద్ర!

ఓమ్.

కావ్యకుసుమావళి

ప్రార్థనము.

శ్రీమదిలా తనూజను వ
రించెడిపట్టునఁ దన్ముఖాంబుజా
తామితరామణీయక సు
ధాసవమానఁ దలంచి యూఁదలన్
ప్రేమను బ్రాలునించెడితె
ఱిన్ గదుపాఱఁగఁ గ్రోలి క్రాలునా
రాముని ప్రేక్షణాళులు ని
రంతరమున్ గృపఁజూచు మమ్ములన్.

సీ. నీకటాక్షంబుచే మాకుఁ బరస్పర
సంభాషణమున శక్తియును గలిగె
నీకృపానిరతిచే మాకు ధర్మాధర్మ
పరిశీలనమున కుపాయ మబ్బె
నీదయాదృష్టిచే నిఖిలలోకవ్యవ
హారముల్ నడచుట కనువు గలిగె
నీమహామహిమచే నిఖిలాగమపురాణ
శాస్త్రేతిహాసముల్ సంభవించె
నీవె శబ్దంబు, శాస్త్రంబు నిగమచయము;
జగములకు నెల్ల నాధారశక్తి వీవె
భారతీదేవి! తల్లి! నీప్రాపుఁ గనని
సకలలోకావళియు నిరర్థకమ కాదె!

శ్రీరామచంద్ర.

కావ్యకుసుమావళి

ప్రథమభాగము.

1 అక్షరగీతము.

ఎంచఁగా రాని శబ్ద ప్రపంచమందు
వేలువేలురూపంబుల వెలయునీవు
విమలపదముల నాత్మ భావించుచుందు
మనిశమును మాకుఁదోడ్పడు మక్షరంబ!
మహితమైయొప్పు రుద్రాక్షమాలకన్నఁ
బేరుఁగాంచిన ముత్యాలపేరుకన్నఁ
గోపుచూపెడు రతనాల కోవకన్న
నెందు నక్షరమాలికయే ఘనంబు,
దైవదత్తంబులైన వేదంబులకును
ధర్మవిహితంబులైన శాస్త్రంబులకును
న్యాయరూపంబులౌ పురాణంబులకును
మూల మగునది యక్షరమాల గాదె?

అఖిలమైన జగద్వ్యవహారమునకు
సకలమైన ప్రపంచ విజ్ఞానమునకు
వివిధమైన మనోభావ విసరమునకు
నిరత మాధారమైన దక్షరము కాదె?

ఒక్కటై యొక్కరూపు నొండొంటిఁగలసి
వేఱుపోలిక నందుచు వివిధగతుల
వలన వివిధాకృతులఁ దాల్చి వఱలుచుండు
నట్టి యక్షర తత్త్వంబు నరయ వశమె?

ధరణిలో నామరూపభేదంబులైన
సకలజీవ భావంబులు సకలలోక
గతులు, సకలేప్సితార్థ సంతతులుఁ దుదకు
నక్షరమునందె సంక్రాంత మగును గాదె?

నిత్యమై, నిర్మలంబయి నిశ్చలమయి
నిఖిలమున కాదియై వర్ణనీయమైన
ప్రణవ మోంకారరూపశబ్దంబుగూడ
మఱిమఱిఁ జూడ నక్షరమయమె కాదె?

ప్రకృతి నన్యోన్యవస్తు సంపర్కకలన
నాకృతి గుణంబులకు భేద మైనయట్లు
లీల నన్యోన్యవర్ణసమ్మేళనమున
వర్ణఫలసిద్ధులకు భేద మగుచు నుండు.

ప్రకృతి రూపంబుఁ గని పరబ్రహ్మమూర్తి
యఖిలభావంబులకును దా నైనయట్లు
గ్రంథరూపంబుఁ గాంచి యక్షరచయంబు
నఖిలభావంబులకును దా నగుచు నుండు.
ఆకసమునుండిపుట్టిన యట్టిశబ్ద
మాకసమువోలె నీరూప మగుచు నుండు
నక్షరంబునఁ బుట్టిన యట్టిశబ్ద
మక్షరాకృతితో నిత్య మలరుచుండు.
ధారుణి, నదీప్రవాహప్రసారవంత
మర్థవంతము, ఫలవంతమైనయట్లు
భావమక్షరసంస్ఫూర్తివలన సార
వంత, మర్థవంతము, ఫలవంత మగును.
వికలితనదీతరంగమాలికలలోనఁ
బ్రకటితాక్షరరూపమాలికలలోన
శబ్దములె పుట్టు నైన నక్షరభవంబు
లైనశబ్దంబులేసుమీ సార్థకములు.
వివిధమతములవారిచే వివిధరూప
భావముల బ్రహ్మ మర్చింపఁ బడినయట్లు
వివిధభాషలవారిచే వివిధరూప
భావముల నక్షరము వాడఁబడుచునుండు.

ఆత్మనిర్వృతికో, పరమాత్మ దేవు
సరయుటకో, పరమాత్మ తా నగుటకో యకో
సంతరింపఁగఁదగిన విజ్ఞానమునకు
సాధనంబైన దల్లయక్షరమ కాదె?
ఒకనిఁ బ్రేమించి తగురీతి నోముటకును
నొకనిఁ గోపించి తగురీతి నొంచుటకును
వలఁతియైయున్న నరపాలవరుని చేతి
కలమునకుఁ గల్గుశక్తి యక్షరమ కాదె?
జగతిఁ బుట్టింప, రక్షింప సమయఁ జేయఁ
గర్తయై, భర్తయై సమాహర్తయగుచుఁ
గర్తృకర్మక్రియాశూన్యగతి వెలుంగు
పరమ తేజంబు నక్షరవాచ్యమె కద!
ప్రకృతిజీవులలోన నీశ్వరుని వెనుక
నిలువఁబడియున్న మానవకులమునెల్ల
నెలమిఁ బైమెట్టునెక్కింపఁ గలుగుటకును
సాధనంబైన దక్షరజ్ఞానమొకద!
సృష్టికర్తకు నీజగత్సృష్టివేళఁ
దత్తదుచిత విజ్ఞానంబు దనరఁ జేయు
నేమహాశక్తి? యట్టివాణీమతల్లి
యక్షరాకృతియే గదా యరసిచూడ!

నీలములు, రత్నములు, గుణనియతిఁ జేసి
ప్రబలియును నలంకార మాత్రములె కాని
సార్థకమ్ములు, నుతపరమార్థకములు
నైన యక్షరవర్ణతుల్యంబులగునె ?
అక్షరం బీజగద్వ్యవహారమునకు
నెన్నియొ పదంబులను సృజియించుచుండ
నలపరబ్రహ్మ లోకయాత్రార్థ మనుచుఁ
బ్రాణికోక కొన్ని యొసఁగు కేపాటిఘనత.
విశ్వమెల్లను వార్తచే వెలయుచుండు
వార్త వెలయును పత్రికావ్యాప్తివలన
పత్రికాస్ఫూర్తి యక్షరావాప్తిఁ గలుగుఁ
గాన నక్షరమే జగత్కల్పకంబు.
అక్షరము వాణికాధారమగునో ? వాణి
యక్షరంబున కాధారమగునో ? యక్ష
రాకృతియె వాణియొ ? యెఱింగి యానతిండు
సదమ లాక్షరతత్త్వ విజ్ఞానులార !

(20-6-1910.)

2 కపోతము.

క. శ్రీమంతంబై విభవో
ద్దామంబై పుణ్యలోకధామం బగుని
త్యామోదస్థానము హ
స్తామలకం బగును సుకృతులగువారలకున్.

క. కంటఁ దడి యేల పెట్టెదు?
వింటికి మొగ మెత్త వేమి వెత చేకూరెన్
దంట నెడఁబాసి యేమిటి
కొంటిగ లేమావిగొమ్మ నుంటి? కపోతీ.

క. జలజలఁ గన్నుల నశ్రులఁ
జిలుకుచు మెడఁ గుంచి క్రుంగి చెలువమెడసియా
యెలఁగొమ్మ నొంటికాలను
నిలిచి తపించెద విదేటినెగులె? కపోతీ.

క. మెత్తని ఱెక్కలు, జిగి దళు
కొత్తెడుననుమేను, మెఱయుచుండెడినెమ్మో
మి త్తఱి నేఁటికి వాడెనొ?
చిత్త మెఱియఁదొడఁగెనాకుఁ జెప్పుము కపోతీ.

క. నిలిచి నిలిచి గురుగురు మని
పలికెద వేతెఱఁగు ప్రియుని పజ్జ వసింపం
గలనాఁటిదానివలె నే
దలఁతు వోహము నుంచె మనమునందుఁ గపోతీ.

క. ఎగురఁగఁ జూచెదవంతనె
యెగురఁగలే వెంతొ దప్పి నెలసితివేమో!
వగరుచుగతిఁ దోఁచెను మొగ
మొగుపక నోరిట్లు తెఱచెదేమొ? కపోతీ.

క. ముకుఁ జొనిపి ఱెక్క లార్పవు;
చకచక నొడలట్టు నిట్టు సవరింపవు; వా
లికచూపుఁ జూచి కులుకవు;
మొక మింతయు కుందనేమినున్నాఁడెఁ? గపోతీ!

క. నిలిచినచోటను నిలువక
కలఁతవాడము దానివోలెఁ గనుపడి నేలా
నెలగొమ్మ మీటుచునుఁ జని
పులుకుపులుకు మనుచుఁ జూచిపోకైదు? చెపుమా!

క. ముకుపుటముల నాహారము
నొక రొక రందించుకొనుచు నుండెదు నిను నీ
సఖునిఁ గనుచుందు మెప్పుడు
నకటా! నేఁ డెవరికేఁగె నాతఁడు? చెపుమా!

క. వగఁ గుర్రింగి సొగసుఁగన్గవ
మొగిడిచి తోనె కనువిచ్చి మూర్ఛిల్లెదు నీ
మగఁడు కలలోన నిన్నుం
దిగవిడిచినయట్లు తోఁచెనే? చెప్పవుగా!

క. వలిగాలి చివురుపీవన
లోలయింపఁగఁ బ్రియునిఁ గూడియుండెడునీ కీ
యలజడి యేఁటికిఁ గల్గెనొ?
పలుకుము నాతోడ; జాలిఁబడలే నింకన్.

క. ఱిక్కించి దెసలఁ జూచెద
విక్కడ నిను డించి మేఁత కేఁగినవిభుఁ డే
చిక్కులఁ బడియెనొ యనువగఁ
ఱిక్కి; నినుంగాంచఁ గడుపు చెఱువగుచుండెన్.

క. నోరెఱుఁగనిపక్షికి నీ
కాఱాటముఁ గూర్ప నక్కటా! నీదుమనో
హారు వలఁ బట్టి యాతనిఁ
గ్రూరుఁ డొకఁడు బుట్టఁ బెట్టికొని పోఁడుగదా!

క. అదిగో! చిక్కనినెత్తురు
కుదులఁగ నెలఁగొమ్ము గ్రుచ్చుకొనియున్నదియా
పదనగుబాణము; నీప్రియు
నెదుఱొమ్మున నాఁటి దూసి యేఁగినదేమో!

క. ఇది నిజమే యయ్యయ్యో!
పొదలెడు నీమగనిహృదయపుటభేదనమై
ప్రదరాఖ్య సార్థకంబుగఁ
బదనై యమదూతభంగి భయమిడుచుండెన్.

క. పతులు వగఁ బొగుల సతులన్
సతులు వగం బొగులఁ బతులఁ జంపుదురకటా!
మతిహీనులు మృగయులు దు
ర్గతు లున్నవటన్న భయము గలదో? లేదో?

క. కలకలఁ గూయుచు ముద్దులు
గులుకుకపోతములఁ బెంచి కొందురుగా కి
ట్లిలుఁగులపా ల్సేయుదురే?
యలరుం గునపాన గ్రుత్తు రటర? కిరాతా!

క. కటికితనంబునకే ము
చ్చటపడియెద వెట్టిపావ జాతివో? ప్రాణుల్
కటకటఁబడ నేసెద వ
క్కట! బిడ్డలఁ గన్నకడుపు గాదే మృగయా!

క. జీవన మీవనసీమల
నీవారము మనుపు; మనుపు నీవనుభావం
బొవహిలఁ గూయుపక్షుల
నే వేఁటాడెదు కిరాతు డెంత యదయుఁడో?

క. అలుఁగా ! యని వెనుదీయని
బలియురపైఁ జూపు నీదు వాఁడితనం బీ
పులుఁగునునుమేన నటవే !
మెలయునె దయ బోయ నాశ్రయించిననీకున్ ?

క. మీాయుసురు లపహరించిన
బోయఁడు సుఖ మొక్కపూఁటపొందునొ లేదో ?
మీాయుసురు దాఁకి యాతని
వేయుగతులఁ గలఁపకుండ విడదు కపోతీ !

క. అలుఁ గలుకుపైనచోటన్
బులుఁగు నిలువదందు రోకపోతి ! యిదేలే
చెలువునెడఁబాటు నెమ్మదిఁ
గలఁగింపఁ దెగించి చావఁగాఁ దలఁపవుగా ?

క. మెడ వ్రేలవైచి, వడవడ
వడఁకుచుఁ, గన్నుఁగవ దేలవైచి, పదంబుల్
తడఁబడ తెక్కార్చి, భువిం
బెడమోమై పడితి వుసురు విడలేదుగదా !

క. అయ్యో ! యిఁక నేమున్నది ?
కొయ్యవడె న్మేనుగుండె కొట్టుకొనదు నీ
కయ్యె నోడలు శ్వాసము రా
దయ్యె నుసురు విడిచి పోయెనా ? యకటకటా !

క. పతికిని సతియే సతికిం
బతియే గతి యని తలంచు పక్షివి గానన్
బతి యీలోకము విడువఁగ
నతని ననుసరింప నిట్టులైతె? కపోతీ!

క. జగ మంధకారమయమై
వగపు సముద్రమయి బ్రదుకు భారంబై తోఁ
పఁగ మగనిఁ గోలుపోయిన
వగఁ గూలిననిన్నుఁ జూడ వగ పయ్యెడినే!

క. వలపులఁ గూరిమినెరపెడు
తలఁపుల నొండొరుల మించు దంపతులకు దు
ర్బలవిధిచేత వియోగము
గలిగిన నేకరణి నోర్వఁగావచ్చుఁ? గటా!

క. చెలువలసుఖదుఃఖములకు
చెలువములకుఁ బ్రియములకు జీవమ్ములకున్
చెలువులకలుములై యాఁత
మ్ములనిమెఱింగికొని చేరఁబోయితె ప్రియునిన్?

క. చనిపోవుమగని విడి, న
చ్చినవేరొకమగనిఁ గోరి చేరెడుపక్షుల్
నినుఁబోఁటివారు గారే
కనుఁగొన నది నీకుఁదప్పుగాఁ గనఁబడెనే?

క. ఓపెట్టిపులుఁగ! యేఁటికిఁ
జావవలయు నమ్మ! నీదుసంతతి బ్రదుకం
గా వెరవుగలదె? విధవలు
జీవించి సతీవ్రతంబుఁ జెల్లింపరఁటే!

క. చెలువల రెండవ పెండ్లికి
బలవంతము చేయుదురటె! వలదనుచుండం
గులజులు; దూరాలోచన
వలదే? చాకున్న నీస్వభావము చెడునే?

క. కులకాంతల నినుఁ బోలం
గలవారలు కోటికొకరు గలరో లేరో?
కులశీలవ్రతనియమం
బులు నీకే చెల్లెనమ్మ పులుఁగువడంతీ!

క. మన మిచ్చినతని కేమి
చ్చినసైన ఋణంబుఁ దీర్పఁ జెల్ల దనికదా
చనవిచ్చినమగనికినై
తను విచ్చితి వెంతసుగుణ ధన్యవో పతగీ.

క. నిన్నెఱుఁగుదు నీతిన్నని
తెన్నెఱుఁగుదు వంగడంబు తెరఁ గెఱుఁగుదునో
పున్నెపుఁబులుఁగ! మతేమను
కొన్నను గొల మూటగట్టుకొనుటవె కాదే!

క. అరుగుము దివ్యపతంగీ !
యరుగు! మరుగు! మమలమై సదానందదమై
శివమై తేజోమయమై
పరగుపదంబునకు విభుని పరిసరమునకున్.

క. అందఱు సదయహృదయులే
యందఱు సమభావయుతులె యందఱమృతులే
యందఱుఁ దృష్ణారహితులె
యం దెందును మృగయు లుండ రరుగుకపోతీ!

(20-5-1910.)

3 కల్పలత.

చ. అనఘ! వసంతయామినుల
　　నాసవపానవిలోలచిత్తు లౌ
జనులు, సుమద్రువం బవసిఁ
　　జాఱఁగఁ దత్ప్రతిబింబితామృతాం
శుని, మధువానుచీమలను
　　జూచుచుఁ "జీమలు చంద్రబింబముం
బన మొనరించెడిన్" భళిరె!
　　మాయురె! యంచుఁ దలంత్రు మూఢులై.

చ. చెనకినయంతమాత్ర చలి
　　చీమలచేనహి సచ్చు నంచుఁ దా
వినినకతాన నై నిలిపి
　　వింతగఁ జీమల రాహుభీతి లోఁ
గనుఁగొని చందురుం డటులు
　　గావునఁ "జీమలు చంద్రబింబముం
బన మొనరించెడిం" జనునె
　　వానిని మత్త్రియు నిత్త్రి యం చనన్.

చ. కనఁ దెలిదమ్మిరేకుల నొ
కానొకచోఁ దగఁ గెంపుఁ జాయ, మె
త్తనిపవడంబు గన్పడియెఁ
దాఁ గని "చీమలు చంద్రబింబమున్
బన మొనరించెడిన్" భళిరె!
మాయురె! దుర్లభసత్క్రియంబు శో
భన మిదు నంచు జప్పరము
వచ్చెను నందకుమారు సేవకున్.

క. భూతేశపరమకరుణా ప్రి
"భూతంబై యుదకరూపమున భూమికిఁ దాఁ
దోఁతెంచె ననఁ"గ జాహ్నవి
ఖ్యాతిగఁ గాశీపురంబునం దలరారున్.

క. ఆతతభగవత్కరుణా ప్రి
"భూతంబై యుదకరూపమున భూమికిఁ దాఁ
దోఁతెంచె ననఁ"గ వర్షము
భూతగణాధార మగుచుఁ బొలుపొందు నృపా!

క. ద్యోతల మంతయును దీపి
"భూతంబై యుదకరూపమున భూమికిఁ దాఁ

తో

దోఁతెంచె ననఁ" గను మహో
త్సాతపువర్షంబు గురిసెఁ బ్రియమున నృపా.

——

చ. తెలతెల వేఁగుచుండుటను
 దేజము దక్కెను నీదుసంపద
లోలకొలల మంచుఁ బక్షులఁ
 గూడెను మామధుపవ్రజంబు నే
నెలనెల వైనఁ గాన నిట
 యీవని ;—వారదె ! పోవుచుండి రా
" వల వలరాజు రాజుఁ—గలు
 వా ! కలవా లవలీలతావళుల్ ?"

చ. చెలిమిని బాసి కాలగతి
 చేతఁ బరస్పర మేఁగుచుండి రా
" వల వలరాజు రాజుఁ గలు
 వా ! కలవా లవలీలతావళుల్ ?"
చెలువుఁడు లేఁ డటంచు వగఁ
 జెందకు స్వప్రభచేత లేఁతవె
న్నెలలను దోఁపఁ జేయుచును
 నీమదికిం బ్రమదంబుఁ గొల్పెడిన్.

చ. చెలియ వియోగతాపమునఁ
జిక్కె నటంచు నిశాతబాణపం
క్తుల నుడుకైన వెన్నెలలఁ
గుప్పుచుఁ గప్పుచు వేచుచుండి రా
" వల వలరాజు రాజుఁ గలు
వా! కలవా లవలీలతావళుల్ "
కొలఁకునఁ? జేయఁగావలయుఁ
గోమలికిన్ శిశిరోపచారముల్.

[కల్పలతలోని ప్రశ్నల కుత్తరములు : కవిత్రితయము]
(30-12-1903.)

4 చాటుపద్యములు.

సంధ్యారాగవర్ణనము.

చ. తనప్రియురాకఁ గోరుచు న
    తం డరుదేరఁగ మోము వాంచి సి
గ్గున, మదిలోఁ బెనంగొను
    కూరిమి జాహ్లాదమేర్పఁ గౌఁగిటం
జొనిపియుఁ దోడిదిక్సతులు
    చూతురొ యేమొ? యటంచు నల్లన
గ్గునఁగొను వారుణీసతివి
    లాసవుఁజూపులో! సాంధ్యరాగమో!

చ. కువలయ మేలలేమిఁ దన
    కున్ మునివృత్తియె యంచుఁ గావిసా
లువులు ధరించి పద్మినివి
    లో నొకసారి దలంచి రాగసా
గరము ప్రవృద్ధమౌటకుఁ గ
    రంబును జింతిలి యొప్పటో తెగం
దివిచె నినుం డనంగ దివి
    నిండి వెలింగెను సాంధ్యరాగముల్.

మ. దినమెల్లం దను నాఁగ మార్కొనెడువం
    దేహాళితోఁ బోరుటం
దనువెల్లన్ రుధిరంబు గ్రమ్మ నిముఁడ
    స్తగ్రావముం జేరి, తెం
పున నాకూపునఁ బశ్చిమాబ్ధి యనుపెం
    పుందల్లినిం జేరినం
తని శోకించు నటంచు నాకనది ర
    క్తంబుం దొలంగించి తా
జనెఁ గాఁబోలును చూడు మింట వరుణా
    శన్ రక్తకాంతుల్ సఖా !

(కవిత్రితయము—12-8-1904.)

నారికేళము.

మ. పునుకం బెం కొనరించి, యందుఁ దనువుం
    బొందించి, లోఁ జిన్నిగం
గను పాత్రించి, కలంబరాశి జడలం
    గావించి, పైఁ జర్మముం
బొనరం జేసి, నతీవియోగమున మున్
    ముక్కంటి జన్మించె నీ
కనుపొందన్ ; భళి ! నారికేళము ! త్వదీ
    యౌన్నత్య మే మందునే !

ఉ. నారికెడంబ! నిన్ను విధి
నారికెడంబుగఁ జేయఁ జింత మైఁ
బాఱఁగఁ బూచి, కాచి, కడుఁ
బండియు, నెండియు, రాలి, గాస్సునం
దారట మొందె, త్రైలగుణ
మందె, పరీమళవస్తుసంపదం
జేరి తదంగనాలకల
చెల్మిని దొంటికొదం దృజించితే!

మ. నినుఁ బాదంబులఁ దన్ని, పై కెగయుచుఁ
నీయుత్తమాంగంబునం
దును బండ్లం బగిలించి తద్రసము నెం
తో ద్రావ నేవారికై
నను దాపం బెడలింతు వీవు త్రుటిలో
నఁ నారికేళంబ; చెం
దినకష్టంబుల నెంతురే ఘనతరుల్
దీనాళులం బ్రోచుచోన్.

(కవితిత్రయము—12-8-1904.)

చంద్రవర్ణనము.

చ. పరుషవచశ్శరంబులను
బాలిశుఁ డెంతగ నొవ్వనాడినన్
సరసునిచిత్త మెల్లపుడుఁ
జల్లనిచూపులె చూచుమాడ్కి ; భా
స్కరుఁడు ఖరాంశుపాళి కడఁ
కం దనపైఁ బ్రసరించుచుండినన్
సురుచిరశీతకాంతుల వ
సుంధరఁ జల్లెడుచంద్రుఁ జూచితే!

చ. తనకడఁ దారకాజనవి
తానము పేరిమిఁ జేరి కొల్వ, మి
న్ననియెడుసింహపీఠమున
యందు సముంచితకాంత వైభవం
బునఁ దనరారుచుండి, కడు
పొంగెడుతెల్వని దిక్పతుల్ నమో
యనఁగను రాజదే కువల
యం బలరారఁగఁ దేజరిల్లెడిన్.

మ. పొలయల్కన్ సతి తన్నుఁ బాసి చనినం
బొల్పేని, కామాగ్నికి

లల నింద్రుండు సహింపలేనియెడఁ
జల్లంజేయఁగా, యామినీ
లలనారత్నము మిన్నుపానుపునఁ బూ
లం జల్లి, పూదండలం
దలయుపిం గదియించిన ట్లుడుసుధా
ధామాకృతుల్ దోఁచెడిన్.

(కవితిత్రయము—13-8-1904.)

చాతకము.

మ. ఇరుతీవంచనెలల్ బలే! కుడుపు తే
కేరితి జీవించితే
వరసారంగమ! నేఁడు వారిదుఁడు ద్యో
భాగంబునం దోఁప స
త్వర మేతెంచితి వేడనుండియొ విచి
త్రిం బేర్పడం గుల్కుచుం
గరకంబో? యమృతంపుబిందువొ పరీ
క్షం జేసి భక్షింపుమా!

చ. ఘనుఁడగు జీవనాథ్యుచెలి
కారము పీడిననాఁటఁగోలెఁ దా
ననుపమతాపవేదనల
సందేశనెమ్మిని దేర్చనచ్చి తే

మని కొనియాడువాఁడ భవ
సంచితసత్కృప పాత్రకంబ! ని
న్నెనయు పరోపకారపరు
లెవ్వరిఁ - మఱిచెక్క పంచుమా?

మ. ఘనమైనట్టివిహార గర్వ నిలుపం
గాలుపాక నిర్జరప
త్కనసంఘోలవముం గ్రసింపఁదగున
క్కాలంబు నీ పేమఁగా
క సమీరము పాతకంబు తమిఁ దా
గంబులా [illegible];
[illegible]
[illegible]

(... — 13-8-1904.)

[illegible]

ఉ. పుట్టితిఁ గోత్రమం దుడిగెఁ
బాల్యతి దేహము మంటలెత్తె, యి
ట్టిసరాని యొంపఁబడి
యే నట నైతిని మీకతొన, ని
ప్పట్టున నైన నన్నెమపఁ
బాపియు, కోరికఁ దీర నిప్పుడుం

4

దిట్టుచు నింక వేఁచికొని
తిందురటయ్య! గృహస్థు లందఱున్?

చ. వెఱవకు నక్కదోస! యవి
వేసములన్ నినుఁ ద్రెంపినందుకే
శిరమున బుట్టలో నిముడఁ
జేరిచి మోయుచు వాడవాడలం
దిరుగుచు "నక్కదోస!" యని
తేపకుఁ దేపకుఁ గేక వేయుచున్
స్మరణయొనర్చు నిన్నతఁడు
చాలదె నీకిది యెంచిచూడఁగన్.

ఉ. అక్కట! చేతులార జల
మల్లన పోయుచుఁ బెంచినట్టియీ
టక్కరిసేద్యగాఁడె యిటు
తారున మాయుసురుల్ హరింపఁగా
నొక్కటఁ దల్లిప్రక్కఁ బడి
యున్న మమ్ముం జెఱుపంగఁ దెచ్చె నీ
చక్కికి బుట్టఁ బెట్టె నిది
చాలదె నెత్తికి నెక్కి త్రొక్కఁగన్?

(శశిలేఖ[illegible]—3-9-1904.)

సూర్యకాంతిపుష్పము.

సీ. తనయభ్యుదయమునఁ దలయెత్తి నానతించి
యెనలేనికాంతి రేకెత్తఁ జేసి
తనకరస్పర్శను దనువల్లి నలరించి
హృదయసమ్మోదంబుఁ బొదలఁ జేసి
తనమూర్తి తేజంబునను రాగ మొదఁగూర్చి
యనువర్తినిఁగ నన్ను నలరఁ జేసి
తనసత్పథవిహారమున నన్ను భ్రమయించి
యాశలతోడ నల్లాడఁ జేసి
నపరదిక్పతి కనురాగి యగుచు నిప్పు
డన్నియును వీడి యినుఁ డిదే యరిగె ననుచు
సూర్యకాంతమ! తలవాంచి సుక్కఁ బోకు
వారుణీసక్తునకు నెందు వలపుగలదె?

(20-11-1904)

5 ఆంధ్రభారతి.

సీ. విబుధులాంధ్రకవిత్రయంబునచెట్టఁ
బట్టిపారంబును ముట్టినపుడు
నావెన్కఁబోతరాజాదులచే నుప
లాలింపఁబడుచు మేల్గాంచినపుడు
నయ్యనంతరమున నలసానిపెద్దనా
దులప్రాపకంబున నలరినపుడు
నామీఁద సూరకవ్యాదులచేఁ దగు
పద్ధతిఁ బోషింపఁబడినయపుడు

నెంతవైభవ మందితో? యిప్పుడిట్టి
కాలమాసన్నమైన నేగతియు లేక
యెవ్వరెటు లాగినను నటు లేఁగుచుండి
నసిచెడి యిట్లైతె! యాంధ్రభాషావధూటి!

సీ. గణయతిప్రాసలక్షణము లేమిటి" కైడి
యా"కుంటువడిపోవు ననెడివారు
గణముంటదగు; "నైసు"గానుండుఁజదువఁ; ద
క్కినవి "యూస్ల"స్సని కెరలువారు

వ్యాకరణంబేల! పలుమ "హైండున" కెక్క-
నట్లు వ్రాయుమనియు ననెడివారు
కాండుటక్క-నివిప్రయోగంబున్నఁ జాలు "న
ప్లై" చేయునగు నని పలుకువారు
నగుమహానుభావులు కవులైరి; నీకుఁ
బ్రాణములు మీఁదికిని వచ్చెఁ; నచ్చటచట
విబుధులున్నవా రమృతంబు వేయఁగలరొ!
యుటకచూచుచు నుండెదవొ? తెలుంగ!

సీ. పాండురోగము కల వాని దేహముపోలెఁ
బైత్యపూఁతమెఱుఁగుల పద్యములును
నబలుని యంగంబులట్లు నీరసములై
వసివాళ్లు వాడెడి వచనములును
నరవి నున్మత్తప్రసంగంబులం బోలి
కడు నసందర్భము లెప్పనలును
కల్లుద్రావినవాని కాలుకూఁతలుపోలె
బడబడలాడెడు పాటవనము
లిన్ని యున్ని యనుచు లెక్క యిడఁగరాక
పెనఁగుచుండెఁ నీవు; వివేకము నస్వ
భావము ననుమాటయె లేదు పదకవులకు
నకట! యిఁకమీఁద నెట్లౌనో యాంధ్రభాష.

సీ. కేవలశ్లేషమే, కావలయును గావ్య
మాధురి కనుబుద్ధి మానుదాఁక
ఘనహారికేళపాకమున గ్రంథము వ్రాయు
కవి ప్రౌఢుఁడనువాదు కడచుదాఁక
దీర్ఘసమాసముల్ తెగి వ్రాయకుండిన
దేలిక యనువెఱ్ఱి తీఱుదాఁక
నొకశబ్ద మగుపల్కులుండుపద్యంబులే
హృద్యంబులనునాఁడు లేఁగుదాఁకఁ
దఱఁచినప్పుడె యెన్నొపద్యములు వ్రాయఁ
దగు ననుకవుల్ జనించుట తగ్గుదాఁక
సెంతతపియించినను నీకు నెప్పటివలె
వెలయుభాగ్యంబు గలుగదో తెలుఁగుబాస !

సీ. పరగఁ దత్సమతద్భవవ్యాజమున సంస్కృ
తంబుఁ గైకొని వేడ్కఁ దనరలేదె !
దేశభాషలఁ గొన్ని దేశ్యపదంబుల
న్నెపమునఁ జేకొని నెగడలేదె !
తత్తద్విశేషసందర్భంబులం దన్య
భాషాపదముల లోఁబఱుపలేదె !
నికరంబుగాఁ జూడ నీవొక కొన్నిభా
షలలోననుండియే కలుగలేదె !

కొ్రత్తయే యన్యభాష లోఁగొనుట నీకు?
మంచియో చెడ్డయో నాదు మాటవినుము
మంచిభాషల నీపోల్కి మార్చికొనుచు
నిలుపుకొనుమమ్మ! నిను నీవె తెలుగుబాస!

సీ. దేశభాషాభివృద్ధికిఁ బాటుపడుచు స
మాజంబులను గూర్చు మహితులార!
మదిఁ దన్పుగతిమృదు మధురరీతులఁబ్రబం
ధములువ్రాయుకవిమూర్ధన్యులార!
గురువిమర్శనమున గుణదోషములు నిర్ణ
యింపఁజాలెడు విబుధేంద్రులార!
శ్రద్ధాళులై యనిశంబు సద్గ్రంథముల్
చదివి యానందించు సరసులార!
పండితులకుఁ బోలెఁ బాలుని వలెనుఁ జదువఁ
దెలియఁగలయట్టి గ్రంథముల్ వెలయుదాఁక
సవి స్వభావాన్వితంబులై యలరుదాఁక
నాంధ్రభాషాసమభివృద్ధి యగుటకల్ల.

గీ. కవులకెల్లను వ్రాయఁగ బుద్ధి కలుగుఁగాక!
దీనినే పండితులు సమర్థింతురుగాక!
దినమునకు నొక్కవింతగాఁ దెలుఁగుబాస
దేవదేవునికరుణ వర్ధిల్లుఁగాక!

(6-6-1910.)

6 ముద్దరాలు.

"తెల్లనగు వస్త్రములమీఁద నల్లగల్వ
లెవరు చల్లినారే ?" యని యెంతో వింత
ముద్దరా లనుచున్నది ముచ్చటపడి
కలము బావ యటందురా గరితలార !
ముగుద మొగమింత చేసికో నగెద రేల ?
బావ యేచెర్వులో దిగఁబడెనో కాని
మంచిపూవులఁ గోయఁడు కొంచెమైనఁ
గొప్పులోఁ బెట్టుకో రాని కోమలములె ?

7 గృహలక్ష్మి.

క. రత్నంబుచేత మేల్మియొ
రత్నము మేలిమినొ జగతి రాణించుటయున్
బతిచేత సతియొ సతిచేఁ
బతియో వెలయుటయు, నెఱుఁగఁ బడ వెవ్వరికిన్.

ఉ. ఏమొకవాక్య మిందు వచి
యించెద మొప్పిద మంటయే బుధ
గ్రామణులైన వారినుడి
కారము ; సమ్మదసంభ్రమావళీ
కామితకౌతుకాభ్యుదయ
పరాగృహిణీరమణీయదర్శనం
బేమహాసియుచిత్త మొల
యించునొ వాసిదె భాగ్యమెన్నఁగన్.

గీ. అవనిఁబోఁ గల్గుపూజ్యవస్తువులలోనఁ
జెలువ తా నొక్కఁడయి ప్రకాశించుననినఁ
గాంత గేహమ్మునకు నలంకారమనెడి
మేటికవివాక్యరత్న మేమిటికిఁ జాలు ?

చ. నరులపురోభివృద్ధికి స
నాతనకారణశక్తియై విభా

స్వరగురుగేహరాజ్యవిభ
వంబున కాదిమసన్నిధానమై
పరగెడుమానినీవిమల
పావనచిత్రచరిత్ర మేకవీ
శ్వరుఁడు రచించి తృప్తిఁ
గనఁజాలునొ నిక్కము తెల్పుఁడెల్లరున్.

సీ. తనయయై తనతల్లిదండ్రులమది ముద్దు
పలుకులనాటపాటలను దనిపి
కాంతయై ప్రాణేశు కనుసన్నల మెలంగి
యనుకూలవర్తిని యై చెలంగి
తోడలై గుణముల కుప్పయో యనఁగఁ దా
నత్తమామల కెమరాడకుండి
అత్తయై కోడండ్ర ననుఁగుఁదనూజుల
సమ్మోవిధంబుల నాదరించి
గీ. అఖిలరూపంబులను దాన యగుటకతన
నఖిలరూపంబులకును దా నాథ్యయగుచు
లలితసంసారసామ్రాజ్య లక్ష్మియనఁగ
నిహపరసుఖంబు లిడునది యింతికాదె?

చ. గలగల సందియల్ గదలఁ
గా నెమరై దరహాసయుక్తమై

కలకలలాడు నెమ్మొగముఁ
గన్పడఁ జేసెడు నప్పుడెంతగాఁ
గలఁగెడుమానసం బయినఁ
గౌతుక మందఁగఁ జేయుచుండు నా
చెలువల గేహలక్ష్ములని
చెప్పుట చాలునో చాలదో సదా!

గీ. వనిత గృహరాజ్యలక్ష్మియే వాస్తవముగఁ
గానిచోఁ దత్కటాక్షపక్షినియుక్తి
కలరి సామ్రాజ్యభారేయుఁ డైనఁగాని
పూరుషార్థముఁ జేవఁగూర్పఁ బూను టేల ?

ఉ. వంటయుఁ బాఁడియున్ బలమ
పారకళావిభవంబు భాగ్యమున్
దంటతనంబుఁ బౌరుషముఁ
దాల్చిరసమ్మె నొకయింటివారుగా
నుంటకు మంగళాంగులు న
మోన్నపూతచరిత్రలైనవా
గ్రుంటులసత్సహాయములె
కావలయుంగద పూరుషాళికిన్.

గీ. పురుషునకు నర్ధదేహమై శరణమునకు
శరణమై ఘనసంసార తరణ మగుచు

సకలసౌభాగ్యములకు సంస్థానమైన
వనిత లేకున్న భవనము వనముగాదె ?

గీ. అలరుమొగమున నిల్లాలు తలుపుచాటు
గాఁగ నిలుచుండి వెన్నెలఁ గాయునొక్క-
చిఱునగవుగాని తేనియ చిందునొక్క-
చిఱుపలుకుగాని నెఱపి రంజించు విభుని.

ఉ. మేలిమిపైఁడిపూఁతపస
మించుబవంతుల నంగణంబులన్
నీలమణీవితర్ది కల
నిర్మలభవ్య పవిత్రశాలలన్
వేలుపుటింట్లలోననొక
వింతహొయల్ చెలఁగంగఁ గూర్మియి
ల్లాలు మెలంగుచుండిన గృ
హంబెగృహంబుధరాతలంబునన్.

క. జిలిబిలి పలుకుల ముద్దులఁ
జిలుకుకుమారు నొడిలోనఁ జేరిచికొని జో
లలువాడి నిద్రపుచ్చెడు
జలజేక్షణ కలుగునిల్లు స్వర్గంబుగదా!

గీ. జగతి రెండింటిచేతనే జరగుచుండు
ధనముచేతను సత్కళాధనముచేత

దలఁప నవి రెండుకాంతాద్వైతముతొ
సారమతు లిది నిజ మని తీరవలయు.

(8-7-1910.)

---

8 ముద్దరాలు.

మనసుబడి పెంచికొనుచున్న మల్లెతీగ
మొగ్గఁ దొడిగిన దని మది ముదము గదురఁ
గులుకునడకల మట్టియల్ గులుకరింపఁ
బసిఁడిచిఱుగజ్జియలు తన్నుఁ బలుకరింప,
నలరుమొగమునఁ జెమ్మట చిలుకరింప
సొగసుఁజూపుల దిక్కులు చూచికొనుచు
నుపవనంబునబడి ముద్దులొలుకుచుండఁ
బూఁపజవరా లొకర్తుక పోవుచుండె.
"అలరుఁబ్రాయంపుజవరాండ్ర కందఱకును
వయసునను సామ్యమే కానఁబడుచున్నఁ
బ్రకృతియందు భేదంబె చూపట్టుచుండు
నహహా! విభిన్నసృష్టినైపుణీ మహిమ మేమొ?

అలరుపండలకై కొంద ఱాసపడుదు
రాటపాటలకై కొంద ఱనుగమింతు
రలఁతిచెలినవ్వులకె కొంద ఱలరుచుందు
రనుసరించుట కొక కొంద ఱనుమతింత్రు.

ఒకతె యుపవనభవనమం దుండఁ గోరు
నొకతె నెలరాలతిన్నియ నుండఁగోరు
నొకతె పూవుటీరంబుల నుండఁగోరు
నొకతె నిల్వుటద్దముచెంత నుండఁగోరు.

వలపునసుమించుసిగ్గున నలరువారు
సిగ్గుననుమించువలపుచేఁ జెలఁగువారు
వలపొ? సిగ్గొ? యెఱుఁగక వఱలువారు
నగపడుచునుందు రిల ముద్దరాండ్రలోన.”

ఆయతివ పోవుమంచఁ “గోకో” యటంచుఁ
గోకిలము మావిచివురు మెక్కుచును గూసె
నపుడె కలకంఠి ప్రియుఁజేర నరుగుదెంచెఁ
గాంతకన్నులఁ బడె నాపికద్వయంబు.

“పట్టపగలె నాథుఁడు తమ్ము వెట్టఁబిలువ
నారగింపంగ వచ్చెఁ బికాంగనయును
ఔర! మగ లెంతసాహసు లైనఁగాని
మగువ తనసిగ్గు విడనాడఁ దగునె యిట్లు?

ఎవరో చూచెదరనెడి సిగ్గెంతసిగ్గు?
ప్రాణవిభుఁ డెంతచనవరి యైనఁగాని
యప్పు డెంతటియొంటిపాటైనఁగాని
చెలువ తనసిగ్గు తనుదాన చెఱిపికొనునె?
ప్రియునిఁ గన్నెత్తి కేళికా గృహమునందు
నైనఁ, దమిమించుమాపుల నైనఁ, బైఁట
చెఱఁ గొకించుక మాటు గాఁ జేసియైనఁ
దప్పఁ గనంజాల నిల్వుటద్దమునఁదక్క.
నేనొకర్తుక నున్నప్డు నేఁడుప్రియుని
చనవుచం జేరి యలరింతు నని తలంతుఁ
గాని ప్రాణేశ్వరుండు నాకంటఁబడినఁ
గ్రచ్చుకొను నెటనుండియోవచ్చి సిగ్గు."
అనుచుఁ దలయెత్తిచూడక యలరుబోడల
మాటునం బడి తనపూప మల్లెతీగ
కుదుచుకొనియున్న సురపొన్నగున్నకడకు
నాలతాతన్వి యల్లన నరుగుచుండ,
వెనుకఁ దూఁగాడుచుండిన వెలఁదిపైఁట
తలిరుగొమ్మ నొకించుక తగులుకొనఁగఁ
గాంతుఁ డప్పుడప్డు పట్టుట గలదుగాన
సిగ్గునం దిగ్గిచూడక చెలువుఁడనుచు.

చెలువకును గంపమునఁ జిఱుచెమట వొడమె
కమ్మతెమ్మెర లోలసెను గమ్మటంచు
మలయపవమానహతికిఁ గొమ్మయును దూలె
తరుణిపైఁటయుఁ దూలెఁ జేతనమువోలి.
అడివి కవ్వలను మరలఁ "గో"యని వినఁబడి
యనుఁగుఁజిలికంఠనాదంబు ననుకరించెఁ
దరుణి చెలి వచ్చె నని వెను దిరిగిచూచె
వెనుక నెవ్వరు లేకుంట విశదమయ్యె.
కోమలాంగికి నెమ్మది గుదుటఁ బడియె.
మరలఁ "గోకో" యనుచు వినంబడియె నంత
వనజదళలోచనయును ముందునకుఁ జరిగి
మల్లెపందిరికడ సఖీమణిని గాంచి.
అలరుఁబ్రాయంపుమల్లిక నాత్మసఖియుఁ
దాను దర్శించి మిగుల సంతసము నొంద
నెంచి పరుగున వచ్చుచు నింతలోనె
కొమ్మభవనమ్మునకు గిరుక్కునను మరలె.
'వలదువలదాఁగుమాఁగుమో చెలువ!' యనుచుఁ
"బడఁతి నాతోడుసుమ్మాన యిడితి" ననుచు
నెంతగా బతిమాలిన నింతి వినక
పట్టుకుచ్చులుజడ వెన్ను పాములాడ.

పంతమాడంగ మొలనూలు వదలి జఘన
సీమ కేఁగంగఁ బయ్యెదచెఱఁగు మరుని
ప్రబలకేతన మనఁ దూలిపడఁగనొక్క-
పరుగులోన లతాంగి దృక్పథము దాఁటె.
కారణము లేకపోవ దాఁ గాంతకొఱకుఁ
బ్రాణనాయకుఁ డాపూల పందిరికడ
నడఁగియుండియుఁ దమకించి యంతలోనె
యొక్కపరిఁ దొంగిచూచె నిల్వోపలేక.
మొదలె సిగ్గరి కత్తియ ముద్దరాలు
వలపుఁబూఁదోఁటలోపలఁ బట్టపగలు
చెలి కనుంగొనుచుండంగఁ జెలువునెదుట
నిలుచునే సిగ్గు తక్కువే వలపుకంటె?
చెలువ మదినిండి విరిసిన సిగ్గుకంటె
దయితునకును పదింతలు తమకమున్న
నెట్టులగు? నంతయోపిక పట్టవలయు
సిగ్గుపోవునుపాయంబు సేయవలయు.
చతురమతులార! జగతి లజ్జావతులకుఁ
బ్రాణవిభునొంటిపాటె ప్రియంబటంచు
నెఱిఁగి రెండవకంటివారెఱుఁగకుండఁ
నిలువున మనోధనంబుల విలిచికొనుఁడు.

(10-7-1910.)

9 పంజరకీరము.

క. అలరుంబోణుల మెత్తని
యలరుం గేల్దోయిఁ బెరుఁగు నంతటిపుణ్యం
బలవడియెఁ గాన నిన్నా
యలరు విటుతువాహనంబ వందురుచిలుకా ?

క. రతనపుఁబంజరమున సం
తతమును వసియించి పంచదారయుఁ బండ్లున్
హితమతి భుజియించెదు స
ద్గతి నీవేకాక యెవరు గాంచిరి ? చిలుకా !

క. అంతిపురంబునఁ గలసీ
మంతినులెల్లరును నీదుమాటలు విన నుం
కింతురు సంతసమునఁ బ
ల్కింతురు మోదమున నాలకింతురు చిలుకా !

క. మన్నించుదొరలు నీకుం
గన్నాకై పోషించుచుండఁగా నెన్నఁటికిన్
నిన్నుఁ బరులెవ్వరైనం
గన్నెత్తియొకింత చూడఁగలరే చిలుకా !

క. సకలఫలంబులు నీమ
న్కికిఁ జేర్చుటకాక పల్కు నేరిపి నీవ

ల్కాకవేయివరాలుగ నె
న్నికొనెదరేమిటఁ గొఱంత నీ కోచిలుకా !

క. గాటపుఁ గూరిమి నీకుం
జాటలుఁ బద్యములు నేర్పవలసినచోటన్
మాటకుమాటకు లంచము
పూఁటకుఁ బూఁటకు నొసంగి ప్రోతురు చిలుకా!

క. అరమరలు లేక నీవుం
గొరవంకయు నొకరికొకరు కోడిగమాడం
దొరకొనుతఱి మీముద్దుల
గరగరికలు మెచ్చవచ్చుఁ గాదే చిలుకా !

క. కొదువపడకుండ నీకె
య్యెదివలయునొ దానిఁ గూర్చు నేలికలుండన్
సదనమున నుండునీకు
న్నది లేదను చింతవలయునా ? రాచిలుకా !

క. ఫలములచేఁ దనుయాత్రిం
జలుపఁగలవు, సంతతైక సన్మార్గరతిన్
మెలఁగెదవు, రామనామముఁ
బలికెదు సత, మింతకంటె భాగ్యముగలదే !

క. చిలుకా ! నీపంజరమున
వెలలకుమీ మొఱకుగండుఁబిల్లులు కడు వి

చ్చలవిడిఁ దిరుగుచునున్నవి
బలవంతముగాఁగ నొడిసి పట్టునొ? యేమో?

క. కవకవఁ గూయుచుఁ జదలన్
జివచివఁ జను నడవిజాతి చిలుకలపలుకుల్
చెవియిచ్చి యేల, వినియెద
వవమతి నెగురంగ నెక్కలార్చెదవేలా?

క. తెగియించి గుంపుగుంపుగ
గగనంబునఁ దిరుగుచిల్కగమిఁ గని యుప్పొం
గఁగఁబోకు మట్టిమార్గము
తగదుసుమీ నీకునిది యథార్థము చిలుకా!

క. ఆయొడిసెలవేటులు నా
రాయిడులా చెట్టుచెట్టురాకలు పోకల్
నీయెదఁ దలఁపవె? యేగతిఁ
బోయిబ్రదుకఁగలవు భ్రాంతిఁ బొందకుచిలుకా!

క. బంగరుగజ్జెలు కాళ్ళ నె
సంగ ఫలాహారములు లసన్నీరములున్
జెంగటనుండఁగ నవహ
ర్మ్యాంగణములనుండు టెవరి కబ్బునె చిలుకా!

క. కికురించి పోయినంతనె
ఘుఘుఁగాటులు గోళ్ళమొనల పోటులెకానీ

యకట! నిను బ్రిదుకనిత్తురె ?
మొకమెఱుఁగనిచోట బ్రదుకు పొందులుగలవే.

క. ఒక్కరు పెట్టిన ఫలములఁ
జక్కఁగ మెక్కితివి చిన్నతనమాదిగ నీ
వెక్కడ ? కాననవాటిక
లెక్కడ ? నిలువంగనేర్తు వే త్రుటియైనన్ ?

క. మనిచెడువారలనే న
వ్వాని నైజముగలుగు వక్రమతివగు నీమే
లునకె నినుఁ బంజరంబున
నునుపవలసెననుచు నెఱిఁగియుండుము చిలుకా!

క. మది వెనుకముందు నరయక
యెది దోఁచిన నదియొచేయు దెఱుఁగవు లాభం
బిది యని నష్టం బిది యని ;
వదలి చనిననీఁదఁ గీడు వచ్చును జిలుకా!

క. అవివేకము నైజము నీ
కెవరేఁ దెలుపకయె తెలియ నెఱుఁగవు స్వేచ్ఛం
దవిలి చరియింపఁగానే
రవు వెడలఁగఁబోకు పంజరంబును జిలుకా!

క. సఖివారు వారు మిన్నం
దిరి నే నీపంజరమునఁ దిరుగవలసె నం

చోఱలకుము నీకు వారికి
సరిపడ దిటఁగలదు నీకు సౌఖ్యము చిలుకా!

క. ఎగురఁగలే వించుకయును
దగకును నాఁకటికి నింత తాళవు గడియిం
పఁగలేవు మేఁత నిట నిను
దిగవిడిచిన నెట్లుగా బ్రదికెదవు? చిలుకా!

క. దూరాలోచన సేయఁగ
నేరక యడివిమాన నెదిరి నిన్నెఱుఁగకయే
వారిని నీకినిఁ గనుఁగొని
కోరకు నీతలకుఁ దగనికోరిక చిలుకా!

క. చిలుకా! యీపంజరమున
నిలిచిన నినుఁ బ్రియసఖిగ గణింతురు నీప
లుకుల నాదరింతు రంతటఁ
గలిసి తిరుగు చిలుక కట్టిగౌరవ మున్నే?

క. పొట్టకు జాలక చెట్టుం
జెట్టునకుం దిరుగుచుండు చిలుకలవలెనే
నట్టడవులఁ బడి చన నీ
కెట్టులు సౌఖ్య మని తోఁచెనే రాచిలుకా!

క. వరిచేల జొన్నచేలం
బఱిగల నేరికొని తినుచుఁ బైఁబడుదేగం

వెరలింపలేక దిక్కఱి
యఱచుచుఁ దిరుగాడఁ గోరనానే చిలుకా !

క. పలుగాకితనమునను బా
ముల కోరిచి చెట్లఁబట్టి పోవగఁ జనునే
యల వెటేఁగి బోయ లొగ్గిన
వలలోఁ బడఁ బ్రాణహాని వచ్చునుగాదే.

క. వన మెఱుఁగవు బోయలజీ
వన మెఱుఁగవు నీవు నిక్కమముగ స్వయంజీ
వన మెఱుఁగవు కనిసంభా
వన మెఱుఁగవు భవన మెట్లువదలెదు చిలుకా!

క. ఇది నీకుఁ దగినసదనము
కదలకు మిటనుండి తుష్టిఁగాంచుము యిది గా
దది, యదిగా దిది యని నె
మ్మదిఁ దోఁచినరీతిఁ జనకుమా ! రాచిలుకా !

క. నీపిచ్చ లెపుడొ యెట్టిలొ
నైపుణ్యముఁ జూపి మెఱఁగినారను మిథ్యా
వ్యాపనము సుకవికల్పిత
మీపట్టున నమ్మి చెడకుమీ రాచిలుకా !

క. నీనెమ్మదికిన్ మాన
ప్రాణములకు నీవె వజ్రపంజర మగుచున్

బూని చరింపఁగ నేర్పరి
వేరా నీచిత్రవృత్తి నేఁగఁగఁ జిలుకా!

క. పోషింతురు కాంతలు సం
భాషింతురు భాగ్యవతులు పరమార్థవిదుల్
భూషింతు రెల్లరును సం
తోషింతురు నీగుణోన్నతుల్ గని చిలుకా!

(8-8-1910.)

---

10 మల్లెపూవు.

ఫాల్గునముతోడ శిశిరంబు పరువులెత్తె
చైత్రుఁ డరుదెంచెఁ గొమ్మలుత్సవముఁ జెందఁ
"చెల్లె! నేఁ బెంచికొనుచున్న మల్లెతీవ
ముద్దుఁగను మూటఁగట్టుచు మొగ్గఁ దొడిగెఁ
గోయఁదగు విచ్చుమొగ్గ యొక్కొండెయుండె?"
అనుచుఁ దనచిన్నిసోదరి కనువదించి
చనువుకొనఁ బోయె నంత వసంతసేన;
చేయఁదగు మటన్న పనులనే చేయుచుంటఁ

జిన్ని బిడ్డలసహజంపుఁజేష్టయొకద !
యనల చిన్నది మెత్తని మనసుగలది
కానిపని యేమి చేసెనో కాని వేగ
మొక్కపర్వునఁ దనతల్లి యొద్ద కరిగి
మనసుచిడిముడిపాటున మసలుచుండె ;
చదువుకొనఁ బోయినట్టివసంతసేన
ముచ్చటకుఁ దోఁటదారినే వచ్చెనేమొ ;
కన్ను లెఱ్ఱగాఁ జెల్లెలిఁ గాంచి "యేమె !
పూవుఁ గోసితివా ?" యన మొగముఁ ద్రిప్పి
"లేదు లే" దని నవ్వెను లేఁతనవ్వు
నవ్వు పువ్వయ్యె నేమొ ? వింతగను దావు
లెల్లయెడ నల్లుకొనె ; "నిదియే" యటంచుఁ
దల్లి యొడిలోనఁ జేర్చి యంతయును వెదక
ననలయొడిలోననే యుండె నానుమంబు ;
అనల తెలతెల్లఁబోయి యాననము వంచెఁ ;
జప్పటలు గొట్టి కేరె వసంతసేన ;
"చేసినది యొప్పొ తప్పొ వచింపవలయుఁ
దప్పు దాఁపఁ జెప్పకు మసత్యంబుఁ దల్లి !
పలుకు దాఁచినఁ జేసినపనులు దాఁగ
వమ్మ !" యని మందలించె నయ్యనల జనని.

(7-9-1910.)

11 జీవగీతము.

నీ వెవరో? జీవమా! నిన్ను నే నెఱుంగ
నాకు నీకును ననుబంధనంబు కలిగె
నేమియో యెందులకొ యిది యెఱుఁగరాదు
ఇంతకాలంబు గడచిన నేముకాని
యెప్పు డెచ్చట నేరీతి నీవు నేను
గలసికొంటిమొ బోధంబు గాకయుండెఁ
గాని, నీవును నే నెప్పుడే నొకప్పు
డెడసిపో నుంటి మంచు నే నెఱిఁగికొంటి
జీవమా! చాలనాళులు నీవు నేను
కష్టకాలంబునను సుఖకాలమునను
నొక్కమాదిరిగాఁ గూడి యున్నవార
మకట! నిశ్చలమై, సత్యమైన సౌహృ
దంబు గల ప్రియమిత్రు లిద్దఱుఁ బరస్ప
రంబు విడఁబాసి చనుట కష్టంబు గాదె!
విధివిధానంబుచే నొక్కవేళ నట్లు
విడిచిపోవుటయే సంభవించు నేని
వేఁడినిట్టూర్పు నొకసారి విడుచుకంటె
నొక్కయించుక కంటినీ రోడ్చుకంటె

జీవమా ! యిఁక నెవ రేమి సేయఁగలరు ?
ప్రాణమిత్రుఁడ ! నను విడనాడునపుడు
నే నెఱుఁగకుండ దొంగతనానఁ బొమ్ము !
నా కెపుడుఁగూడ నీప్రయాణమును గూర్చి
కొంచెమైనను సూచింప నెంచఁబోకు
నీమనసువచ్చినప్పుడే నీవు పొమ్ము !
సెలవు గైకొనవలదు నా చెంత నీవు
గాని, యింతటికంటె మేలైనదియును,
పావనంబైనదియునైన పదమునందు
దిరిగి యొసఁగుము నాకు నీదరిసెనంబు.

(7-9-1910.)

12 కలము.

మ. కలమా! నింపును సొంపునై; విశదమై
కాంత్యుజ్జ్వలంబై, సుధో
పలసంకాశవికాసమై, మహితమా
పత్త్రాళిమీఁదన్ మషీ
సలిలాంచన్మృదువర్ణమాలికల నీ
సామర్థ్య మింపొందఁ; గే
వలనీలోత్పలమాలికావళుల తే
వన్ దావు లేపారఁగన్.

క. వారియుము నిర్మలభావవి
ధేయమ్ముగ బుధజనాళి ధేయముగ, జగ
ద్గేయమ్ముగ, లలితసుధా
పాయమ్ముగఁ; బాఠకశ్రవణపేయముగన్.

చ. హృదయమువెంటనే పరువు
లెత్తుము మేల్రతనాలకోవ నీ
కొదవినయట్టులే; నిలుచు
చుండక మేనితళత్తళదుర్చుల్
బొవలఁగఁజేయుటే పనిగఁ
బోవు మనంతలసత్త్రటిల్లతా

భ్యుదయముఁ గాంచినట్లె విబు
ధోత్సవదాయిని! దివ్యలేఖినీ!

మ. అమితఖ్యాతి వహింపఁ గోరి తలఁక్రిం
దైనంత నేమాయె? నీ
క్రిమ మెవ్వారల కబ్బునే! సుకవిచం
ద్రప్రౌఢహృద్భాసితా
ర్థము లన్వర్థముసేసి కూర్చెదవుగా
దా యున్నతిన్ లేఖనో
ద్యమసంభూతసువర్ణనీలమణిదీ
వ్యన్మాలికా! తూలికా!

గీ. తళతళత్కాంతి పత్త్రిసంతతుల నొలయఁ
గలకలధ్వని గతిభేదములఁ జెలంగ
భవ్యశరధైనయటుత పథమునందుఁ
బూల, ముత్యాలఁ జల్లుచుఁ బొమ్ము కలమ!

గీ. తిరుగు మరుగుఁజేసి దీనుని ప్రభుఁ జేయుఁ
ద్రిప్పిత్రిప్పి ప్రభుని దీనుఁ జేయు
నెవనిహృదయ మరుగు నేరీతి నారీతి
మెలఁగుశక్తి నీకె కలదు కలమ!

క. శ్రీమంతులచేతులలో
సామంతముఁ జూపు ద్రవ్యసంతతిపోల్కిన్

ధీమంతులచేతులలో
సామంతముఁ జూపి మెలగఁ జాలెద వీవున్.

గీ. నిలిచి తనపని సతము రాణింపకున్న
వన్నెకెక్కదుగాదె నేర్పరితనంబు
జగతి విధిసృష్టియెల్లను క్షరమెకాని
కలమ ! నీసృష్టియెల్ల నక్షరమునుమ్మ !

చ. స్థలము సుధానురూపము ; ప్ర
శస్త పథంబు శుభాక్షరంబు ; తా
వలము సుధీహృదంతరవి
భాసితసాధుమహాశయంబు ; ని
స్తులము ప్రభావ ; మేగతిని
జూచిన నీకుఁ గొఱంత లేదు త్రి
ప్పులఁ బడుచుంటినంచుఁదల
పోయకు కష్టమెకా ఫలం బిడున్ !

గీ. అంబునిధిలోన నుప్పగల్లైనఁ గాని
జలకణము శుక్తి ముత్యమై యలరునట్లె
యజ్ఞకడ గుడ్డిగచ్చకాయయును గాని
నీవు కవిచెంత ముత్యాలకోవ వగుదు.

చ. అరమరలేక నీవు విమ
లాధ్వమునం జనుచుండువేళ నా

ప్పరయఁగలేక దుష్టమతు
లడ్డము వచ్చిన నీవిలాసభా
సురవిమలాక్షరాకృతులఁ
జూపుచు నాఁపుము ; వార లంతకున్
గఱకుగ నున్నఁ దీవ్రపద
ఘట్టన నెట్టన శాస్తి సేయుమీ!

చ. కవు లనుపేరివక్రపథ
గాములచేఁ బడు టబ్బెనేని నీ
పవిమలరీతు లెక్కడివి?
బండతనంబె శరణ్య మచ్చటన్
దవు నది ; మేలిబుద్ధి గల
దానవమే నటఁ గొయ్యవారి కుం
టు వడుము ; పల్లటీ లెగిరి
టొంకు ; మ దే యుపకార మయ్యెడిన్.

(5-10-1910.)

13 రాజభక్తి.

క. శ్రీయాదవకులభూషణుఁ
డై యొప్పెడు కుంతిభోజుఁడను రాజు ప్రభు
త్వాయతమహిమాన్వితను
శ్రీయుతుఁడై వెలయు సుప్రసిద్ధుం డగుచున్.

గీ. అతని తనుజాత సకలగుణాభ్యుపేత
పృథ యనఁగఁ గుంతి యనఁగను వెలయుచుండు
నాసతీమణి కభ్యాగతార్చనమున
నతిథిగురుపూజలందుఁ బ్రియంబు ఘనము.

క. ఆసాధ్వీరత్నము దు
ర్వాసోముని మంత్రమహిమ భాస్కరుకరుణం
జేసి కనియెఁ గన్యాత్వం
బోసరిలకమున్న తనయు నొక్కని ననఘున్.

గీ. గోలతనమునఁ దానట్లు గోరికొనఁగ
దినమణి యొసంగినట్టినందనునివలన
నాభిజాత్యంబు రూపఱె నంచు వగచు
నామెఁ గని భాస్కరుండు దయాళుఁ డగుచు.

గీ. కన్యకాత్వంబు దూష్యంబు గాకయుండ
వర మొసంగిన, నాఁటి తరుణియంతఁ

దామరాకుల దొన్నెలోఁ దనయునునిచి
గంగలోపల విడిచె దుఃఖంబుతోడ.

క. ఆవెనుకఁ గొంతకాలము
పోవఁగ నాసాధ్వి పాండుభూపాలునకున్
దేవి యయి కనియెఁ దనయులఁ
బావనులను ధర్మభీమపార్థుల వరుసన్.

గీ. గంగలో నిడ్డ నెత్తురు కందు కొట్టి
కొనుచుఁ బోవంగ సూతుఁడొక్కరుఁడు గాంచె
సహజకుండల భాసిత మహిత తేజుఁ
గనులు మిఱుమిట్లు గొన మది కలుకు మసఁగ.

గీ. పెన్నిధిం గనుఁగొన్నట్టి పేదవోలె
తా నపుత్త్రికుఁ డగుట నాకూనసెత్తి
పరుగుపరుగున నింటికి నరిగి తనదు
వనిత కిడి ప్రేమమునఁ బెంచికొనుచునుండె.

గీ. కర్ణుఁ డనుచు నామకరణంబుఁ గావించి
బిడ్డ కాలు క్రిందఁ బెట్టనీక
యలరఁ జేయుచుండఁ దొలిజెక్కనెలవోలె
దినదినాభివృద్ధిఁ గనియె నతఁడు.

గీ. సూతపుత్త్రిఁ డయ్యు సుక్షత్త్రియకుమార
వరుల నెల్ల మించి వఱలు ననుచు

లలిత కవచకుండలములఁ గన్గొని జను
లబ్బు పొంద నాతఁ డలరుచుండు.

గీ. పాండుభూపాలు వెనుక నప్పాండవులను
దనసుతుల నేకరీతిగాఁ బెంచికొనుచుఁ
గురువిభుఁడు వారలకు ధనుర్ధరునివలనఁ
బేర్మి ధనురాగమంబు నేర్పించుచుండె.

క. ధృతరాష్ట్రుని తనయుం డు
ద్ధతుఁ డగుదుర్యోధనునకు నాకర్ణునకున్
బ్రతికిన బ్రతుకుట, మృతిఁ గన
మృతిఁ జెందుట—యనెడుపాటి మిత్రతగల్గెన్.

గీ. అతఁడు సూతుఁడు నే రాజ ననెడిభేద
మొక్కయింతయు లేక దుర్యోధనుండు
కర్ణుఁగూడ సహాధ్యాయిగా నొనర్చె
ప్రభుఁడు తలఁచినఁ దీరనిపనులు గలవె?

గీ. అన్నదమ్ములకును బిడ్డ లైనయట్టి
పాండవులకుఁ గౌరవులకు బాల్యమాది
నాటలందుసైతము వైరమగుచునుండె
భీమబలుఁడై మెలంగెడు భీమువలన.

క. అట్టియెడ నాంబికేయుని
పట్టికిఁ దాఁ జేయిదోడు వాదోడగుచున్

నెట్టిన విశ్వాసము చూ
పట్టి మెలఁగుఁ గర్ణుఁ డనిక భక్తిపరుండై.

క. విలువిద్య నొండొరులకుం
గలభేదముఁ దెలియఁ బార్థ కర్ణులఁ జేరం
బిలిచి గురుఁడు మీఁశిక్షల
వెలయింపుండనినఁ గసలి భీముండంతన్.

క. సూతసుతుఁడు సత్కులసం
భూతుం డగు క్షత్రియోత్తమునితో నెదురై
పోతరమున నస్త్రకళా
చాతుర్యముఁ జూపు టార్యసమ్మత మగునే?

గీ. అని వచింప దుర్యోధనుఁ డంగరాజ్య
మితని కొసఁగితి రాజయ్యె నింతనుండి
యని కిరీటంబు గొడుగుఁ గర్ణున కొసంగి
పరిభవమూరులలోపలఁ బ్రభునిఁ జేసె.

గీ. అస్త్రవిద్యాప్రదర్శన మందు నాఁడు
కర్ణపార్థు లొండొరులను గడచుకతన
కర్ణసాహాయ్యమే తన కార్యసిద్ధి
నొసఁగు నని నమ్మియుండె దుర్యోధనుండు.

గీ. బాల్యమాది పాండవులతో వైరమగుట
నొకసమయంబునందు దుర్యోధనుండు

శకుని ధర్మజులకును జూజంబుఁ గూర్చి
యనఘు లగువారి రాజ్యంబు నాక్రమించి.

గీ. వనమునకు నేఁగి ద్వాదశాబ్దములు గడప,
నూర నజ్ఞాతవాసంబు నొక్కయేఁడు
గడప వారల నొప్పించి వెడల నడచి
కృత్రిమపథానువర్తి దుష్కీర్తి దాల్చె.

గీ. పాండవులు దాను నేకగర్భస్థులగుట
తెలిసియుండియు వారింప వలఁతియయ్యు
తన్ను మన్నించు నృపతిచిత్తంబురీతి
నంగపతి పోయెఁ గాని వద్దనక యుండె.

క. తమ్మెఱిఁగి ప్రోచునృపుచి
త్తమ్మునకున్ వచ్చి మెలఁగు తఱి తనకమని
త్తమ్ములఁ, దమ్ములఁ, దమ్ముల
నిమ్ముల విడనాడికొనెద రిద్ధచరితులిల.

క. తఱచిన కొలఁదిఁ గర్ణుని
చరితంబున రాజభక్తి సంపన్నతయున్
గురుతరధీబలతేజ
స్స్ఫురణంబును దోఁచుచుండుఁ బూర్ణముగాఁగన్.

గీ. ఘనులు కాననవాసాదికంబుఁ దీర్చి
పాండుసుతులు దుర్యోధను పాలి కొకట

రాజ్యభాగంబునుం గోరి రాయబార
మల్లవసుదేవనందను నంపినపుడు.

క. సంధి కుదురంగనీక మ
దాంధత దుర్యోధనుండు హరి శ్రీకృష్ణున్
బంధింపఁ దలఁప నాగ
ర్వాంధుని యూనతినె పోవఁ డాకర్ణుండున్.

క. కౌరవపాండవులకుఁ గల
వైరము వారింప వలను పడకుండుటచే
శౌరి చనుచుండి కర్ణునిఁ
జేరి పలికె మృదులమధుర శీతలఫణితిన్.

క. బావా! సూతసుతుఁడ వని
నీవనుకొనుచుంటి వేమొ నిజముగఁ గుంతీ
దేవితనయుఁడవు భారత
భూవరుఁడవు ధర్మరాజ పూజ్యుఁడవు సుమీ!

గీ. అగ్రజుఁడ వౌట నీవు రాజ్యంబు గొనుము
వలచు ద్రౌపది యాఱవ వరుస నిన్ను
నఖిలరాజన్యమణులు నినాశ్రయింతు
రితరులను గొల్చి బ్రదుక నీ కేఁటికయ్య?

గీ. మాత్స్యయాదవ పాంచాల మనుజపతులు
నీపనుపు సేయు నిరతంబు నిన్నుఁ గొలుచు

ధర్మరాజాదులకడఁ బెత్తనముఁ దాల్చి
నీదొరతనంబు నెమ్మియు నెఱపుమయ్య.

క. అనఘుఁడు శ్రీకృష్ణా ! నా
జననం బెఱుఁగుదును; ధర్మజప్రముఖులు నా
యనుజులగు టెఱుంగుదు ; నై
నను గురుపతి నెట్లు విడుతు నమ్మినప్రభునిన్ ?

క. నన్నెఱుఁగరు కౌంతేయులు ;
కన్నెతనమునందె కుంతిగని విడిచెను న
న్నన్న నగరె ? యేమని మీ
యన్న ననుచుఁ జేరువాఁడ నాపాండవులన్.

క. జననీజనకులకంటెను,
ననుజన్ములకంటె, బాంధవావళికంటెన్,
ననుఁబెద్దఁజేసి దుర్యో
ధనుఁ డింతటివానిఁ జేసె దయ దైవాఱన్.

గీ. అంతియేకాక పార్థునే నొంతుననుచు
నమ్మియున్నాఁడు దుర్యోధనప్రభుండు
అట్టియేలిక విడిచి మీయన్న ననుచుఁ
బాండవులతోడఁ జేరుటేపాటికీర్తి ?

గీ. ధర్మజుఁడు చక్రవర్తి కాఁదగినవాఁడు
అన్నగా నన్నెఱింగిన నట్టిపదవి

నతఁడు గోరఁడు గాన నెట్లయినఁగృష్ణ !
యీరహస్యంబు బయలుగానీకుమయ్య !

క. అని వాసుదేవుతోడన్
వినయము గౌరవము దోఁప విశదపఱచి కర్ణ
న్నన యనిపెఁ దగినతెఱఁగున
ఘనమతి కర్ణుండు రాజకార్యపరుండై.

క. ఒకనాఁడు కుంతి యొరు లెఱుఁ
గకయుండ రహస్యవృత్తి గంగానదిచెం
తకుఁ జని జపయుక్తునిఁ బు
త్త్రకునిం గని సూర్యజపవిధానాంతమునన్.

క. తనరాకఁ దెలిపి యాతఁడు
తనతనయుం డగుట తొల్లి తపనునివలనన్
జనియించు టాది యాతని
జననకథం దెలిపి నిలుపఁజాలనికరుణన్.

క. పరితాపామోదాశ్రువు
లిరుగన్నుల కొనలనుండి యిరుదెఱఁగులు గా
నోలలుచు ననుఁగుఁగుమారుని
శిరమున్ దడుపఁ గవుఁగింటఁ జేరిచి పలికెన్.

గీ. అకట ! సుతు త్త్రియుండవు నీ వయ్యు సూతుఁ
డితఁ డనెడిపేరు మోయ నీ కేఁటికయ్య ?

భారతార్థరాజ్యరమానుభవము గలుగ
నితరులం గొల్చి బ్రిమక నీ కేలతండ్రి!

క. ఊరక దాయలపొత్తుం
గోరి దయన్ విడిచి తమ్ముఁ గుఱ్ఱలతోఁ దన్
వైరముగొని దారుణరణ
ధారుణి నెదిరింప నీకు ధర్మమె చెపుమా!

క. అని వగచే గద్గదని
స్వనము గదురఁ గరుణ దోఁప జనని పలికినన్
విని రాజభక్తిపూరిత
ఘనహృదయుఁడు ధీరుఁడైన కర్ణుం డనియెన్.

గీ. ఎపుడు కన్నీరు విడుచుచు నీవు నన్నుఁ
గడు భయంబున విడిచితో గంగలోన
నాఁడె నీకును నాకు ఋణంబు దీఱెఁ
దనయునిఁగ నన్ను నీవింకఁ దలఁప కమ్మ.

గీ. ఏను బార్థుని ననిలో జయింతు ననుచు
నమ్మియున్నాఁడు దుర్యోధనప్రభుండు
కర్ణపార్థులం దెవ్వరు ఘనులొ యనుచుఁ
జూడ నున్నారు తక్కిన జోదులెల్ల.

గీ. తల్లి! మనసిచ్చి యేలినాతనిని ద్రోసి
యెలమిఁ బెంచినతల్లిదండ్రులను మఱచి

క్షత్త్రియోచిత మగుపౌరుషంబు విడిచి
యెట్లు వచ్చెద నీబిడ్డ నే నటంచు.

గీ. ఆతని సేనొంప నాతోడ నైదుగురము
నతఁడు నన్నొంప నైదుగు రతనితోడఁ
గాని పార్థకర్ణులు చెల్మిఁగనుట, పుత్త్రు
లార్వు రుండుటయును కల్గ దమ్మ యింక!

గీ. పతులఁ జేరితి నని దుఃఖపడకు మమ్మ!
సోదరఘ్నునిఁగా నన్నుఁ జూడ కమ్మ!
ప్రభుఋణముఁ దీర్పఁగా నొక్క పార్థుకంటెఁ
దొరకినను పెఱతమ్ములఁ దునుమ నమ్మ!

క. అని యనునయమునఁ దల్లిన్
ఘనమతి నూఱార్చి పంపెఁ గాని జననికై
తనరాజభక్తి విడువఁడు
ఘనుఁడగు కర్ణుండు; పొగడఁగలమే యతనిన్.

క. గరువతనంబున సుస్థిర
తరపౌరుషమందు రాజధర్మమున నిశే
శ్వరభక్తియందు సుగుణా
కరుఁడగునంగపతిఁ బోలఁగలరే యితరుల్?

గీ. ఎల్లప్రియవస్తువుల మించు తల్లిప్రేమ
వరబలంబులమించు సోదరులతోడు

అన్నిఁటను మిందు నాభిజాత్యంపుగరిమ
తృణముగా రాజభక్తి కర్పణముఁ జేసె.

గీ. అనిపుమార్గంబు ధర్మబాహ్య మని యెఱిఁగి,
యనుఁగుఁదమ్ముల కప్రియంబని యెఱింగి
తనకు గెల్పుట జేకూరదని యెఱింగి
కట్టువడె స్వామిభక్తికిఁ గర్ణుఁ డౌర!

గీ. తన్నుఁ గురువృద్ధుఁ డెంతయర్ధరథుఁ డన్న
చేరి ద్రోణజుఁ డెప్డు దూషించుచున్న
పరులు సూతజుఁ డని యెంత పలికికొనిన
స్వామిభక్తికై కర్ణుండు సైఁచె నహహా!

గీ. స్యందనము గ్రుంగినను, పార్థుశరచయంబు
ముంచుకొనుచున్న, నుసురు చలించుచున్నఁ
గాని తానెంతధీరుఁడో కర్ణుఁ డట్టి
సమయముననైన విడువఁడు స్వామిభక్తి!

గీ. తల్లిపైఁ బ్రేమ, తమ్ములందలిప్రియంబు,
కులమునందు గౌరవమును, గొమరులందు
నలరువాత్సల్యమును, ప్రాణమందు నాస
వదలుకొనె నంగపతి రాజభక్తికొఱకు.

(10-12-1910.)

14 నాటకములు.

సీ. జనదురాచార హింస్రాజంతుమారణ
క్రీడాసముత్సుకా ఖేటకములు
ధర్మాదిపూరుషార్థచతుష్టయాసూచి
కమనీయవిమల శృంగాటకములు
శృంగారహాస్య విశేషరసాపాది
చిత్రవిదూషక చేటకములు
దుర్వాదదుర్మత దుర్నీతిబోధక
విమతసంతానచపేటకములు
ఛాందసాచార దుర్గ్రహోచ్చాటకములు
పాటితాజ్ఞానదుర్విష కీటకములు
అభ్యుపేతసమున్నత హాటకములు
నవనవోద్ఘాటకమ్ములు నాటకములు.

(10-12-1910.)

15 యద్దృశ్యం తన్నశ్యమ్.

ముద్దులొలికించు చివురులో మొగ్గవోలెఁ
దావులను జిమ్ముచు గులాబి పూవుపగిది
పగటియందుఁ బ్రభాతసంపత్తి కరణి
నక్షులను దన్ను నుదయారుణార్కునట్లు
పాట పాడుచు నెగిరెడు పక్షిమాడ్కి
నల్లనల్లన నీఁదు రాయంచరీతిఁ
దానములఁ బాడు వల్లకీతంత్రిలీల
విశ్వమంతట నలమిన వెలుఁగుపోల్కి
లలితపరిమళ మలయానిలంబులాగు
తొలుకరిందోఁచు శాద్వలతలమువలెను
కడఁగి క్రొత్తగ మొదలిడ్డ కథకయివడి
మలయుమించులఁ దగుమేఘమాలభాతిఁ
బుట్టి, కనువిచ్చి, పురిటింటఁ బొలుపు దెలిపి
చిన్ని నెమ్మిని నిగ్గులఁ జెంగలించి
ఱెక్క లల్లార్చి, ఊ, యని నిక్కి నిక్కి,
తప్పటడుగులఁ దారి తాతా యటంచు
ముద్దుమాటలఁ బాటల మురువు సూపి
శరణమున రత్నదీపమై జవ్వనంబుఁ

గాంచి, కుల మెల్లఁ దనలోనఁ గలుపుకొనుచు
జీవయాత్రకు నూతన సృష్టిఁ గూర్చి
సంతతులతోడ మెఱయుచు సంతతంబు
మూఁగి లోకానుభవము తన్మ్రించుకొనఁగ
జగతి నలరారుచుండును జనుఁడుఁగూడఁ :—
గాని, యోచింపఁ బ్రకృతిసంకలనమునను
ధాత్రితలంబునఁ దోఁచునైజంబు గలుగు
సకలమైన చరాచర సంతతికిని
భవము నాశంబుఁ గూడఁ దప్పనివె సుమ్మ !
మొగ్గవిడిపోవును, గులాబిపువ్వు వాడుఁ ;
గాంచుచుండఁగనె ప్రభాతకాల మేఁగు ;
నరుణబింబంబు పడమట నస్తమించు ;
మఱియువిహగంబు గిరగిరఁ దిరిగిపడును ;
ఈఁదు రాయంచ మృతిదరి కేఁగియూఁగు ;
స్వరము లోలయించు తంతువు సాగి తునియు ;
వెలుఁగగిరిపోవు ; బరిమళానిలము నడఁగు
నెండచే లేఁతపచ్చిక యెండిపోవుఁ ;
గ్రమముగాఁ దుదముట్టును కథయుఁగూడ ;
మాయమగు నంతలో మేఘమాలికయును ;
కూరుచుండఁడు మనుజుండుఁగూడఁ జచ్చు.

చావుపుట్టువు లవధులు జీవితమున
కట్టిజీవిత మొకస్వప్న మట్టిదగును ;
జనన మారసిచూడ నిచ్చటికి మొదలు,
చావుఁ దలపోసి తెలియ నచ్చటికి మొదలు ;
భూతపంచక మనియెడి పోగులెల్లఁ
దశవి పురివెట్టి కూర్చిన త్రాడువంటి
దగునుజీవంబు; క్రమముగా నట్టె చాఁగి
బిగిసి బిగ్గర సాఁగి తాఁ దెగును దుదకు.
కానదృష్టంబు నష్టమున్ గణనఁజేసి
కొని యదృష్టంబునే దైవమనిరి బుధులు.

(19-1-1911.)

16 గురుభక్తి.

క. సూనఫలభరిత తరుయుత
కాననవల్లీమతల్లికావాసకిరా
తానీకనేతయై విన
యానతుఁడు హిరణ్యధన్వుఁ డనునతఁ డొప్పున్.

క. ఆయెఱుకరాజునకు సుగు
ణాయత్తుం డేకలవ్యుఁ డనునతఁడు సుతుం
డై యుద్భవించె ధర్మ మ
మేయస్థితి మూర్తిఁ దాల్చి మెలఁగువిధమునన్.

క. అనుగుణున కస్త్రకళా
వ్యాసంగమునందుఁ గోర్కి యగ్గల మగుటం
జేసి సమర్థుం డగుగురు
నాసించి చరించుచుండె నాయాయెడలన్.

క. ధనురాచార్యుఁడు ద్రోణుఁడు
ఘనమతి రాసుతుల కెల్లఁ గరిపురి నావి
ద్యను నేర్పుచుండె నంచును
విని యాతనికడకుఁ జేరి వినయానతుఁడై.

గీ. హేగురూత్తమ ! నేనొక్క యెఱుకవాఁడ,
నస్త్రవిద్యార్థినై భవదంతికమున

కరుగుదెంచితి శిష్యుఁగా నరయుమయ్య !
కరుణ నావిద్య నాకును గఱపుమయ్య !

క. అనవిని ద్రోణాచార్యుం
డనుమానము నొందుచుండ నట రాకొమరుల్
గని శూద్రున కస్త్రాభ్యా
సనియతి యేమిటికి రాజసంతతితోడన్ ?

క. మరిమాట గాదు రాజుల
కెఱుకు సహాధ్యాయి యగుట యెందునుగలదే ?
సరిసరి లే పదపద మని
పరిహాసము చేసి రంత బాణాసుడుండున్.

క. వారిమన మెఱిఁగి బోయకు
మారునకుం బ్రియము సెప్పి మఱియొక్కెడకుం
జేరుము నీకోరిక చే
కూరకపో దెచట నేని గుఱి గలదేనిన్.

క. అని యీగతి నాతని సాం
త్వనవచనంబులను దనిపి పదమన ననఘా !
పనివినియెద దయ గల్గుం
డని పదములకెఱఁగి యాతఁడరుగుచు మదిలోన్.

క. గుఱియున్న నెల్లవిద్యలు
కరగతములౌ ననుచుఁ దెల్పఁ గాఁబడెనుగదా !

గురువాక్య మింత యొప్పునె?
గురియను రెండక్షరములె గురుమంత్ర మగున్.

క. అని కృతనిశ్చయుఁడై యా
ధను రాచార్యు నెదలోనఁ దలపోయుచు నా
తనివిధానము మృత్తికతో
నొసరించి యనూనభక్తి యుతుఁడై కడఁకన్.

క. ఆవిగ్రహంబె గురువుగ
భావించుచు నస్త్రశాస్త్ర పద్ధతు లెల్లన్
వేవేగము యభ్యాసము
గావించుచు నుండె నతఁడు గడు నిపుణుండై.

క. అమలధనుర్వేదము సాం
గముగా నేర్చికొనె నతఁడు కలితాభ్యాస
క్రమమున, గురి గల్గినచో
విమలమతుల కందరాని విద్యలుగలవే?

ఆ. ద్రోణశిష్యులందు దొడ్డవాఁ డని పేరు
నొందియున్న పార్థుఁ డొక్కనాఁడు
విల్లునమ్ము లూని వేఁటాడ వేడ్క నీ
యెలుకుసొలము చెంత కేఁగుదెంచి.

ఆ. ఏకలంబు తన్ను నెలయించుకొని రాఁగ
వచ్చివచ్చి యొక్క వాఁడితూపు

వింటఁబూన్చి కూల్చు వెలుపున నేయంగఁ
దప్పిపోయి పంది తాఁకుటయును.

ఆ. తటిమికొనుచుఁ బోవుతటి నేకలవ్యుండు
దానిఁ గాంచి చేతి ధనువు నెత్తి
మొగమునాటి పుచ్ఛమునఁ దూఁటిపోవంగ
నాఁటుశరము లొక్క దారినేయ.

గీ. అట్టిశరలాఘవంబున కబ్రమంది
యిట్టు లేసినధన్వి తా నెవ్వఁడొక్కొ?
యనుచు నెంచుచు నాదారి నల్లనల్ల
నరిగి యందొక్కధారుణీధరముచెంతఁ.

క. ఘనశస్త్రాస్త్రంబులసా
ధనము సలుపు నేకలవ్యుదరిఁ జేరి సయం
బున నీ వెవ్వఁడ వని య
ర్జునుఁ డడుగ హిరణ్యధన్వసుతుఁ డిట్లనియెన్.

క. అనఘా! నేద్రోణాచా
ర్యునిశిష్యుఁడ నర్జునకుఁడ నోపికతోడన్
ధనురాచార్యునికనికర
మున ధనురాగమరహస్యముల నేరిచితిన్.

క. అన విని సముచితగతి నా
తని వీడ్కొని యర్జునుండు తనగృహమునకుం

జనుదెంచి మఱి గలంగఁగ
ధనురాచార్యకథ కేఁగి తనికినవగతోన్.

క. నీయట్టిధన్వి జగమున
నేయెడ లేకుండునట్లు లేఁ జేసెద నం
చోయనఘ! బాసఁ జేసితి,
వాయ మగుసె తావకీనవచనం బెపుడున్.

క. నేఁటికి విలువిద్యం గను
మేటిం గనుఁగొంటి నన్ను మించె నొకం డా
పాటిపరిపీణునిఁ జూడము
పోటుమగల మూఁడులోకముల నేయెడలన్.

గీ. అతఁ డెఱుఁగు భవచ్ఛిష్యుఁడఁట! మహాత్మ!
యనుచుఁ దాఁ గన్నయంతవట్టును చెలుపఁగ
ద్రోణుఁ డాశ్చర్యమగ్నుఁడై తొంటివృత్త
మొఱిఁగి పార్థసహితో వని కేఁగె నంత.

గీ. ఏకలవ్యుండు గురున కనేకవిధులఁ
బ్రణతులొసరించి పూజించి భక్తి మించి
హేగురూత్తమ! తావకాహీనకరుణ
వెలయుశిష్యుని నన్ను దీవింపుమయ్య!

క. ఏమను, నాకుఁ బ్రియంబగు
నీనిఖిలాస్త్రములు, ధనము లీవనసీమల్

జనువెంచి మతి గలంగఁగ
ధనురాచార్యకడ కేఁగి తనికినవగతోన్.

క. నీయట్టిధన్వి జగమున
నేయెడ లేకుండునట్లు లేఁ జేసెద నం
చోయనఘ! బాసఁ జేసితి,
వాయ మగుసె తావకీనవచనం బెపుడున్.

క. నేఁటికి విలువిద్యం గడు
మేటిం గనుఁగొంటి నన్ను మించె నొకం డా
పాటిపరిపిణునిఁ జూడము
పోటుమగల మూఁడులోకముల నేయెడలన్.

గీ. అతఁ డెఱుఁగు భవచ్ఛిష్యుఁడఁట! మహాత్మ!
యనుచుఁ దాఁ గన్నయంతవట్టును దెలుపఁగ
ద్రోణుఁ డాశ్చర్యమగ్నుఁడై తొంటివృత్త
మెఱిఁగి పార్థసహితో వని కేఁగె నంత.

గీ. ఏకలవ్యుండు గురుని కనేకవిధులఁ
బ్రణతు లొనరించి పూజించి భక్తి మించి
హే గురూత్తమ! తావకాహీనకరుణ
వెలయుశిష్యుని నన్ను దీవింపుమయ్య!

క. ఏమను, నాకుఁ బ్రియంబగు
నీనిఖిలాస్త్రములు, ధనము లీవనసీమల్

17 చందమామ.

1

పిల్ల లవ్యక్తమధురోక్తిఁ దల్లిచెంతఁ
జందమామని జందమామ యటందు రెపుడు
ముద్దులకు మాట నామాటఁ; బోల్చి మనము
చందమామయె యని పిల్చుచుంద మతని.
ఇప్పు డదియేమి వెఱ్ఱియో కాని, చంద
మామ యనుముద్దుపదమును మాని దాని
కెన్నొ పర్యాయపదముల నిడుచునుందు
రందు నే దానితోడ దీటైన పదము ?
పాలకడలికి ముద్దులపట్టి యనిన
సిరులనిచ్చెడు చెలువ సోదరుఁ డటన్నఁ
జేఁపచేఁ గువలయ మేలు రాజటన్నఁ
జందమామకుఁ దీటురా వందు మేము.
ఉగ్గుపాలను ద్రాగుచు నున్నయప్పుడె
తల్లిచే విన్న దగుటఁ జాబిల్లిపదము
చందమామకు సరిపడు, నెందు నొకటె
మాకు జాబిల్లియనఁ జందమామ యనిన.

17 చందమామ.

1

పిల్ల లవ్యక్తమధురోక్తిఁ దల్లిచెంతఁ
జందురునిఁ జందమామ యటందు రెపుడు
ముద్దులకు మాట నామాటఁ; బోల్చి మనము
చందమామయె యని పిల్చుచుంద మతని.
నిన్నుఁ గదియేమి వెఱ్ఱియో కాని, చంద
మామ యనుముద్దుపదమును మాని దాని
కెన్నొ పర్యాయపదముల నిడుచునుందు
రేలుదుసే దానితోడ దీటైన పదము?
పాలకడలికి ముద్దులపట్టి యనిన
సిరులనిచ్చెడు చెలువ సోదరుఁ డటన్నఁ
జేఁగుఁ గువలయ మేలు రాజటన్నఁ
జందమామకుఁ దీటు రా వందు మేము.
ఉగ్గుపాలను ద్రాగుచు నున్నయపుడె
తల్లిచే విన్న దగుట జాబిల్లిపదము
చందమామకు సరిపడు, నెందు నొకటె
మామ జాబిల్లియనఁ జందమామ యనిన.

లలితగతి మీఱుకోకిలాలాపములను,
గోరక చరించువార లున్నారె జగతి?
ఆరుబైట వెన్నెలకుప్ప లాడువారు,
కోకిలరుతంబులకు మాఱుకూయువారు,
కల్లపాదులఁ గల్పించి కాయఁజేసి
గుమ్మడులఁ జిక్కుడులఁ జాలఁ గోయువారు;
తత్తరంబున వెన్నెలవత్తి విసరి
తెచ్చియిచ్చిన వారల మెచ్చువారు;
చిట్టిమిరియంబులును, జిప్పచిప్పగోళ్లు
చెమ్మచెక్కలు నాడి హర్షించువారు;
నగుచు బాలిక లావేళ నగుచు నగుచు
నీడుజోడుగ నాటల నాడికొనిరి;
తార యీబాలికలతోడఁ జేరియుండె;
నీమె ముద్దులచెల్లె లైదేండ్ల లలిత
"అక్కనన్నెల గొనిపోవదయ్యొ" ననుచు
వీథిగుమ్మముదాఁక వెన్వెంటఁ దవిలి,
కనుమొఱంగినసోదరిఁ గానలేక,
వెనుదిరిగి, తల్లికడ కేఁగి వెక్కివెక్కి
యెన్ని చెప్పిన వినకుండ నేడ్చుచుండఁ
బోఁడువెట్టినబాలిక బుజ్జగించి

లీల యొక పైడిగిన్నెలోఁ బాలు వోసి
గుజ్జుబువ్వను గలిపి యా కూఁతునెత్తి
చంక నిడికొని వాకిటఁ జందమామఁ
జూపి "మాతల్లి! జాబిల్లిఁ జూచినావె!
అమ్మ బువ్వకుఁ బిలిచిన యంతలోనె
పరుగుపరుగునఁ జెంతకు నరుగుదెంచు!
తగవుఁ బెట్టక బంగారు తండ్రిలాగు
బొజ్జనిండఁగఁ దిని యాడఁబోవునమ్మ!
తల్లితో 'మారము' ను జేయఁ డెల్లవేళ
నల్లరులఁ జేయ డాటల నాడుచుండు,
మంచిపిల్లలఁ గూడఁడు; మంచివాఁడు;
బుద్ధిమంతుండు కొండపైఁ బోవుచుండు;
చల్లఁదన మిచ్చు; వెన్నెలఁ జాల నిచ్చు;
నేఁడు నాతల్లి! నినుఁ జూచినాఁ డితండు.
బువ్వఁ దినకున్న జాబిల్లి నవ్వు" నంచు
వెర వెఱిఁగి లీల లలితకన్విందుఁ జేసి
మఱియు వినవిందుగాఁ జందమామఁ బొగడి
కూఁతు మఱపించి పని చెప్పెఁ జేతి కంత.
లలిత మాటాడుసందడివలనఁ దగిలి
తారమాటను మఱచి తాఁ బోరు మఱచి

పైఁడిగిన్నియందులో నున్న పాలబువ్వ
నించు కించుకగా నారగించుచుండె.

* * * *

III

“అమ్మరో! గిన్నెలోనిది యయ్యె; నాదు
కడుపులో నున్ననల్లని కాకిపిల్ల
పొట్ట నిండఁగఁ దిని పోయె బువ్వ యెల్ల;
బలుకుచున్నది చల్లఁగాఁ బాలుద్రావి.
నేల నొకచుక్క యైనను రాలకుండఁ
ద్రాగితిని పాలు బంగారుతల్లిలాగు;
తల్లి! జాబిల్లి యల్లరిపిల్లవాఁడు;
బువ్వ నేరీతిగా నొల్కఁబోసికొనెనొ?
వేగ నాబువ్వఁ దిని పొట్టు వేసినాను
చందమామపై; నోయమ్మ! ముందు నాదు
కడుపులోఁ గాకిపిల్లయే గంతు వైచె;
కలదు గాఁబోలు నీతనికడుపులోనఁ
జిన్నిదగు కాకిపిల్ల; లేకున్న నతని
మొడలిలో నల్పు గాన్పించుచున్న దేమి?
అమ్మ! యీచిన్నిజాబిల్లి కమ్మ యెవరు?

ఈతనికి బువ్వపెట్టువారెవ్వ రమ్మ !
అక్క నాకుండె నీతని కక్క గలదె ?
యితనితో నాడుకొనకుండ నెవటి కేఁగె ?
పోరువెట్టఁడె కొండపైఁ బోవలేక !
భయమువేయదె క్రిందికిఁ బడునొ యేమొ ?
రాత్రియైనను నింటికి రాక బయలఁ
దెల్లవాఱినదాఁకను దిరుగు నేమొ ?
ఎవరుపిల్చిన వారితో నేఁగి వారి
తోడఁ గూర్చుండి యెంగిలికూడు దినునె ?"
అనుచు నవ్యక్తమధురోక్తు లాడుచుండ
జనని ప్రియమంది లలిత నక్కునఁ గదించి
చల్లఁగా నుత్తరంబు లొసంగుచుండ
నాడఁబోయినతారయు నరుగుదెంచె.
తారహృదయంబు మెత్తన ; తార కెప్పుడుఁ
జందమామను జూచుట చాలఁ బ్రీతి ;
పగలు జాబిల్లి రాక యేమగునొ కాని
తారయును మింటిపైఁ జూడ్కిఁ జేరనీదు.
ఎపుడు సూర్యుఁడు గ్రుంకునో, యెపుడు గోవు
లిండ్లకయి వచ్చుచుండునో, యెపుడు పక్షు
లెల్ల గూండ్లకుఁ జేరునో, యెపుడు మింట

నెఱ్ఱగాఁ దోఁచుచుండునో, యెపుడు రేయి
యఱుగుబెంచునో, తారయు నప్పు డపుడె
చందమామను జూచెడు సంభ్రమమున
నింగి నిరువంకలను దొంగితొంగి చూచు;
వెన్నెలబయళ్లలో నాటలన్న నామె
కెంతయో ప్రీతి గావున నెపుడు చంద
మామరాకయె కోరు నెమ్మనమునందుఁ
గోరి తనయీడువారితోఁ జేరి తార
యాడుకొనుఁ జందమామ యున్నన్నినాళ్లు.
సంజచీకటిరాత్రులఁ జందమామ
రాకఁ గోరుచు నామె తదేకదృష్టిఁ
గాచికొని యున్న నిద్దుర కన్నుఁగప్పి
నందులకుఁ దార నెవ్వ రేమందు రపుడు?
పోరువెట్టెడిబిడ్డల నూఱడింపఁ
జిన్నపిల్లల కాటలఁ జెలిమి నింప,
యువజనంబుల కానంద ముద్ధరింప
మంచిమందుగదా చందమామవిందు.
అరసిచూడంగ నీడుజో డైన వగుచు
భువి మనోజ్ఞంబులైన వస్తువులు రెండె
వలపుఁజిలికెడు ప్రియురాలివదన మొకటి

మదిఁగరంచు పున్నమచందమామ యొకటి.
అల్లదిగో ! కన్ను మలపి మీ రరయుఁ డిపుడు.
మినుకుమినుకను చుక్కల మెఱయుచుండు
రమ్యతరమైన నీలాంబరంబునందు
చల్లఁగాఁ గూరుచున్నాఁడు చందమామ.
పౌషపునెలనాఁ డొసంగిన పోగులెల్ల
నెత్తికొని వెండిపూఁతఁ బూయించె నేమొ
చందమామకు నును వెండిజాల రుండె
సఖు లరమోడ్చి కనుఁగొనుఁ డల్లయదిగో !
బాలికామణుల్ వెన్నెలవత్తు లనియుఁ
ప్రౌఢలగు సుందరులు నెలవంక లనియు
వనితలందఱుఁ జందురువంకలనియు
ననెద రవి చందమామఁ బుట్టినవి కావె ?
సరిగఁ బదియేనుదినములు చందమామ
క్రమముగా సంజకే వచ్చుఁ గాని, వెనుక
నొకట నాలస్యముగ వచ్చు చుండియుండి
మేము నిద్రించుదాఁక రాఁడేమొ తుదకు ?
ఆఁడుబిడ్డ లొప్పాలకుప్ప లాడువేళ
గల్లుగల్లను నద్దాల గాజులందు
నిలిచి కన్నుల మిఱుమిట్లు గొలుపుచుండు

చందమామకు నదియేమి సంబరంబొ ?
ఆటసందడిలో నున్నయట్టివేళ
చెట్లకొమ్మలసందులచెంతఁ జేరి
యూరినచిగుళ్లలో మంచునీరు వోసి
యెన్నియో ముత్తియములఁ గాపించుచుండు.
ఆటలో నోడిపోయిన యట్టివారిఁ
దెల్లఁబోయినవారంచు దెప్పఁబోవ
చిన్ని వెన్నెల నెల్లరఁ జిన్నబుచ్చి
తెల్లఁబోయినవారలఁ దెలియనీఁడు.
కొండపై నెన్నిచుక్కలో నిండియుండ
దినమునకు నొక్కచుక్కతోఁ దిరుగుఁగాని
"యూడుకొనరార ! జాబిల్లి !" యనుచుఁ బిల్ల
లెంత పిలిచిన దిగిరాఁడ దేమి భయమొ ?
సరిగ లేఁజిగురాకుల సందులందు
నెన్నియో వెండిపూలఁ జేయించుచుండఁ
గనుమలపి చూడ మింటికిఁ గంటి కొకటు
వెండితీఁగ లెన్నెన్నొ కల్పించుచుండు.
అంటఁగా ముట్టఁగా రానియట్టిచోట
నిలిచి దాఁగిలిమూఁతల నెఱపుఁగాని
యీడుజోడైనవారితో నాడుకొనఁగ

జతలుగూడఁ డిదేమొకో చందమామ !
ఒక్కమాటుగఁ దెరచాటునుండివచ్చు
భామవేషంబువలె మబ్బుప్రక్కనుండి
చటుకుమని వచ్చుచుండు నీచందమామ
యీతనికి నింతయొయ్యార మెందుకోఱక్కో ?
చందమామ యదేమొ కాసారవారి
పూరములలోన మాటికిఁ దూరుచుండు ?
మఱచితిమి కవితావేశపరవశతను
గలదుగా యట వలపించు కలువకన్నె !
తుమ్మెదలఁ గాంచి గీతమాధుర్య మెంచు
మల్లెపూవులఁ గలపరిమళముఁ గాంచు
వాయునందనుతోఁ జేయిచేయి గలపు
సరససుకుమారబలుఁడు మాచందమామ !
నిండుగా నొక్కనాఁడు గాన్పించినంత
నెవరిదృష్టులు తాఁకునో యేమొకాని
నాఁడునాఁటికిఁ గృశియించి పోఁడి దక్కి
తిరిగి నెలనాళ్లదాఁకను దేఱుకోనఁడు.
ఎలమి నంతఃపురంబుల కెగయఁ బ్రాకి
ముంగిటి గవాక్షములఁ దొంగితొంగి చూచుఁ
జేఱి చూచిన మిన్నెక్కి కూరుచుండుఁ

దుందుడుకుబాలకుఁడు గాఁడె చందమామ ?
లతితసితకిరణముల జాలంబు లల్లుఁ
దోయనిధిపీచికలలోనఁ దూఁగియాడు
మబ్బుటోడలపై నెక్కి మాయ మగును
జాలరుల చెల్మిఁ గనె నేమొ చందమామ !
చందమామను గను టెంతసంబరంబొ!
సలిలకలశంబు చెప్పఁగాఁ జాలకున్నఁ
బొడఁగనినమాత్ర నుప్పొంగి పోవుచున్న
కలశవారాశిఁ గనినైనఁ దెలిసికొనుఁడు.
తెల్లనగుకాగితమువిూఁదఁ దిరిగితిరిగి
కలము గంతులువేయంగఁ గలదుగాని
నల్లనగునింగి నల్లన నడచుచున్న
చందమామను వ్రాసి మెప్పొందఁగలదె ?

(18-2-1911.)

18 వసంతకో...

క. లలితకుహూకలరవమా!
యల వనరమయింటి విందవగు కనివరమా!
యలరువసంతుని రాకం
దలఁచించెదు నీవు స్వాగతము కోకిలమా!

క. నీరాక కలరి పికమా!
యారామశ్రీ మనోహరామలగాన
ప్రారంభచ్ఛలమునఁ జవు
లూరన్ స్వాగతముఁ దెల్పుచున్నది కంటే.

క. ముందే నీక్రీడావన
మందిరమునఁ బ్రకృతికాంత మహనీయతరా
నందమునఁ దలిరుదోరణ
లందముగాఁ గట్టుచున్న యది కోకిలమా!

క. వినరెదవు నీవు కోకిల!
కొసగలముత్యాలసరులో కుసుమసరములో
రసవన్మృదుగానసుధా
రసకలితకుహూకుహూస్వరంబులో చెప్పుమా!

క. ఎందాఁక మాధవీలత
సుందరసుమమంజరీపరిశోభిత మగునో

యందాఁక మేము వీనుల
విందుగ నీగానరవము వినఁగలముగదా!

క. బాలుఁడు నవవికసితసుమ
జాలంబులఁ గోయుచున్ వసంతారామా
ఖేలనమున నీగానము
నాలించి కుహూస్వరంబు నాలాపించున్.

క. బాలకుఁడె కాదు దివ్యక
లాలాపనమైనఁ, దత్కరాంచద్వీణా
లోలత్తంతువులైనను,
నీలాగునఁ బలుకనేర్చునే కోకిలమా!

క. నీకును నావికునకుఁబలె
నే కలదా చుక్క మార్గ మెఱుఁగించుటకున్?
లేకున్నఁ దిరిగిపోయెడు
నీకాలము నెట్లు తెలియ నేర్తువు చెపుమా!

క. ఓమోహనగాయకమణి!
నీమందిర మెప్డుఁ బచ్చనిదియే మఱియున్
నీమార్గము ద్యోమార్గము
నీమసలినయంతవఱకు నిర్మలమె కదా.

క. కానంగఁబోము నీకా
లానన్ శీతాతపంబు లంగల బాధల్

లేనేలేదు సుమీ నీ
గానమున విచారసూచకస్వర మైనన్.

క. చిగురువలన నీ గానము
నెగడెనొ? లేకున్నఁ జిగురె నీ గానముననె
నెగడెనొ? నీగానంబును
జిగురు నొకట నెగడెనో? వచింపుము పికమా!

క. చివురాకుఁ దినుము! పాడుము!
చివురులు వెట్టింపు; మరలఁ జేయుమువనమున్;
నవనవగీతాచాతురి
మివుల మరల మరలఁ బాడుమీ! కోకిలమా!

క. అయ్యో! నాకును ఱెక్కల
నియ్యఁడు భగవంతుఁ; డిచ్చె నేనియు నీతో
నియ్యాకసమున నెగురుచు
పయ్యాటంబులను బ్రొద్దు జరపుదునుగదా!

క. ముచ్చటగ నెగిరిపోనుచును
నెచ్చటికేనియును బోయి యిర్వురమును రా
వచ్చుఁగదా! విందులమై
యిచ్చటికి వసంతుఁగూడి యిల్లేఁ జేఁటఁ.

(20-4-1911.)

19 ప్రభాతవాతము.

చ. మముఁ బరమార్థమైన యొక
మాట వచింపఁగనిందు నిత్యస
త్యమునకుఁ జేరువైనదియొ?
స్వానుభవంబున కూఁతమైనదో?
క్రమముగ మీకె తోఁచెడుఁ; బ
రాకునన్నైనఁ బ్రభాతవాతపో
తము నెద నమ్మరా దనెడి
తత్త్వమె బోధయొనర్తు మియ్యెడన్.

చ. మనమునఁ బక్షపాతమును
మాని వచింపుఁడు మీరె; యేకతం
బున యువదంపతుల్ నిదుర
వోవుచునుండఁగఁ దట్టి లేపఁగా
దనకుఁ బనేమి? యిట్లు గల
దా? యిది సిగ్గులచేటుగాదె? యే
మనఁదగు నీప్రభాతసమ
యాగతధూర్తసమీరడింభకున్!

సీ. జలతరంగముల నుయ్యేలలూఁగి నట్లుండి
తటివేచి చలువలఁ దస్కరించు

నరవిరిమొగ్గల నలరించి నట్లుండి
యదనెంచి రజమెల్ల నపహరించు
లతకూనచెంత మెల్లఁగ నున్నయట్లుండి
సమయంబుఁ గని చుట్టు సడలఁ జేయు
ననగొమ్మ నిట్టె యూఁచినయట్టులే యుండి
కొంటెయై వలపులఁ గొల్లవెట్టు
చలువతెక్కలికాఁడు, రజంపుదొంగ,
పైఁడిపచ్చీఁడు ; తావులబందెకాఁడు,
పాతిరనిలార్భకుఁడు తడిపాఁత గొంతు.
కోఁతగాఁ డాతనిని నమ్మఁగూడదెపుడు.

(17-5-1911.)

20 నిన్న, నేఁడు, ఱేపు.

సంతసంబో, విచారమో, సంభవించు
సుఖమొ, కష్టంబొ మఱినీవు చూడలేని
దాని, నీజన్మమున నీకఁ రానిదాని
నీవు గాంచితివెప్పుడు? నిన్న! నిన్న!
నీవు పోయెడుత్రోవలో నీయదృష్ట
దేవతయభీష్టఫలము లందించుచుండ
నాఁగి వేవేగముగ వాని నందికొనఁగ
నెపుడు కోరెద వీవు? నేఁడేకదయ్య!
కాని, యాదేవి విముఖయై కానిపించి
ముందు రాఁబోవు నీకష్టములను దెలుప
నట్టికష్టంబు లెల్ల నీ వనుభవింప
వలసినప్పుడు ఱేపు గావలయు నీకు.
పుణ్యమో పాపమో నీవు పూనుకొన్న
యొక్కకార్యంబు నెఱవేర్చుచున్నయపుడు
మంచిచెడ్డలఁగూర్చి యోజించు టెపుడు?
తెలివిగలదేని నిన్నటి దినమునందె.
అపకృతియొనర్చి నీకుఁ దా నవల నెఱిఁగి
సిగ్గుపడుచుఁ బశ్చాత్తప్త చిత్తవృత్తి

నీవుఁడై వేఁడుకొనుచున్న వానితప్పు
నీవు క్షమియింపఁదగినది నేఁడె నేఁడె!
గురుతరక్రోధవశమున నొరునిఁ గీడు
పఱిచి నీతప్పు నీవుగా నెఱిఁగినపుడు
వానిక్షమియింపఁ గోరఁగావలసెనేని
నీకు సమయంబు తేపటిదాఁక లేదు.
ఒరులకడ దాఁచికొన్నదో యొరులవలన
రావలసియున్న యట్టిదో కావలసిన
నవసరంబైనయపుడు నీ కందఁ బోదు
తెచ్చికోనఁదగు నిన్నటిదినమునందె.
తీరుపుంగాంచి ధనము తేతెమ్మటంచు
నప్పులిచ్చినయతఁడు ని న్నడ్డగించి
తీవరంబును జూపి వేధించెనేని
నిలువఁబడి తీర్పఁదగు నీవు నేఁటిదినమె.
సాక్షి లేకయొ, కాలదోషంబు గనియొ
యన్యుకడ నీవు తెచ్చికొన్నట్టి ఋణము
పరిష్కృతశాసనమునఁ గొట్టువడిననైన
మాన దది; తీర్పవలయు తే పైనఁగాని

నేఁడు రేపటికింజూడ నిన్నయగును
రేపు నేఁడగుచుండును రేపటికిని
నిన్న, నేఁడు, రేపనుకాల మెన్నివేల
యేండ్లనుండియొ యొకరీతి నేఁగుచుండె.

(27-5-1911.)

---

21 ప్రణయకోపము.

(రాధాకృష్ణులు.)

కవులకు స్వభావవర్ణన కష్టతరము
ప్రకృతిచిత్రంబు గ్రహియింపఁ బాఠకులకు
నంతకంటెను గష్టమౌ నైన నుస్వ
భావమాధురికిని లేదు పరిమితి భువి.

జలదమాలిక నింగిపై నలరుచుండ
మెఱుఁగుఁదీవలు మిలమిల మెఱయుచుండఁ
బాటపాటగఁ జినుకులు పడుచునుండఁ
దఱచుగాక తుషారంబు గురియుచుండ
ఱివ్వుఱివ్వున వలిగాలి ఱువ్వుచుండ
రేఁగి యొక్కొక్క జడి గొట్టి యాఁగుచుండఁ
గారుమబ్బులఁ జీఁకటి గ్రమ్ముచుండ
నొరపిడిం గాంచి మేఘంబు లుఱుముచుండ
జోరు మని వానకాళులు జాఱుచుండ
స్వాంత మలరించు వర్షావసరముఁ జూచి
మెడలు త్రిక్కించి కూయునెమిళ్లఁ జూచి
యెలమి దివి నాడువానకోయిలలఁ జూచి.
తొరట వాయనిశుకదంపతులను జూచి
మేలుకట్టులనీలాల మేడఁ జూచి
భవనమున హంసతూలతల్పంబుఁ జూచి
ఆపపడి వచ్చుప్రాణనాయకునిఁ జూచి.
ప్రణయకోపంబు దాల్ప నెవ్వరితరంబు
గొల్లచేడియ రాధకుఁ జెల్లెఁగాక !

* * * *

నవనవామోదబృందావనంబులోన

లలితమాధవీ మల్లికా లతలలోన.
రమ్యతరమైన భర్మహర్మ్యంబులోన
ఘనమణీమయదీపికా కాంతిలోన
బాలగోపాలుఁ డెదుటఁ గన్పట్టుకున్న
కానఁబడి తన్ను దయతోడఁ గాంచకున్నఁ
గాంచి తనమాటలో మాట గలపకున్నఁ
గలపి హర్షించి చనవుమై మెలఁగకున్న
మనసుచిడిముడిపాటుతో మసలురాధ
పదము లదరంగ నెల్లెడ వెదకురాధ
క్షణ మొకమహాయుగంబుగాఁ గడపురాధ
తనదుజీవమ్ము వమ్మని తలఁచురాధ
అతిమృదులచిత్త యగురాధ—అట్టిరాధ
మదనజనకుండు తనయెట్ట యెదుట నుండఁ
బ్రేమనిండారి మది తత్తరించుచుండ
నోరు మాటాడ నువ్విళు లూరుచుండ
నోరచూపులు చల్లఁగా జాఱుచుండ
నెట్టినిర్బంధ మయ్యెనో యేమొకాని
ఎట్టికఠినత్వ మూనెనో యేమొకాని
యెట్టిగొడవలు పుట్టెనో యేమొకాని
యేమి యూహించెనో చెప్పలేము గాని

వడఁకుచుండెడు మృదుగాత్రి వల్లితోడఁ
గలఁగి వెలవెల్లనగునెమ్మొగంబుతోడ
రక్తకాంతులఁ జిమ్ము నేత్రములతోడ
నశ్రుసంసిక్త గండద్వయంబుతోడ
నోష్ఠరాగంబుఁ దోలఁచునిట్టూర్పుతోడఁ
బ్రకటితంబగు బొమముడి పాటుతోడఁ
దల్లడిల్లుచునుండు చిత్తంబుతోడ
విభుని కవ్వలిమొగమయి వెలఁది నిలిచె
నెట్లు నిలువంగఁగలిగెనో యెవరికెఱుక ?

* * * *

అంబుదశ్యామ కోమలాంగంబువాని
తరళతరపద్మపత్త్రనేత్రములవాని
చారుచమకితబర్హిపింఛంబువాని
వలపు లొలయించు చిఱునవ్వు గులుకువాని
కలికి చూపుల రాగంబుఁ జిలుకువాని
పలుకుపలుకున నమృతంబు లొలుకువాని
ప్రేమగలవాని, నందుని పిల్లవాని
గాంచి యూరక మోడి వహించుటకును
గారణం బేదొ రాధకుఁ గలుగవలయు;
రాధికాకృష్ణులదృఢానురాగగరిమ

మెఱిఁగియున్న వారల కిది యెంత వింత!
గోపికానాయకుం డెంత కొంటెవాఁడో
యంతకంటెను ఖండిత యగును రాధ
యెంతకైనను మగవాఁడు కృష్ణమూర్తి
తనదునధికార మటఁ జూపఁ దగదు రాధ
మృదులతరపుష్పసుకుమార హృదయ రాధ
నిట్టు లలయింపఁదగదు శ్రీకృష్ణునకును,
నొక్కమూలను ప్రణయంబు నొక్కమూలఁ
గోపభావంబు, రెండును గూడిమాడి
యుత్తరోత్తర మభివృద్ధి నొందుచుండ
నొండొరులచిత్తములు మార్పు నొందుచుండె-
పలుకు మని యనుచున్నదో ప్రణయమహిమ
కూడదని చెప్పుచున్నదో కోపమహిమ,
పలుకఁగడఁగుదు రిరువురుఁ బలుకలేరు!
వలపుఁజూపు లొండొంటితోఁ గలయఁజూచుఁ
గాని యంతలోఁ జాఱుకున గాఁడివాఱు
ప్రణయమహిమంబునకు వెనుఁబాటుఁ గూర్చి
మేరమీఱినకోపంబు దారిఁ జూప
సౌమ్యసంకల్పములమేలిచాయ లెల్ల
నంతలోననె మాయంబు లగుచునుండె

నిరత మీకోప మిట్టులే నిలుచు నేమొ
ప్రణయమహిమంబునకుఁ బట్టు వదలు నేమొ
ఒఱలు చొండొరు లిట్టులే యుందు రేమొ
దర్పకునకును వాఁడిమి తగ్గు నేమొ
యకట! యంతటిదాంపత్య మంత మైత్రి
యంతచన వంతకూరిమి యంతగరువ
మంతదయ యంతమర్యాద యంతమోహ
మంతయనురాగ మెచ్చట నైనఁ గలదె?
కుటిలమైన తాత్కాలికక్రోధవహ్ని
బారిఁ బడి పోవఁదగినదా ప్రణయమహిమ?—
ఎంతదూరంబు పోయితి! యిది నిజంబె?
ప్రణయకోపంబునకుఁ జింతపడఁగ నేల?
కొఱవిదయ్యంబువలె భయపఱచుఁ గాని
ప్రణయకోపంబునకును రూపంబె లేదు.
కానియతిలోకమైనది దాని తెఱఁగు
దానికుటిలప్రకృతి యసాధారణంబు
దానివేషంబు మాయావితానకంబు
దానివృత్తం బనాలోచితంబు గాదె!
కాక యుండిన ననురాగ కలితులైన
రాధికాకృష్ణులను నొక్క సౌధమందె

నిలిపి వైముఖ్యమును గూర్చి నిలువఁగలదె?—
ఆసపడి లేనిపోనియాయాసములను
తీరి కూర్చుండి యెవ్వఁడు తెచ్చికొనును ?
పాలయలుకగూడఁ బ్రియముగాఁదలఁచుచుండు
కాముకులకు వివేకంబు గలదొ లేదొ—
చేరి యొండొరుఁ జూచుకొన్నారొ లేదొ
కేరుసెమ్ములనేక విన్నారొ లేదొ
నాల్గునిమిషంబులైన నున్నారొ లేదొ
పట్టువీడినచిత్తంబుఁ బట్టలేక
యిర్వు రిరువంకలకుఁ బోయి రింతలోనె
ప్రియము గల్గియు నిర్వురుఁ బిలిచికొనినఁ
గోర్కెఁ గల్గియు నొండొరుఁ గూడికొనిన
మనసుపడియుఁ బరస్పరం బెనసికొనినఁ
గోపగౌరవమున కేమి లోప మగును ?
అలుక ముక్కున నున్న నేమాయె దాన ?
మేను లీరీతి దాఁచుకో నైన దేమి ?
పాదుకొనియున్న ప్రేమానుబంధమునకు
నట్టి వేమియు నంతరాయములు గావు.
ఎదురుకొనుకొలందిని ప్రేమ హెచ్చుచుండు
నెడసి చనుకొలందిని ప్రేమ హెచ్చుచుండు

ననుచుఁ జిరకాలపరిచితు లైనయట్టి
పరిణయకోపతత్త్వజ్ఞులు పలికినారు.

* * * *

రాధికాకృష్ణమధ్యవర్తనముఁ గాంచి
వారిప్రతిబింబముల నేకభావలీల
లోఁగొనెడుమణికుడ్యమా ! లోకమందు
నీవు ధన్యమవే యిష్టు నిశ్చయముగఁ
గాని యన్యాపదేశంబు గాఁగ వార
లాడుకొనుమాట లాలించు నట్టిభాగ్య
మెక్కడిది నీకు? వానిమే మెఱుఁగఁగలము.
రాధికాకృష్ణు లిటఁ గనరారుగాని
వారు మేమింత యెఱుఁగనివారు గారు
వార లెవ్వరికిని వింతవారు గారు
వారిసంభాషణంబుల వేఱువేఱ
పలుకునవ్వడిఁ బోలిక పట్టఁగలము.
కానఁబడకుండ మాటాడుకారణమునఁ
బ్రకృతిభేదంబు లేర్పరింపంగ లేక
పాఠకోత్తములార ! దిగ్భ్రమము నొందఁ
బోకుఁడీ భావగతిఁబట్టి పోవవచ్చు
కొంచెమైనఁ బరాకుఁగాకొనఁగఁబోక

విను(డు చెవియొగ్గి కౌతుక మెనయ నదిగొ!
పలుకుచున్నది రాధ యాభావ మేమొ;
"అళివరా! నీవు చాల ధన్యాత్ముకుఁడవు
మందభాగ్యను నావంక మరలె దేల
వలపుఁగొలిపెడునీపుష్పవాటిలోని
కరిగి విహరింప నిన్నెవ్వ రాగఁగలరు?"
అనుచు రాధిక వర్ణోక్తు లాడుచుండ,
"ఒక్కతరుకోటరవంబున నున్నవార
లొట్టు వెట్టిన ముట్టుకోకుండు టెట్లు?
కసరి పలికిన బెదరక మసలు టెట్టు?
లొట్టుఁ దీసి గట్టునఁ బెట్టు మోసిచిలుక!"
అని వినంబడఁ జమకిత యగుచు రాధ
మనసు జల్లనఁ బొలయల్క ననుసరించి
తెగువ యుదయింప వెనుకకుఁ దిరుగఁబోయి
యడుగు తడఁబడఁ జిడిముడిపడుచు నొడలు
గడగడ వడంకఁ బీరంబు సడలిపోవ
నడలి బుడిబుడిఁ గన్నీరు వొడమఁ బ్రియుని
గలిసికొనలేక మఱియట నిలువలేక
సంభ్రమంబున నిటునటు జరగుచుండ
మదనగోపాలుడుఁగూడ మదిఁగలంగి

క్షణమె యొక్కొక్క యేఁడాదిగాఁగ హృదయ
తాప మగ్గలమైన నిల్పోపలేక
రాధికాహృదయాంతర క్రోధవహ్ని
నార్పఁజాలు నుపాయంబు నరయలేక
చిత్త మం దేమొకాని యోజించుచుండ,
నంతలో స్యందనాశ్వ హేషాస్వనంబు,
వచ్చె నక్రూరుఁ డను జనవాచకంబు,
" శౌరియెక్కడ ?" యనెడి ప్రశ్నారవంబు
నొక్కమాఱుగ నుదయింప నుదరిపడుచుఁ
దత్తరంబునఁ గేళి సౌధంబు వెడలి
ముద్దు కృష్ణుండు సోపానములనుఁబట్టి
త్వరగఁ బోవుచునుండ సంభ్రమము నొంది
చిరవియోగంబునట్టి సూచించుచున్న
కృష్ణుమధురాప్రయాణంబు స్మృతికి రాఁగఁ
గళవళంబున వెన్నాడి కలిసికొనఁగ
వడివడిగ రాధ మెట్టులో వచ్చెఁ గాని
యప్పుడే కృష్ణుఁ డక్రూరు నరద మెక్కె

* * * *

పాప మా రాధ కుత్సాహభంగమయ్యె
నామెహృదయ భావములెల్ల నంతరించె

డిల్లపాటునగుండె గుభిల్లుమనియెఁ
గ్రిందికిం కను జనుబుద్ధి మందమయ్యెఁ
బైకిఁబోవుట కెంతయో భారమయ్యె
నిముసమున కెన్నొమెట్టులం దిగినరాధ
యొక్కలేకుండె గడియకే నొక్కమెట్టు;
అనురుపురువుట్టెఁ, జిత్తంబు వసముదప్పె
నసిచెమటయె మేను, చూపులపస యడంగె
నబల రాధిక యేమి చేయంగఁ గలదు ?
అకట ! దడదడలాడు దేహంబుతోడఁ
దడఁబడుచునుండు మృదులపాదములతోడ
నమలమణిమయకుడ్యంబు నానికొనుచు
నల్లనల్లన సౌధంబు నధిగమించి
గహనమందలిపర్వతగుహారమట్టు
లతిభయంకరమైనగేహంబుఁజొచ్చి
జల్లుజల్లున గుండెలు తల్లడిల్ల
మృదులపర్యంకమున నెట్లొ మేను వాల్చి
దిగులుఁ జెందుచుఁ జేసేతఁ దెచ్చికొనిన
మొడ రనుభవింపకే తీరుటెట్లు లనుచు
నొరుని వెలపింపఁబోయి తా వెలచినట్లు
లక్కటా ! నేఁడు నాబ్రదు కాయె ననుచుఁ

గ్రమ్మఱఁగ శౌరిఁ గన్నులఁ గాంతునేని
తప్పులకుఁ బాదములఁ బట్టుదాన ననుచు
వేణుగానలోలుం డెంత విరసుఁడైన
సరస నుండుటయే నాకుఁ జాలు ననుచుఁ
బ్రియుఁడు దయతోడ ననుఁ బల్కరించినపుడు
చిన్నిమాటాడు మని వేఁడుకొన్నయపుడు
నేరము క్షమింపు మని దరిఁ జేరినపుడు
మోడి వహియించి నేనేల చూడనైతి?
పాడి దొరఁగి నేనేల మాటాడనైతి?
పాడుకోపంబు నేనేల వీడనైతి?
ప్రియునికడ నేల నే నొట్టు పెట్టుకొంటి?
అతనిదర్శన మిఁక నెటులబ్బు నాకు?
ననుచు నేమేమి మదినెంచుకొనెనో? రాధ
తరళనయనంబు లశ్రులు గురియుచుండె;
పరులహృదయంబు నెఱుఁగ నెవ్వరితరంబు?
కానియూహింప నెన్నో మార్గములు గలవు;
అద్ద మున్నది మొగమున్న దడుగనేల?
చెప్పనేఁటికి మీరె యోజించుకొనుఁడు!
సమయముంబట్టి తత్కథాసరణిఁబట్టి.

* * * *

చెలువ నిశ్చేష్టయై కొంతసే పటుండి
చారుచేలాంచలమునఁ గన్నీరు దుడిచి
లేచి కూర్చుండి యొకపత్రలేఖనంబు
హస్తపద్మంబు గంపింప నట్టె వ్రాసి
మొదలినుండియుఁ దుదదాఁకఁ జదివి చదివి
నిలిపినను నిల్వకుండఁ గన్నీటిధార
వరదలై పాఱ మఱి చదువంగలేక
యట నిలువలేక సదుపాయ మరయలేక
రమణునకు లేఖనంప ధైర్యంబులేక
యతితరంబగు దుఃఖంబు నాఁపలేక
హస్తమందున్న పత్త్రిక నట్టె విడిచి
యేమి తలపోసికొన్నదో యేమొ కాని
నడలు తడఁబడుచుండ నెన్నడుము వడఁక
సౌధమును డిగ్గి బిరబిరఁ జనియె బాధ;

* * * *

అవల నేమయ్యె ననుచు మ మ్మడుగవలదు
ప్రణయకోపంబుఁ గూర్చిన మనకథాంశ
మింతియే కాన తెలిపితి మింతవఱకె.
కొదవ గలదేని యూహించుకొనుఁడు మీరె;
ఐన నిప్డు రాధాకృష్ణులందుఁ గలుగు

ప్రణయకోపాన కేమికారణము గలదొ
మన మెఱుఁగమైతి; మేకాంతమునఁ జరించు
దంపతుల వృత్త మెవ్వరు తలఁపఁగలరు?
రాధికాకృష్ణు లిందుఁ బరస్పరంబుఁ
గలిసికొనకుండ మనకథ గడఁచెఁ గాని
వార లెటులైనఁ గలియకపోరు తుదకు.
ప్రణయకోపంబు వైరకారణము గాదు
ప్రియులహృదయంబు పాషాణమయము గాదు
కాని, యీకథ యెల్లను గట్టిపెట్టి
రాధికాసాధుభావవిరాజమాన
మోహలేఖార్థము గ్రహింప ముచ్చటైన
నిదిగో! యీపత్రిక నున్నది చదివికొనుఁడు.

(9-8-1911.)

“ మఱచిపోవకు

నన్ను మఱచిపోవకుము.

(మంజరి.)

నామనోనాయక ! నామోహఫలము !
క్రొత్తనెచ్చెలులును గ్రొత్తయాశలును
గ్రొత్తసంతోషముల్ కోరికఁ బొంద
నరుగుదే దూరదేశాంతరములకు,
అయినను సౌందర్య మందును మిగుల
గర్వించియున్నట్టి కాంతలనడుమ
నల్లన విహరించు నప్పుడుఁగూడ
నెవ్వతె నొంటిగా నీవిందు విడిచి
యరిగితివో దాని నపుడప్పుడైనఁ
దలఁచుట గొఱఁతగాఁ దలఁపంగఁబోకు,
నవయౌవనాకార ! నామోహనాంగ !
నీదగుప్రేమను నీదుభాగ్యమును
బొందిసుఖించెడి పుణ్య మేమియును
నిఁక నాకుఁ గల్గఁబో దీజన్మమందు ;
నైనను నీదీనురాలి ప్రార్థనము,
నైననుంచి యొకవర మీయంగవలయు

" మఱచిపోవకు నన్ను మఱచిపోవకుము "
ఈదీనదురదృష్ట మించుకంతైనఁ
దలఁచినమాత్రఁ జిత్తంబున నీకు
భరియింపరానితాపము కల్గనేని
నేను గోరినయట్టి యీప్రార్థనంబు
నుల్లంబులోపల నుంపఁగాఁబోకు,
ననుఁగూర్చియైన నెన్నండునుగాని
చిత్తమం దింతయోజింపఁగాఁబోకు ;
అటు సేయుదువుగాని యక్కటా ! నీకు
ఘనవిచారంబులు కల్గినయపుడు
నేవైన లోపంబు లెనసినయపుడు
దురదృష్టవశమునఁ దొంటియారోగ్య
వశ చెడి ధైర్యంబు దప్పినయపుడు
చిత్తశాంతి నొసంగు చెలియసాయంబు
వలసినయపుడు నాప్రాణసఖుండ !
" మఱచిపోవకు నన్ను మఱచిపోవకుము."

రాధ "

(12-8_1911.)

22 మక్షికము.

క. నీ వెపు డేదో పనికై
పోవుదు విపు డేమొ దాహముం గొని నాతోఁ
ద్రావఁగ వేఁడుకపడు చు
న్నావో ? మక్షికమ ! రమ్ము నాచెంగటికిన్.

క. త్రాగుము నాతో ; నే నెటు
త్రాగితి నటు త్రాగుమీ ! స్వతంత్రతతోడన్
నాగిన్నె దరికి రమ్మా !
యీగవ్యము చప్పరింపుమీ ! మెలమెల్లన్.

క. నీమనసు వచ్చినట్లుగ
నీమనుగడ సార్థకముగ నెఱపఁగ వలదే !
యేమున్నది జీవితపరి
ణామము క్షణకాలికము క్షణక్షీణమొకా !

క. అరయఁగ నీ జీవితమును
మఱి నాజీవితము నొక్కమాదిరిగానే
పరుగిడుచు నున్నయవి స
త్వరముగఁ దమయంత్యదశలఁ బడయుటకొఱకున్.

(13-8-1911.)

23 భాగ్యము.

ఎట్టులుండునో నాభాగ్య మెల్లి యనుచుఁ
గాంచ నెంచుట నాపని కాదుకాదు
నేను నను దాఁటిపోలేదు నేఁ డటంచు
నవగతం బగుచుండె నా కదియె చాలు.
మృత్యు వొకవేళ నద్దమ రేయినాడు
నెత్తురు హరించి శ్వాసల నిలుపనిమ్ము
నేను నాలోని మేలి నిధానమునకు
నేకరణినైనఁ గర్తను గాకపోను.
కనఁబడకపోవు భాగ్యమా! కరఁగిపోవు
కనకమా! యూరకేపోవు ఘనబిరుదము!
మెఱసిపోయెడు రత్నమా మీకునెల్ల
ఱెక్క లున్నవటంచు నెఱింగి యుంటి.
నెగిరిపోయెడు పక్షంబు లెఱుఁగఁబడియె
నట్టి ఱెక్కాఁర్చుచును మాయ పూఁచురిక్ట్రై
నిట్టివస్తులఁ గాంచుచు నెప్పటికిని
గూడ నాపని భావించువాఁడఁ గాను.
ఈప్రపంచకమే వాని నిచ్చెఁ గాన

వాని నెల్లను దానెప్పుడైన సరియె
వెండి గైకొననిమ్ము పోవిడువనిమ్ము
కాని నాపెన్నిధిని జేరనైనఁ గలదె?
నేను నాయాత్మఁ జూడఁగా నేర్చినపుడు
నన్ను నేఁ బూర్ణముగఁ గనుఁగొన్నయపుడు
నేను నాలోన నానంద మూనునపుడు
నేనె నా రాజ్యమై యుండు నిశ్చయముగ.

(20-8-1911.)

---

22 ఆత్మసఖుఁడు.

ఎపుడు నీవెంటఁ దిరుగుచా రెందఱున్న
వార లందఱు మిత్రులుగారు నీకు
వారిపరిహాసములు, ప్రియ భాషణములు
పొగడికలు గాలితోఁ గూడఁ బోవుచుండు.
ఆటపాటలకును గోటు నీటులకును

వింతలకు వేడియములకు విందులకును
నెన్నినాళ్ళీవు ధనము వ్యయింపఁగలవొ
యన్నినాళ్ళును వారు నీకాత్మసఖులె.
ఈవిలోనైన విందుల నిడుటనైన
గొదవయించుక నీయెడ నొదవెనేని
దినదినము నిన్నుఁ గనవచ్చు ఘను లదేమొ
యేఁటికైనను దర్శన మీయలేరు.
భయమొ, బాంధవ్యమో, మత పరిచయంబొ
కారణంబుగఁ గలిగిన కలయికలకు
సమయముంబట్టి మార్పులు జరుగుచుండుఁ
గాని మిత్రిత్వమట్టిది కాదుకాదు
సహజధర్మంబుచే నన్న చనవుఁజూపు
సత్కులాచారమున భార్య సరస మెలఁగు
వృత్తిధర్మంబున భటుండు వేఁడి కొలుచు
నంతమాత్రిన మిత్రత్వ మనఁగరాదు.
అనిశ మానందదాయక మైనయట్టి
నీదుభాగ్యంబుతోఁగూడ నీప్రియులును
బూర్వపరిచితులుంగూడఁ బోవుచుండ్రు
ప్రొద్దుతోఁగూడ దీప్తులు వోవుకరణి.
కలిమిలేములయం దొక్కగతిఁ జరించి

కష్టసుఖములలోన భాగంబుఁ గొనుచు
కష్టమైనను హితముసు గఱపుచుండు
వాఁడెచుమ్ము నిజమ్ము నీ ప్రాణసఖుఁడు.
ఆత్మబంధులు వాసి యిల్లాలు రోసి
పొరుగువారలు తలుపులు మూసినపుడు
దివ్వెతోఁగూడ నున్నట్టి తేజువోలె
నెవఁడు నినుఁబాయఁడతఁడె నీ యిష్టసఖుఁడు.
పేదవడిపోయి యాఁకలిచేఁ దపించి
దిక్కులేనియవస్థలోఁ జిక్కినపుడు
చేతనైనంత సాయంబు చేసి యెవఁడు
నీకుఁ దోడగు నాతఁడే నీసఖుండు.
ధనమునకుఁగాక నీదుమెప్పునకుఁగాక
కీర్తికింగాక ప్రత్యుపకృతికిఁ గాక
చిత్తశుద్ధిగ నీకు మేల్సేయు నెవఁడు
నిజముగాఁ జూడ నాతఁడే నీసఖుండు
ఎవనిచిత్తంబు నీచిత్త మేకమగునొ
యెవనిజీవంబు నీజీవ మేకమగునొ
యెవనివృత్తంబు నీవృత్త మేకమగునొ
యాతఁడేచుమ్ము నమ్ము నీయాత్మసఖుఁడు.

(16-9-1911.)

25 రాజభక్తి.

శ్రీజార్జి పట్టాభిషేకోపాయనపద్యహారావళి.

ఆశీర్వాదము.

శ్రీరంజిల్లఁగ భద్రపీఠమున భా
త్రీపుత్త్రితోఁ గూర్మియే
పారం గొల్వయి సోదరాప్తబుధమి
త్రామాత్యసామంతులున్
బౌరవ్రాతముఁ గొల్వఁ జెల్వెసఁగు నా
పట్టాభిరాముండు మా
మేరీజార్జుల రాజదంపతులఁ బే
ర్మిన్ బ్రోచు నశ్రాంతమున్.

ఉ. శ్రీమహిళాజనార్దనులు
శ్రీయును, రాజ్యరమానుభూతి, భా
షామహిళాపితామహులు
సన్మతియున్, జిరజీవనంబు, నా
ర్యామహిళాగిరీశులు శు
భాళి, విభూతియు, నిచ్చి మేరిరా

జ్ఞీమణి, జార్జి భూవిభుని
నిత్యముఁ బ్రోతురుగాక సత్కృపన్.

స్వాగతము.

మ. మును రాజేంద్రకుమారచంద్రు నిను స
మ్మోదంబు రెట్టింపఁగాఁ
గనుమాకిప్పుడు చక్రవర్తివయి రాఁ
గాఁ గ్రమ్మఱంగల్గె ద
ర్శనలాభంబు, కృతార్థులైతిమి మహా
రాజేంద్రచూడామణీ !
ఘనతేజోద్యుమణీ ! శ్రితావనమణీ !
కల్యాణచింతామణీ !

సీ. ధర్మంబు నాల్గుపాదములఁ దప్పకయుండ
నర్థంబు సంక్షయ మందకుండ
విజయరమాహృదంబుజము కందకయుండఁ
గీర్తికామిని కోపగింపకుండ
సుప్రతాపానల స్ఫూర్తితగ్గకయుండ
గుణముల లోపంబు గూడకుండ
ప్రజలచిత్తంబుల భక్తితప్పకయుండఁ
బగవార లున్నతిఁ బడయకుండఁ

దండ్రిపోలికి, నాతని తల్లిపోల్కి
నేలుచున్నావు చిరకాల మేలఁగలవు
భరతఖండంబునను పట్టభద్రుఁడైన
సత్యపథవర్తి! శ్రీజార్జి చక్రవర్తి!
గీ. జానకీరాములను, శచీ శతమఖులను,
శారదాబ్జాసనుల, నుమా శంకరులను,
శ్రీరమామాధవులఁ, బోలి చెలఁగుసార్వ
భౌమదంపతులకు మీకు స్వాగతంబు.

అమూల్యమణిహారము.

సీ. ఇనుఁడగునీకు బేర్మినిఁ గూర్చురెందఱో
ప్రభుశేఖరులు పద్మరాగమణుల
రాజగు నీకు నమ్రిత దెత్తురెందఱో
సామంతనృపులు ముక్తామణులను
గురుఁడగు నీకు మక్కువ నిత్తురెందఱో
ప్రకృతినాథులు పుష్యరాగమణుల
బుధుఁడగునీకుఁ బెంపునఁ జేర్తురెందఱో
ధరణీజనంబులు గరుడమణుల

భూమిపాలక ! మేము నమూల్యనవ్య
పద్యమణిహారముల నీ కుపాయనముగ
నిచ్చుచుంటిమి దయతో గ్రహింపుమయ్య !
చారుమణిధామ ! శ్రీజార్జిసార్వభౌమ!

అమ్లానపుష్పహారము.

సీ. అసమానమాలతీ కుసుమవల్లరికంటెఁ
జాఁ గమోహానమ్మృదు శయ్యఁగూర్చి
కమనీయనవమల్లికాగుళుచ్ఛముకంటెఁ
బ్రథితసౌరభ్య భావంబు నెఱపి
సురపారిజాత ప్రసూనమంజరికంటె
సమ్యగామోదరసంబుఁ జిలికి
మాలతీ మల్లికామందారములకంటె
లలితమనోజ్ఞ రీతులఘటించి
పద్యపుష్పహారముల్ భక్తిమీఱఁ
జేర్చినారము పట్టాభిషేకపుష్ప
హారములుగాఁగఁ బ్రేమతో నందికొనుఁడు
సాధ్వి ! మేరీమతల్లి ! శ్రీజార్జిభూప !

అభినందనము.

సీ. వైభవంబున శచీవరునికన్నులు గుట్టి,
వైశ్వానరునిశుచిత్వమునమూఁది
ధర్మరక్షణఁ గాలు దండంబు వెట్టించిఁ
నిర్ఋతిఁ బుణ్యజనత్వ నియతిఁదెగడి
భువనపాలనమున భువనేశు నరికట్టి
యమ్మహాబలుశక్తి వమ్ముఁజేసి
ధనదత్వమునఁ గుబేరున కుత్తరంబిచ్చి,
శర్వుని భూతిచే నగముచేసి
యష్టదిక్పాలకాంశల నవఘళించి
విశ్వపాలనమున మహావిష్ణువగుచు
వెలయుచున్నాఁడు విబుధులు వినుతిసేయఁ
జారుతరకీర్తి మాజార్జి చక్రవర్తి.

సీ. వాహినీమండలి వస్తుమాత్రమెకాని,
యతనిప్రతాపమే యవనినేలు
అంగరక్షకసైన్య మంగమాత్రమెకాని,
యతనితేజమె దుష్టతతి నడంచు
న్యాయసభాపాళి నామమాత్రమెకానిఁ
యతనియాజ్ఞయె ధర్మగతుల నిలుపు

ఛత్రాదికంబు భూషామాత్రమేగాని
యతనిరూపమె ప్రభుత్వాప్తిఁ దెలుపుఁ
దలఁప మాగధు లైభవమాత్రింబెగాని
యతనిభాగ్యంబె యశము దిక్తతుల నింపు
రాజమాత్రుండె యతఁడు విరాజమాన
విక్రమస్ఫూర్తి, శ్రీజార్జి చక్రవర్తి.

సీ. చతురాస్యుఁడను పేర జరుగుచుండుటెగాని,
యజుఁడెన్న మతిమాలినట్టివాఁడు
విశ్వరక్షకుఁడను పేరుమోయుటెగాని,
హరిజ్ఞాతివైరంబు గలుపువాఁడు
మంగళవ్రతుఁడను మాటమాత్రమెగాని,
హేమచాపుఁడు బిచ్చ మెత్తువాఁడు
సతతసన్మార్గసంచరణుఁడంటయెగాని,
రవి యంటముట్టఁగా రానివాఁడు
పొగడికలుగావు ముప్వురు మూర్తులైన
మూడుమూర్తుల రూపొందు ప్రోడమైన
నాతనికి నెందు నీడు జోడనఁగ రాదు
సర్వసామాన్యుఁడే జార్జి చక్రవర్తి.

సీ. తనరాజ్యమున నెప్పు డినుని వెలింగించు
నన్నఁ బ్రతాపంబు నెన్న నేల!

తననివాసంబె తెల్లని దీవిగాఁజేసె
నన్నయశస్స్ఫూర్తి నెన్ననేల ?
తనభూమి విమలవాహినులఁ దన్పఁగఁజేయు
నన్న దయారసం బెన్న నేల ?
తనముద్రికనె జగద్భరణంబుఁగావించు
నన్న మహత్త్వంబు నెన్న నేల ?
శిష్టజనముల మన్నించి దుష్టతతుల
నొంచి దయతోడ జగతిఁ బాలించుచుండె
నమ్మహారాజ్ఞి సార్వభౌమావతంసుఁ
డన్న మఱి వేఱె విష్ణువం చెన్న నేల ?

సీ. విబుధరక్షణముఁ గావించు మహేంద్రుండు
జనుల నెల్లరఁ బ్రోచు సర్వసముఁడు
ఖలవైరిజనముల కనులు గుట్టునినుండు
పరిజలకన్నులఁ జల్లఁబఱచు రాజు
అపమృత్యుభయముల నడఁగించు నీశుండు
జగమెల్లఁ బాలించు సార్వభౌముఁ
డిష్టార్థములనెల్ల నిచ్చువదాన్యుండు
పాపభారముఁదీర్చు భూపవరాళి
అర్థులకుఁ గొంగుబంగార మైనవాఁడు
ఆశ్రితులయింటి కల్పకం బైనవాఁడు

అఖిలభూమీజనుల కారాధ్యుఁ డైనవాఁడు
సత్యపథవర్తి శ్రీజార్జి చక్రవర్తి.

గీ. భరతఖండాద్వితీయ సౌభాగ్యగరిమ
భారతీయతపః పరిపాకకలన
మేరియుతుఁడౌచు జార్జి భూమీవిభుండు
చేరి యిచ్చటఁ బట్టాభిషిక్తుఁడయ్యె.

అ భి జా త్య ము.

సీ. జగమెల్ల నేలఁగాఁ జాలినబిడ్డలఁ
గడుపు చల్లనగాఁగఁ గన్నతల్లి
పతిని దైవంబుగా భావించి సేవించి
కమనీయతరకీర్తిఁ గన్నసాధ్వి
ప్రజల బిడ్డలవలెఁ బాలించి యెనలేని
గౌరవభావంబుఁ గన్నరాజ్ఞి
నిజశత్రులకు గర్భనిర్భేదమగుప్రతా
పోన్నతి వెలయింపఁ గన్నదేవి
ఈదృశానేక సత్ప్రతిభాదికములఁ
గానిమె నేదేవి యట్టివిక్టోరియాంబ
యెన్నఁ దనతండ్రితల్లిగా నెసఁగువాఁడు
సర్వసామాన్యుఁడే జార్జి చక్రవర్తి.

సీ. దిశలెల్లఁ గీర్తిచంద్రికలఁ గప్పినదెవ్వ
రన, నాతఁడన నర్హుఁ డైనవాఁడు
అరులైదుపదిసేయ నవని నేలినదెవ్వ
రన, నాతఁడన గుణాఢ్యుఁడైనవాఁడు
ప్రజల బిడ్డలఁబోలెఁ బాలించు విభుఁడెవ్వ
రన నాతఁడనఁ బాత్రుఁ డైనవాఁడు
వసుధ సప్తమ సార్వభౌమ శేఖరుఁ డెవ్వ
రన, నాతఁడన యోగ్యుఁ డైనవాఁడు
ప్రథిత విక్టోరియా తపఃఫలము నైన
సాంద్రతరకీర్తి యెడ్వర్డు చక్రవర్తి
తనకు జనకుండుగాఁ బ్రోది గనినవాఁడు
భూపమాత్రుండె శ్రీజార్జి భూపమౌళి.
సీ. దీనపాలనకు నందినచేయి, సత్యప్రి
యత్వంబునకును బట్టైనకొమ్మ
ఋజువర్తనమునకు నిజమైన మార్గంబు
గౌరవంబునకు నాకల్పకంబు
అనఘ పాతివ్రత్యమునకు నిదానంబు
తరుణీమణులకు నాదర్శకంబు
శాంతి సద్ధర్మశౌచముల కావాసంబు
సద్గుణంబులకును జన్మభూమి

యగు నాంగ్లాంద్రియా, మహీయాభిజాత్య,
ధన్యచారిత్రి, సాధ్వీమతల్లి, తల్లి
కూరిమిని బెంపఁబెరుగు కుమారమూర్తి
సర్వసామాన్యుఁడే జార్జి చక్రవర్తి?
గీ. పూర్ణచంద్రునితోడి కౌముదినిబోలి
వెన్నుఁబాయక యెపుడు సేవించుచుండు
నట్టి శ్రీమేరిరాజ్ఞి యర్ధాంగిగాఁగఁ
బ్రీతిఁ దనరారు జార్జి వర్ణింపఁదరమె.

పరిపాలనము.

సీ. మున్నున్నదనియైన నెన్నఁడే వింటిమే,
రమణీయతంతి వార్తాప్రశంస
మున్నున్నదనియైన నెన్నఁడేఁ గంటిమే,
యత్యద్భుతాకాశ యానకలన
మున్నున్నదనియైన నెన్నఁడే వింటిమే,
కమనీయలోహ మార్గప్రశస్తి
మున్నున్నదనియైన నెన్నఁడేఁ గంటిమే,
విద్యుత్ప్రదీపికా విలసనంబు
విన్నవియుఁ, గన్నవియుఁ, గాని వింతలెల్లఁ
గాంచుచుంటిమి ; నెమ్మదిఁ గాంచుచుంటి

మవనిలో స్వర్గసౌఖ్యంబు లందుచుంటి
మహహా! యాంగ్లేయ ధర్మరాజ్యంబువలన.

సీ. రాజవీథులనైన రత్నాలమూటలఁ
బడవేసికొనుటకు భయము లేదు
నడురేయినైన నొంటరిగ మార్గంబున
జరగిపోవుటకును జంకులేదు
అడవిలోపలనైన వ్యవసాయ మొనరించి
శరణంబుఁ జేర సంశయములేదు
అంబుధినైనఁ బ్రయాణంబుఁ గావించి,
దేశాంతరము లేగ దిగులులేదు
ప్రజలతలను పూవు వాడకయుండఁగాఁ
గడుపులోనిచల్ల గదలకుండ
వఱలఁజేయుచుండు పరిపాలనము గల్గె
నహహా! మనయదృష్ట మరయవశమె!

సీ. చౌడైనఁ బండని చట్టునేలలుగూడ
మహనీయ సస్య ధామంబు లయ్యెఁ
గాలైన నిడరాని గహనభూములుగూడ
రమణీయ రాజమార్గంబు లయ్యె
గట్టైన నెఱుఁగని మెట్టచెర్వులుగూడఁ
గమనీయ సోపాన గతము లయ్యెఁ

గదలైన నెఱుఁగని కారుకాల్వలుగూడ
వరణీయవాహినీ వరము లయ్యె
నెప్పుడో కృతయుగధర్మ మెవ్వఁ డెఱుఁగు
నెప్పుడో రామరాజ్యంబు నెవ్వఁ డెఱుఁగు
నెప్పుడో యుధిష్ఠిరశకం బెవ్వఁ డెఱుఁగు
నింతటిపరిభూత్వ మున్నదే యెన్నఁడైన ?

సీ. ఏటికావల నూళులే లేవనెడివార
మంబుధి యవ్వల నరయుచుంటి
మామడ దినమున కరుగనేరనివార
మయుతయోజనముల కరుగుచుంటి
మవలివీధిప్రసంగ మాకళింపనివార
మెల్లభూములవార్త లెఱుఁగుచుంటి
మాత్మదేశము వీడి యడుగు దాఁటనివార
మెల్లదేశంబుల కేఁగుచుంటి
మహహా ! యెన్నఁడు నెఱుఁగని యట్టిభాగ్య
మట్టిసౌఖ్యంబు నట్టి మహాముదంబు
ననుభవించితిమే యెప్పుడైన మనము
నయత రాంగ్లేయ పరిపాలనమునఁ గాక !

సీ. సాహసికంబైన సహగమన మడంగె
శిశుహత్య లెల్ల నశించిపోయె

గాలపుసిడులు ధిక్కారంబు నందెను
నరబలులెల్ల వినాశమయ్యె
పాశకారుల దుష్టవర్తనంబు లడంగె
దొంగతనంబులు దూరమయ్యె
బందిపోటులకు నిర్బంధముల్ ఘటియిల్లె
సకల దుష్కార్యముల్ సమసిపోయె
ప్రాణమానధనాళి గాపాడఁబడియె
దివ్యసత్యధర్మములు బోధింపఁబడియె
క్షితిజనాళికి సౌఖ్యంబు చేర్పఁబడియె
ఘనత రాంగ్లేయపాలనా కౌశలమున.

సీ. సందేశములఁ దెల్పు జాబులందింప లే
ఖాప్రేషణస్థాన కలనఁగలిగె
క్రయవిక్రయముల సౌకర్యంబుఁ గలిగింప
రాకపోకలకు మార్గములు గలిగె
వ్యవసాయ మభివృద్ధిపఱుపంగఁ బ్రవిమలాం
బువులైన పంటకాలువలు గలిగె
విద్యాభివృద్ధిఁ గావింప నూరూరికి
సరవి నొక్కొక్క కళాశాలగలిగె
ప్రజలకుంగల మూఢభావములు వోయె
స్త్రీలకునుగూడ విద్య నేర్పింపఁబడియె

జగతి నెల్లెడలంగూడ శాంతియొదవె
ఘనత రాంగ్లేయపాలనా కౌశలమున.

సీ. అవనివార్తలకెల్ల నాధారమైన వా
　　ర్తాపత్త్రికా ప్రచారంబు గలిగె
నారోగ్యమునకు మూలాధారమైయున్న
　　వైద్యాలయాధిక వ్యాప్తిగలిగె
నగరంబులకు లోహనాళమార్గంబుల
　　నమలోదకప్రవాహము లభించె
స్ఫోటకామయము లుద్ఘాటించి యపమృత్యు
　　భయము పోకార్చు త్రోవలు లభించె
ఇన్ని యన్ని యనఁగనేల యెన్నియేని
సౌఖ్యకరమార్గములు ప్రజా సమితికొదవె
సత్యధర్మక్షమాదయా సక్తమైన
ఘనత రాంగ్లేయపాలనా కౌశలమున.

సీ. ఆంగిలేయుల ప్రభుత్వాప్తి యబ్బుటఁగదా
　　ధర్మపాలన మహత్త్వంబు గలిగె
ధర్మపాలన మహత్త్వంబు గల్గుటఁగదా
　　జగమంతయు సుభిక్ష మగుచునుండె
జగమంతయు సుభిక్ష మగుచుండుటనెగదా
　　దుర్వృత్తి జనులకు దూరమయ్యె

దుర్వృత్తి జనులకు దూరమౌటనెగదా
ప్రజలకు సౌఖ్యంబు వడయఁగలిగె
సకలభూభారము సడంగె; శాంతియొదవె;
నహహా! మనభాగ్య మెంతని యనఁగవచ్చు
నాసుధాకర తారార్క మగుచు నిట్టి
దివ్యపరిపాలనంబు వర్ధిల్లుఁగాక!

మంగళాశాసనము.

సీ. మహనీయతరసర్వ మంగళాకలితయై,
యలరారుచుండు నర్ధాంగితోడ
ననుపమానందదాయకమౌచు సౌఖ్యంబుఁ,
గాంచు కుమార వర్గంబుతోడ
విద్యున్నిభద్యుతి విలసిల్లు విమలమ
హాహీన మణిభూషణాళితోడ
నాజ్ఞానుసార విహారమై భక్తిసం
గతిఁగొల్చు సద్భృత్య గణముతోడ
సదమలవిభూతితోడఁ దేజంబుతోడ,
నలరి, రాజశేఖరత నార్యానురాగ

పరతఁ జెలువొందు, జార్జిభూపాలతిలక !
లీలఁ బెక్కేఁడు లవనిఁ బాలింపుమయ్య !

మంగళమహశ్రీ

శ్రీనిలయుఁ డార్యజన, సేవ్యుఁడు, పరాత్పరుఁ,డ
శేషజనపాలకుఁ, డనంతుం
డానతశరణ్యుఁడు, మహామహుఁ డమేయగుణుఁ
డాఢ్యుఁడు, దయామయుఁ, డజుండున్
జ్ఞానమయుఁ, డీశ్వరుఁ డఖండమగునట్లొసఁగుఁ
గావుతఁ గృపామతిని మేరీ
మానవతి, కీశ్వరసమానుఁ డగుజార్జికిని,
మంగళము, మంగళమహశ్రీన్.

కథాప్రారంభము.

శ్రీమదిలాతనూజను వ
రించెడిపట్టునఁ దన్ముఖాంబుజా
తామితరామణీయక సు
ధాసవ మానఁదలంచి యూఁదలన్
ప్రేమను బ్రోలునించెడుత
టిన్ గడుపారఁగఁ గ్రోలి క్రాలు నా
రాముని ప్రేక్షణాళులు ని
రంతరమున్ గృపఁజూచు మమ్ములన్.

సీ. దర్శనీయంబైన దైవంబు భూపాలుఁ
డిహము వెలుంగించు నినుఁడు విభుఁడు
చనవునఁ బోషించు జనకుండు నృపమౌళి
తమిమీఱ నలరించు తల్లి ప్రభువు
గుణదోషములఁ దెల్పు గురుఁడు మహీంద్రుండు
హితముదెల్పెడు పురోహితుఁడు రాజు
మేలొనఁగూర్చు సన్మిత్రుఁ డుర్వీశుండు
తలఁపుల నీడేర్చు దాత నృపతి
మహిత మహిమాన్వితుండు పేర్మిప్రపూర్ణుఁ
డనుపమజ్ఞానసంపన్నుఁ డాత్మనున్న

భావకలితుండు, నగు నరపాలుఁ డెగద
యవనిజనులకు నన్నియు నైనవాఁడు !

ఉ. క్రోఁతియె యయ్యె మారుతి య
కుంఠితవిక్రముఁడై యపారవి
ఖ్యాతి పయోనిధిం గడవఁ
గల్గెను, సూతుఁడె యయ్యెఁ గర్ణుఁడా
స్ఫీతచరిత్రుఁడై నృపతి
సేవితుఁడయ్యెఁ; దలంచి చూడఁగా
నాతత రాజభక్తులకు
నందఁగరాని యభీష్ట ముండునే?

సీ. శ్రీమద్వసుంధరా స్థితజనోన్నతిఁ గూర్చు
పరిణతప్రభాశక్తి రాజభక్తి
ధర్మార్థకామముక్త్యాచయంబు లొసంగు
రమణీయతరశక్తి రాజభక్తి
సంతతసన్మార్గసరణిఁ బరిబోధించు
పారంచదాగమసూక్తి రాజభక్తి
అనవద్యభువనయాత్రానందము ఘటించు
రమ్యనౌకాయుక్తి రాజభక్తి
సకల భూమండలికిని బ్రశాంతమైన
తేజమిడు నద్భుతవ్యక్తి రాజభక్తి

సకలజనులకు నెనలేని సౌఖ్యమిచ్చు
రాజితామృతభక్తి శ్రీరాజభక్తి.

క. వేదవ్యాసుఁడు పంచమ
వేదంబున వ్రాసినట్టి విమలచరిత్రం
బాదర్శంబుగఁ జేసి ని
వేదింతుము రాజభక్తి విశ్రుతఫణితిన్.

సీ. తుదమొద లెఱుఁగక తోఁచునన్నియువ్రాసి,
మా గ్రంథమును నింప మనసు లేదు
అస్వభావంబులౌ నాఖ్యాయికలఁ గూర్చి
క్రొత్తపద్యము లల్లఁ గోర్కె లేదు
కల్లవ్రాఁతలతోడఁ గాగితంబుల నింపి
మము మేమె మెచ్చుకో మమత లేదు
కలదులేదనుశంక గలిగించి పాఠకా
గ్రణులఁ గలంగింపఁ గాంక్ష లేదు
అచతురాననుఁడగు బ్రహ్మ, యపరవిష్ణుఁ,
డత్రిలోచనుఁడగు హరుఁడైన వ్యాస
మూర్తి భావించి స్వాంత మున్ముఖముచేసి
కడఁగుచుంటిమి సత్యవాగ్రచనకొఱకు.

సీ. ఇది మంచి దిది చెడ్డ దిది యధర్మం బిది .
ధర్మంబని విధించు తాత్త్రి లేక

ఈతప్పుఁ జేసిన నీశిక్ష యగునని
నిల్చి శాసించెడి నేత లేక
దుష్కృతు లొనరించు దుష్టులఁ గనిపట్టి
తగురీతి దండించు ధాత లేక
అదివారి దిదివీరి దని స్వాస్థ్యవృత్తుల
నియమింపఁజాలు నిర్ణేత లేక
యల్లకల్లోలమై విపదంధకార
మందుఁబడి రాజులేని త్రియామభంగి
ప్రతిభచెడి రవిలేనట్టి పగటికరణిఁ
దొల్లి యొక్కప్పుడు జగంబు తల్లడిల్లె.

క. ఆకాలంబునఁ బ్రజ లె
ట్లాకుల పడుచుండిరో యథార్థ మెఱుఁగ ని
ర్వ్యాకులచిత్తంబున నా
లోకించినఁ దెలియు నెంతలోనిది మనకున్.

ఉ. ఉన్నది లేనియ ట్లెఱుఁగ
నోపెడు తెల్వియు లేనిదున్నయ
ట్లెన్నఁగఁజాలు నేర్పును, వ
హించిన మానస దివ్యశక్తికిన్
విన్నది కన్నయట్లుగ స
విస్తరభంగి సహేతుకంబుగాఁ

జెన్నసలార భావనము
చేయుట కష్టముగాఁగఁ దోఁచునే.

ఆ. రామ ! రామ ! యేమి వ్రాయంగనేర్తు మా
నాఁటి భూమి ప్రజల పాటులెల్లఁ
బెద్దమీను వచ్చి పిల్లమీనును బట్టి
పొట్టఁబెట్టుకొన్న యట్టులుండె.

సీ. తలకించుచుండి రెందఱో హిరణ్యాక్షులు,
ధారణీచక్రంబు దద్దరిల్ల
దండించుచుండి రెందఱో హేమకశ్యపుల్,
సాధుసంతానంబు బాధనొంద
చెఱఁబట్టుచుండి రెందఱో రావణాసురుల్,
కోమలాంగులు గోలుగోలనంగ
తెరలించుచుండి రెందఱో నరకాసురుల్,
విబుధసంఘంబులు వెతలఁగుంద
దుష్టచక్రంబునొంచు నాథుండు లేఁడె
దీనజనముల రక్షించు దిక్కులేదె
భూమి భారంబడంచు విభుండు లేఁడె
యనుచు జగమెల్ల భీతి నల్లాడుచుండె.

సీ. బలవంతముగ నొక్క వరకాంతఁ జెఱఁబట్టు
వారి మేనులు కాల్చువారు లేరు

ధనవంతు తలఁగొట్టి ధనమెల్లఁ దరలించు
వారి బంధించెడువారు లేరు
పగఁబూని యొరులకొంపలకు నిప్పులువెట్టు,
వారిచేతులఁ జెండువారు లేరు
నడురేయి నిండ్లలోఁబడి హత్య లొనరించు,
వారితలల్ గొట్టువారు లేరు
జారచోరు, లభాగ్యు లజ్ఞాను, లనద
లవినయు, లధర్మమార్గవిహారు, లల్ప
లప్రయోజకు, లప్రియు లసురమూర్తు
లైరి ప్రజలెల్ల శాసించువారు లేక.

సీ. సంపదగలదన్న సంతోషమున్నదే,
కొట్టిచోరులు దోఁచుకొనుచునుండ
నాలుబిడ్డలు గలరనుతృప్తియున్నదే,
పట్టి జారులు భంగపఱచుచుండఁ
బండించుకొంటిమఁ బరితోషమున్నదే
త్రెంచి ముష్కరులు తర్లించుచుండఁ
బొలములు గలవన్న నిలుకడయున్నదే,
మించి దుర్మదు లాక్రమించుచుండ
నన్న మున్నది యని తృప్తియున్నదొకొ?
పొగరుఁబోఁ తెవ్వఁడో తినిపోవుచుండ

లేదు నెమ్మది; సంతుష్టి లేదు; సుఖము
లేదు; గతిలేదు; శరణంబు లేదు లేదు.

చ. అనయము హెచ్చు; ధర్మ మడు
గంటెను; వర్తక మంతరించె, దు
ర్జనత విశేషమయ్యె; వ్యస
నాయము వచ్చె; నధర్మమార్గ వ
ర్తనములు వృద్ధినొందెను; మ
తంబులు మాసెఁ గులంబు గూలెఁ; బీ
డన మతిరేక మయ్యెను; గ
డంకలుపోయె మహీజనాళికిన్.

సీ. కామంబునకు యథేచ్ఛాప్రచార మొనఁగూడె,
క్రోధంబునకుఁ బట్టుఁగొమ్మ లబ్బె
లోభంబునకు భృత్యలోకంబు చేఁజిక్కె,
మోహమ్మునకు జయమ్ములు ఘటిల్లె
మదమున కధిక సన్మానంబు సమకూరె,
మత్సరంబునకు సామ్రాజ్య మొదవె
దుర్గుణంబులకును దొలునోము ఫలియించె
దుర్నయంబుల కున్నతులు లభించె
ధర్మమే లేదు; కలదే నధర్మహాతము;
సాధులే లేరు, కలరే నసాధుహాతులు;

కటకటా ! మంగలములోని కందిగింజఁ
బోలె జగమంతయును వేగిపోవుచుండె.

క. తగవులు, నల్లరు, లలజడు,
లగచా, ట్లాఱడులు, తిట్టులాడిక, లఱపుల్,
జగడంబులు, హాత్యలునై
జగము పరిభ్రాంత మగుచు నసిచెడిపోయెన్.

సీ. సంఘంబు దుర్నీతి నమయించుటకుఁ గాదు,
చొచ్చి గ్రామముల దోఁచుటకుఁగాని
ప్రాబల్య మబలలఁ బాలించుటకుఁ గాదు,
శుద్ధాంతములఁ గలంచుటకుఁ గాని
ఖడ్గంబు దుష్టుల ఖండించుటకుఁ గాదు,
పొడిచి కన్నములు త్రవ్వుటకుఁ గాని
ప్రాభవం బనదలఁ బాలించుటకుఁ గాదు,
చుఱచుఱ ప్రజలఁ గాల్చుటకుఁగాని,
అకట ! యూహాఁటిప్రజలయం దడరియున్న
శక్తులన్నియు దుష్క్రియాచరణమునకె
పాలుపడుచుండ దీనుల ప్రాణములకు
గడియ కొక్కొక్కకష్టంబు గలుగుచుండె.

చ. బలమున విక్రమంబునను
బాపపథోన్ముఖ వర్తనంబునన్

జలమున నొక్కనిం గెలువఁ
జాలినవాఁడు మఱొక్కఁడుంట దు
ర్బలబలభేదభావములఁ
బాల్పడి పోరెద రంతెగాని యీ
యిలపయి నొక్కఁడేని సుఖి
యించుటలే దదియేమి పాపమో.

ఉ. కలవులచేత, దుర్జనని
కాయముచేతఁ, బరస్పరంబు ము
ష్కరులయిపోరు దుర్మదుల
ఘర్షణచేత భయంబునొంది ది
క్కఱి దరిలేనియాపదలఁ
గ్రాఁగుచు దూఁగుచు నొక్కరీతిగా
హరి! హరి? యప్పు డట్టుడికి
నట్టుడికెన్ బ్రజయెల్ల నెల్లెడన్.

శా. ఆరీతిం జనులెల్లఁ దల్లడిల న
న్యాయంబు వర్ధిల్లుటన్
దౌరాత్మ్యంబుఁ దొలంచి తోడిప్రజ కా
ధారంబుఁ గల్పింపఁగా
ధీరస్వాంతుఁ డొకండు గావలయుఁ గా
దే నాయకుం డంచు నూ

రూరన్ జర్చలు సేయఁ జొచ్చిరి మహో
దోగ్యంబుఁ గావించుచున్.

చ. పదుగురు చేరి యొక్కరునిఁ
బాలకుఁగాఁ గొని యూరనూర ధ
ర్మములు నడంచి సాధుజన
మండలిఁ దన్పుచునుండ నాతనిం
గుదురొనరించి భక్తిమెయిఁ
గొల్చుచు నాతని శాసనంబు నె
మ్మదిఁ దలఁదాల్చుచుండుటకు
మేకొనుచుండిరి కొన్నినాళ్లాగన్.

క. అంతటితో నేమగుఁ గ
ల్పాంతజ్వలనంబు నార్పఁజాలును సమిధల్
సంతప్తములై కీలా
సంతానంబునకుఁ దోడొసఁగుఁగాకవియున్.

క. ఆపాలకు లధికారము
ప్రాపునకు మదించి ధర్మపద్ధతిఁ బ్రజలం
గాపాడనేరక యథే
చ్ఛాపరతంత్రులయి తిరుగసాగిరి పెలుచన్.

చ. తనతన కానఁగొల్పిన ల
తాలలితాంగుల వాహనంబులన్

ధనముల మానికంబుల సు
దారమతిం గొనితెచ్చి యిచ్చు నా
తనిఁ దమనానిగా మనిచి
తక్కినవారల దండనార్హులం
చును నలయించుచుండె రవి
శుద్ధచరిత్రిసుత్రై క్రమంబుగన్.

మ. తనుదావచ్చిన స్వానికారములచే
తంబొంగి మత్తిల్లి దు
ర్జనతం బూని చరించువారిఁ గని యా
శంజెంది యాస్థాన మొ
య్యన చెందందగు మాక, మాక, యని పో
రాడంగఁ దొల్లింటి మిం
చినకల్లోలము పుట్టి భూప్రజలకుం
జేసూర్చెఁ గష్టంబులన్.

క. ఒకరొకరుగ, నొకసంఘము
నొకసంఘముగాఁగ, యుద్ధమొనరింపఁగ నూ
రక రక్తనదులె కానీ
సుఖము జయము చేర దొక్కచోటికి నైనన్.

ఆ. ఒకనిజంపి యొక్కఁ డుస్నతివహించుఁ బ
నతనిఁజంపి మఱొకఁ డది హరించు ;

తాఁకిడిఁ దన్నువాని తలఁదన్నువాఁడుండు
నన్న యార్యసూక్తి సార్థకముగ.

మ. జగమెల్లన్ రణరంగమై యెసఁగ వే
శ్మంబుల్ శ్మశానంబులై
నగరంబుల్ గహనంబులై చెడియె ను
న్మత్తాకృతుల్ దాల్చి దు
ష్టగణంబుల్ చెలరేఁగి యుబ్బుచు యథే
చ్ఛావృత్తి సన్మార్గ దూ
రగులై తాండవమాడుచుండిరి జగ
ద్రంగంబు భంగించుచున్.

క. ఆకల్లోలమునంబడి
లోకము తల్లడము నొంది లోఁగఁగఁ బ్రజల
వ్యాకులమతులై శరణము
నాకాంక్షించి పరమేశుఁ బ్రార్థించిరోగిన్.

మ. జగతిన్ సృష్టియుఁ బాలనంబును వినా
శంబున్ ద్రిభంగిం బొన
ర్పఁగ నీవేగద కర్త వాఢ్యుఁడవు దే
వా! యార్తులన్, దీనులన్,
విగతజ్ఞానుల, నిస్సహాయుల, విపద్వి
భ్రాంతులన్ మమ్ముఁ బ్రో

వఁగరావే దయఁజూడవే యనదలం
బాలింపవే యీశ్వరా!

శా. దేవా! పాపముపండె; సాధుజనముల్ ది
క్కేఁడియున్నారు; రౌ
ద్రావేశంబున దుర్మదుల్ ప్రబలి దు
ర్వారాపకారక్రియల్
గావింపన్ వెనుదీయకుండిరి, మహా
కాలావతారుండవై
రావే! రక్షణ శిక్షణంబులను దీ
ర్పం బెద్ద నిర్మింపవే!

మ. గరదుల్ కొంపలఁ గాల్చువారలు కనత్
ఖడ్గాది శస్త్రాస్త్రదుల్
పరదారాభిరతుల్ పరస్వహరణ
ప్రాశుల్ పరక్షేత్రసం
హారణు ల్మ్రన్నగు నాతతాయులు యథే
చ్ఛాయత్తులై సాహసో
ద్ధురులై చుండిరి, విశ్వరక్షక!
జగద్ద్రోహంబు వారింపవే!

చ. బలమును విక్రమంబును బ్ర
భావము సర్వసమత్వమున్ దయా

కలనముఁ గల్గు నాథ్యుఁడు జ
గంబు భరించుటలేక యెల్లెడన్
దలతలపెత్తనంబును న
ధర్మపథాచరణంబుఁగల్గి వి
చ్చలవిడి రేఁగుచుండి రతి
సాహసులై ఖలులై మహీజనుల్.

సీ. చోరులు, జారులు, జూదరుల్ మద్యసే
వనులును, దుర్మార్గ వర్తనులును,
ననృతవాదులు, న్యాసహారులు, వర్ణాశ్ర
మాచారదూరు, లన్యాయపరులు,
శఠులు, నాస్తికులు, హింసాపరు, లార్యవి
ద్వేషులు, సత్క్రియాదూషకులును,
బరుషభాషణులు, ముష్కరులు, మన్మథు, లహం
కారు, లున్మత్తులు, మారకులును,
స్వార్థపరతంత్రులౌచు నీ జగమునెల్ల
గలఁచుచున్నారు దీనులు నిలువ నీడ
లేదు ; చేరుటకును దిక్కులేదు ; వేగ
రావె ! రక్షింపవే ! మహాదేవ ! దేవ !

సీ. కరుణారసముఁజిల్కు కడకంటిచూపుతో
దీనులఁబాలించు దిక్కునీవ

జగతికి భద్రంబు సమకూర్చి సమబుద్ధిఁ
బరిపాలనము సేయు ప్రభుఁడవీవ
లోకకంటకుల నాలోకించి తగురీతి,
శాసింపఁజాలు శిక్షకుఁడవీవ,
ఆర్తులౌ భక్తుల యభిమతార్థంబులు
దయచేసి ప్రోచెడి దాతవీవ
శిష్టజనరక్షణము, దుష్టశిక్షణంబు
నెఱపి భూభారమడఁగింప ధరణి నవత
రించు నాథుఁడవీవ హరీ! మహాత్మ!
అగతికుల మమ్ముఁ గాపాడుమయ్య దేవ!

మ. అని యీరీతి విపత్పయోనిఁబడి హా
హాకారముల్ సేయుచున్
ఘనభక్తిన్ ధరణీజనంబులు జగ
త్కర్తన్, జగన్నాథుఁ, బా
వను, నీశుం, బ్రణతార్తి సంహరణునిన్,
వందారు మందారు, వి
శ్వనిదానుం, బరముం, బ్రభావమహితుం
బ్రార్థించి రొక్కుమ్మడిన్.

సీ. దుష్టశిక్షణమును శిష్టరక్షణమును,
నొకచేతనే చేయుచుండువాఁడు

ఖలులదుర్మార్గంబు, ఘనులసన్మార్గంబు,
 నొకకంటనే చూచుచుండువాఁడు
నాస్తికులదురుక్తి యాస్తికుల నతోక్తి,
యొకచెవినే వినుచుండువాఁడు
నిరుపేదబిడ్డల నరపాలసూనుల,
నొకరీతినే పెంచుచుండువాఁడు
రాతిలోఁ గప్పకును చెట్లఁ గోఁతులకును
నొక్కగతి భుక్తినొనఁగూర్చు చుండువాఁడు
సర్వసమవర్తి దేవతా చక్రవర్తి
యపుడు వారలయెదుటఁ బ్రత్యక్షమయ్యె.

సీ. నిప్పచ్చరంబున నెగులొందుపేదకుఁ,
బెన్నిధి యెదుటఁ గాన్పించినట్లు
నట్టేటఁబడి మున్గి కొట్టాడు నార్తుని,
చేతికిఁ గూలంబు చిక్కినట్లు
అంధకారమున నల్లాడు జాత్యంధున,
కాకస్మికముగ జూపైనయట్లు
కడుపు మండంగ నాఁకలిగొన్నవానికి
నిష్టాన్నములు లభియించినట్లు
అఖిల భూతదయాపరుఁడయిన విభుఁడు
కట్టెదుట నొక్కసారి సాక్షాత్కరింప

నామహాజనమండల మద్భుతప్ర
మోదరసమగ్నమై తేలిపోవుచుండె.

సీ. చాతకాళికిఁ బిపాసాస్ఫూర్తి తీరదే
        కమనీయ మేఘోదకంబువలన
కుముదావళికిని సంకోచంబుతీరదే
        లలితేందుచంద్రికా విలసనమున
కుజషండమునకు నాకులపాటు తీరదే,
        మహితవతంస సమాగమమున
శోకసంతతికి వ్యాకులపాటు తీరదే
        తరుణ ప్రభాకరోదయమువలన
ఘనుఁ డనంత లసత్ప్రభాకరుఁడు విభుఁడు,
కాలరూపుఁడు సర్వజగత్స్వరూపుఁ
డైనదేవుండె ప్రత్యక్షమైనయపుడు
దీనజనుల యభీష్టముల్ తీరకున్నె?

శా. ఆయానందరసాతిరేకమున నా
        హ్లాదంబు దీపింప ని
త్యా, యానందమయాయ విశ్వపతయే
        ధర్మస్వరూపాయ వే
ద్యాయాద్యాయ నమోస్తుతే యనుచు సా
        ష్టాంగంబు లర్పించి భ

క్త్యాయత్తాస్త్రకు లమ్మహాజనులు లో
కారాధ్యుఁ బ్రార్థింపఁగన్.
శా. ఆర్తత్రాణపరాయణుం డఖిలలో
కాధీశుఁ డుద్యత్కృపా
స్ఫూర్తిన్ దక్షిణహస్త మెత్తి, వినుఁడో
భూమీజనుల్ ! విస్ఫుర
త్కీర్తిన్ సాత్త్వికమూర్తి సర్వసమవ
ర్తిన్ భర్తగాఁగూర్చి మీ
యార్తిం దీర్చెద నోడకుండుఁడని స
ద్యస్సిద్ధ సంకల్పుఁడై.
మ. అనహంకారుఁడు నీతికోవిదుఁడు శా
క్యాచార్యవీరోన్నతుం
డనసూయాపరుఁ డార్యధర్మనిరతుం
డార్తార్తినిర్వాపణుం
డనుకంపామతి, సాత్త్వికాకృతి యమే
యప్రాభవోపేతుఁడా
ఘనతేజోనిలయున్ సృజించెను జగ
త్కల్యాణసంసిద్ధికిన్.
క. ఆరీతిన్ సృజియించి కృ
పారతుఁ డయ్యీశ్వరుండు ప్రజలం గనుమన్

మీరాశా జీతండే మీ
యారాటముఁ దీర్చునని కటాక్షింపంగన్.

గీ. రాజుఁగని పొంగు నాజలరాశిపోల్కి
రాజుఁ గని పొంగె నా జనరాజియపుడు
ఘనతరానందరస తరంగములతోడ
విజయఘోషంబు లెల్లెడ విస్తరిల్లె.

క. మాకోరికలు ఫలించెను ;
మాకన్నులు చల్లనయ్యె మాకొదతీరెన్
మాకార్యము సిద్ధించెను
లోకావనమయ్యె సత్యలోకాధీశా !

క. అని యిటు లేకగ్రీవం
బున నానందంబు పొంగి పొరలఁ బలుకుచున్
జనులు జయధ్వనులఁ బ్రతి
ధ్వనితంబుగఁ జేసి రఖిల ధరణీతలమున్.

క. ఆకలకల మడఁగించి కృ
పాకలితుం డీశ్వరుండు వారిం గని యీ
భూకాంతుఁడు మనునాముము
చేకొని పాలింపఁగలఁడు క్షితితల మెల్లన్.

చ. అని మనుసార్వభౌముని, గ
టాక్షములన్ దిలకించి వత్స ! నీ

వనితర ధీవిశారదుఁడ
వై సమదృష్టిని ధర్మమార్గవ
ర్తనమున, సాధుభావమున
ధారుణిఁ బాలనసేయు మర్త్యశా
సనమున దుష్టభంజనము
సల్పుము నిల్పుము ధర్మమెల్లెడన్.

సీ. ధర్మంబు నిలుపుము తఱి వేచి శత్రుల
మడఁగింపు, మనదల మనవి వినుము,
బలములఁ గూర్పుము ; వ్యసనంబు లెడలింపు
మవినీతుల నడంపు ; మవని గొనుము
సైనికుల్, ప్రజలును సచివు లేకీభావ
మందునట్లుగఁ జూడు మర్థధర్మ
కామమోక్షంబులఁ గాంచుము ; విషయస
క్తుండవు గాకుము గురుపురోహి
తాదుల, నమాత్యభృత్యుల నాదరింపు
మవనిజనముల నీబిడ్డలట్లు చూడు
మర్త్యదండంబు గొనుము, మహాపరాధుఁ
డయిన సుతునైన దండింపు మనఘచరిత !

చ. ప్రతినిధియుం ; బ్రధానుఁడును,
బండితుఁడున్, సచివుండు మంత్రియున్

మతియుతుఁడో నమాత్యుఁడు, సు
మంత్రుఁడు, ధీనిధి ప్రాడ్వివాకుఁడుం
బతులకు నెందునుం బ్రకృతి
వర్గము కావున నట్టివార లా
యతమతులున్, సధర్ములుగ
నారసి చేకొనఁబోలు జేనికిన్.

గీ. రాజులేని ప్రజ విరాజిల్లనోపదు
రాజు ప్రజలులేక తేజరిలఁడు
కాన; స్వామిభక్తి ఘనతరంబగునట్లు
నృపతి ప్రజల నాదరింపవలయు.

గీ. మించు శక్తిత్రియంబు సాధించి, చతురు
పాయముల మర్మములెఱింగి పంచకరణ
మును నిరోధించి షాడ్గుణ్యమును నెఱింగి
కొనుచు సప్తాంగములఁ గాచికొనఁగవలయు.

క. తానుగ నవమానించుట
దానము సేయుమియుఁ బ్రబలదండము, కపటం
బైనగతి; పలుకుపల్లద
మూనుటయును దొసఁగుదెచ్చు నుర్వీశునకున్.

క. అని యుపదేశించి కన
ఘనకీజుం డీశ్వరుండు కరుణామయుఁ డ

ల్లన నంతర్ధానుండయి
చనియె జగద్రింగమెడలి సత్యపథమునన్.

క. అంతట జను లమ్మనుభూ
కాంతుం గని భక్తి వినయగౌరవముల న
త్యంతముఁ బ్రార్థించిరి సు
స్వాంతంబున సార్వభౌమపదముం గొనఁగన్.

సీ. ధరణిజను లసత్యనిరతులై యుండుట
రాష్ట్రిజనులయఘము రాజుదగుట
తలఁచి మనువిభుండు తలఁకి మహీరాజ్య
పాలనమున కిష్టపడకయుండె.

క. జను లప్డు ససంభ్రములై
మనువుం గని సార్వభౌమ! మము దయతోడం
గని పాలింపుము బిడ్డలఁ
దనుపక జనకుండు విడువ ధర్మంబగునే.

క. ధరణీశ ! విపజ్జలధిం
దరి గానఁగ లేనిమమ్ము దయఁగన, నిన్నున్
దరణికిఁ్రియఁ జూపి చనె నీ
శ్వరుఁ డాతనిపనుపు సేయవలవదె నీకున్.

గీ. "లోకములు, లోకధర్మంబులును నృపాల!
రాజమూలముల్ ; రాజవిరహితమైన

పుడమిజనులకు నింకిన మడువులోని
జలచరంబులు వడుపాటు సంభవిల్లు.

క. తరణి శశాంకుల తేజ
స్స్ఫురణము లేకున్నయట్లు భూజనములు ని
ర్భరదురితతఁ జేష్టుడుదురు
నరపాలకవిహితపాలనము లేకున్నన్.

క. తనధన మిదియని యూఁకడి
మనఁ; బరిణయమాదియైనమహోత్సవముల్
గానియాడ నెవ్వరికి వ
చ్చునె? జనపాలుండు లేనిచో నిర్భయతన్?

గీ. విభుఁడు లేకున్న జనములు సభయహృదయు
లగుచు హాహానినాదంబు లడరఁ దల్ల
డిల్లుదురు; రాజులేమియు నెల్లవారు
లేమి; కల్మియ కల్మి నిర్లేపహృదయ!

క. యోగములును భోగములును
ద్యాగములును, బహువిధములధర్మములు మహా
భాగా! నరపతిరక్షా
యోగంబునఁ జెల్లుఁ బ్రజకు నుల్లాసమునన్.

క. రాజునకుఁ బ్రజ శరీరము
రాజు ప్రజకు నాత్మగాన రాజుం బ్రజయున్

రాజోత్తమ ! యన్యోన్యవి
రాజితులై యుండవలయు రక్షార్చనలన్.

గీ. ఈశ్వరోద్దేశమును నిర్వహింపుమయ్య!
నియతితోడ స్వధర్మంబు నెఱపుమయ్య !
ప్రజల బిడ్డలఁబోలెఁ గాపాడుమయ్య !
విశ్వధూర్వహవిఖ్యాతి వెలయుమయ్య !

ఆ. హేమగోగణముల నేఁబదియవపాలు
ధాన్యతతులయందు దశమభాగ
మప్పనంబుగాఁగ నంది రాజ్యాంగంబు
నిలిపి పాలనంబుఁ జలుపుమయ్య !

ఆ. జగతిఁగల్గు నెల్ల శత్రుజీవుల నీవ
చేర్చికొనుచు దుష్టశిక్షణంబు
శిష్టరక్షణంబు సేయుచు రాజధ
ర్మంబు నిలిపి ప్రజల మనుపుమయ్య !

క. మనుజాధీశ్వర ! యీనీ
జనముల ధర్మంబునందు షడ్భాగంబున్
గొని బలతేజస్స్ఫూర్తిం
గని సురల మహేంద్రుఁడట్లు కావుముకూర్మిన్.

సీ. అని ప్రజలెల్ల నిట్లర్థింప మనుధర
ణీశ్వరుం డందుల కియ్యకొనుచు

నోమహీజనులార ! మోదకుం డిమ్మహీ
భారంబు వహియించి భద్రగతులఁ
బరిపాలనముచేసి పరమేశ్వరునియాజ్ఞ
ననుసరించెద నని యభయమొసఁగ
నెసలేని సంతోషమునఁబొంగి ప్రజలెల్ల,
జయజయోదీర్ణ ఘోషములతోడ
గీ. భక్తితోడ ననంతవైభవముతోడ
మంగళాశాసనములతో మనునృపాలు
నవ్యమణిమయ సింహాసనమున నునిచి
వేడ్కఁ బట్టాభిషిక్తుఁ గావించిరంత.
సీ, సకలభూమీజనస్వాంతముల్ విలసిల్లె
సకలదేశంబులు చల్లనయ్యె
సకలసస్యంబులు సంపూర్ణముగఁబండె
సకలదిక్కులు ప్రకాశకములయ్యె
సకలధర్మంబులు సంస్థాపితములయ్యె
సకలదుష్కృతులు నాశంబులయ్యె
సకలసౌఖ్యంబులు సంకల్పితములయ్యె
సకలేప్సితంబులు సఫలమయ్యె
సకల లోకాభినంద్య ప్రశస్తకీర్తి
సకల కల్యాణగుణ సుప్రసన్నమూర్తి

సకల సమవర్తి యమ్మను చక్రివర్తి
సకల భూప్రజలలర రాజ్యంబు సేయ.

చ. ప్రియజనకుండుఁ, దల్లియును,
విశ్వవిభుండు గురుండు దేవుఁడై
దయయును బ్రేమమున్నతియు
దాంతియు శాంతియుఁ గల్గి లోకమున్
నయగతి రక్షసేయుచు జ
నంబులఁబోృచు ప్రభుండు కల్గుటన్
భయములుతీరె నీధరణి
భారముతీరెను జేరె సౌఖ్యముల్.

గీ. కరము కరముఁ గొనక కడుఁగృపామతితోడ
నేల నేల సాధుశీలముసను
ప్రిజలు ప్రజలువోలెఁ బ్రభుభక్తి యుతులైరి
రాజు రాజువోలెఁ దేజరిల్లె.

(15-11-1912.)

26 కవిగీతము.

కవిత కవిమూలమునఁ గవి కవితవలన
ఘనతర స్థితినందుట గలుగుచుండుఁ
గవితఁబోలిన మధురవస్తువులు లేవు
కవులఁబోలిన ధన్యమానవులు లేరు.

విమలనవనీత మృదులశబ్దములఁ గూర్చి
రమ్యభావ ప్రబోధకార్థములఁ గూర్చి
పరిమళామోద మధురభావములఁ గూర్చి
తతమనోహారలసదలంకృతులఁ గూర్చి
యనుపమావ్యక్తసుమధురధ్వనులు సెలఁగ
సలలిత శిరీషసుకుమార శయ్యలలర
నూతనమనోజ్ఞ చాతురీ రీతులెసఁగఁ
బటుతరాద్భుత వివిధకల్పనలు వెలయఁ
దఱచు దొలకరి మెఱపులు మెఱసినట్లు
మెఱసి కొ్రవ్విరి సోనలు గురిసినట్లు
కురిసి సౌరభమెల్లెడ దొరసినట్లు
మహితమై మానితంబైన మనసుతోడ

భవ్యమై పావనంబైన పల్కుతోడ
విమలమై విస్ఫుటంబైన వృత్తితోడ
దివ్యమై ధీయుతంబైన దృష్టితోడఁ
బదములు నిరర్థకంబులై గదురకుండఁ
బొదలు రసభావములు చెక్కు చెదరకుండ
సుస్వభావ మాధుర్యంబు సుడియకుండఁ
గావ్యదోషంబు లెందును గవియకుండ
భావముఁ గరంచు దృశ్యకావ్యములనైనఁ
జవులఁబుట్టించు శ్రవ్యకోశములనైనఁ
దానవర్ణాళిఁ బోలు పద్యములనైనఁ
దారహారాళిఁ బోలు గద్యములనైన
మహితగతి వ్రాయుమా! వ్రాయుమా! కవీంద్ర!
ప్రకృతి నీతోడునీడయై పలుకుచుండె
స్వస్థచిత్తత గల దంతెచాలు నీకుఁ
గావ్యనిర్మాణమునఁ బరికరము లరసి
చూచుకొన నేల ? కవిత నీసొమ్ము కాదె !
భావనాబల మున్నది ప్రకృతియున్న
దిష్టముండినఁ బదముల కేమి కొఱఁత ?
వారిదఖిహారనగశృంగపదము లరసి
స్వాదు జలపూర్ణ నదనదీపదము లరసి

పంకజామోద కాసారపదము లరసి
ఫలభరిత దివ్య కేదారపదము లరసి
సదమల స్నిగ్ధసైకతపదము లరసి
పావన తపోవనాశ్రమ పదము లరసి
భవ్యతర మందిరారామ పదము లరసి
భవనగోపుర పట్టణపదము లరసి
సార్థకంబుగ భావించి సరసకావ్య
మొకటివ్రాయుము! వ్రాయుము! సుకవిచంద్ర!
సమదకోకిల కలకూజితములలోనఁ
బ్రముదిత మయూర కేకారవములలోనఁ
బంజరశుకీశుకాను లాపములలోన
సుమసమారోహదళిశింజితములలోన
వర్షపాద ప్రచారారవములలోనఁ
దుములకల్లోల జలధి ఘోషములలోన
ధరణిధర నిర్ఝరప్రపాతములలోన
విమలతటినీ తరంగవేగములలోన
సుమధురానిల సంచాలనములలోనఁ
దరుణకాదంబినీ గర్జితములలోనఁ
బ్రకృతి యవ్యక్తమంజుల ధ్వనులు దెలిపి
వినుచున్నది చెవియొగ్గి వినుము! వినుము!

రమణ నొకసారి నీలాంబరంబుఁదాల్చి
చెలఁగి యొకసారి వెన్నెల చీరఁదాల్చి
పొసఁగ నొకసారి మంచుమేల్ముసుఁగుఁదాల్చి
లీల నొకసారి మేఘమాలికలఁ దాల్చి
ప్రీతి నొకసారి చుక్కలపేరుదాల్చి
పరగ నొకసారి క్రొన్నెలవంకఁ దాల్చి
వరుసనొకసారి సస్యగర్భంబుఁ దాల్చి
సరస నొకసారి బాలభాస్కరునిఁ దాల్చి
గడియకొకరీతిగా నలంకార సరణి
నెఱపుచున్నది ప్రకృతి నీనికటమందు
లసదలంకారముల లక్ష్యలక్షణములఁ
దెలిసియుంటి విఁకేమికావలయు నీకు?
కమ్మపుప్పొడి నెత్తావి గుబ్బరించి
వేగుఁబోకలఁ దెమ్మెరల్ వీచునపుడు
ప్రౌఢకాంతల ప్రణయకోపములు దీరఁ
గొక్కొరోయని తొలుకోడి కూయునపుడు
కాఱుచీఁకటి గుంపులఁ గడలఁద్రోసి
తూర్పునఁ బ్రభాతకాంతులు తోఁచునప్పు
డుదయశైలంబు మాటుననుండి బాల
సూర్యుఁ డల్లనల్లన తొంగిచూచునప్పు

దరుణకిరణంబు లల్లన తరులమీఁద
నలరు పవడంపుఁ దీవల నల్లునపుడు
ప్రకృతికాంత ప్రసన్నభావంబుఁ దాల్చి
కలవిహంగమ రుతములఁ గులుకునపుడు
విమలమౌ నీహృదంతరాళమున నెన్ని
యెన్నియూహలు తట్టెనో యెవరికెఱుక ?
కలికి చూపుల నెంత రాగంబు గలదొ
వెలఁది నవ్వులలో నెంత చలువగలదొ
విరిశరంబులలో నెంత చుఱుకుగలదొ
కాంచి తెలుపంగ వలఁతివీ కవివిగాదె !
సమయ సముచిత నవరస స్యందనమున
హృదయకేదారముల నెల్లఁ బదనుచేసి
లలిత నీతి బీజంబులఁ జిలుకరించి
మొలకలెత్తింపఁగాఁ గృషి సలుపుమయ్య !
నీతితత్త్వబోధకుఁడవై నెగడునపుడు
తోఁచి నన్నితోవల నీవు ద్రొక్కవచ్చు
లేదు నిర్బంధమనఁగ నీలేఖినికిని
కలదుగాదె "నిరంకుశాః కవయ" యనుట ;
వెలయు ప్రకృతికిఁ బరిమితి కలదుగాని
భావనాప్రకృతికి లేదు పరిమితి భువి

భావవీథి యనంతమై పరఁగఁగాన
వివిధగతులఁ జరింపుమీ కవివరేణ్య!
నిస్తులంబగు నీలేఖనీముఖం బ
కలుషపూర్ణమషీరస కలితమయ్యె
నవరసంబులఁ జిల్కుచున్నది సతంబుఁ
గృతుల చేపట్టుగలవారి కేమికొఱఁత?
నీమనోభావముల నెల్ల నేర్పుమీఱ
నక్షరాకృతి విలసిల్లు నట్లుచేసి
మనసువెంబడి నీదులేఖని చరింపఁ
గలదుగావునఁ గవితపైఁ దలఁపుఁ జేసి
ప్రకృతితత్త్వరహస్య నిర్ణయముచేసి
యఖిలవస్తుగుణంబుల నవధరించి
వివిధరూపస్వభావముల్ విశదపఱచి
దేశకాలపాత్రంబులఁ దెలియఁజెప్పి
నయ దుర్నయగతుల బోధనము చేసి
కష్టసుఖసంతతుల నెల్ల గణనఁ జేసి
పాపపుణ్యకర్మంబులఁ బరిగణించి
యనుపమపవిత్ర చరితంబు లనువదించి
సకలవిధ్యుక్తధర్మముల్ సంతరించి
సర్వశాస్త్రముల్ బోధింపఁజాలఁగలవు

సర్వధర్మముల్ వివరింపఁ జాలఁగలవు
సర్వశక్తులు గలిగింపఁ జాలఁగలవు
సర్వశుభముల సమకూర్పఁ జాలఁగలవు
జగతి నీమాటమీఁదుగా జరుగుచుండు
జగతి నీచేత నన్వర్థ మగుచునుండు
జగతి నీచూపుత్రోవనే చనుచునుండు
జగతి ధన్యుండనఁగ నీవె సత్కవీంద్ర!

(2_9-12.)

27 కావ్యగీతము.

సుకవి మూర్ధన్యభావబోధకములైన
లలితసూక్తుల నక్షరంబులుగఁ జేయు
నిస్తులంబైన వరలేఖనీముఖంబు
సుప్రసన్నప్రభావంబుఁ జూపుఁగాక !

రథ్యములఁదోలి దినరాజు రథముఁద్రిప్ప
మహిజనంబుల వడఁకించు మంచువిప్పి
తరువరంబుల జీర్ణపత్త్రములదూసి
విశ్వమెల్లెడ నాశల వెలయఁజేసి
వత్సరముతోడ శిశిరంబు వదలిపోవ
విరిసరులతోడ నలరుఁ దెమ్మెరలతోడఁ
దలిరుఁగొమ్మలతోడఁ గోకిలలతోడఁ
గమ్మపుప్పొళ్లతోడ భృంగములతోడ
వల్లరులతోడ నిత్యోత్సవములతోడ
మేలిదినములతోడ యామినులతోడ
నల్లనల్లన మధుమాస మరుగుదెంచె ;
నైననేమాయె శాశ్వత మైనదేది ?

కాంచుచుండంగ నిదియును గడచిపోవు;
నిట్టి శిశిరవసంతంబు లేమిలెక్క?
యెన్నికల్పాంతరంబు లెన్నెన్ని యుగము
లెన్ని యేం డ్లెన్ని యయనంబు లెన్ని ఋతువు
లెన్ని నెల లెన్ని పక్షంబు లెన్ని దినము
లెన్ని రే లెన్ని యామంబు లెన్ని గడియ
లెన్ని నిమిషంబు లీరీతి సేఁగినవియొ?
పడిపడిగఁ బోవు కాలప్రవాహమందుఁ
బొడము సుడిగండములలోనఁ బడి మునింగి
పాంచభౌతిక వస్తుప్రపంచ మెన్ని
యెన్ని మార్పుల నందలే దింతదనుక?
ఎట్టయెదుటనో, వెనుకనో యెఱుకపడియొ
యెఱుకపడకుండనో భువి జరగిపోవు
చున్న యీపరిణామంబు లన్నిటికిని
మనము గనఁజాలు నానవాళ్లను లిఖించి
ప్రకృతి చూపుచునేయుండు వికృతలీల;
భౌతికంబైనయట్టి ప్రపంచమునకుఁ
గేవలాదర్శనంబె స్వాభావికంబు
గాని దానికి, మనమంతగా గ్రహింపఁ
గలమొ లేమోయనెడు శంక గలుగఁబోదు;

అరయఁ గావ్యప్రపంచంబునందుఁగూడ
నట్టి కాలాతిపాతంబు లట్టిమార్పు
లట్టిచిహ్నంబులే పొడకట్టుచుండు;
నైనను బ్రదర్శనంబున యందెకాక
బోధనంబునఁగూడఁ బ్రబుద్ధమైన
దగుటఁ గావ్యంబె వరణీయమగునుగాదె?
పరమమైనట్టి కావ్యప్రపంచమందు
దర్శితములైన ప్రకృతిచిత్రంబులెల్లఁ
గాలవాహిని వడిలోనఁ గలసిపోక
యుండు నవ్వటి కెప్పటి కొక్కగతినె;
నగరరాజమయోధ్య యెన్నటిదో? పుణ్య
వనగిరి నదీనదంబు లెప్పటివొ? సేతు
కలనమేనాఁటిదో? మహోజలధిలోని
లంకయెప్పటిదో? నిష్కళంకుఁడైన
మేటి శ్రీరామచంద్రుఁ డేనాఁటివాఁడొ?
పరమసాధ్వీమహీజ యెప్పటిదొ? ఖలుఁడు
పఙ్క్తికంధరుఁ డెప్పటివాఁడొ చూడ
నాస్థలంబులు మున్నటియట్లలేవు;
తెలుపు నాకాలమంతయుఁ దిరిగిపోయె
నాఁటివారొక్కరైన నీనాఁడులేరు

కాని తత్తత్స్వరూపలక్షణములెల్ల
నతుల కావ్యప్రపంచ చిహ్నితములగుటఁ
గావ్యమునఁ బూర్వమెట్లట్లె కాంచఁగలము.
ఉచితదేశంబులను దత్తదుచితరీతి
నుచితసమయంబులను దత్తదుచితలీల
నుచితపాత్రంబులను దత్తదుచితవృత్తి
నుచితభంగిఁ బ్రదర్శించి యుచితవచన
గతుల నుచితానుచిత ధర్మతతులనెల్ల
నెఱపి కావ్యప్రపంచంబు గఱపుచుండు.
ధర్మదేవతా నిర్మలోత్తమపవిత్ర
సుప్రసిద్ధానురూప వచోమధురిమ,
శ్రీరమారమణీమణీ చిరదయార్ద్ర
పావనాలోకనాతి ప్రభావపటిమ,
ప్రియసతీహృదయాంభోజ విలసదతను
భావనిస్తులనిశ్చల ప్రణయమహిమ,
మోక్షలక్ష్మీమనోజ్ఞ సముత్సుకప్ర
భాసమానాభినుత మందహాసగరిమ
మెల్ల నొకచోటఁ బడయంగ నెంతువేని
పడసి నెమ్మదినలరారఁ గడఁగుదేని
నలరి యనుభావములఁ జొక్కఁ దలతువేని

చొక్క పరమార్థము గ్రహింపఁ జూతువేని
నలఘుతర దివ్యవస్తుసంకలితమైన
కలితగుణభావ వర్ణనాలలితమైన
లలితశబ్దార్థమధురసోచ్ఛలితమైన
చలదమేయాభినవరసోల్లలితమైన
సరసకావ్యంబు నొకసారి చదువుకొనుము!
తలుపుచాటున నిలుచుండి తమివెలార్చు
వలపుటిల్లాలి నునుముద్దు పలుకువోలె
మెలపునం జేరి కౌఁగిట నలముకొనిన
కలికిజవరాలి వగగుల్కు పలుకువోలె
నలసి యలయించి తలపించు నలవెఱింగె
కులుకుప్రాయాలి నెఱనీటు పలుకువోలె
నేది నీమానసము నెలయింపఁగలదొ?
యేది నీయాత్మ కానంద మీయఁగలదొ?
యేది తనతోడ నిన్నెనయింపఁగలదొ?
అట్టి సద్వస్తునిస్తులంబైనదాని,
నట్టి నవరసబంధురంబైనదాని
నట్టి పరమార్థసాధనంబైనదాని
నెఱిఁగి సత్కావ్యముగ గ్రహియింపుమయ్య!
మించు సంసారజలధి దాఁటించునావ

మంచిచెడ్డలగతు లేర్పరించుత్రోవ
మానసికరోగములనెల్ల మాన్పుమందు
మహితదీప్తికరంబైన మంచివిందు
సరసకావ్యంబునను నీకు దొరకఁగలదు.
పొదలు పరితాపమున మది చెదరునపుడు
దొరలు దుఃఖంబునను దారి దోఁపనపుడు
వడఁకు నెమ్మనికలసత వొడమునపుడు
జీవితమునందు నిస్పృహఁ జెందునపుడు
మదిఁగుదురఁ జేసి, చల్లనిమాట చెప్పి
కలఁకనెడలించి, ధైర్యంబు గలుగఁ జేసి
తల్లిదండ్రులఁబోలి, పెద్దలనుబోలి
యిష్టసఖుఁబోలి, ప్రాణనాయికనుబోలి
గురుజనముఁబోలి, వలయు నెల్లరనుబోలి
యెల్లవిధముల నీమేలునే ఘటింప
సదుపదేశంబు నీఁజాలునది తలంపఁ
గావ్యమునకంటె వేఱొండు గానరాదు.
అరసిచూడ నిరర్థకమగునయేని
నక్షరనమష్టియే పదమనఁగరాదు;
లోకహితలక్షణయుతంబు గాకయున్నఁ
బద్యగద్యాత్మకంబె కావ్యంబుగాదు;

హృదయభావంబులను వెలయింపకున్నఁ
గలముపట్టినమాత్రనఁ గవులుగారు;
ఉచితగతి రసభావంబు లొప్పకున్నఁ
గవులు వ్రాసినదంతయుఁ గవితగాదు;
వరుసపెట్టి యష్టాదశవర్ణనములఁ
బెంచి వర్ణించి మ్రొక్కు చెల్లించుకొఱకె
ధరణి కాకాశమునకు సూత్రములఁగట్టి
తలతిరుగఁజేయు కల్పనల్ తార్చుకొఱకె
అస్వభావపదంబుల ననుగమించి
కడఁగి తడఁబాటుగాఁ గథ నడపుకొఱకె
తగనిచిక్కులఁబెట్టి బంధంబు లనుచు
నల్లిబిల్లిగఁ బద్యంబు లల్లుకొఱకె
గణయతిప్రాసముల గట్టిగాఁ గుదించి
పద్యములలోనఁ బద్యముల్ పన్నుకొఱకె
ఓష్ఠ్యమస్పర్శకంబు నిరోష్ఠ్యమనుచుఁ
ద్ర్యక్షరద్వ్యక్షరైకాక్షరంబులనుచుఁ
బ్రాసగతులంచు శబ్దచిత్రంబులనుచు
సర్వగురులఘువర్ణప్రసారమనుచు
వ్యర్థవాక్యావళీ విడంబనముకొఱకె
వ్రాయఁబడినవియెల్లఁ గావ్యంబులగునె?

అర్థములతోడ వాక్యంబు లమరుచుండఁ
జిత్తముఁ గరంచుగతి ధ్వనుల్ సెలఁగుచుండ
భావము సెలంగ రస ముట్టిపడుచునుండ
సమయసముచితవర్ణనల్ సాగుచుండఁ
బాత్రరూపంబు లెదుటఁ గన్పట్టుచుండఁ
దత్తదుచితస్వభావముల్ తెల్పుచుండ
సరణి విడకుండఁగాఁ గథ జరుగుచుండఁ
బాఠకుల మానసములలోఁ బడఁగఁ జేసి
నిశ్చయజ్ఞానగరిమ నందింపఁ జేసి
పాత్రపాఠకతతి నైక్యపడఁగఁ జేసి
మోదమో, ఖేదమో, కష్టమో, సుఖంబొ,
ధైర్యమో, దైన్యమో యద్భుతంబొ, భయమొ
కోపమో, యీర్ష్యయో, మోహతాపభరమొ
యనుభవింపంగఁ జేసి యయ్యదనులందు
నెల్లధర్మంబు లక్షరాకృతిగఁ జేసి
హృదయఫలకంబులందుఁ జిత్రింపఁ జాలు
నట్టికావ్యంబె సత్కావ్యమగు నిజంబు.
కలిత గంగాప్రవాహావగాహనమున
గాత్రము పవిత్రమై కాంతిఁ గాంచినట్లు
అనుపమానప్రభావ దివ్యాంజనమున

నేత్రములు నిర్మలంబులై నెగడినట్లు
కమ్రితరశాణయంత్ర సంఘర్షణమున
జీవమణిదీప్తమై విరాజిల్లినట్లు
పటుతరానలసంపుట పాకకలనఁ
గనకముత్తప్తమై వన్నెఁ గన్నయట్లు
సరసకావ్యరసామృతాస్వాదనమున
హృదయసీమ పవిత్రమై సదమల మయి,
దివ్యమై, తీక్ష్ణమై, సముద్దీప్తమగుచు
నిశ్చలానందపదవి నందించుచుండ
నీనరుఁడు కోరఁదగిన దింకేమిగలదు ?
విధివిధానంబు లెప్డు భావింపఁబోము
ప్రకృతిసూత్రంబు గరమునఁ బట్టఁబోము
విశ్వమనియెడు కావ్యంబు విప్పఁబోము
అంతరాళంబులోనున్న దరయఁబోము
కాంచెదము నిన్నె కావ్యమా! కన్నులార
వినియెదము నిన్నె సతతంబు వీనులార
చదివెదము నిన్నె నోరూరఁ జవులుదేర
మననమొనరించెదము నిన్నె మనసుదీరఁ
గడఁగి ధర్మార్థకామమోక్షంబులనెడి
పూరుషార్థచతుష్కంబుఁ బొందఁజేసి

యనితరజ్ఞాన సంపద నందఁజేసి
మమ్ముఁ జరితార్థులను జేయుమా సతంబు !
(10-1-13.)

---

28 ప్రేమ.

ప్రేమమున లోకముదయించెనేమొ ? కాక
ప్రేమమే లోకమునఁ బుట్టెనేమొ ? కాక
ప్రేమ లోకమయంబయ్యెనేమొ ? కాక
లోకమే ప్రేమమయమై వెలుంగునేమొ !
ఏమయిననేమి, కొంచె మూహించిచూడఁ
బ్రేమమయుఁ డీశ్వరుఁడు; సృష్టిప్రేమమయము
ప్రేమమయులెల్ల జీవులు ప్రేమయొకటె
పావనంబైనదని బోధపడుచునుండె.
అంతరంగమునిండి తొలాఁకెడునేది ?
యితరభావంబులను చొరనీని దేది ?
కష్టసుఖముల భేదంబుఁ గనని దేది ?
ప్రతివిధానంబునకు నాసపడని దేది ?

యవిరతానందదాయకమైనదేది ?
యదిగదా యుత్తమోత్తమమైనప్రేమ.
అట్టి ప్రేమంబునకు విష మమృతమగును ;
కాలకాకోదరము పూలమాలయగును;
దారుణారణ్య మభినవోద్యానమగును;
జ్వలనకుండంబు చందనకలశమగును ;
బండఱానేల యరవిరి పానుపగును ;
మండువేసవియెండ రేయెండయగును ;
మృత్యుదేవత పరమాప్త మిత్రమగును;
అట్టి ప్రేమప్రకాశంబు నెట్టయెదుట
నట్టి ప్రేమసుధావృష్టి యెట్టయెదుట
నట్టిప్రేమ ప్రతాపాగ్ని యెట్టయెదుట
నట్టి ప్రేమౌషధరసంబు నెట్టయెదుట
నట్టి ప్రేమమృగేంద్రంబు నెట్టయెదుట
నట్టిప్రేమ గరుత్మంతు నెట్టయెదుటఁ
గలుష కామాంధకారంబు నిలువఁగలదె ?
నిర్గతక్రోధదావాగ్ని నిలువఁగలదె ?
ఖలవిలోభపతంగంబు నిలువఁగలదె ?
నీచమోహావికారంబు నిలువఁగలదె ?
నిష్ఠురమదోన్మదేభంబు నిలువఁగలదె?

నిందర్యమాత్సర్యవిషఫణి నిలువఁగలదె—
భవ్యమగునట్టిప్రేమ ప్రపంచకమున
కమరపట్టణ మొకపల్లెయైనఁ గాదు;
హద్దులేనట్టిప్రేమ రసాలయమున
కంబునిధి యొకశీకరమైనఁగాదు.
వేయుఁగన్నులవెలయు నాప్రేమగతులఁ
గన్నుఁగవతోడ నెవ్వాఁడు గాంచఁగలఁడు?
తూరుపునఁబుట్టి మిన్నెక్కి తొంగిచూచి
యబ్ధిఁబొంగించి కువలయ మలరఁజేసి
కమలజాండకటాక్షంబుఁ గలయఁబ్రాఁకి
చలువలను గ్రుమ్మరించి ప్రశాంతినెసఁగు
పావనప్రేమచంద్రికా పటలమందు
నెంతయమృతంబు గలదొకో యెవరికెఱుక?
యెంత మాధుర్యమున్నదో యెవరికెఱుక?
యెంతలావణ్యమున్నదో యెవరికెఱుక?
యెంతయానందమున్నదో యెవరికెఱుక?

(25-4-13.)

29 నిర్వేదము.

కాలకూటవిషంబును గంఠమందుఁ
దాల్చి శితికంఠుఁ డయ్యె సదాశివుండు
కాళియోరగ విషవహ్నిఁ గ్రాఁగుకతన
నల్లవాఁడయ్యె గోపాలనందనుండు
విషము భూషణమనియెంచి వెఱ్ఱినైతి
విషము కన్నులలోనుంచి వెఱ్ఱినైతి
విషము దిగమ్రింగఁజాలక వెఱ్ఱినైతి
విషము తలఁదాల్చి నిలువున వెఱ్ఱినైతి
ఈవిషంబును భరియింప నేది తెరువు
విషము హరియించుటకు వేఱువిషములేదె?—
విషము విషమునహరియించు వేళదాఁక
విషపువిఱుగుడు దొరకెడు వేళదాఁక
విషపుమంత్రంబు సదివెడు వేళదాఁకఁ
దాఁచుపాములబుట్ట నాతల నిదేల?
ఫణిఫణంబున నొక దివ్యమణినిగాంచి
నెత్తిపై నాశతో దీని నెత్తుకొంటి;
త్రాఁచు బుసకొట్టి విసములఁ గ్రక్కుచుండె
నీవిషాగ్నిని నే భరియింపఁగలనె?

బుట్టలోనుండి తలమీఁదఁ బొడిచె నేదొ
ఉన్నయది పాముగాక యేమున్న దింక—
అవశమగుచుండె నాయొడ లక్కటకట !
బుట్టనెట్టులు భరియింతుఁ బుట్టిమునిఁగెఁ
గానుకగ దీని నేమంత్రగానికిత్తు ?
పాముమంత్రంబు నేర్చిన ప్రౌఢుఁ డెవఁడొ ?
తెలివిలో వానిఁగానక తిరిగితిరిగి
విశ్వమంతయు వెదకుచు వెఱ్ఱినైతి.

(5-5-1913.)

30 కౌతుకము.

ఆకసంబున నెల తోఁచినంతమాత్రఁ
జుక్క హృదయాంతరంబునఁ జొచ్చు టేల ?
మినుకుమినుకుమటంచును మెఱయు టేల ?
మెఱసి లోలోననే యస్తమింపకుండఁ
బొంగిపొరలుచుఁ గన్నులఁ బొడుచు టేల ?
చుక్క పొడిచిన తావెంత చక్కనిదియొ?
నెలకుఁ జుక్కకు నేపాటి నెలవు కలదొ?
కన్నులను విప్పి కన్నవా రున్నవారె ?

(19-5-1913.)

31 రాధ.

ఎచటఁజూచినఁ గనులున్నవేమొ నాకు
నెచటఁజూచినఁ జెవులున్నవేమొ నాకు
నీవె కానంగఁబడుచుంటి వెల్లయెడల
వినఁబడుచునుండె నీపేరె విశ్వమందు
నిన్నుఁ బొడఁగానకుండ నే నున్నవేళ
నగపడిన నాదుకష్టంబు లట్టె యుండె
మేఘమాలికపైఁ దోఁచు మెఱపువోలెఁ
గష్టతతిమీఁద నాకు సుఖంబుదోఁచె
సుఖము కష్టాలమాఱిచి సుఖమెయగునొ ?
కష్టములఁగూడి సుఖమును గష్టమగునొ?—
నీవె లోకంబుగా మదినెంచు నాకు
మతి చెదరిపోవుచుండె నీమాటలేక
హృదయదావానలము భరియింపలేక
కష్టతరమైన కాలంబుఁ గడపలేక
తల్లడిలునన్ను దయఁజూడఁ దలఁపరాదె
కృష్ణపక్షంబునను జంద్రరేఖవోలె
రాధ యిదె యున్నదిచట నీరాధ యిదిగొ—
మంజులంబేమొ చీఁకటిమాఁనిచిగురు ?

నిస్తులమనోహరంబేమొ నెమిలికన్న ?
కుతుకదాయకమగునేమొ కొంచెకోడి!
దివ్యతమమేమొ యమునానదీజలంబు
కానిచో వీనిపైఁ బ్రేమ కలుగుటేల ?
అందమునకును బ్రేమింతువా మహాత్మ ?—
(16-5-1913.)

---

32 ప్రకృతిప్రబంధకర్త.

దేవదేవ ! మహాత్మ ! త్వదీయదివ్య
భావబోధకవిశ్వ ప్రబంధమందు
నెచట శ్రీరామచుట్టెతి ? వెచటఁ జిత్ర
గింపవలెనని వ్రాసి ముగించినావు ?
మొదలు తుది లేని నీగ్రంథమును నతంబు
నెంతచదివిన, నెంత యూహించుకొన్న

నెవ్వరీకావ్యమును రచియింపుమనిరొ
యెవరికీకృతి నొసఁగితొ యెఱుఁగరాదు.
సుమధురమనోజ్ఞ మృదుపదార్థములతోడఁ
బరిస్ఫుటప్రౌఢ రుచిరభావములతోడ
సలలితస్నిగ్ధసౌరభ శైలితోడ
నీప్రబంధంబు సర్వంబు నిండియుండె
నీప్రబంధంబె సర్వమై నెగడుచుండె
నిట్టిసత్కావ్యమును రచియించునూహ
మనమున! యెప్పుడు కలిగినదయ్య నీకు?
ఆకసంబున నోంకార మైనయపుడొ?
విపులగతి రేఁగి వాయువుల్ వీచినపుడొ?
కీలికీలాకలాపుఁడై కెరలినపుడొ?
ఉదకము రసోత్తరంగమై యొదవినపుడొ;
భూతపంచకమై భూమి పుట్టినపుడొ?
మింటఁ జుక్కలు మిలమిల మెఱసినపుడొ?
ధరణి జీవులు కన్నులఁ దెఱచినపుడొ?
యెపుడు మొదలిడితొ తెల్పుమీ మహాత్మ!
సర్వరక్షక మంగళాశాసనముగ
నీవు తొలుదొల్త వ్రాసిన నిరుపమాన
దివ్యగీతంబు నీదయాదృష్టిఁ జేసి

యేసుకృతిముందు గానంబు చేసినాఁడొ
యాతఁడేగద ధన్యాత్ముఁ డైనవాఁడు.
సదయ ! సచరాచరప్రపంచమున జీవ
హృదయభావప్రబోధార్థ మెల్లయెడల
నెన్ని యెన్నిరీతుల బాసలున్నయవియొ
యన్నిబాసల నలరారు నఖిలమునకు
నఖిలమును నిండియున్న నీయాదికావ్య
మర్మగతిఁ బఠనీయమై యలరుచుండె.
అనఘ! నీవచియించినయదియె వేద ;
మరయ నీవాత్రితలకు నెందుఁ దిరుగులేదు;
దివ్యలేఖిని నీకు స్వాధీనమయ్యె ;
గ్రంథకర్తలకును గ్రంథకర్త వీవు.
అమలతరమైన నీప్రబంధమునఁ దక్కఁ
దనుసుఖావహముగఁ జల్లఁదనముఁ గూర్చు
మలయమారుత మెచ్చోట మలయుచుండు ?
నేత్రపర్వంబుగాఁగ వెన్నెలలఁ గాయు
చందురుం డెందు వాహ్యాళి సలుపుచుండు ?
శ్రుతివిమోహనముగ దివ్యరుతులఁ దేల్చు
విహగసంతాన మేయెడ వెలయుచుండు?
జిహ్వకింపగు రుచులచేఁ జెలఁగుచుండు

సరసవాహిను లెచ్చట జరుగుచుండు;
ఘ్రాణతర్పణముగను సుగంధ మొసఁగు
కుసుమవిసరంబు లేకడ నెసఁగుచుండు?
కవులు ని న్ననుసంధించు కాంక్షఁ జేసి
కావ్యములు వ్రాయుచుండు టొక్కటియె గాని
యూహకొలఁది వర్ణించుట యొకటె కాని
ప్రకృతిమర్మంబు గ్రహియించు పాటివారె?
ప్రకృతిమాయల కెందు లోఁబడనివారె?
ప్రకృతి కెల్ల నధీశుఁడౌ ప్రభుని నిన్ను,
బ్రకృతిఁ జేబట్టి గాఁబట్టు ప్రభుని నిన్నుఁ
బ్రకృతిశాసన మొనరించు ప్రభుని నిన్నుఁ
బ్రకృతియందెల్ల నిండిన ప్రభుని నిన్నుఁ
నూహసేయుట కేని వా రోపఁగలరె?
వారు కవిజాతిలోఁ జేరువారె కాని
ని న్ననుసరించి వ్రాయఁగా నేర్తుమనుట
సాహసముగాదె కవిరాజ చక్రవర్తి!
అనుపమంబైన నీదుకావ్యంబు నిట్టు
లెట్టియోజనతో వెలయించినావొ
యెంత యోజించుకొన్న నావంతయైన
హృదయనయనంబులకు గోచరింపకుండె.

నేను దరియించు తెరువను నియతిఁగాని
యాత్మశక్తిని బ్రకటించు నాసఁగాని
లోకములు మెచ్చునవెడి లోలుపతఁగాని
నాకు యశమబ్బునను చింతనమునఁ గాని
యర్థసంగ్రహణాపేక్ష నందిగాని
యీమహాకావ్యమును రచియించినావె?
జగములఁ దరింపఁజేయంగఁ జాలునీకు
నఖిలశక్తులకును మూలమైననీకు
సకలముఁ బ్రకాశనసేయంగఁ జాలు నీకు
లోకమంతట నిండి వెలుంగు నీకు
నందగారాని పరమార్థమైన నీకు
నుల్లమునఁ గోరఁదగిన దేమున్నదయ్య!
మేము నీకృతిఁ జూచుచున్నాముగాని
మేముఁ దన్మయలీల నున్నాముగాని
తెలిసినట్లుండి యేమియుఁ దెలియకుండఁ
దెలియకుండియు నంతయుఁ దెలిసినట్లు
నటనమును జేయుచుంటి మనాథనాథ!
యెవరు నీకృతిమర్మంబు లెఱుఁగఁగలరు
దేవ! యాద్యంతరహితమై దివ్యగతిని
భవ్యమైయొప్పు నీమహాకావ్యమునకు

నీవె వ్యాఖ్యాతవై ప్రోషి నెఱపకున్న
నెవఁడు వ్యాఖ్యానమును రచియింపఁగలఁడు ?
నీమహాకావ్యమహిమం బదేమొకాని
పూర్వసందర్భముల పొంతఁ బోవకున్నఁ
జదువ మొదలిడ్డ నెచటి కచ్చటికెపుట్టి
పొదలి రసభావములు పొంగి పొరలుచుండు ;
నిట్టిమృదుశైలి నీకెట్లు పట్టువడెనొ
దేవ ! యెవ్వరికేని బోధింపరాదె !
తాము వ్రాసిన దొక్కపద్యంబునైన
నొరుఁ డొకండైనఁ బఠియించుచున్న యపుడు
కవుల కెంతయానందమో కలుగునంట!
విశ్వమయ ! విశ్వమందు నీవిపుల కావ్య
మఖిలజీవులు గూడ నిరంతరంబు
నెంతొ సంతోషమునఁ బఠియించుచుండఁ
గాంచు నీకెంత యానందగరిమ కలదొ
కొలఁదివెట్టి వర్ణింపఁగాఁగలమటయ్య !
రమ్యగుణసాంద్ర ! యోకవిరాజచంద్ర !
ఎన్నిజన్మాంతరంబులో యెత్తియెత్తి
యెచటదొరకిన నచ్చటనే గ్రహించి
యిమ్మహాకావ్యమును పఠియించుచుంటి

మారా ! యెప్పటి కప్పుడే యభినవముగ,
నతిమనోహరముగ, సురసాశ్రియముగ,
సత్యముగ, సార్థకమ్ముగ, సమధికముగ,
సర్వజనసమ్మతమ్ముగా, సలలితముగ
ననుభవంబునకుం దోఁచునంతె కాని
విసుఁగొకింతయుఁ గలుగ దీవింతయేమొ !
కొక్కొరోయని తొలికోడి కూసినపుడు
తొలుదెసఁ బ్రభాతకాంతులు దోఁచినపుడు
కులుకుబెల్గునఁ బక్షులు పలికినపుడు
తరులతాదులఁ బూవులు విరిసినపుడు
తరుణభృంగాళి మొఱయుచు నరుగునపుడు
వెడలి ప్రత్యూషపవనంబు వీచినపుడు
పూర్వరాగంబు కుంకుమఁ బూసినపుడు
చివురులాకాంతి నైక్యంబుఁ జెందినపుడు
కూసి కోకిల కన్నెఱ్ఱచేసినపుడు
పొడుపుఁగొండపై నెఱపొద్దు పొడిచినపుడు
తరణికిరణంబు లవనికిఁ దిరిగినపుడు
మెచ్చి తామరమొగ్గలు విచ్చినపుడు
బాలభానుండు మింటిపైఁ బ్రాకునపుడు
జరగినకొలంది నీడలు దరియునపుడు

తలకు సూటిగ దినమణి నిలిచినపుడు
తరలి పడమటిదెసఁ బ్రొద్దుతిరిగినపుడు
నానవిడి ఛాయ పెడమొగమైనయపుడు
నపరగిరి ధాతురాగంబు లలమినపుడు
నపరవారిధి మిలమిలలాడునపుడు
కనకకాంతుల నీరెండఁ గాయునపుడు
నిట్టి పవలంతయును దుదముట్టినపుడు
మిన్ను తనభాగ్యమణి దాఁచుకొన్నయపుడు
వెలుఁగుఁ జీఁకటియును గాక వెలయునపుడు
నఖిలజగతిఁ దమోలత లలమినపుడు
పొలుపుగా మింటఁ బూవులు పూచినప్పు
డాశలన్నియు నేకంబులైనయపుడు
మిణుగురుంబుర్వు లెగయుచు మెఱసినపుడు
నించుమించుగ నెల యుదయించునపుడు
వెలఁదివెన్నెలకుప్పలు విరిసినపుడు
నలుదెసలు చూచి కలకల నవ్వినపుడు
కలువపూవులనెత్తావు లొలసినపుడు
దేవ! యొక్కఁడవ్వాడా? దినదినమునందు
గాఢనిద్రను బొందిన గడియయేమొ
కాని నిక్కంబుగాఁ గలలోనఁగూడ

నవరసాశ్రయమగు నీయనంతకావ్య
గతులు సూచుచు నానందగరిమఁ గాంచి
చకువుకొనుచుందు మొకవింతచవులు దేవ.
చదివినకొలంది మాకు నోసదయహృదయ
దినము నీమీఁది భక్తి వర్ధిల్లుచుండు.
ప్రబలగౌరవమో యనిర్వాచ్యమైన
ప్రేమయో మాహృదయవీథిఁ బెరుఁగుచుండు
నేమహాకావ్యమును బఠియించునప్పు
డామహాకావ్యకర్తపై ననుపమాన
భక్తిగౌరవప్రేమముల్ ప్రబలుచుండు ;
వదిగదా యుత్తమోత్తమమైనసుకృతి!
అట్టిమహిమంబు నీకావ్యమునందె కలదు,
అట్టి రచనాప్రశస్తి నీయందె కలదు,
కానఁ ద్రికరణశుద్ధిగా గౌరవించి
దేవ! నీమీఁదిప్రేమ వర్ధిల్లుకొఱకుఁ
బ్రవిమలజ్ఞానసంపత్తిఁ బడయుకొఱకు
నవ్యయానంద పరిపూర్తి నందుకొఱకు
నెపుడు నీకావ్యమే పఠియింతుమయ్య !
పఠని మిటుసేయఁ జేయ నెప్పటికి మేము
దీని ముగియింపఁగలమయ్య ! దేవదేవ !

ఇమ్మహాకావ్యజలధిలో నెంతకాల
మీఁది యవ్వలియొడ్డున కేఁగఁగలము ?
ఈవలావలియొడ్డులం దెచటికేనిఁ
గష్టపడి యెట్టులో చేరఁగలమయేనిఁ
దీరమునఁ గూరుచుండి నీదివ్యకావ్య
మహిమ యెంతటిదో యొక్కమాటలోనె
యింతలో నంతయును గ్రహియింపఁగలము.
కాని తొలిగాథ తెలియంగరాని మాకు
నవల నేమున్నదో చూచునంతకంటె
నాది గాంచుటకే యాస యధికమయ్యె.
సర్వభూతదయాపర సాధుహృదయ !
మాయభిమతంబుఁ దీర్పవే మాననీయ!
తావకీన మహాప్రబంధంబునందు
నాది సింహాసనంబుపై నధిగమించి
సర్వశక్తిస్వరూప ప్రసన్నమగుచు
ననుపమానాతిలోక రహస్య మగుచు
మూలకారణతత్త్వ ప్రబోధ మగుచు
నిర్మలానందవిజ్ఞాన నిలయ మగుచు
దాదులకు నాదియైన నీయాదిగీత
మెప్పు డుపదేశ మొనరింప నెంచినావు ?

ఎప్పుడు గానంబుసేయింప నెంచినావు?
ఎప్పుడు మాకభిముఖముగా నెంచినావు?
ఎప్పుడు పిలిచిన నోయన నెంచినావు?
అప్పుడు నీవేమి బోధింతువయ్య మాకు?
అప్పుడు కోరుట కేముండునయ్య మాకు?
అప్పుడు నీవలె రచియింప నగునుగాదె!
అప్పుడు నీవంటియానంద మగునుగాదె!
సచ్చిదానందమూర్తి! విశాలకీర్తి!

(8-11-13.)

33 సంవత్సరాది.

సకలసచరాచర ప్రపంచకము నరయ
నిరత మభినవముగఁ గానఁబఱచుచుండు
ప్రకృతికో పరమాత్మకో పలుకరాని
సర్వశక్తికి మా నమస్కారశతము.

మ. కలమా! నీవిపు డేమివ్రాయుటకు సం
కల్పించితో? నేఁటి నీ
కులుకుం జెయ్వులు మైచకచ్చకలు మా
కుఁ జింతగాఁదోఁచె; ను
జ్జ్వలభావస్ఫురణంబునం దభినవ
ప్రాగల్భ్యముం జూపు నీ
జిలుగుం బంగరువ్రాలమోఘవిజయ
శ్రీకంబులౌఁ గావుతన్!
అస్మదీయ మనోభావనానురూప
కామగామినీ! యో లేఖనీమతల్లి!
చల్లచల్లగ నటునిటు జరగెదేల?
తెల్లముగ మాకు నీజాడ తెలిపిపొమ్మె.

నాయికానాయకుల నటనంబు లెల్ల
నెలమిఁ జిత్రింపఁగా మది నెంచలేదు;
వికృతసందర్శనాలాప విభ్రమముల
నలరు పురుషులఁ జూపింపఁ దలఁపలేదు;
జీవితంబంతయును దేశసేవఁ గడపు
పుణ్యులచరిత్రమును వ్రాయఁ బూనలేదు;
బవరమున జయలక్ష్మినో స్వర్గరమనో
చూఱఁగొను వీరుల లిఖింపఁ జూడలేదు;
ప్రథిత దేశభాషోపద్రవంబుఁ గూర్చు
తెంపరుల విమర్శింప నూహింపలేదు;
ఘనదురాచారపంక సంకలితులైన
కుమతులఁ దిరస్కరింప నూల్కొనఁగలేదు,
అవని కపకారకారణు లైనయట్టి
దుర్మదాంధుల దూషింపఁ దొడరలేదు;
ప్రకృతితత్త్వాద్భుతగుణానుభవము గలుగు
ధీమతుల చిత్రగతులఁ జింతింపలేదు;
విపులవైరాగ్య నిష్ఠాపరివిష్టులైన
మౌనులమహాత్మ్య మెఱిగించు మమతలేదు;
కాని, నవరసంబులకు నిధానులైన
యందఱకు నాట్యరంగమై యొసఁగుచున్న

యిందఱకు నాశలను వెలయించుచున్న
యిందఱకు నూతనోత్సాహ మిచ్చుచున్న
యిందఱకు నొక్కరూపుగా నెదుట నున్న
యట్టి నూతనసంవత్సరాదిఁ గూర్చి
లేఖినీ! వ్రాయఁదలఁచుకోలేదె? చెప్పుమ!

* * * *

క. వ్రాయుము నిర్మలభావవి
ధేయమ్ముగ బుధజనాతిథేయముగ జగ
ద్గేయమ్ముగ లలితసుధా
ప్రాయమ్ముగఁ బాఠకశ్రవణపేయముగన్.
ప్రమదమందానిలాంకూర పటలితోడ
లలితకుసుమపరిమళలహరితోడఁ
గలితనవమంజరీలతా గణముతోడ
నమితఫలపుష్ప ఘనతరు సమితితోడఁ
దనరు నుపవనముల, మహావనములందు,
నలరు పొదరింటి చల్లని నెలవులందు,
జలజ విలసిత కాసారతలములందు,
బలియు చక్కని పచ్చికబయళులందు
బొసఁగెడు మనోజ్ఞభావంబు నెంచుకొనుచు
ఘనితరానందలీలల నాడుకొనుచు

భ్రమరఝుంకారములతోడఁ బాడుకొనుచుఁ
బ్రకృతిచిత్రంబులను గానఁబఱచుకొనుచు
వనరమంగూడి క్రీడింప వచ్చినట్టి
తరుణసుందరమూర్తి మాధవునిఁ గూడి
వచ్చినది నేఁడు నూతన వత్సరంబు.

* * * *

అస్మదీయసుఖస్థితు లందుఁగాని
యలఘుతర కష్టకాలంబులందుఁ గాని
యరనిముసమైన మము విడనాడకుండ
నీడపోలిక నెపుడు మాతోడఁ దిరిగి
కాలవశమున నేఁడు మాకను మొఱంగి
పూర్వవత్సర మెచటికో పోయె ననుచు,
దానితోఁగూడఁ దలచూపి ద్రఢిమఁగాంచి
పొదలు నాశాలతలు తెగిపోయె ననుచు
డెందములఁ గుందువడి దిగులొందనేల?
దానిపోలికనే పూని దానివెనుక
దాని సర్వస్వమునకు స్వత్వంబుఁగాంచి
దానియధికారమున నిల్చి దానిగతిని
కలసి మిమ్ములఁ దనవారిఁగా గ్రహించి
భావుకాన్యోన్యబంధుసంబంధభావ

బోధకంబుగఁ దానె మిమ్ములను జేర
వచ్చినదిగాదె నూతన వత్సరంబు !
కాని, యొకచింత యున్నది ! దాని నిదియు
దీని నదియును జూడఁగా లేనిగతికిఁ
దలఁచి తలఁచి విచారింపవలసినదియె.
కడచిపోయిన వత్సరగర్భమందుఁ
గలసిపోయిన సంస్థితిగతులయందు
జరగిపోయిన కార్యసంచయమునందు
మనసుపోయినచోఁ బోవఁజనును గాక,
మనకు నాస్థితి మరల రాదనుట నిజము;
మనము నచటికిఁ బోఁజాలమనుట నిజము.
ఏరు గతమున కొక యుపకారమైనఁ
జేయునదిలేదు ; కాన నాచింత మాని
హృదయముల నాశలను వెలయించుచున్న
యట్టి యీవర్తమానంబు ననుసరించి
యొదవనై యున్న భావిఫలోదయమున
కెదురుసూచుచు ముందుఁ బోవుదముగాక !
అనయ మెలమావి లేఁజిగురాకె మెసవఁ
దలఁపుఁగాంచుట కోకిల తప్పుగాదు ;
ఎప్పుడు వికసించియే యుండ నిచ్ఛగించి

సంభ్రమించుట తప్పుదోసమ్ము గాదు ;
ప్రకృతిసంబంధులగు జీవులకు సతంబు
భావ మాశార్ద్రమగుట స్వాభావికంబు.
అవనతోన్నతగతుల కాశాభరతులె
కారణములని, పరిణామకాలమందుఁ
గష్టసుఖదాయకము లని కాంచి, వాని
నెవఁడు మొదలంటఁ దెగఁగోయ నెంచఁగలఁడు?
జీవులప్రచారములకు, నాశావకాశ
విస్మృతికి, వర్తమానభవిష్యములకు
ననిశసంబంధబాంధవ్య మమరుఁ; గాన
సాగిపోయిన పూర్వవత్సరముకంటె
నరుగుదెంచిన యీనూతనాబ్దమందె
యెల్లవారలకును బ్రేమ హెచ్చుఁగాదె!

* * * *

"క్రొత్త యొకవింత యని యెంచుకొనుటె కాని
జగతికిం గ్రొత్తయున్నదే ? సాధులార!
పరిగ దినములలోన మాసములలోన
నమరు ఋతువులలో నయనములలోనఁ
గాలములలోన నొక్కటే గతినిగాంచి
తలఁగి చన్న ప్రమాదివత్సరముకంటె

నేఁగుదెంచిన యానంద మెంతగొప్ప?
జరిగిపోయినయట్టి వత్సరమునకును
వచ్చి జరుగుచున్న యీవర్షమునకు
నెంచి చూడంగ వ్యత్యాస మేమికలదు?
కాలగతికిని భేదంబు కలదె?''—యనుచుఁ
జెప్పుచుందురు కొంద ఱచ్చెరువుగాఁగ
విశ్వసింపంగఁ జెల్లునే వీరిమాట?
కాలపరిణామముల కానవాలు నైచి
ప్రకృతి కన్నారఁగాఁ గనంబఱచుచుండఁ
దెలిసి యెవ్వారు కాదని పలుకఁగలరు?
అస్మదీయోక్తు లనృతంబు లందురేనిఁ
బ్రక్కమీఁదనె యటునిటు పడుటమాని
లలితగతిఁ బ్రాఁకుచుండు బాలకునిఁ జూచి
తప్పటడుగులఁ దిరుగాడు దారిమాని
పరువులెత్తుచునుండు డింభకునిఁ జూచి
జననిచెంగటనే యాడుకొనుట మాని
సకులతోఁగూడి యాడు కొండికనుజూచి
మంటిలో వ్రాసికొను నోనమాలు మాని
బాలబోధను చదువు శాబకునిఁ జూచి
చదువుసాములు నేర్చుకోఁ జనుట మాని

వలపుజవరాలిఁ జేరు జవ్వనునిఁజూచి
భవనమున భార్యతో నొంటిపాటు మాని
తనయులం గాంచు బిడ్డల తండ్రిఁజూచి
యంతయును నాదియని దొర్లు నాసమాని
ముక్తికై చూచు ముక్కాలి ముసలిఁజూచి
ముఖ్యముగ వారిదరి కేఁగి ముచ్చటించి
కాలగతికిని భేదంబు కలదొ, లేదొ
తిరిగిపోవక వలసినఁ దెలిసికొనుఁడు!

* * * *

నిన్న నేఁడును నొకరీతిఁ జన్ననైన
జీవులకుఁ గ్రొత్తయే చేసి పోవుచుండు.
రాజ్యములఁగ్రొత్త, సమయధర్మములఁ గ్రొత్త,
పాత్రములఁ గ్రొత్త, నెఱసడవడులఁ గ్రొత్త,
గుణములం గ్రొత్త, పలుపలుకులను గ్రొత్త,
వేసములఁ గ్రొత్త, యాచారవిధులఁ గ్రొత్త,
చదువులం గ్రొత్త, కవితారసములఁ గ్రొత్త,
దినదినంబును గ్రొత్తయై తనరుచుండు.
నూత్నజీవధర్మాసక్తి, నూత్నశక్తి,
నూత్నవైభవసంపత్తి, నూత్నవృత్తి,
నూత్నమార్గానుగతబుద్ధి, నూత్నసిద్ధి

నూత్నభావోదయమునసే నూలుకొనును;
గాన ప్రకృతియో పరముఁడో కరుణఁజేసి
జీవులకు నూత్నమతి దయచేసియుంట
నిట్టిసంవత్సరాదు లెన్నేని జనిన
మనకు నీవత్సరాది నూతనమె యయ్యె.
నెల్లవారల హృదయముల్ పల్లవించె;
మరల నాశాలతలు పూచి పరిమళించె;
జనులకెలను నూతనోత్సాహ మొదవె;
నవ్యభావోదయం బయ్యె నరులలోన.
జనుల జీవమానమున వత్సరమొకండె
యరయ సర్వప్రధానమై వఱలుఁ; గాన
జీవితంబున నొకయేఁడు చెల్లిపోయె
ననుచుఁ బెద్దలు తమధర్మ మాచరింప,
వయసు వెలయింప నొకయేఁడు వచ్చెననుచు
నలరి బాలురు పెద్దల ననుకరింప,
నేఁడు గడచిన ఫల మింత యెఱుఁగలేమి
జడమతులు పండుగలె చేసి సంతసింప,
నందఱకు నన్నిరూపులై యవతరించి
యుత్సవముఁ గూర్చుచుండె సంవత్సరాది.
ఉదయభానుని కోమల మృదుకరముల

దరవికసితాబ్జినీనవపరిమళములఁ
జారు శీతలమంద సమీరణములఁ
గలవిహంగకలాలాప కలకలముల
నిట్టలంబుగ నాశలు నిండియుండె.
నేక్షణంబున గతవర్ష మిక్కెచనియె
నేక్షణంబున నవవర్ష మేఁగుదెంచె
నాక్షణం బెవ్వ డేరీతి నరిగినదియొ
యెట్లు మాఱిచి మాఱెనో యెవ్వఁడెఱుఁగు?
జననమరణంబులకు నట్టిక్షణమె కలదు;
జాగరస్వప్నముల కట్టి క్షణమె కలదు;
ఆక్షణం బెట్లుగా మాయమైన నేమి?
గతవినూత్నవర్షములకుఁ, గాలగతికిఁ
దిరుగులేకుంటఁ జూపులు దొరకకున్నఁ
బ్రజల కిప్పుడు కలిగిన బాధయేమి?
ప్రభుననంతరమునఁ గుమారప్రభుండు
పైతృకపదం బధిష్ఠింప వచ్చినపుడు
లోకమునకును గలిగిన లోపమేమి?
కాని, గతమునకంటె నాగతముఁ గూర్చి
సంశయంబులు పుట్టుట సహజ మరయ.
" పూర్వవత్సర మేరీతిఁ బోయినదియొ

మరల రాకుంట దానికి మాఱ్పు లేదు;
మనల లోఁగొని, మనతోడ ననుగమించు
చున్న యీయేఁటిగతి యెట్టులుండు?" నను చు
మనుజులకు సంశయముతోఁచు మాట నిజము.
ప్రజలజీవితము లను కావ్యములందు
వఱలు సర్గలవంటి వీవత్సరములు ;
జరగిపోయిన వత్సర సమితి నెల్లఁ
జదివివైచిన సర్గల జాడ విడిచి
వానిలోఁ గన్న సుఖదుఃఖభావములను
నెడఁదలోఁ బెట్టుకొని యాత్ర పడెద రేల ?
వచ్చు సర్గను నేకతపట్టు గలదొ
చల్లఁగాఁ బత్త్రిముల విప్పి చదువుకొనుఁడు !

(10-2-1914.)

34 సంశయము.

ఎవని గతిభేదమునఁ జేసి యీజగంబు
వివిధపరిణామములతోడ వెలయుచుండు
నట్టికాలాత్మకునకు నిరంతరునకు
ననితరాధీనగతికి వందనశతంబు.

నిత్యమై యద్వయంబయి నెగడుదాని
నాకృతి గుణాహ్వయాభావ మైనదాని
నాదిమధ్యాంతరహితమై యలరుదాని
నఖిలకర్మంబులకు సాక్షి యైనదాని
నఖిలశక్తులకును మూల మైనదాని
నఖిలపరిణామకారణ మైనదాని
నఖిలమును జూచి చూడనియట్టిదాని
నఖిలమును జేసి చేయనియట్టిదాని
నఖిలమును నంటి యంటనియట్టిదాని
నఖిలమగుదాని నవ్యయ మైనదాని
విమలవిజ్ఞానధనులైన విబుధులెల్ల
నైకకంఠ్యంబుగాఁ బరమాత్మ యనిరి ;—

కాని యామూర్తి నేనెట్లుఁ గాంచనగుదొ
తెలిసి చూపఁగలేక యదృశ్యమైరి ;
పలికి బోధింపలే కనిర్వాచ్యు లైరి ;
అతితరానుభవంబున నానుభూత్మ
లేఁదె పరమాత్మయని నిశ్చయించినారొ
యావిశేషంబు లెల్ల నీయందుఁ గూడ
నగపడుచునుండె నిదియేమి యద్భుతంబొ?
కాలమా! శాశ్వతత్వంబు గలదె నీకు?—
దైవమునకును నీకు భేదంబు గలదొ,
నీవె దైవంబొ తెలియంగ నేరకుంటి
నుగము గుర్తించుచునుండె నే మున్నదింక ?
నాత్మనిర్వృతి కెవ్వారి నాశ్రయింతు ?
నెవరి నడుగుదు సంశయం బెట్లు తీఱుఁ
గాలమా! యించు కాఁగుము కరుణతోడ
నాదుసంశయమును దీర్చి పోదుగాని—
అధికలోకానుభవయుక్తు లైనవారు
అనుభవంబున విజ్ఞాను లైనవారు
తెలిసికొన్నంత యడిగినఁ దెలుపువారు
ప్రకృతిలో ముందు నీకంటెఁ బడినవారు
పేరుగలవారు, నాకంటెఁ బెద్దవారు

పుడమి విడనాడి యెచటికో పోయినారు ;
ఉన్నవారెల్ల నాకంటెఁ జిన్నవారె
యెవరి నడుగుదు ? సంశయం బెట్లుతీఱుఁ ?
గాలమా ! యించుకాఁగుము కరుణతోడ
నాదుసంశయమును దీర్చి పోదుగాని;—
తల నరసియుండె ; మేనిరక్తము హరించె ;
చూపులు నశించెఁ ; బలుగమి శూన్యమయ్యె;
నడుము లేవదు ; కాళ్లకు నడకలేదు
శల్యములు సంధులను బాయు సమయమయ్యె.
నేను నీతోడఁ బరువెత్తలేను గాన
నేను గన్నార నినుఁ గానలేనుగాన
నాదువిన్నప మొక్కటున్నయది గానఁ
గరుణ నీదీనమానవు మొఱ వినంగఁ
గాలమా ! నీవొకించుక కాలమాఁగు !
నాదుసంశయమును దీర్చి పోదుగాని;—
తల్లియొడిలోనఁ జేరి తాతాయటంచుఁ
గాలు సేయి గదల్చుచుఁ బాలు ద్రావి
చిన్ని చిఱునవ్వు వెన్నెలల్ చిందువాఱఁ
గన్నులరమోడ్చి నిద్దురఁ గనుచు కాని
నీవు తారుట యే చూడనేరనైతి

నాఁటి యవ్యక్తజోలికాంతరమునుండి
నేఁటివఱకును మేలుకోనేరనైతి
నిపుడు నీపొందు గాక నా కేమికలదు?
కాలమా! యించుకాఁగుము కరుణతోడ
నాదుసంశయమును దీర్చి పోదుగాని;
వనవిహారంబులను జేయు వాంఛతోడఁ
గుసుమసౌరభములఁ గాంచు కులుకుతోడ
మలయమారుతముల మెచ్చు మమతతోడఁ
గోకిలాలాపముల విను కోర్కితోడఁ
దమిఁ బ్రియాన్వేషణము చేయు తలఁపుతోనె
తెలిసితెలియనిరీతిని దిరిగితిరిగి
నావనంతంబు కడచనిపోవుచుండఁ
జోద్యముగ నంతయును జూచి చూడనైతిఁ
గాలమా! యించుకాఁగుము కరుణతోడ
నాదుసంశయమును దీర్చి పోదుగాని;—
మోహమృగతృష్ణ యొకవంక ముసరుచుండ,
విరహపరితాప మొకవంకఁ గెరలుచుండ,
వేఁడినిట్టూర్పు లొకవంక వెడలుచుండ,
నుష్ణసంకల్పరుచి రారుణోదయములు,
నప్రసన్ననిదాఘసాయంతనములు,

జాగరీకృత యామినీసముదయములు
జరగె నెన్నియొ నాగ్రీష్మసమయమందుఁ,
గాని నాకిప్డు జీవనోపాయ కలుగ లేదు
కాలమా! యించుకాఁగుము కరుణతోడ
నాదుసంశయమును దీర్చి పోదు గాని ;—
శైశవశ్యామ సుందరాంగంబుతోడఁ
జారువిన్యాసవిలాసహాసంబుతోడ
మెలిచూపుల నగ్నాంగి లీల వచ్చి
సమనైకానంద బాష్ప వర్షంబు గురిసి
చల్లగా మేను ముఱపించి సాఁగిపోయె
నతిచమత్కృతి నాదు వర్షావసరము
పోవువేళను దుఃఖాశ్రుపూరమయ్యె
నింక నితరంబు నామది కెట్లుతోఁచు?
తోఁచి యిప్పుడు ప్రశ్నింపఁ జూచుచుంటిఁ
గాలమా! యించుకాఁగుము కరుణతోడ
నాదుసంశయమును దీర్చి పోదుగాని ;—
జీవనకళంకమంతయుఁ బోవఁజేసి
మానసాకాశవీథి నిర్మలముచేసి
కలుషపంకంబు నెల్ల నింకంగఁజేసి
హృదయకమలంబు నలరించి పొదలఁజేసి

నాశరద్వాసరంబులు నడచునాఁడు
వివృతవేణిక యగు నదీవిలసనంబు
వెలువడుచునున్న యిసుకతిన్నెలతెఱఁగు
కలసి యాడెదు రాయంచకవ జెడంగు
తనివిదీఱక నిరతంబుఁ గనుటకొఱకె
మఱగి నీమాటఁ దలపోయ నెఱుఁగనైతిఁ
గాలమా! యించుకాఁగుము కరుణతోడ
నాదుసంశయమును దీర్చి పోదుగాని;—
నలుగడల మంచుకావిరు లొలయువేళ
హంససంస్ఫూర్తి యత్యల్పమైనవేళ
దడదడంగూర్చి కంపంబు దొడరువేళ
ననలసాన్నిధ్యమును గోరునట్టివేళఁ
దమివిశేషించి యసుఖంబుఁ దాల్చువేళ
మదిఁ గలంగించు నాదు హేమంతవేళ
ముడుచుకొని కన్నులను మూసి గడపినాడఁ
గాని యావేళ నాముందు గతిని గూర్చి
క్షణము నేపైన నూహింపఁ జాలనైతి
నుగము గ్రుంకుచుండె; నేమున్న దింకఁ?
గాలమా! యించుకాఁగుము కరుణతోడ
నాదు సంశయమును దీర్చి పోదుగాని;—

నా మనోరథగతికి భిన్నత ఘటిల్ల
శైశిరమువచ్చెఁ, బ్రకృతియసారమయ్యె;
జీవితలతాలవాలంబు జీర్ణమయ్యెఁ;
బాటవము తగ్గె నాకులపాటు దోఁచెఁ;
నాశ కింకను చిగిరించు నాశ కలిగెఁ;—
బతనశీలంబు లగు జీర్ణపత్త్రివితతు
లెల్లఁ దలపోయ మున్ను చిగుళ్లె కావె?
ముందు దలసూపఁబోవు నామోపు లెల్లఁ
బండుటాకులు గాకుండ నుండఁగలవె?
బెండువడి రాలిపడకుండ నుండఁగలవె?
ఇట్టి చర్వితచర్వణ మెందుకొఱకు?
ఇంతమాత్రాన కాసించు టెందుకొఱకు?
అట్టె తలసూపుచుండెను నాచిగుళ్లు
పండిరాలెడు నీజీర్ణపత్త్రములును
నెచటివో యెట కేఁగునో యెఱుఁగరాదు
కాన నామార్గమంతయుఁ గట్టిపెట్టి
పుట్టుటయుఁ గిట్టుటయు లేని పట్టుకొఱకు
సుఖము దుఃఖము నెఱుఁగని చోటుకొఱకు
బంధమును మోక్షమును లేని పదముకొఱకు
వెదకుకొనుచుంటి; దానికై వెడలనుంటి

నుగము గ్రుంగుచునుండె; నేమున్నదింక!
నాత్మనిర్వృతి కెవ్వారి నాశ్రయింతు?
నెవరి నడుగుదు; సంశయం బెట్లుతీఱు?
గాలమా! యించుకాఁగుము కరుణతోడ
నాదుసంశయమును దీర్చి పోదుగాని.

(15-6-1914.)

35 ఆనందమందిరము.

సీ. పులకించెఁ జూచితే పుష్పచ్ఛలంబున
శోభాయమానమై చూతలతిక
హసియించెఁ జూచితే కుసుమకైతవమున
జగ్గునిగ్గైన గొజ్జంగిమోక
కొనసాగెఁ జూచితే నన లెత్తుమిషమునఁ
జలువపందిరిమీఁది లలితవల్లి
తలయూచెఁ జూచితే వలిగాలినెపమున
పరువంబుఁ జిల్కుసంపంగిగున్న

చంద్రి! త్వత్పాలితంబైన చంద్రికాల
యభిద నానందమందిరం బగుటకతన
నేతదంగణోద్యాన లతాతరులకు
సంతతానందమగు లేఁకు సందియంబు!

సీ. జలయంత్రగళిత నిర్ఝరవేణికలపైని
కలకలధ్వని విను కాంక్షఁ జేసి
చెసల గమ్మనిపించు కుసుమసౌరభములఁ
నాఘ్రాణమొనరించు నాసఁ జేసి
అమృతంబు మఱపించు నమలఫలంబుల
మాధుర్యమును గాంచు మమతఁ జేసి
ఆలోక రమణీయమైన నీయుద్యాన
వనము నాలోకించు వాంఛఁ జేసి
దేవతాగణములతోడ దివ్యపురుషు
లతితరానందహృదయులై యరుగుదెంచి
చంద్రి! నీపరిమదావనసద్మమునను
చిత్రములుపోలె నిలిచి రచ్చెరువుగాఁగ!

సీ. సురభిళ కుసుమ సంశోభితంబగుదాని
నాఘ్రాణతర్పణం బైనదాని
పల్లవగౌరవాస్పద వైభవముదాని
నానందదాయక మైనదాని

కోమలతరులతా శ్యామలంబగుదాని
నాలోకరమణీయ మైనదాని
పరిణతమాధురీ ఫలపూర్ణమగుదాని
నాకల్పితాభీష్ట మైనదాని
చలువగలదానిఁ జెలువంబు లొలుకుదాని
మలయవాయుచ్ఛలంబునఁ గులుకుదాని
తావకానంద మందిరోద్యానపాళిఁ
గాంచి యెంతని వర్ణింపఁగలము చంద్ర !

(20-1-1915.)

36 సంకల్పసోపానములు.

అడుగు వెట్టక పరువెత్తు నట్టిశక్తి
పక్షవిక్షేపమే కానఁబడకయుండ
నంతరాళాన నెగిరెడు నట్టిశక్తి
రూపమెఱుఁగక యెన్నియో రూపములను
నఖిలజగముల విహరించు నట్టిశక్తి
కానఁగారాని కాలంబుఁ గాంచుశక్తి
అఖిలశక్తులఁ జేపట్టు నట్టిశక్తి
చూడఁగారాని తావును జూచుశక్తి
పడసియుండియు మాయలోఁబడి మునింగి
లీల సంకల్పసోపాన పాళియందు
గంతులిడుచును విహరించు కర్మమేమొ
మనస! మఱవక నాకొక్కమాఱు చెపుమ!
చిటికలోన సౌధాంతరసీమలందు
మెత్తనగు పట్టుపఱపులమీఁదఁ జేరి
యెలమి నొకచెలి వీడియ మిచ్చుచుండ,
నొకవిలాసిని చిఱునవ్వు లొలుకుచూపు
లలర వింతగ ముచ్చటలాడుచుండ,
నొక్కభామిని కోపించి యోరచూపు

తూపులను గుప్పించుచుండంగ, గోపువిరాలి
సేవకప్రజ లెందఱో చేరికొలువఁ
దిరుగుచుంటివి నిన్ను నీవెఱుఁగకుండ;
ఉత్తరక్షణమందె నీవొక యగాధ
జలధిలోఁబడి జలచరసముదయంబు
పట్టి బాధించుచుండంగఁ బ్రాఁకికొనుచుఁ
దిరిగి యెటువోవుటకు దారి తెన్ను లేక
తీర మెందున్నదో కాంచు తెలివిలేక
జలధిలో నీఁదులాడెడు శక్తి లేక
మీఁద నేమున్నదో చూచు మెలపులేక
మునకలిడుచును గ్రిందికిఁ బోవుచుంటి
వెందు సుఖమున్నదో, దుఃఖ మెందుఁగలదొ,
మనస! మఱవక నాకొక్కమాటు చెప్పుము!
అరయఁ బరిణామమున దుఃఖమగున దేదొ?
సుఖమగున దేదొ? సుఖదుఃఖమాత్రమగుచు
భ్రిప్పలను బెట్టునది యేదొ? చెప్పఁగదవె!
మింటి మబ్బుచాయలనుండి మెఱపుఁదీవ
సోయగముమీఱ నిటు తొంగిచూచువేళ
వాయుసంరంభమున మహావార్ధిపొంగి
రంగదుత్తుంగభంగానుషంగమయ్యె;

నుదరి ఘనతరులొందల లూఁపనయ్యెఁ;
గొమ్మ లదిగాంచలేక సంకోచమొడలి
యొడలు తెలియని కంపంబు నొందసయ్యె;
కటకటా! యిట్టివింతల గాలివాన
రేఁగి యుప్పొంగుచుండ నూరేఁగుతలఁపు,
నఖిలలోకంబులను ముంచునట్టి వరదఁ
గానఁబడని సంకల్పసోపానములను
జరణముల నానకుండంగఁ దిరుగు తెగువ
యేమిటజనించెనో, యది యెందుకొఱకొ?
పరువులెత్తుట మాని లోఁ గరుణనూని
మనస! నవ్వక నాకొక్కమాఱు చెపుమ!
రమ్యతరమార్గములను నిరంతరంబు
నీసుఖావాప్తి కేవేళ నేఁ జరింతుఁ
బ్రికృతిలోఁ గానఁబడుచున్న వస్తువులను
నీవు సంతోషపడుటకై నేను గాంతు
ఫలరసాదిక సదమల భక్ష్యములను
నీవు సంతృప్తిఁగనుటకై నేభుజింతు
ఘనముదావహమోహన గానరవము
నీవు హాయినిజెందంగ నేను విందు
నెప్పు డెయ్యెది చేయ నీకిష్టముగునొ

యప్పు డాపనిచేసెడు నట్టి నన్ను,
నిన్ను వీడినఁ గొయ్యూరాచున్న నన్ను
నిన్నుఁ బ్రాణంబుగాఁ జూచుచున్న నన్ను,
మొఱఁగి యెచటికిఁ బరువునఁ బోవుచుంటి?
వాకసంబున నిలువకే యరుగుచుంటి?
పుడమిఁ గాలూనకే పాఱిపోవుచుంటి?
దశదిశలయందు మెల్లగాఁ దాచుచుంటి
వంతరాళంబులోఁ జేరి యాడుచుంటి
వేపదార్థంబుకొఱకు నీవింతగాఁగ
వెదకులాడుచునుంటివి విశ్వమందుఁ?
బరువులెత్తుట మాని లోఁ గడుణాసాని
మనస! మఱవక నాకొక్కమాఱు చెప్పుము!
లీలమెయి గాలినాడఁ దూలికవుగావు
కాని, చిటికలోఁ గృతకపక్షములవిచ్చి
పక్షివలె నాకసంబునఁ బాఱుచుంటి
వేఁగుచుండెడి సద్దాక యింతలేక
కనుఁగొనుటకైనఁ గన్నులఁ గానరాక
మించి ముల్లోకముల సంచరించుచుంటి
వెట్లుపోవుచునుంటివో యెఱుఁగఁగనికి
నెచటి కేఁగుచునుంటివో యెఱుఁగఁగనికి

నెందులకుఁ బోవుచుంటివో యెఱుఁగకునికి
నీదురూపిట్టిదని కాంచ నేరకునికి
నీదుసంకల్ప మెఱుఁగంగ నేరకునికి
నచ్చెరువునంది యొకమాట యడుగుచుంటి
బరువులెత్తుటమాని లోఁ గరుణమాని
మనస ! నవ్వక నాకొక్కమాఱు చెపుమ !
సతతమును నీదు సంకల్ప జగతిలోన
ధనము, ధాన్యంబు, వస్తువాహనచయంబు,
నెచ్చెలులు, సేవకులు, రమణీజనంబు,
రమ్యమందిరవితతు, లారామములును,
కేళికాసరోవరములుఁ గృతకగిరులు
నాకసంబును జంద్రసూర్యగ్రహములుఁ
దారకారాజి, దిక్కులు ధరణితలము
సకలము బహిర్జగంబున జరుగునట్లె
యగపడుచునుండె నిదియేమి యద్భుతంబొ ?
నీజగమునకు మాతృక యీజగంబొ,
యీజగమునకు మాతృక నీజగంబొ ?
రెంటికిని భేద మరయలేకుంటి మహహా !
నీజగము సత్యమో, కాక యీజగంబు
సత్యమో, కాక రెండు వాస్తవము లగునొ

అట్లుగాక రెండును నసత్యంబు లగునొ?
కనులు విప్పి యోజించినఁ గానఁబడెడు
నొకటి, కనుమూసి యోజింప నొకటిపోఁచు
నట్టి ఘనశక్తి యీరెంటియందె కలదొ
కాక నీయందెకలదొ నిక్కంబుఁ దెలియఁ
బరువులెత్తెడుటపూని లోఁ గరుణపూని
మనస! మఱవక నాకొక్కమాట చెప్పుము!
(19-3-1915.)

---

37 నక్షత్రము.

తలను పైకెత్తి కన్నుఱెప్పలను విప్పి
కనుబొమలనెత్తి ఫాలంబు గదియఁజేచ్చి
ఘనతరాద్భుతదృష్టితోఁ గాంచుచున్న
నన్నుఁ గన్గొని నవ్వుచున్నావొ, కాక

నవ్వుచుండుటయే నీకు నైజగుణమొ
ఆశలను నిండియున్న యాకాశమందు
మినుకుమినుకుమనాంతితో మెఱయుచున్న
చిన్నినక్షత్రమా! నాకుఁ జెప్పఁగదవె—
జననమరణానుసారమై జరుగుదాని
బుణ్యపాపానుభూతమై పొల్చుదాని
సౌఖ్యదుఃఖాన్వితంబై యొసంగుదాని
క్షణిక పరిణామశీలమై సాగుదాని
బ్రకృతిఁగని దాని మాయలోఁబడి మునింగి
యొడలెఱుంగక కాలంబుఁ గడపుచున్న
నన్నుఁ గన్గొని నవ్వుచున్నావొ కాక
నవ్వుచుండుటయే నీకు నైజగుణమొ
చిన్నినక్షత్రమా! నాకుఁ జెప్పగదవె!

(25-5-1915.)

38 సంతుష్టి.

ఏమహావృత్తి చిత్తమం దెనసి యున్న
నిఖిలజగముఁ జిదానందనిలయ మగునో
యట్టిసుఖజీవితాలంబ మైనయష్టి
యైనసంతుష్టి నిరతంబు నాశ్రయింతు.

మంజులం బైనయారాజమార్గమందుఁ
జరణములఁ దాఁకుకర్కశాశ్మములు గాని
పదములం గ్రుచ్చుకొనుముండ్లపొదలు గాని
తవిలి బాధించుక్రూరజంతువులు గాని
కలికమున కైన నెం దైనఁ గానఁబడవు
తొలకరి నెలర్చి పొదలుశాద్వలముకంటె
నామనిం దోఁచుతొలిచిగురాకుకంటెఁ
బట్టుపూవులమెత్తనివఱపుకంటె
నతిమృదుల మైనయావిమలాధ్వమందు
నల్లనల్లన హాయిగా నడుగు లిడుచు
నెంతదూరంబు నడచిన నేమిభయము ?
నిరత మాత్రోవఁ జరియించు నరవరులకు

శీతవాతాతపంబుల భీతి లేదు
కాలగతిభేదములచేతఁ గలుగుచుండు
నట్టిదుస్సహకష్టంబు లందు లేవు
భగ్గునను మండునెండపవళ్లు లేవు
కాలునింబోలు చీకటిరేలు లేవు
దురితభయ మేది బాధించు దోపుకాండ్రి
మొదల నమ్మించి విడనాడు మోసకాండ్రు
పొదివి యదలించు నెఱతాగ్రిగుఁబోఁతుకాండ్రు
కానరా రొక్కరైన నాఘనపథమున
సుగమమై శుభప్రమైన యాసుపథమునకు
నిరుగడల నున్నవనలతాతరులనుండి
మెల్లమెల్లన పిల్లతెమ్మెరలతరఁగ
లొలసి పాంథులకును హాయి నొసఁగుచుండు;
ఆపథంబున కిరువంకలందు బలిసి
కనులఁ దనియించురమ్యోపవనములందు
నలరుకమలాకరము లమృతాకరములై
క్రమభూజలతావళుల్ కల్పకములై
సురుచిరలతాంతమంజరుల్ సురభిళములై
సరసఫలగుచ్ఛములు సుధాసారకములై
యచట నెప్పుడు విహరించునట్టివార

లెన్నుకొని కోరఁదగిన దేమున్న దింక?
నచటినెలవులఁ బదచారి యైనవాఁడు
పైఁడిగాఁడీలకై తూలి పడఁగఁబోవఁ
డచటిపూఁపొదరిండ్లలో నలరువాఁడు
భర్మహర్మ్యాళికై మిట్టిపడఁగఁబోవఁ
డచటిచివురాకునును సెజ్జ ననఁగువాఁడు
పట్టుపఱపులకై ప్రియం బడఁగఁబోవఁ
డచటిపూఁదీవచెలువల నత్తువాఁడు
వలపుటింతులకై వేడ్కపడఁగఁబోవఁ
డచటిఫలభోగములకు లోనైనవాఁడు
పంచభక్ష్యంబులకుఁ గోర్కి పడఁగఁబోవఁ
డచటికమలాకరములనీ రానువాఁడు
పరిమళాసవములఁ జొక్కపడఁగఁబోవఁ
డచటిప్రకృతిచేఁ బరిచర్య లందువాఁడు
పరిజనంబులకొఱ కిష్టపడఁగఁబోవఁ
డచటిదివ్యపదార్థముఁ డైనవాఁడు
భవ్యరాజ్యంబులకు నాసపడఁగఁబోవఁ
డిన్ని యననేల యట్టిసర్వోన్నతుండు
సకలసుఖదుఃఖసన్నివాసంబులైన
కోరికలనెల్ల నొకమూలఁ గూలఁద్రోసి

యగపడినదెల్ల సుఖమయం బని తలంచు
సర్వభూతదయాళుండు సర్వశక్తి
సర్వలోకశరణ్యుండు సర్వసముఁడు
శాశ్వతానందుఁడైన సర్వేశ్వరుండు
తాను సర్వజ్ఞుఁ డగుట నంతయును దెలిసి
సర్వజగముల సృజియించు సమయమందె
సర్వజీవులకును నపేక్ష్యంబులైన
సర్వవస్తువు లందందు సంతరించి
కొదవ లేకుండఁగా సమకూర్చి యుంచి
యెట్టు లెవరికిఁ దగు నట్టు లిచ్చి యుండఁ
దమకు లభియించువానితోఁ దనియలేక
ఘనతరాశాకుటిలమార్గ మనుసరించి
తీరినకాలంది గోరికల్ మీఱుచుండ
సంచరింతురు కొందఱు చపలమతులు ;
అంబునిధు లేల, యవి భూము లైన నెంత
రాజ్య మగు ? నని తలపోయు రాజవరుఁడు
ఆపగల జల మేల ; కల్లైన నెంత
బాగుగా నుండు నని యెంచుఁ ద్రాగుఁబోఁతు
గిరుల శిల లేల పసిఁడిబొంగరము లైన
నెంతభాగ్యంబు గలుగునం చెంచు లోభి

పురుషు లేఁటికి నందఱుఁ దరుణు లైనఁ
గలదె నాకడ్డ మని యెంచుఁ గాముకుండు
దినము లవి యేల దర్శయామినులె యైన
నెంత సుఖ మబ్బు నని తపియించు దొంగ
కాఱుకొనునాశలకు నెందు మేర లేదు
మదిఁ బొడముకోరికల కెందుఁ గొదవ లేదు
ఘృతసముద్దీప్త శిఖిశిఖా తతులభాతి
నబ్బినకొలందిఁ గోరిక లడరుచుండుఁ
దనివి యొక్కింత యెఱుఁగక యనవరతము
దారుణాశోపనయనంబుఁ దాల్చి వివిధ
గతులఁ దిలకించువారల కన్నుఁగవల
కవనితలమెల్ల నొకయడు గైనఁ గాదు
హేమభూధర మొక చిన్నమేని గాదు
సకలసంపత్సమృద్ధమౌ జగతి యెల్ల
విశ్వపతి జీవులకుఁ జూఱ విడిచియుండ
హాయిగా నందుకొని సుఖ మందలేక
కోరికలమీఁదఁ గోరికల్ కోరికొనుచు
దుర్గమపథానువర్తులై తూలికొనుచుఁ
జేయరాని యకార్యముల్ చేసికొనుచు
నాత్మవంచితు లగుచుండ్రు రల్పమతులు

ఒక్కఁ బరమార్థము వచింతు నున్నమాట
ప్రబలసుఖదుఃఖమయ మైన ప్రకృతియందుఁ
గలసి చరియింప రెండుమార్గములు గలవు
తలఁచి చూడంగ నా రెండు దారులందు
సకలదుఃఖాధివాస మూశాపథంబు
స్వేష్టసుఖమందిరంబు సంతుష్టిపథము.

(20-6-1915.)

---

39 వేంకటేశ్వరస్తవము.

చ. సిరి నురమందుఁ జేర్చుకొని
శ్రీకరలీల సుఖోపభోగత
త్పరుఁడయి భక్త లోక పరి
పాలన మొల్లఁడఁటన్న వాఁడు నీ
శిరమునఁ జేరెఁ గానియెడఁ
జెచ్చెర నాకుఁ బ్రసన్నమూర్తివై
కరుణను నన్నుఁ బ్రోచుటయె
కల్గు మదీశ్వర వేంకటేశ్వరా!

మ. కలికాలంబున దుష్టమానవుల కీ
తౌబద్ధులం జేసి ని
శ్చలధర్మంబు జగంబు నెల్లెడల సం
స్థాపింప శ్రీవేంకటా
చలదుర్గంబునఁ బ్రేయసీయుతుఁడవై
సద్భృత్యసంఘంబుతో
వెలయంగాంచిన దేవదేవు నిను సే
వింతున్ జగద్రక్షకా!

మ. అలవైకుంఠపురంబువీడి నిజభ
క్తాభీష్టముల్ గూర్పఁగా
వెలసెన్ వేంకటశైలమందిరమునన్
విశ్వాత్మకుండంచు ది
వ్యులు బ్రహ్మాది సమస్తదేవతలు భ
క్త్యుద్రేకులై యేవిభున్
గొలువన్ జేరిరో యయ్యనంతుని నినున్
గొల్తున్ రమావల్లభా!

(24-7-15.)

40 జలజమాలిక.

మృదులసుమవల్లి పొదలియుఁ బొదలకుండఁ
దొగరుఁజిగురాకు తోఁచియుఁ దోఁపకుండఁ
దొడఁగునును మొగ్గ తొడిగియుఁ దొడుగకుండ
సురుచిరసుమంబు విరిసియు విరియకుండఁ
బూఁపపిందియ పుట్టియుఁ బుట్టకుండ
మధురమధుమాసముననె గ్రీష్మంబుదోఁపఁ
దాఁకువడగాలిచేత నాతపముచేతఁ
గాలవశమున వసివాఁడి తూలుచుండఁ
గన్ను గలవారు హృదయంబుఁ గన్నవారు
కష్టసుఖములభేదంబుఁ గన్నవారు
కడుపు సల్లగ బిడ్డలఁ గన్నవారు
కరుణ వెదచల్లునొకచూపుఁ బరవఁజేసి
వేఁడినిట్టూరు పొకటైన విడువకుండ
బండతనమున నూరక యుండఁగలరె ?
ఇంచుకంత యేపాపంబు నెఱుఁగనట్టి
యబలనిర్బంధజీవితం బక్కటకట !
యడవిఁ గాచినవెన్నెల యగుచునుండ
సాధుమతులార ! మీకింత జాలిలేదె ?

చెడు గన నెఱుంగనట్టి నాజీవనంబు
ప్రబలతాపాప్తి నింకిపోవలసినదియె?
మవ్వపుంబువ్వుఁబోని నాజవ్వనంబు
ఫల మెఱుంగక జాఱిపోవలసినదియె?
చంచరీకంబు మంత్రంబు చదువకుండ
మెఱుఁగునును మొగ్గ యొక్కింత విరిసినంతఁ
బ్రసవరసమెల్ల విషము గావలసినదియె?
అక్కటా! యిది యేటియన్యాయ మయ్య!
ఎట్టియపరాధము నెఱుఁగనట్టి నాకుఁ
దగునె యింతటికీడు నాకంటఁ బ్రియులారా!
అతికరుణా మైనయట్టి నామాఁడుకొమారు
నాలకించుట దోసమే యన్నలార!

అగ్రహారంబు నేఁబుట్టినట్టియూరు;
మాకులం బెన్నఁదగినబ్రాహ్మణకులంబు;
తగినమాయింటిపేరు వేదాలవారు
సోమయాజులు భాసురశ్రుతివిశుద్ధ
ధర్మసన్మార్గరతులు మాతాతలెల్ల;
గౌరిపతిసోమయాజి నాకన్నతండ్రి;
అర్థ మధికంబు గలయింటియాఁడుపడుచు

కామమాంబామతల్లి నాకన్నతల్లి;
ఇట్టితల్లియుఁ దండ్రియు నేకపుత్త్రి
నైననను బిల్తు రన్నపూర్ణమ్మ యనుచు;
నాదిపురుషులు గూర్చిన యగ్రహార
పావనక్షేత్రములు మాకు జీవనంబు;
మాపురంబున కెంతయు దాపునందె
పద్మనాయకకులులు సుప్రథితయశులు
మేరుమందరధీరు లుదారగుణులు
శూరసేనులు దీనమందారులైన
రావుభూపాలవరులకు రాజధాని
కలదు భూగోపురము పీఠికాపురంబు;
అనగర మేలు రావుభూజానిసభను
వాజపేయాన్వయారామ పారిజాతుఁ
డగుపరబ్రహ్మశాస్త్రి విద్యాధికుండు
సంస్కృతాంధ్రసాహిత్యవిశారదుండు
నిగమచయవేది పండితుండగుచునుండు;
అతనియిల్లాలు మామేనయత్తగారు
శీలవతి శాంతిసదన చుట్టాలసురభి
యగుచు సీతమ్మ పేరికిఁ దగు నటంచు
నవనిజనులెన్న నత్తింట నలరుచుండు.

ధన్యజీవను లైనయాదంపతులకుఁ
దొలుత నోఁచినయట్టినోములు ఫలింపఁ
గలిగె నొకబిడ్డ చంద్రశేఖరుఁ డనంగ.
అతనినాలవయేఁట మాయమ్మ యెంతొ
కష్టపడి నాకుఁ గష్టముల్ గట్టుకొఱకుఁ
దాఁ గనియె నన్ను దుర్ముహూర్తంబునందు.
నేను బుట్టినయపుడు మామేనయత్త
తనకుఁ గోడలు కలిగినదనుచు నుబ్బి
భూరిసంతోషమునఁ బొంగిపోయెనంట!
అదిమొదలుగాఁగ నామేనయత్త ప్రేమ
నగ్రహారంబు తనయూరి కవలివీథి
యట్లుగా నుంట ననుఁ జూడ ననుదినంబు
నొక్కపరి వచ్చి పోవుచు నుండు నంట!
మిగులఁ బసితనమందె నామేనబావ
నన్ను ముద్దాడి నవ్వించుచున్నయపుడు
కెవ్వు మని నవ్వలేక నేఁ గేక వేయఁ
బరుగుపరుగున మాయమ్మ యరుగుదెంచి
తత్తరంబున నెగచి నన్నెత్తికొనుచుఁ
బడకపై వంగియున్నమాబావఁ బట్టి
బారుమని యేడ్చుచుండ నీవలికిఁ దేఁగ

నమ్మసండిటిలోనుండి మావురావు
రనుచుఁ గడుపుబ్బ నేడ్చితి నంట నేను
చిన్నతనమున విధవయై కన్నయింట
నున్నమాచిన్న మేనత్త యూర్చికొనుచు
నపుడు వంటింటిలోనుండి యరుగుదెంచి
నన్ను నొకవంకఁ దనయక్క చిన్నికొమరు
నెలమి నింకొకవంకఁ దానెత్తికొనిన
నూరకుంటిమి యంట మే మొక్కమాఱె.
అపుడు మాయమ్మ రోసరోస లాడుకొనుచు
పణఁగుచుండియు నంతలో జలముఁ గొనుచు
వచ్చుమాయత్తఁ గనుఁగొని ఱిచ్చవడియుఁ
గోపచిహ్నంబు మొగమునఁ దోఁపనీక
నగుమొగంబునఁ జూచి యంతయును దెలిపి
“ఇట్టిపసిపాపలకు నింత లేసిప్రేమ
లేక్రియ ఘటిల్లెనో దైవమే యెఱుంగుఁ
జనులు సేపిన నూరకుండనినిసుంగు
బావఁ గని యూఱడిలెదె” నంచుఁ బలికెనంట !
అగ్నిహోత్రంబు సేయుమాయయ్య యప్పు
డమృతరసమొలుకు నాపలుకు లాలకించి
యల్లునిం గూఁతుఁ దిలకించి యలరెనంట!

ఇరుగుపొరుగులం గలవార లీయుదంత
మిప్పటికిఁ జెప్పుకొనుచుందు రెలమిమీఱ.
పలికితినియంట! ముందుగా బావపేరె
యడుగు పెట్టితినంట ముందత్తయింట
నేమి చెప్పుదు నిట్లు మాయిర్వురకును
దైవవిధిమూలమునఁ బసితనమునుండి
భావమునఁ బ్రేమ యుదయించి ప్రబలుచుండె.
మేము నిజముగ మేనత్త మేనమామ
బిడ్డలము; మాకు మాలోనఁ బ్రేమ కలిగె
ననిన నపరాధ మని యెవ్వ రనఁగఁగలరు?
చెరువపురంబులం దున్నవార మగుటఁ
బ్రతిదినముఁ జూచుకొనుచున్నవార మగుట
నుదయ మందినమాప్రేమ యొండొరులకుఁ
దెలియకుండ నంతంత వర్ధిల్లుచుండె.
ఇరువురము నొక్కయేఁటిపై నేఁడు వడఁగఁ
దల్లిదండ్రులహృదయేప్సితములతోడ
నలరుచుంటిమి నెలను వెన్నెలను బోలి.
బావ వీరపురంబున బడిని విద్య
గఱచుచుండెను గురులు నచ్చెరువుఁ జెందఁ
బండితకుటుంబమునఁ బుట్టి యుండుకతన

నంతయో యింతయో శాస్త్ర మభ్యసించి
గౌరవము గన్నయట్టి మాకన్నతండ్రి
చనవు మీరంగ నా కనుదినము వ్రాయఁ
జదువ నేర్పుచు నుండెను స్వయముగానె.
ఎలమి వారంబునకు వచ్చు సెలవుదినము
లందు మాబావ మాయింటి కరుగుదెంచి
నీటుగులుకెడు మాపూల తోఁటలోన
గాటపుం బ్రేమ నాతోడ నాట లాడి
మరల బడి యుంచుదినమున కరుగుచుండు.
ఎనిమిదవయేఁడు నాకు వచ్చినది మొదలు
మిగుల నుత్కంఠ మెఱయ నామేనయత్త
వచ్చి యేఁటేఁట మాఘాదిపంచకంబు
దాఁటునందాఁక నాపెండ్లిమాట యుల్ల
మలర మాతల్లిదండ్రుల నడుగుచుండు.
అపుడు మాతల్లి యామాట కడ్డు వచ్చి
పరిహాసితాస్యంబు భావగోపనము చేయ
"వదినె! యిట్టుల తొందరపడియె దమ్మ!
మెదిగిపోవుదురే వీర లింతలోన?
కోడఱికమునఁ దనివంది కొన్నినాళ్లు
లత్తఱికమును జూపింప నాస గలదో?

చిన్నిమనుమని నక్కునఁ జేర్చి చెప్పె
ముద్దులాడంగఁ దగునంత మురువు గలదొ?
జరుగఁదగు పెండ్లి యొక్కటే కొఱఁతగాని
యన్నపూర్ణ నీకోడలే యగును గాదె!
పరిణయంబున కేవ రడ్డపడఁగఁగలరు?
అంతవఱకును నెవ రెంత యాత్రపడిన
నెంత యత్నించినను లాభమేమి గలదు?
పసితనంబున డుబుడక్క వాఁడొకండు
వచ్చి మాయన్నపూర్ణ చేపట్టి చూచి
'యీమె పెండ్లి పండ్రెండవయేఁట జరుగు'
నంచు జోస్యంబు సెప్పె నే నడుగకుండ
నెవరివాక్యవిశేషమం దేమి కలదొ
యమ్మ! యీక్షింపుదముగాక యంతదాఁక
నింత యుబలాటపడియెదవేఁటి" కంచు
నాఁడుబిడ్డను గని హాస్యమాడుచుండు.
ఇంతయును విని మాయయ్య యేమి యనఁగ
నోపఁగాలేక మాటాడ కూరకుండు.
ఇట్లు నాపెండ్లిమాట లేఁటేఁట జరిగి
సన్న మగుచుండుఁ గోకిలస్వరములట్లు.

హృదయము లవేద్యములు గాన నెవరికైన
సమయమధురంబు లైనవాక్యములఁబట్టి
యభినయవిశేషములఁబట్టి యన్యజనుల
భావగతుల నిరూపింప వశముగాదు.

శ్రీరామ రామ రామా
శ్రీరామా రామ రామ శ్రీరఘురామా
శ్రీరామ రామ రామా
శ్రీరామా రామ రామ సీతారామా?

కలిమిలేములు సుఖములుఁ గష్టములును
జననమరణంబులును దన కనులయెదుట
జరగుచున్నఁ జూడనియట్లు జరగుకాల
మూరకిటు లేగుచుండఁగా నొక్కనాఁడు
బాల్యమున యౌవనచ్ఛాయ పడనినాఁడు
పరువ మంగకముల బయల్పడనినాఁడు
పదియురెండేడు లింకఁ బైఁబడనినాఁడు
పావడకుఁ బైఁట సవరింపఁ బడనినాఁడు
శాంతమయ మైనప్రత్యూష సమయమందు
రమ్యతర మైనమందిరా రామమందు

దివ్యతమ మైనకాసార తీరమందు
మంజులం బైనదాక్షానికుంజమందుఁ
గోరికలు మీఱ హాయిగాఁ గూరుచుండి
యుదయరాగప్రభలతోడ నుల్లసిల్లి
హృదయరాగంబు లుప్పొంగి పొదలుచుండ
బావయును నేనుఁ బ్రకృతివైభవముఁ గనుచుఁ
గుతుక మలరార నొకచోటఁ గూరుచుండి
సంతసిల్లుచు నుంటిమి కొంతసేపు.
ఇట్లు గూర్చుండి యున్నమా యెట్టయెదుట
వికసనోన్ముఖములు దరవికసితములు
వికచములు విస్ఫుటంబులౌ విమలకమల
కుసుమములతోడ నిండినకొల నొకండు
కనులపండువు సేయ మా యనుఁగుబావ
నన్నుఁ గని యిట్టు లనియె "నోయన్నపూర్ణ!
యెట్లు వికసిల్లెనో చూడు మీసుమములు
పరిమళంబులఁ జిమ్మునీపంకజములఁ
గొలనిలో దిగి నేఁ గోసికొనుచుఁ బోయి
యందినకొలంది దెచ్చి నీయంతికమునఁ
జేర్చుచుండెద హాయిగాఁ గూర్చుకొనుము"
అని వచించి నేనప్పు 'డూఁ' యనకమున్నె

చెంగు జాల్వాఱఁ గట్టిన యంగవస్త్ర
మించుకంత బిగించి పై కెగయఁ గట్టి
కంచుకకరంబులను సవరించి మలపి
సరవి దండలవఱ కెగసనఁగఁ ద్రోసి
కొలనిలోఁ జొచ్చి యందినకొలఁదిఁ గమల
కుసుమములఁ గోసి తెచ్చి నాకొసఁగుచుండె.
అతిముదముతోడ వాని నే నందికొనుచుఁ
గొమరుమీఱంగ హారంబు గ్రుచ్చుచుంటి.
చేతి కందెడుపూవులు చెల్లిపోయె
నిట్టలంబుగ నాయొడి నిండిపోయె
నళినినాదంబు కడుదూరమగుచుఁ బోయె
నాస యింకను బావకు నధిక మాయె
నపుడు ననుఁ జూచి "పూర్ణ! యీహారమునకు
నాయకసుమంబుగాఁ గూర్పు సేయఁదగిన
వికసితం బగుశతపత్ర మొకటి యుండె
నదిగొ! చూచితివే కమలాకరమునఁ;
గోసి తెచ్చెద నిదె చూచికొను" మటంచుఁ
గంచుకము విచ్చి గట్టుపైనుంచి వడిగ
వలదు వల దింక ననుచు నేఁ బలుకుచుండఁ
గొలనిలోఁ జొచ్చి చేయూఁచికొనుచుఁ బోయె.

అపుడు నాగుండె దడదడ లాడుచుండఁ
నంగకము లెల్ల గడగడ లాడుచుండఁ
గట్టుచుండినహారంబు నెట్టివైచి
యలరు లన్నిటి నొడినుండి దులిపివైచి
తత్తరంబున మతిలేని దానిఁబోలె
నేమి చేయుచు నుంటినో యెఱుఁగకుండ
నతిభయంబున "నాయనా! యమ్మ!" యనుచుఁ
గేకలిడుచును జని కమలాకరమునఁ
జొచ్చితిని ముందు వెనుకయుఁ జూడకుండ.
బావ యింతలోననె శతపత్త్రసుమము
నందికొని కోసి సంతోష మతిశయింప
సరభసంబున వెనుకకు మరలునపుడు
పంకమునఁ గాలు రాయి నవ్వలికి జోగి
ఘనగభీరజలంబుల మునిఁగిపోయె;
నప్పుడొకసారి చలిపిడు గడఁచినట్టు
లూరుపులు కట్టువడ నిలువు నీరు గాఁగఁ
గనులు చీకటి గ్రమ్మ నెమ్మనము చెదర
స్మృతి యెగసిపోవ మూర్ఛ ముంచికొనిపోవఁ
గూలఁబడిపోయితిని తమ్మికొలనిలోన.
తల్లిదండ్రులు నాదునార్తస్వరంబు

నాలకించుట తడవుగా నరుగుదెంచి
యొడ్డునం గూలఁబడిపోయియున్న నన్ను
మునిఁగి తేలుచునుండిన యనుఁగుబావఁ
బట్టి కంపితకరములఁ బైకిఁ దీసి
చిటుకుచిటుకునఁ గన్నీరు చిలుకుచుండఁ
జేసిరుపచారములు కొంతసేపుదాఁక.
అంత మేమిరువురముఁ దెలివినందుటయును
నుస్సురని నాదుజనని నిట్టూర్పు విడిచి
సన్నగిల్లిన గద్గదస్వరముతోడ
ననియె నీరీతి నాప్రియజనకుతోడఁ
"గూర్మిమేనల్లుఁడనుచుఁ బొంగుటయె కాని
మీరొకింత యెఱుంగరు మీఁదితెఱఁగుఁ
గన్నదాదిగఁ గన్నులఁ గప్పికొనుచుఁ
బెంచికొనుచున్న యీముద్దుబిడ్డకంటె
నింక నీలోకమున మనకేమి గలదు?
చిన్నతనమాది నీచంద్రశేఖరుండు
దుడుకుఁదనముల కలవాటుపడినవాఁడు
కఠినమైన యీ సేనటికంపుఁ బెండ్లి
యక్కటా! యెట్లు విడిపోవునాయటంచుఁ
గోటిదైవంబులకు మ్రొక్కికొనుచు నుంటి

నాఁడుబిడ్డతోఁ బోరాట మాడలేక
మంచిమాటలతోనె తప్పించుకొంటి
నామె నిక్కంబుగా మనయన్నప్రాప్త
పుణ్యమా యని పరలోకమునకు నరిగె
నింక నీతనిసంబంధ మేల మనకు
నితనితోఁగూడి మనబిడ్డ యెట్లు లెప్పు
డేమి యై పోవునో యని యేడ్చుచుంటి
మంచి దిప్పుడు మనబిడ్డ మనకుఁ దక్కె
నిప్పుడేనియు నీతని నిల్లువెడలఁ
గొట్టి మనబిడ్డ బ్రదికించుకొనఁగ రాదె
అనెడు నిల్లాలివచనంబు లాలకించి
యట్టి నాజనకుండు కొయ్యబడిపోయె
నిలువుఁజూపులతో నేను నిలిచియుంటి
మానఘనుఁ డైన నామేనమఱఁది యపుడు
జలజమాలికకడకొక్కసారి చూచి
వేఁడినిట్టూర్పు విడిచి మాటాడకుండ
నను నొకించుక గని గిరుక్కునను మఱలి
పీఠికాపట్టణమునకు వెడలిపోయె.

ఒరులకష్టసుఖంబుల నెఱుఁగకుండఁ
దమయభిమతంబె తీర్చికోఁదలఁచికొనుచుఁ
దఱి వెఱింగి పూరుషులస్వాంతములు గరఁగ
మాటలాడుచు నుందురు మానవతులు.

ఎల్లఋతువులు గ్రీష్మంబులేయనంగ
నధికదుస్సహములు గాఁగ నంతనంత
నేమి చెప్పుదు నటు లొక్కయేఁడు గడచె
బావ యెన్నఁడు నాకంటఁ బడుట లేదు
బావపల్కులు నాచెవిఁ బడుటలేదు.
బాల్యయౌవనములకు సంబంధ మయ్యె
భావకుసుమంబు రేకెత్తి పరిమళించె
సోయగంబు నొయారంబు చూఱగొనియెఁ
జిలుకుఁజూపులలో వింత మెఱుఁగు మెఱసెఁ
జిఱునగవు తేటమాటలఁ జేరికొనియెఁ
జిన్నతనమేఁగి పొడచూపెఁ గన్నెతనము
పొరుగువారలు నాయొద్దుపొడవుఁ గాంచి
"పిల్ల చూపట్టె బిడ్డల తల్లిలాగు
తల్లిదండ్రుల కింతటి ధైర్య మేమొ
యీడువచ్చిన యీబిడ్డ కింతదాఁకఁ

బరిణయము సేయకుండుట పాడిగాదు"
అనుచుఁ దమలోనఁ గుజగుజలాడికొనుచు
నాసికను దర్జనిం జేర్చి నవ్వికొనిరి.
చైత్రవైశాఖమాసముల్ చెల్లిపోయె
నప్పు డొకనాఁటిరాత్రి మాయయ్యకడకుఁ
జేరిమమిూఱంగ మామేనమామ వచ్చి
"బావ! మనయన్నపూర్ణ కీవత్సరమున
వేడుకలుమిూఱఁ బెండ్లి గావింపవలయు
విజయనగరంబునం గల వేదవేత్త
సోమయాజుల వేంకట సోమయాజి
నెఱుఁగుదువు కాదె మీకు స్నేహితులె కాదె
అతనికిఁ దనూజుఁ డైనజనార్దనునకు
నిచ్చెద నటంచు నే మాట యిచ్చినాఁడఁ
బ్రియముతో మీరు నంగీకరింపవలయు"
ననిన మాయమ్మ "వారగ్రహారఘనులు
భాగ్యవంతులు వారిసంబంధ మెంత
దొరలినను మనబోంట్లకు దొరకఁ గలదె
నచ్చె నిఁక నిన్నియాలోచనంబు లేల?
పెండ్లి యీమాసముననె గావింపవలయు
నన్న? నీ వన్న నీబావ యన్నయట్లు

కాదె ? యీమాట తిరిగిపోరాదు మనకు "
ననిన మాతండ్రి మాఱుమాటాడఁడాయె
నాక్షణమునందె నాదీప మారిపోయె
నంతరంగంబు దడదడ లాడిపోయె
నుదుకుఁగన్నీటిచేఁ బైఁట తడిసిపోయె
నాశలన్నియు నపు డడుగంటిపోయె
నమ్మ యొకనాఁడు మంచిమూర్తమ్ముఁ జూచి
మోదకప్రియునకు మాట మీఁదుగట్టి
వేగ నాపెండ్లిపనులు గావింపఁ బూనె
బహుళపంచమినాఁడు నాపరిణయంబు
జరుపఁదలఁచినయట్లు లుత్తరము వచ్చె
జరుగవలసినదంతయు జరగిపోయె
నింక నాయాశ కాధార మేమి గలదు ?
చిత్తము గలంగ నున్మాద మెత్తినట్లు
లేఁ దిరుగుచుంటి దివసంబు లెన్నొకొనుచు
వచ్చియును రానియలరుజవ్వనపుమిసిమి
నిమిషనిమిషంబున కొకింత గమలుచుండె
నప్పుడప్పుడు నాచిన్నియత్త నన్నుఁ
గౌఁగిటఁ గదించి కన్నీరు కాల్వఁగట్టఁ
జిన్ననాఁటికథలు చెప్పిచెప్పి వగచి

నగచి దైవంబు దూఱి సన్నగిలుచుండె.
పెండిలిదినంబు దా సమీపించుకొలఁది
నెడమగుచునుండె మది జీవితేచ్ఛ నాకు.
అపరిమితమైన కాలాన కాసవాలు
చూపుచేపుల మాపులఁ జూచి చూచి
యహితునింబోలె హితుఁడయ్యు నైన దాను
లందుఁ గానిది కంచాలయందుఁ బెట్టఁ
దలఁచు దైవంబు సేఁతలఁ దలఁచి తలఁచి
ప్రకృతియందును బహునందు భవమునందు
నఖిలకారణముల నసహ్యత జనింపఁ
బ్రాయమున నుండియును బహుబాలపడితి
బెంగచేతఁ గ్రమంబుగాఁ గ్రుంగుచుంటి
నన్నిపనులును దీఱె మాయమ్మకోర్కె
నిండెఁ జుట్టాలతో నిల్లు నిండిపోయెఁ
బెద్దముత్తైదువలు జేపు పెండ్లి యనుచు
వేడ్కతోఁ బెండ్లికూఁతుఁ గావించి నన్నుఁ
గొలని పెద్దలకెల్ల మ్రొక్కించువేళ
నడుగు తడఁబడుచుండ మాయయ్య వచ్చి
" వరుఁడు చెన్నపురమునుండి వచ్చెనంట
యన్నపూర్ణను బెండ్లాడవనియె నంట

యేమి యన్నఁ బ్రత్యుత్తర మీయఁ డంట
యెంత బ్రతిమాలినను దల యెత్తఁ డంట
వలవ దీపెండ్లి యని తంత్రి వార్త వచ్చె
నేమిచేయుదుమో తుద కిట్టు లయ్యె"
అని వచింపంగ నచ్చటి యమ్మలక్క-
లెల్ల ముక్కున వ్రేలిడి తెల్లపోయి
మదిగలఁగ నల్వురును నాల్గుమాట లనిరి.
అపుడు మాతల్లిదండ్రుల యంతరంగ
మేపగిది నుండెనో దైవమే యెఱుంగు
మానసోత్సాహపరిభంగ మైనకతనఁ
దల్లిదండ్రులు మదిలోనఁ దల్లడిల్లి
యేమి యోచించుకొనిరొ నే నెఱుఁగఁ గాని
తండ్రి పీఠాపురికి వేగఁ దరలిపోయె
మ్లానవదనంబుతోడ నామామఁ గాంచి
"బావ! మన్నించి నావిన్నపంబు వినుము
జరగిపోయిన దంతయు మఱచి పొమ్ము
మొన్న సోదరి నాస్వప్నమునను దోఁచి
కమల దుఃఖాశ్రుపూరంబు గ్రమ్మ దేర
'నకట సోదర! నీమేనయల్లుఁ డుండఁ
దనయ నితరుల కొసఁగుట తప్పుగాదె?

చచ్చిపోయిననాయాత్మ శాంతికొఱకు
సత్యపరుఁ డైననీమన శ్శాంతికొఱకు
నాత్మబంధులలో మరియాదకొఱకు
గురుజనులలోనఁ దలయెత్తికొనెడునీకు
జగము మెచ్చెడునట్లుగా జరుపఁ దగదె'
యని వచించి యంత గ్రాతమైనయట్లు
లగపడుటఁ జేసి నీకడ కరుగుదెంచి
కోరికొనుచుంటి వినుము నాకూఁతు నిచ్చి
చంద్రశేఖరునకుఁ బెండ్లి సలుపువాఁడ
నిందులకు నీవు ననుమతిఁ జెందవలయు."
అనిన నామాఁవ కోపంబు ననఁచివైచి
"బావ! సమయజ్ఞుఁ డగునీదు పలుకులెల్ల
మెచ్చికొనఁదగినవియె కావచ్చుఁ గాని
నాదుకలలోనఁ గనుపట్టి నీదుభగిని
యిట్టిమాటలు వచియించి నట్టులైన
నపుడు నీముద్దుతనయ నాయాత్మజునకుఁ
జిత్తమలరఁగఁ బెండిలి చేసికొందు
నపుడు నీకడకే వార్త పంపికొందు
నిప్పటికిఁ జాలు నీమాటలేఁగు" మనియె
చండశాసనుఁ డగుతండ్రిచాయఁ దెలిసి

బావ యేమియు మఱుమాట పలుకఁ డయ్యె
జనకునకు నాశయంతయు సమసిపోయె
నట్లగుటఁ జేసి నా పెండ్లి యాఁగిపోయె
నంత మాబావ తనచిత్త మాఁపలేక
కలఁగి పీఠపురంబున నిలువలేక
యెపుడొ రెండవకంటివా రెఱుఁగకుండ
జనియెఁ దా నొక్కఁడును విదేశములఁ బట్టి
యేమి చేయుదు నాబ్రదు కిట్టులయ్యె
నంత ప్రేమానుబంధంబు నింత యయ్యె
నాఁడు వారలమాటల నాలకింపఁ
గలుగుసిలుగుల మాతండ్రి తెలిసికొనియె.

ఎఱుఁగకయె చేసి తరువాత నెఱిఁగి యెఱిఁగి
తప్పులకుఁ గాంచుచుందురు తగినశిక్ష
కడఁగుటకు మున్నె యోజనగాని వెనుక
నెంతతపియించినను ఫల మేమి గలదు ?

అట్లు నా పెండ్లి యాయేఁటి కాఁగిపోయెఁ
గాని, దినము లెప్పటియట్లె కడచుచుండెఁ
బ్రకృతి యప్పుడుఁ దనయిచ్ఛవచ్చినట్లు

కాలగతిచేతఁ బరిణతిఁ గాంచుచుండెఁ
గోకిలంబు లొకింత కన్గొలుపకుండ
నెలమిఁ గొమ్మలు చిగురాకు లెత్తుచుండెఁ
గొదమతుమ్మెదగము లీలకొట్టకుండఁ
జిన్నికోరకములు వికసించుచుండెఁ
జిలుకముక్కులగిలిగింత లొలయకుండఁ
బసరుకాయలు పరువంబుఁ బడయుచుండె
నిరతపరిణామశీల మౌ నిఖిలవస్తు
సంచయంబును ననునిమిషంబునందు
నొకరికోరికకొఱకుఁ గాకున్నఁ దనకుఁ
దానె సమయోచితాకృతిఁ దాల్చుచుండె—
హృదయవేదనతోడ నేనిట్టులుండ
నక్కటా! యేమి చెప్పుదు నొక్కనాఁడు
పూర్వదిగ్భాగమునఁ బొద్దు వొడుచువేళ
శయ్యాపై లేచియున్నా చాయఁ జూచి
మేనెఱుంగక నాచిన్నమేనయత్త
వాకిటం బడి పొరలుచు వాయిమొత్తి
"అక్కటా! మచ్చలేనిమాయన్వయమున
కింతయపకీర్తిఁ దెచ్చితివేవిధాత!
అన్నెమును బున్నె మెఱుఁగని చిన్నిబిడ్డ

నేమి సేయంగఁ దలఁచితివో మహాత్మ!
కటకటా! యిట్టియిక్కట్టు గలుగుననుచు
ననుకొనుచు నుంటి నట్టులే యయ్యెనమ్మ!
కులములోపలఁ దల యెత్తికొనుటయెట్లొ?
తగవు పెఱవారలకుఁ జెప్పఁదగినయట్టి
యన్నగారికి దారి యేమున్న దింక?
నయ్యయో! మాకుటుంబ మీయార్తి జలధిఁ
బడి సమూలంబు నమసి పోవలసినదియె?
నవ్వఁదలఁచినవారలు నవ్వుచుండ
నేడ్చుచుండెదుమాకు దిక్కెవ్వరయ్యొ!"
అనుచు నీరీతి గుండెల నడఁచికొనుచు
గోలుగోలున విలపింప, నాలకించి
యిరుగుపొరుగులఁ గలవార లేఁగుదెంచి
సంభ్రమాశ్చర్యములు మది సందడింప
నూఱడింపఁదొడంగిరి వేఱువేఱ
నేమిచెప్పెదు నంతలో నింతలోనె
"యన్నపూర్ణ రజస్వలయయ్యె" ననుచుఁ
బలుకుభంగులచే నిట్టె తెలిసిపోయె
మాకులాచారసంపత్తి మాసిపోయె
నెమ్మదిగ నూర నీవార్త నిండిపోయె

దాచిపెట్టునుపాయంబు తప్పిపోయె
నపుడు మాయగ్రహారధర్మాధికారు
లగుమహాపురవరు లోకక్రియజ్ఞుఁ డుపరాఁప
బ్రహ్మపరిషత్తుఁ గావించి బహువిధములఁ
జలుపఁదొడఁగిరి వింతగా శాస్త్రపక్ష
ఘనులలోఁగొంద ఱార్షవాక్యములఁదఱచి
యనువదించుచుఁ బరిణయంబునకుఁ బూర్వ
సమయములఁ గల్గునట్టిరజస్వలలకు
రాగజాదిభేదంబులఁ బ్రస్తరించి
కఱపియున్నప్రాయశ్చిత్తగతులుఁ జూపి
తెలిపి దీనికి నిష్కృతి కలుగు ననిరి.
మున్నొకప్డు విదేశంబు చన్నయట్టి
విప్రు నొకనిఁ బతితుఁ గావించునట్టి
ధర్మమెఱిఁగినయట్టి నాతండ్రి కొంత
దెలిపి వల దిది యంచు వాదించుకతన
నట్టితఱిఁ బూర్వపక్షులైనట్టివార
లిట్టె తల లూపి తగ దిది యేటిమాట
"కాలజం బిది దీనికి గతులు లేవు
పతితమైనట్టి యీకుటుంబు చావ
వలయునే గాని నిష్కృతి కలుగఁబోదు"

అనుచుఁ దమపూర్వవైరంబులను దలంచి
ధర్మశాస్త్రంబుఁ ద్యజియించి దయను వీడి
మానుషత్వంబుఁ ద్రోసి సన్మతము రోసి
మమ్ము వెలిఁబెట్టి రార్యులమ్మనందు.
అదిమొదలుగాఁగ మాపాట్లు హరి యెఱుంగు
నేమి చెప్పుదు మాకష్ట మిట్టిదనుచు
నుత్తరీయంబు చాకెత యుదుకదయ్యెఁ
బదములొత్తిన మంగలి పలుకఁడయ్యె
గవ్వచేయనిదానికిఁ గానునిడిన
సరిగ బచ్చింట వెచ్చంబుఁ దొరకదయ్యె
నాత్మబంధుప్రజలరాక లాఁగిపోయె
నెలమిగలవారు పిలిచినఁ బలుకరైరి
దయయెఱుంగక ధర్మశాస్త్రములవిడిచి
పరిచలితాన్యోన్య వైరభావములతోడఁ
జిత్తములువచ్చినట్లు శాసించునట్టి
బ్రహ్మపుత్త్రులఁ గానంగఁ బడసినట్టి
కఠినతరమైన యిక్కలికాలమందు
భయద మగుఁగాదె వెలిఁబడ్డ వారిబ్రదుకు!
కడకు మాతండ్రి యిటు దుఃఖపడఁగలేక
యగ్రహారంబు విడిచి మాన్యములు విడిచి

భీతి గదురంగ సుబ్బమ్మపేటయనెడు
పల్లెపల్లెకు దరినున్న బయలునందు
నాకుటీరంబు నిర్మించి యందులోనఁ
దనకుటుంబముతో నుండె వనట మిగుల.
మొదటినెలయైనఁ గడచని పోవకుండఁ
బ్రాఁకిపోయినయపవాద భయముచేతఁ
గడుపు దరికొని కాల్చుశోకంబుచేత
హృదయ ముడుకంగ నుడుకంగ బ్రదుకునందు
నేవ జనియింపఁగాఁ గృశియించి తుదకు
నాదుజననియు జనకుండు నన్ను విడిచి
కష్టదశలను విడిచి లోకంబు విడిచి
మేను విడనాడి పోవ నామేనయత్త
వారికొఱ కేడ్చి యేడ్చి నోరారిపోవ
నాపయిం గన్ను లుంచి ప్రాణములు విడిచె.
ఆత్మబంధులు నను విడనాడిపోవ
దిక్కుమాలినపక్షినై తిరుగునన్ను
సిగ్గుమాలినప్రాణముల్ చిక్కువెట్టి
పనికిమాలిననామేను బడలఁజేసి
విడిచియును నాశచేఁ బట్టు విడువకుండ
నిట్లు వేధించుచుండె నింకెందుకొఱకొ?

చెట్టు వడిపోవఁ గడపటి చిగు
ననుదినము వాడి నే వరుగగు
నమ్మలార! నాయనలార! ఆ
కరుణపుట్టదె? మీమది కరఁ
పండితాన్యోన్య వైరభావము
సాధులు కుటుంబసహితులై
తల్లిదండ్రులు చేసిన తప్పుకాఁ
గోమరుపాయంపుజవరాలు కు
పాపమతులై చరించెను పరుఁ
నచ్చుపుంబ్రేమ నాశన మందె
శాస్త్రసముదయమందు నాచా
బ్రజలచిత్తంబులందు దైవవిశ్వా
గఠినతర మైననాయభాగ్యంపు
మీఁద నిష్కృతి యనుమాట
పుట్టకయ ముండు నెమ్మదిఁ ఉ
ప్రణయములతోడఁ బెరుగుబా
గలసికొనుభాగ్య మికఁ ముందె
బ్రేమతోఁ బుట్టి ప్రేమతోఁ బె
ప్రేమమయజీవితంబును బ్రేమ

బలిమిమై బలి సేయంగ వలయునేమొ ?:—

* * * *

తలఁప గతవర్తమానసందర్భములకు
నొలయుచిఱునవ్వొ మసలునిట్టూర్పొ కాని
భావిగర్భస్థ మైనప్రబంధమందు
నెట్టికథ లెట్లు వచ్చునో యెవ్వఁ డెఱుఁగు ?
నెట్టిగతు లెట్లు లీడ్చునో యెవ్వఁ డెఱుఁగు?
నెట్టివిధు లెట్లు మార్చునో యెవ్వఁ డెఱుఁగు?
(10-9-1915.)

41 ప్రేమాంజలి.

ఏవిశుద్ధతత్త్వంబున నీజగంబు
పుట్టిలయమొందు క్రిమ్మఱఁ బుట్టిగిట్టు
నట్టికట్టడి కనయంబుఁ గట్టువడెనో ?
యావిశుద్ధైకతత్వంబు నాశ్రయింతుం.

విన్నపము.

"భూమిపాలక ! యొకయబలామతల్లి
కాదనాథ యనాథయై కాలవశత
నొక్కవిన్నపమును బంపుచున్న దిపుడు
దీని దయతోడఁ గాంచి యాదీనురాలి
ప్రార్థనం బాలకింపుమీ ! పార్థివేంద్ర !
పాంచభౌతికమైన ప్రపంచమందుఁ
బార్థివశరీరమును దాల్చి ప్రకృతిగెల్చి
జగతినుండరె యెవరైన శాశ్వతముగ ?
శాశ్వతంబుఁగోర, రాజ్యమును గోర,
ధనము ధాన్యంబుతో నిమిత్తంబు లేదు
చంచలము లస్థిరంబులై జరగువానిఁ
గొనుట కిసుమంతయును బ్రయోజనముగానఁ

గావున ననంతమైన లోకము సృజించి
యొకనిమేషంబులోఁ బోవనున్ననాకు
వసుమతీశ్వర ! యేమి గావలసియుండు !
నిహముతోడి సంబంధ మింకేమియుండు ?
నై నగరుణించి దీనితో నంపికొన్న
కడకునాకిదే కోరికగాఁగనున్న
యట్టిప్రేమాంజలిని దయయుట్టిపడఁగ
బ్రాణనాథుని పదములపాలి కనిపి
క్ష్మాతలేశ్వర ! పుణ్యంబుఁ గట్టుకొనుము —
మొగమెఱుంగనిలేమ మోమోటమెడలి
నాకు నీవనిచెప్పుట న్యాయమగునె ?
తనకు నాకంతరంబును గనఁగవలదె ?
యనుచు నన్యథాభావింపఁ జనదునీకు;
ధరణిపతి ప్రజలకెల్లను దండ్రిగాన
నేను నీప్రజయందలిదానఁ గాన
నామరూపంబు లఱినయనాథఁ గాన
నా మొఱాలించుట యె నీకు న్యాయమగును,
నన్ను మన్నించుటయె నీకు న్యాయమగును,
నామతుదికోర్కి తీర్చుటే న్యాయమగును,
ధరణి ప్రజలకు నీకంటె దైవమెవరు ?

దైవమే దీనులను బ్రోవఁదలఁపకున్న
నక్కటా! వారికిఁక శరణ్యంబు గలదె?—
కానఁబడకుండఁ జనిన యీకాంతకొఱకు
నేను శ్రమపడవలసిననియతియేమి?
యెన్నియో రాజకార్యంబు లున్న నేను
కన్ను పెట్టంగఁగలనె యీచిన్ని పనికి?
నిదియె జ్ఞాపకముగ నుండు టెట్టులనుచు
భూతలేశ! యుదాసీనబుద్ధి దాల్చి
నాదువిన్నప మఱసేయఁగాదు నీకు;
ఒకయనాథ, జగతి వీడియున్న యబల,
దయితునిపవిత్ర పాదపద్మములయందుఁ
జిత్తమిడి చన్నక్రొత్తడి, జీవనములు
విభునిప్రేమాంజలికి ధారవిడిచి చనిన
యట్టియిల్లాలు కోరినయట్టికోర్కి—
చిన్నికోరిక నీవంటి క్షితిపునకును
దీర్పకుండుట ధర్మంబు నేర్పె యనుచు,
నహరహంబును నీయంత రాత్మ నిన్ను
నోర్మితోడఁ బ్రబోధించుచుండుఁ గాన
నాదువిన్నపమును దీర్పఁగాదటంచు
నీవు నపేక్షింతువనుచు నేనెంచఁబోను—

* * * * *

లోకపాలక ! నా మొఱ నాకళించి
నీ జగత్పాలకత్వసన్నుయతి నెంచి
పుణ్యతత్పర మగుధర్మబుద్ధి నించి
చిరతరైశ్వర్య భోగసంసిద్ధిఁ గాంచి
శాశ్వతంబగుకీర్తి నెసంగుమయ్య !"

ప్రేమాంజలి.

(మంజరి)

" నామనోనాయక ! నాప్రాణధనమ !
నాజీవితేశ్వర ! నాతపఃఫలమ !
మగువలకుండు సామాన్యపులజ్జ
యనయంబు నామీఁద నధికారవృత్తి
నెఱపుచునుండంగ నృపశిఖామణికి
నామనోనాయక ! నాప్రాణధనమ !
నీయునికి, నీమనికి, నీస్వరూపంబు,
నీనామవృత్తులు నీవిలాసములు,
చిడిముడిపాటునఁ జెప్పలేనైతి ;

అటు చెప్పుకుండినయంత నేమాయె
ప్రాణనాయక! నీదుపావననామ
మనయంబు నాహృదయాంబుజమందు
శతసహస్రాధిక సమదాళులట్లు
విరతినెఱుంగక విహరించుచుండె,
నీయున్కి, నీమన్కి, నీస్వరూపమున
నీనామవృత్తుల నీవిలాసముల
నైక్యానుభావంబు నందిన నేను
విరహతాపమునకు విస్మృతి నొసఁగి
యతులితానందరసాంబుధిలోన
నీఁదులాడుచునుందు నేమియుఁ గనక—
అది మనఃకల్పన మగునంతె కాని
నిజముగా నను గూడి నీవుండ లేదు
నను విడనాడితే నానాథ యనుచు
నంతరంగసమాధి నవ్వలఁ బెట్టి
కనుదోయి విచ్చి నేఁ గనుఁగొనునంత
హృదయంబునకు సత్య మేర్పడఁదోఁచు,
నది తోఁచినంతనే యక్కటా! నాథ!
వివరింపఁగారాని విరహార్తిగుంది
నీకయి వెదకుదు; నిన్నుఁ గన్గొనక

చెలువలకుండిన సిగ్గునువీడి
హానాథ ! హానాథ ! హానాథ! యనుచు,
నను వీడిపోయితే నానాథ! యనుచుఁ
" ప్రాణనాయక! నన్నుఁ బాసిన నేను
నిమిషార్థమైనను నిలువంగఁగలనె ?
నానాథ వేగమే నామొఱాలించి
నాప్రాణవాయువుల్ ననుఁబాయువేళ
దగ్గఱెఁ గావునఁ దడయంగఁబోక
తలఁపులు మాని చింతాసముద్రమున
మునుఁగకమున్నె నామ్రోలను నిలిచి
నీప్రాణములలోన నిలుపుమువీనిఁ
గడసారి యిదె నిన్నుఁ గాంక్షించుచుంటి "
నని తలపోయుదు నావేళలందు——
ఒకమొగంబునఁ గన్నులున్నపోలికను
నొకగుత్తిలోఁ బూవు లున్నపోలికను
నంటువాయక తిరుగాడెడు మనల
నేవిధి యీవిధి మెడఁబాపనోపె ?
అక్కటా ! యిదియేమి యనుతాప మయ్యెఁ
గంటికిఁ గంటికిఁ గడుదూర మయ్యెఁ
బూవులు గడు వాడిపోవఁగనయ్యెఁ

జిత్తానుసంధులు చెదరఁగనయ్యొ
భావాబ్ధి యీగాలివానకుఁ బొంగి
యధికసంక్షోభంబు నందఁగనయ్యొ
భూవభ్యంతరములఁ బొలుపైన తేజ
మాకస్మికంబుగా నడఁగంగనయ్యొ
నక్షులుండియును గాఢాంధకారమున
దిక్కేది యూరక తిరుగంగనయ్యొ
హృదయేశ! హృదయేశ! యిరుపురిమధ్య
నీచిమ్మచీకటి యెందుండి వచ్చె!
నీమహాంభోనిధి యెందుండి వచ్చె
నీప్రభంజనవేగ మెందుండి వచ్చె
'నంధకారాంబుధి నాపెనుగాలి
నదియేమొ యొకబడబాగ్ని జనించె
నీబడబానలం బెందుండివచ్చె?
హానాథ! నాగుండె లదరుచునుండె
నిదియేమి ప్రళయమో యెఱుఁగంగనేర
నేమి గానుంటినో యెఱుఁగంగనేర
నీవెందు డాఁగితో యెఱుఁగంగనేర
నీప్రళయానల మేమైననేమి?
యీజగమంతయు నేమైననేమి?

యీజన్మమందు నేనేమైననేమి ?
నాజీవితేశ్వర ! నాప్రాణధనమ !
నిశ్చలమూర్తివై నీవుండఁగోరి
నిఖిలదైవములకు నేమ్రొక్కుదాన ;
అక్కటా ! యిదియేమి యన్యాయమయ్యె
హృదయేశ ! నీకంటె నీజగమందు
దైవము నాకొండు తానేమిగలదు ?
చిత్తవిక్షోభంబుఁ జెందిననాకు
భ్రాంతిమై నీరీతిఁ బలుకుటగాక—
అడుగుఁ దమ్ములక్రింది యవనీతలమ్మ
సకలేశ ! యిదియేమొ ! జాఱినట్లుండె,
నంతరాళములోని యమృతసరస్సు
హృదయేశ ! యిదియేమొ యింకినట్లుండె.
నాహ్లాదకరమైన యత్నుల తేజ
మాత్మేశ ! యిదియేమొ యడఁగినట్లుండె,
ముకుపుటంబుల నున్న మునిమునియూర్పు
లధిప ! యిదేమొ ! నేఁ డాఁగునట్లుండె,
నాఁదలపై నున్నయీమిన్ను గూలి
ప్రాణేశ ! నామీఁదఁ బడినట్లులుండె
నఖిల మీయెడ నేకమైనట్లులుండె

నఖిలమ్ములను హరించునట్లుగా నుండె
నట్టి యీవేళ నిన్నర్థించునేను
అవసానకాలంబు నందిననేను
నాథ ! నావిలయంబునకు విచారింపఁ
గాని యవ్వల నేమి గలదో యటంచుఁ
దోఁపక యీరీతి దుఃఖించుచుంటి,
నెచటఁ బుట్టిననేమి ? యెట్లున్న నేమి ?
భవదీయపాదసేవాభాగ్యమున్న
విభువరా ! యదె పదివేలగు నాకు;
అట్టిసౌభాగ్యంబు నందుటకొఱకు
ఈమహాజ్ఞ నీవిచ్చుటకొఱకు
నంజలిపట్టి నిన్నర్థించుచుంటి.
నామనోనాయక ! నాతపఃఫలమ !
యట్టిదీవనల నాకమరంగనిమ్ము,
కడసారి సెలవును గైకొనుదాన—"

శాంతిగీతము.

" కాంత ! నీ వేన్నృపాలశేఖరున కిపుడు
కమ్మలిఖియించితో ? యట్టి ఘమ్మైకలేఖఁ

డట్టి నీప్రియుఁ డొకస్థాణువట్టు లిపుడు
విజనవనసీమ విజ్ఞానవికలుఁ డగుచుఁ
బడి కదలకుండెఁ దా నొకజడునిభంగి,
నక్కటా! శక్తిఁ బాసిన యట్టివాఁడు
చెలువ! యేకాకి తా నేమిసేయఁగలఁడు?
ప్రాణనాయిక! నిను విడనాడినపుడె
నీవు నాకంటఁబడకుండ నిలిచినపుడె
మామకమహాధికారసంపదలకెల్లఁ
జటికలోననె యిటు స్వస్తి చెప్పుటయ్యె
అస్మదీయమహాలక్ష్మివైన నిన్ను
నస్మదీయ రాజ్యేందిరవైననిన్ను
నస్మదీయమహాశక్తివైననిన్ను
నస్మదీయమనోభీష్టమైన నిన్ను
నస్మదీయమనోధనమైననిన్ను
నస్మదీయైకజీవనమైననిన్ను
వీడినప్పుడె లోకంబు వీడుటయ్యె
నట్టియవతారమును వీడినట్టినేను
అట్టియుత్సాహమును వీడినట్టినేను
అట్టిక్రీడల విడనాడినట్టినేను
అట్టిభాగ్యంబు పోయినయట్టినేను

ప్రేయసీ! లోకపాలకబిరుదమునకు
నెట్టు లర్హతగలవాఁడ నింకమీఁద?—
అతివ! నీదు ప్రేమాంజలి యందుకతన
నంతరాళంబు కరఁగి నీరైనకతన
నకట! యొకభావ మీహృదయాంబుజమునఁ
బుట్టి సాగరమట్టు లుప్పొంగుచుండె—
కాంత! చెదరిన నామనశ్శాంతికొఱకు
దృఢతరంబైనయట్టి నీప్రేమకొఱకు
వేఱుపడి కానఁబడకున్న విశ్వరూప
మోహనంబగు నీదివ్యమూర్తికొఱకు
సర్వమయి యగు నామహాశక్తికొఱకు
దృఢతరంబగు సంకల్పదృష్టితోడ
నీవునేనుగ మఱి నేనునీవుగాఁగ
నద్వయానందసుఖముల నందుదాఁక
చిత్తమున నిట్లు కోరియాశీర్వదింతు—
"రమ్యతరమైనశుభ్రాంబరంబుఁదాల్చి
పొలుపుమీఱెడు సూర్యచంద్రులను దాల్చి
ప్రవిలములైన తారహారములఁదాల్చి
సౌరభంబుల నొసఁగుపుష్పములఁ దాల్చి
భువనవిఖ్యాతకంకణములను దాల్చి

కడువిమోహన మగునలంకార మెసఁగ
మానితంబైన నునుమించుమేనితోడఁ
గలుములీనెడు నవ్వువెన్నెలలతోడ
రాజితంబైన కలకంఠరవముతోడ
నాదరంబున నెప్పటియట్ల వచ్చి
భవదనుపమాన వికృతి ప్రభావకలన
భవదనంతకృపాపాంగపాశములను
నన్ను బంధించి సామేన నన్నుఁ జేర్చి
జన్మజన్మంబు నిల్లై నాసకియవగుచు
మదవతీ! శాంతిసుఖము నందెదవుగాక!”

(16-9-15.)

42 గోగీతము.

పులి యావుపైఁ బడఁబోవుట.

ఆ. అనఁగ ననఁగ నొక్కయావుండె నొకయూర;
నంతచక్కనైన యావులేదు;
గుల్లపొదుఁగు వాలుకుచ్చుతోఁ కయుఁ గల్గి
కనులకెంతొ యింపుగాఁగ నుండె.

గీ. ఒక్కనాఁ డది మేఁతకై యూరు వెడలి
కొండప్రక్కను మేయుచు నుండఁగాను,
నొక్కడుముకునఁ జనుదెంచి హుంకరించి
పులియొకటి దానిపైఁబడఁ బోయె నకట!
అట్లు పడనున్న పులిఁ జూచి యావొకింత
యైనబెదరక నిల్చి "యోవ్యాఘ్రరాజ!
నిమిషమాత్ర మోపికపట్టి నిలిచి నాదు
విన్నపము నీవు పూర్తిగా వినఁగదయ్య!"
అనెడు నాయావు పలుకుల నాలకించి
పులి నిలిచిపోయె గోడపై బొమ్మవోలె,
నదరుబెదరును లేకుండ నాడినట్టి
పలుకులందెంత శక్తియో తలఁపవశమె?.

ఆవు పులిని బ్రార్థించుట.

'ఓయి పులిఱేఁడ! కలఁడు నాకొక్కకొడుకు,
కంటి నాతనిఁ దొలిచూలి కానుపునను,
నేఁటి కాతని కేడవనాఁటిపురుడు,
పూరిమేయు టెఱుంగఁడు పురిటిపాప.
చనుగుడిపి వచ్చియుంటిఁ బొద్దునను లేచి,
యకట! యాపాలు గ్రక్కఁడు నఱిగిపోవఁ
బే! యనుచు నాపయిని గన్ను పెట్టుకొనుచు
నాఁకటను జాల నకనకలాడుచుండు.
చంటిబిడ్డకుఁ గడుపారఁ జన్నుగుడిపి
తిరిగివచ్చి నీయాఁకలి దీర్చుదాన,
ననుఁ ద్వరగ నింటికేఁగి రమ్మనుము దయను
బులివయిన నేమి? దయ నీకుఁ బుట్టకున్నె?'
అనుచుఁ గన్నుల నీరొల్క నావు వల్క,
వెఱ్ఱినవ్వును నవ్వుచు గుఱ్ఱుమనుచుఁ
దలను బంకించి యొడలుబ్బ దులిపి యావు
నట్టె యీక్షించి శార్దూలమనియె నిట్లు.

పులి యావునకుఁ బ్రత్యుత్తర మిచ్చుట.

"ఏమి? బిడ్డకుఁ బాలిచ్చి యిటకుఁ దిరిగి
వత్తువో? యేఁటిమాటలు వల్కెదీవు?

నన్ను మఱపించి పోఁజూచు చున్నదాన;
వైన నామాత్ర మెఱుఁగనిదానఁ గాను.
నోటఁబడనున్న నావు నెచ్చోటనైన
విడిచెఁ బులియంచు నెప్పుడైన వింటివొకో?
విడిచెనో, యెన్నఁడైనను వేగ తిరిగి
వచ్చి యాయావు పులినోటఁ బడియెనొకో!
మహితవిజ్ఞానులైనట్టి మనుజులైన
నెట్లు పలికిరో యట్లు వర్తింపలేరు;
నిత్యమును గడ్డి దినుచుండు నిన్నుఁబోలు
నెడ్డపశువులమాట వేఱెన్న నేల?.
ఆత్మసంరక్షకంటె నే ప్రాణికైన,
నురుతరంబైన కోరిక యొండులేదు,
నిన్నుఁ దినకుండ విడుచుట నీతికాదు,
నీవు మరలవచ్చుటయును నీతికాదు.

పులిని గోవు తిరుగఁ బ్రార్థించుట.

ద్విపద. అని పులి వల్కిన నాగోవు కలఁగి,
తలవంచికొని కంటఁ దడి పెట్టుకొనుచు
"నో పెద్దపులిరాజ! యొకమాట నన్నుఁ
బశువులన్నిటివలె భావింపకయ్య!
సత్యంబుతోఁ బోల్పఁజాలినయట్టి

యుత్తమధర్మ మింకొకటి లేదయ్య!
సత్యవిహీనులు చనుచుండు గతికిఁ
బోయెదనయ్య నేఁ బోయి రాకున్న,
నతివల విడలేని యతులేఁగు గతికి,
నిష్టమిత్రద్రోహు లేఁగెడు గతికిఁ,
బరదార నాశించు పాపుల గతికిఁ
బరధనంబుల దోఁచు పాపాత్ము గతికిఁ,
దల్లిదండ్రుల దూఱు తనయుల గతికిఁ,
బోయెదనయ్య నేఁ బోయి రాకున్న.
పూర్వదత్తముల దోఁపుడు వెట్టువాఁడు
నతిథుల నలరింప కదలించువాఁడు
కన్నెను ముసలికిఁ గట్టెడువాఁడు
పెద్దల దూషించి పేరెడువాఁడు
తప్పకపోవంగఁ దగినదుర్గతికిఁ
బోయెదనయ్య నేఁ బోయి రాకున్న.
నామాట నమ్ముమీ నాయన్న! నీవు
నాబిడ్డ నొకసారి నాకుఁ జూపించి
పుణ్యంపుఁ ద్రోవను బోవంగదన్న!
కడుపారఁ జన్నిచ్చి కడసారి నాదు
కనులార నాబిడ్డఁ గని వచ్చి నీదు

కడుపు మండించునాఁకలి దీర్తునన్న !
పోయి రమ్మొకసారి పొమ్మను మన్న."

గీ. మోమునందును సత్యంబు మొలకలెత్త
నావు చేసిన శపథంబు లాలకించి
కరుణపెల్లున హృదయంబు కరఁగి పోవఁ
బులి ప్రసన్నాస్య మగుచును బలికె నిట్లు.

పులి గోవునకుఁ బ్రత్యుత్తర మిచ్చుట.

"కడుపుతీపిచే నీ విట్లు పడెడుబాధ
కడుపుమంటనుఁ నేఁ బడు గాసికంటె
నెక్కువగఁ దోఁచెఁ గావున నీవు వేగ
వెడలి రాఁగదవమ్మ యోవెఱ్ఱిగోవ !
వనధిలోఁ తెంతొ చెప్పఁగాఁ దరము గాదు
తల్లిదయలోఁతు చెప్పఁగాఁ దరము గాదు
తల్లిదయ యన్నిదయల నుత్తమము గాన
వెడలి రాఁగదవమ్మ యోవెఱ్ఱిగోవ !"

ఆవు తనయింటికిఁ బోవుట.

అనినఁ బులికిఁ బ్రదక్షిణ మాచరించి
కన్ను లానందరసమునఁ గడలుకొనఁగ
నొక్కపరుగున దివ్వెన నూఁచపగిదిఁ
బోయి యిలుసేరె నంత నంబా ! యటంచు.

అమృతమయమైన యాస్వరం బాలకించి
బే! యనుచు నొక్కపరుగున డాయఁబోయి
పొంగఁజేఁపిన తనతల్లి పొదుఁగుఁజేరి
గుప్పుగుప్పున లేఁగ, పాల్గుడిచికొనియె,
అతఁడు తనపాలు ద్రావుచున్నంత సేపు
నావు కదలక మెదలక యట్టె నిలిచెఁ,
బిదప నాయింటియిల్లాలు వేగ వచ్చి
వెచ్చవెచ్చనిపాలను బిదికికొనియె.
అంతఁ గడుపారఁ బాల్ద్రావి యట్టు లిట్టు
కన్నబిడ్డఁడు పరువెత్తఁ గాంచి కాంచి
కంటికొలుకుల బాష్పముల్ గ్రమ్ముకొనఁగఁ
గొడుకుతో మెల్లగా నిట్లు గోవు పలికె.

గోవు, దూడకు బుద్ధులు చెప్పుట.

" ఏను నీ కిన్నినాళ్లు చన్నిచ్చి పెంచి
కొంటి, ఋణలేశమును దీర్చుకొన్నదానఁ;
దండ్రి! యిఁకమీఁద నామాట తలఁపకయ్య,
'పొలమునం దొంటి చరియింపఁ బోకుమయ్య,
పొద్దు చనుదాఁక మసలఁగాఁ బోకుమయ్య,
పోటువసరాలచెంతకుఁ బోకుమయ్య.
గుఱ్ఱములు గాడిదలు నేనుఁగులును దఱచు

నడచు త్రోవల కష్టంబు పడకుమయ్య.
బావులకుఁ జెంత గోతుల పక్కలందు
నెట్టికస వున్న మేయుట కేఁగకయ్య.
పాలపేదతనంబునఁ దూలితూలి
దుడుకుటావుల పొదుఁగులఁ బొడువకయ్య.
కడుమధురమైన చెంగలి గడ్డియైన
మూరుకొనకుండ మేయఁగాఁ బోకుమయ్య.
కొడుక ! నేనున్నయపుడె నీ కులుకుగాని
యవల నిన్నెవ్వరును ముద్దులాడరయ్య.
బెండుకంటె బూరుగుదూది పింజకంటెఁ
బుష్పధూళికంటెను నూలుపోఁగుకంటెఁ
జుల్కనైనట్టి యన్నివస్తువులకంటెఁ
జుల్కనగు దల్లిలేనట్టి సుతుఁడు భువిని.
ఎవరు నిన్నేమి యన్నను నెదురుకొనక
యండజకుఁ దలలోనాల్కయట్లు మెలఁగి
ధర్మమార్గంబు దేవునిదయయె నీకు
నూఁతగాఁ, జిరంజీవివై యుండు మయ్య!"

దూఁడ యావుతోఁ బలుకుట.

తల్లి యిటు పల్కఁగా, లేఁగ దద్దతిల్లి
"యమ్మ యిటువంటిమాటల నాడె దేల ?

కనుల నీరేల? పెదవులఁ గంపమేల?
యింతవంతకుఁ గారణ మేమి చెపుమ?
నీవు లేకుండ నేనెట్లు నిలువఁగలను?
అమ్మ! యెవ రింక నను ముద్దులాడువారు?
నాల్కతో నింక నెవరు నన్ నాకువారు?
ఎవరు జల్లున నాకుఁ జన్నిచ్చువారు?
ఎచ్చటికి నీవు వోవఁగా నెంచినావొ
యచ్చటికి నన్నుఁ గొనిపోఁగదమ్మ! దయను.
నన్ను విడనాడి పోవుట న్యాయమౌనె
గోవుతోడిదె గాదొకో కోడె?" యనిన;

ఆవు పులిని జేరఁబోవుట.

కడుపు అంపవు.గోఁతచే గాసిఁ జెందఁ
గన్నబిడ్డను గడుపునఁ గదియఁజేర్చి
పులి కొసంగిన బాసను బూర్ణముగను
గోవు వినిపించె నప్పుడు కొడుకునకును.
తల్లిమాటలు వినఁగానె తనయుఁ డకట!
"అమ్మ! అమ్మా!" యటంచును నార్చియార్చి
బడలికను జెంది కొంతసేపటికిఁ దల్లి
కుటుఁగటను నిద్రపోయెను గుటుక లిడుచు.
అంత నాగోవు సత్యవాక్యంబుఁ దలఁచి

యతిథిసత్కారరూపపుణ్యంబుఁ దలఁచి
పుత్త్రిమోహంబు దవ్వులఁ బోవఁ దఱిమి
పెద్దపులినోరఁ బడుటకై వెడలిపోయె.

పులి చింతించుట.

పాడి యున్నదె యెంతైనఁ బసరమునకు ?
దక్కిన నిధానమును గాలఁ దన్నుకొంటి,
బుద్ధిహీనుఁడనై మోసపోయినాఁడ
నింత తలకాయ యుండియు నేమిఫలము ?
ఆఁకలి దహింపఁగాఁ బ్రేవు లాఱిపోవఁ
జిక్కి గాసిల్లి నేనె చచ్చెదను గాక,
ముద్దులాడుచు బిడ్డతో మురిసిమురిసి
తనివి దీరక పడియుండు దాని కేమి ?

ఆవు పులియెదుటకు వచ్చుట.

"చాలఁగాఁ దడవయ్యెఁ గాఁబోలునయ్య
కడుపు మండంగ నెంతటికష్టమునకు
నోర్చికొనియుంటివో యయ్య ! యుత్తముఁడవు
నాకు బిడ్డను జూపించినావు దయను.
ఎన్నిజన్మంబులకునైన నీవు చేసి
నట్టిపుణ్యంబు మఱవనోయయ్య ! యిపుడె
నన్ను భక్షింపుమయ్య ! నాయన్న ! యింక,

నాఁకటను నీవు నిలువలేవయ్యొ యకట !"

పులి గోవుతోఁ బలుకుట.

గోవుమాటలు విని పులి కొయ్య యగుచుఁ
గొంతవడికిని దెలిసి "యోగోవ ! వినుము
యేను బుట్టినదాదిగా నింతదాఁక
నింతధర్మస్వరూపను నెఱుఁగనమ్మ.
ఎంతపాపాత్ముఁడనో నేను నింతవఱకు
నెన్ని యావులఁ దింటినో యెఱుఁగరాదు
చాలు నింకను జాలును చాలు, నీకు
మ్రొక్కెదను నాదుపాపముల్ పోవునట్లు."

గోవు తిరిగి పులితోఁ జెప్పుట.

అనినఁ బులిఁగాంచి "యిది న్యాయమామహాత్మ!
యీశరీరంబు మున్నె నీకిచ్చియుంటి
నన్నుఁ గృతకృత్యఁ జేయుమో యన్న వేగ,
యాలసింపకు మాఁకటి కాఁగలేవు"
అనుచు నాగోవు గంగడోలెత్తి బిగియ
నట్టు పైకెత్తి దాపున కరుగుదెంచి
యెంతవేఁడిన, దయ యన నెఱుఁగనట్టి
పులియు, నప్పుడు పిల్లియైపోయె నహహా !
"తినుముతినుమయ్య!తినుమన్న!" యనుచుగోవు

"తినను దినననమ్మ తినననమ్మ!" యనుచుఁబులియు
నట్లు చాలఁగఁ బంతంబు లాడియాడి
యెవరిదారిని వా రప్పుడేఁగినారు.
అమలసత్యంబె పవిత్రమైన యావునకును
నట్టిసత్యంబు గని సాధువైనపులికి
నీశ్వరుఁడు శాశ్వతసుఖంబులిచ్చెను, గథ
యేఁగెఁ గంచెకు మన యింటి కేఁగవలయు.

☞ ఇది బడిపిల్లలకొఱకు వ్రాయఁబడి యానంద వాచకపుస్తకమునఁ జేరియున్నది.

(1913-1914.)

43 లక్ష్మీవిలాసము.

గీ. సత్యము దయాగుణంబు శౌచంబు ధర్మ
నిష్ఠ యెచ్చోట నిలుచు నానెలవుఁజూచి
యలరి తనయంతఁ జనుదెంచి యాశ్రయించు
నమ్మహాదేవి శ్రీదేవి నాశ్రయింతు.

(నాంద్యంతమున సూత్రధారుఁడు పుష్పాంజలివిడిచి)

సభాసదులగు నీసరసుల హృదయకమలములు లక్ష్మీవిలాసభవనములై వికసించియున్నవి. ఇఁక నే నీలక్ష్మీవిలాసరూపక ప్రదర్శనమునకై త్వరపడవలయును.

(తెరలో)

గీ. ప్రకృతమున వచ్చె శుకవారంపుఁబొద్దు,
తెల్లవాఱిన దాదిగాఁ దిరిగితిరిగి
యాత్మ కానందనిలయమైనట్టిచోటి
నెన్నికొనలేక వేసరుచున్నదాన.

సూత్ర—(ఆలకించి) అదిగో! ఉచితజ్ఞురాలగు నటి యప్పుడే లక్ష్మీభూమికం దాల్చి వచ్చుచున్నది. ఇఁక ననంతర కరణీయముల నిర్వర్తింప నేఁ

బోయెదను. (అని నిష్క్రమించును.)

ప్రదేశము—సిరిపల్లెలోని వీథి.

ప్రవేశము—పేదరాలివేషముతో లక్ష్మీదేవి.

లక్ష్మి—"ప్రకృతమునవచ్చె" అను పద్యమును జదువుచుఁ బ్రవేశించి యొక యింటిగుమ్మముకడ నిలిచి లోపలికిఁ జూచి ఏమది!

గీ. ఇల్లు వాకిలియును లోన నెవరులేని
పగిదిఁ బాడుచుండ నీపాఁచియింటఁ
జలిదికంచాల వ్రాల్చి బిడ్డలకుఁ దాను
దినుచుఁ దినిపించుచున్న దీ దెబెపడుచు.

నాచూపులు తిరిగిపోవుచున్నవి. నాపాదము లిచ్చట నిలుచుటలేదు. ఆమందిరముకడకుఁబోయి చూచెదను. (అట్లు చేసి లోనికిఁ జూచి ముక్కుపై వ్రేలుంచుకొని) చీ! చీ!

గీ. మురికిచేతను దుర్గంధపూర్ణమైన
వసనములతోడఁ బిడ్డలు మసలుచుండఁ,
గురుల సంపఁగినూనియ మెఱుఁగువెట్టి
దిద్దుకొనుచున్న దీతరితీపులాఁడి.

నామేను జలదరించుచున్నది. నేనిట నిలువజాలను. (ప్రక్కయింటికిఁ జూపులునిగిడించి) ఈమె

సౌభాగ్యము మఱియు మెచ్చుకొనఁ దగియున్నది.

గీ. పక్కపై లేచి మలినంపుఁ బాచియింటి
గడపఁ గూర్చుండి చినిఁగిన కంబళమును
బ్రాఁతబ్రహ్మసూత్రంబు దబ్బనపుసూదిఁ
గూర్చి కుట్టుచునున్న దీక్రొంచెకత్తె.

ఈయిల్లు మాయక్క నివసించుటకుఁ దగియున్నది. నేనుండుటకుఁ దగదు. (పరిక్రమించి చూచి) అదిగో! ఆయింటియామె యీామె కక్కయో చెల్లెలో కావచ్చును.

గీ. ఎండఁ గని లేచి వెలుఁగుచునుండుదీప
మూఁది యాఱిచి పుక్కిటనున్నవిడెము
మరల నమలుచు వీథిగుమ్మంబుఁ జేరి
తూఁగులాడుచునున్న దాజోగురాలు.

ఇట్టియిల్లాండ్రతోఁ దల్లడపడుచు మఱుఁగుఁబెరళ్లతోఁ దులతూఁగుచుండు నీమలినమందిరములకడ నేనొక్కగడియయైన నిలువఁజాలను.

సీ. బెడిదంపుసోమరిపడుచు లుండెడునింటఁ,
బరిశుద్ధిలేని వెంబరలయింట,
మైలమొగంబుల మగువలు గలయింట,
మలమూత్రములబిడ్డలాలయునింట

నెంగిలాకులమీఁద నీఁగ లాడెడునింటఁ,
జీరలఁ జీడపేల్జాఱునింట,
నాత్మీయధర్మంబు లడుగంటిచెడునింట,
ననదలు సాయంబుఁ గననియింటఁ,
గలిమి లేమిగ సుఖము దుఃఖంబుగాఁగ
మార్పఁగలమెబ్బె రాసులు మలయునింట
నిలువఁగాఁజాల నేనొక్కనిమిషమైన
నిలువఁజాల! నిలువఁజాల! నిలువఁజాల!

మఱియును.

సీ. ఉన్నది తినలేక యొరుల కీయఁగలేక
యుండెడిచోట నే నుండఁజాల,
ముదుకగోనెలఁగ్రుక్కి మూలఁబొఁతలువెట్టు
చుండెడిచోట నే నుండఁజాలఁ,
గల్లుకుండలకు నై యిల్లు గుల్లఁగజేయు
చుండెడిచోట నే నుండఁజాలఁ,
బరిశుద్ధి యొఱుఁగక పాఁలుమాలికఁజూపు
చుండెడిచోట నే నుండఁజాలఁ,
గలిగియుండియు గతిలేనికరణి మెలఁగు
యువతు లుండెడుచోట నే నుండఁజాల,
ఘనదురాచారములు దుర్వ్యసనము లెచట

నుండు నచ్చోటఁ గూడ నే నుండఁజాల.

ఈవీథి యిండ్లన్నియు నొకదాని కొకటి తీసిపో వుటలేదు. ఇందలి యిల్లాండ్రిందఱు నొక్కయా కునే చదివినట్లున్నారు.

గీ. పూర్వగిరిఁ బొ్రిద్దు పొడువకముమపె లేచి
కాలికములగు విధులు చక్కఁగను నెఱపి
శుచిత నిలు దీర్చుకొను నొక్కసుదతియైనఁ
గంటఁ బడదయ్యె నకట! యేయింటనైన.

గీ. స్వాంత మలరించు నిట్టిప్రభాతమందుఁ,
గలకలవెలుంగు కుంకుమ కాంతులందుఁ,
జెలువమున నేత్రపర్వంబు చేయునట్టు
లలికి ముగ్గించు నొక్కయిల్లైన లేదు.

ఎంత వెదకినను నాకెచ్చటను దగినవసతి దొరకు ట లేదు. ప్రొద్దెక్కిపోవుచున్నది. ఎండైన నావి శ్రాంతికిఁ దగినతావు చూచుకొనవలయును. మఱి యొక వీథికిఁబోయి చూచెదఁగాక.

(అని నిష్క్రమించును.)

—

పరిచ్ఛేదము—మఱియొకవీథి.

ప్రవేశము—భోగశీల, ధర్మశీల.

భోగ—అక్కా! మనకోరిక యెప్పుడు ఫలించునో కదా!

ధర్మ—మనమిరువుర మేకీభవించి సంకల్పించినచోఁ దీరనికోరిక లుండునా?

భోగ—నీకెప్పుడు నొక్కటే ధైర్యము. ఇట్లెంతకాలము కనుపెట్టుకొని యుండఁగలము? మనవెచ్చెలి యగుసిరికింకను మనప్రార్థనము వినఁబడుట లేదు. ఆదంపతులు శ్రీమంతులగువఱకు మనకు శాంతియెక్కడిది? వారి నాశ్రయించిన మనకే యింతకష్టముగ నుండఁగా నిరంతరదారిద్ర్యమున నల్లాడు నాదంపతుల కెంతకష్టముగ నుండునోకదా!

ధర్మ—సోదరీ! మృదులహృదయ వగునీ విట్లను చుంటివి గాని నిరంతరశాంతస్వభావులగువారలకుఁ గష్టమగును మాటయే యుండదుసుమా!

భోగ—నాకంత వేదాంతము తెలియదు. ఈయుదయమునఁ జూడలేదా? బయటికి భిక్షకుఁ బోవుటకు భర్తకు బట్టలేకుండుటచే సార్థకనామయగు

మనశాంతమ్మ తనచీర సగముచించి కట్టఁబెట్టి పంపినది. అది యెంతవిచారకరమగువిషయము!

గీ. బట్టయును లేదని దినంతుకొట్టి బిట్టు
రేఁగి పోరాడి మగని వర్జింపకుండఁ,
గట్టుచీర సగము చించి కట్టఁబెట్టి
పంపుమగనాలిఁ గని జాలిపడఁగవలదె?

ధర్మ—ఓసి వెఱ్ఱిదానా! సతీధర్మ మట్టిదేకదా! స్వధర్మనిర్వహణము గావించి యానందించుచున్న యామెనుగాంచి సంతోషించుటకు బదులుగ జాలిపడు టెందులకు?

భోగ—అక్కా! సరేకాని, వారు సంపన్నులైనచో నిట్టిచిక్కు లుండవుగదా! వారి కావిచారమే లేదు. ఇంతేకాక వారు కష్టములే కోరుచుందురని తోఁచుచున్నది. అట్లుకానిచోఁ బిడికెఁడు పిడికెఁడుచొప్పునఁ దెచ్చుకొన్న భిక్షమును వండుకొని తినక యందులో నతిథిపూజలు చేయుట కెవ్వ రభిలషింతురు?

ధర్మ—సాధులస్వభావము లట్టే యుండును. అనుభవజ్ఞులకే యాపన్నుల కష్టములు బాగుగ బోధపడును. కన్నతల్లికే తెలియును గాని బిడ్డబాధ

గ్రాడ్రాలి కెట్లు తెలియును ?

భోగ—అట్టి సాధుస్వభావులను సంపన్నులఁ జేయుక పరమేశ్వరుఁడు భాగ్యహీనులఁ జేయు నెందులకు ?

ధర్మ—జీవితపద్ధతులు కర్మసూత్రముంబట్టి పోవుచుండును. ప్రాప్తికాలము వచ్చినప్పుడుగాని భాగ్యము లభింపదు.

గీ. ఎరువు కొఱఁతలేక యొద్దడి నలయక
మేపు చెడకయుండ నెదుగుచున్న,
వరవసంతకాల మరుగుదెంచినదాఁకఁ
దావి నందఁగలదె పూవుఁదోఁట ?

భోగ—అట్టి శుభసమయముకొఱకు నామనసు వేగిరపడుచున్నది.

ధర్మ—నేఁడు శుక్రవాసరము. ఇది శ్రీదేవికిఁ బ్రియకరమగుదినము. ఆసాధుదంపతులకు సంపత్ప్రాప్తికై యాదేవి నింకొకసారి యీదినమున నిశ్చలహృదయముతోఁ బ్రార్థింతము రమ్ము.

భోగ—అట్లే పోవుదము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

రెండవరంగము.

ప్రదేశము—బ్రాహ్మణగృహము.

ప్రవేశము—అరుఁగుపై బ్రాహ్మణబాలుఁడు.

బాలు—నాయనగారు సెలవిచ్చినట్లు శ్రీసూక్తము చింతన చేసికొంటిని. ఆయన వచ్చువఱకును లక్ష్మీస్తవము చేసికొనుచుందును.

"పద్మాసనే పద్మకరే సర్వలోకైకపూజితే
నారాయణప్రియే దేవి సుప్రీతాభవ సర్వదా."

(అని స్తుతించుచుండఁగా లక్ష్మీదేవి ప్రవేశించును)

లక్ష్మి—(తనలో) ఆహా! ఇచ్చటికి వచ్చుసరికి నా శరీరాయాసము తీఱిపోయినది. నాకన్నులు చల్లఁబడినవి. నాహృదయ మానందతరంగిత మగుచున్నది. గులకఱాలలోఁ గురువిందమణి వలె నీయిండ్లనడుమ నీమందిర మెంత కళకళ లాడుచున్నది! (పరిక్రమించి) ఔరా! ముద్దుల మూటయగు నీబాలకుఁ డెంత మనోహరముగ నున్నాఁడు!

గీ. అలికి ముగ్గులు వెట్టిన యరుఁగుమీఁదఁ
జారుకృష్ణాజినంబుపైఁ గూరుచుండి

వడుగురూపుఁ దాల్చిన వేదవల్లివోలె
నలరుచున్నాఁడు మ్రోల నీయర్భకుండు.

(అని నిట్టూర్పు విడిచి యాయాసము నభినయించు
చు నరుఁగుపైఁ గూరుచుండును.)

బాలు—అమ్మా! మీరెవ్వరు?

లక్ష్మి—మార్గాయాసముచే నలసిన యొక పేదరా
లను. ఆఁకటికిఁ దాళలేకున్న దానను. పట్టెఁడ
న్నముఁ బెట్టించి పుణ్యము గట్టుకొనుము.

బాలు—అమ్మా! నీకష్టముచూచి నాగుండె నీరగు
చున్నది. భిక్షార్థము మానాయనగారు పోయి
యున్నారు. వచ్చువేళయైనది. ఆయన తెచ్చిన
తోడనే వండి మాయమ్మ నీకు వడ్డింపఁగలదు.
కొంచెము సే పోర్చుకొని యుండుము.

లక్ష్మి—(తనలో) ఆహా! ఏమి యీతని యమృత
వాక్కులు! (ప్రకాశముగా) నాయనా! నేనొ
క్క నిమిషమైన క్షుద్బాధ నోర్వఁజాలను. లో
నికిఁ బోయి మీయమ్మనే ప్రార్థింతును.

బాలు—అమ్మా! మాయమ్మ యర్థవసనయై యు
న్నది. ఎప్పటివలె నర్థులు లోనికి రావలనుపడ
కుండుటచేఁ దలుపోరచేసి నేను వారికొఱకై

యరుఁగుపైఁ గూరుచుంటిని. నూనాయన వ
చ్చువఱకును లోని కితరు లెవ్వరును బోవలను
గాదు.

లక్ష్మి—బ్రాహ్మణిని, ఆఁడుదానను. నేను బోవుట
కభ్యంతర మేమి యుండును ?

బాలు—(ఇంచుక యాలోచించి) సరే! పోయి
రమ్మా !

లక్ష్మి—(వీధితలుపు తెఱచి లోపలికిఁ బోయి చా
పపైఁ గూరుచుండి) అమ్మా! (అనిపిలుచును.)
(శాంతమ్మ పడమటింటి తలుపుచాటున మొగముగ
పడునట్లు నిలిచి) ఏమితల్లీ! (అని పలుకరించును.)

లక్ష్మి—ఆఁకలి దహించివేయుచున్నది. పట్టెఁడన్న
ము పెట్టవలయును.

శాంత—(నిట్టూర్పు విడిచి) అమ్మా! వండినయ
న్నము లేదు. కొలఁదిసేపటిలో బియ్యము తె
చ్చెదరు. తెచ్చినవెంటనే నిమిషములో వంట
చేసిపెట్టెదను.

లక్ష్మి—నే నంతవఱ కాఁగఁజాలను. ఎచ్చటనైన
నప్పుఁ దెచ్చియైనఁ బెట్టుము.

శాంత—కలిగినదానితోఁ గడుపుకొనుటయే కాని

నే నెన్నఁడును జేట తీసికొని చేరెఁడు బియ్య
మునకైనఁ బొరుగింటి కప్పానకుఁ బోయి యె
ఱుఁగను.

లక్ష్మి—క్షమియించి యీదినమున నానిమిత్త మిం
చుక శ్రమపడవలయును.

శాంత—(సందేహించును.)

లక్ష్మి—అమ్మా! ఏమట్లు సంశయించుచున్నావు?

శాంత—(దీనస్వరముతో) తల్లీ! నాయొడలినిండ
వసనమైన లేదు. ఆఁడుదానను. వీథిఁబడి పో
వుట యెట్లు?

లక్ష్మి—ఆసందేహ మక్కఱలేదు నాచీర చాలఁ
బెద్దది. ఇందు సగము చించి నీకిచ్చెదను. ఇది
గో! అందుకొనుము.

(అని చెప్పినట్లు చేయుచున్నది.)

(శాంతమ్మ చీరఁగట్టుకొని చేట చేతఁబట్టుకొని ప్ర
వేశించి) అబ్బాయీ! (అని పిలుచును.)

బాలు—(ప్రవేశించి) అమ్మా! ఏమి సెలవు?

శాంత—నే నిప్పుడే వచ్చెదను. అంతవఱకీవీవనతో
విసరుచు నీమెను భద్రముగఁ గాపాడుచుండు
ము. అమ్మా! పోయివచ్చెదను. (అని పోవును.)

(బాలుఁడు నిలువఁబడి విసరుచుండును.)

లక్ష్మి—అబ్బాయీ! నీపేరేమి?

బాలు—ఆనందుఁడు.

లక్ష్మి—మీతండ్రిపేరు?

బాలు—బ్రహ్మసోమయాజి.

లక్ష్మి—నాయనా! నీయుపచారములచే నాకుఁ జాల సుఖముగ నున్నది.

బాలు—లోన నాఁకలి యగుచుండఁగాఁ బైయుపచారము లెన్ని చేసిన నేమి? అమ్మ కప్పుడొరకెనో లేదో!

(కావటివానితో శాంతమ్మ ప్రవేశము.)

లక్ష్మి—అమ్మా! ఇవి యన్నియు నెక్కడదొరకినవి?

శాంత—తల్లీ! నీవు వచ్చినవేళ మంచిది. అప్పునకుఁ బోవనక్కఱ లేకుండఁగనే పెద్దకోమటి యీాస్వయంపాకము పంపినాఁడు. ఇతఁడు నాకెదురుపడుటచే నిట్టె వచ్చితిని. నీ వించుకసేపు విశ్రమింపుము. నిమిషములో నన్నము పెట్టెదను. (అని కావటివానిఁబంపి శాంతమ్మ పరికరములఁ దీసికొని లోనికిఁ బోవును.)

బాలు—(లక్ష్మిఁజూచి) అమ్మా! ఒక్కనిమిషము

చాఁపపైఁ బరుండెదవా!

లక్ష్మి—అక్కఱలేదు నాయనా! అన్నముపేరు వి న్నతోడనే యాఁకలి సగము తగ్గిపోయినది.

బాలు—అట్లయినచో నమ్మ వంట చేయునంతలో నీవు స్నానము చేసికొందువా?

లక్ష్మి—మీనాయనగారు వచ్చి స్నానము చేసిన తరువాతఁ జేయుదును.

బాలు—ఆయనకు నాకు నుదయముననే స్నానసం ధ్యావందనము లైనవి. మాధ్యాహ్నికసంధ్యా సమయ మగుచున్నది. ఏమోకాని మానాయ నగా రింకను వచ్చుటలేదు.

లక్ష్మి—తొందరలేదు. మీతండ్రిబిడ్డలభోజనము లైన తరువాతనే నేనును మీయమ్మయు భుజి యింతుము.

శాంత—(లోపలనుండి) అమ్మా! వంటయైనది. స్నానమునకు లెమ్ము. వేఁడినీళ్లు పెట్టితిని.

లక్ష్మి—నీనాథుఁడుగూడ రానిమ్మ.

(అప్పుడు భిక్షాపాత్రము చేతఁబూని బ్రహ్మసోమ యాజి ప్రవేశించును.)

బాలు—నాయనగారూ! వందనములు. (అనితండ్రి

తెచ్చినవానిని లోనికిఁ దీసికొనిపోవును).

బ్రహ్మ—(లక్ష్మివంకఁజూచి) అమ్మా! నామూలమున నీకాలస్యమైనది కాఁబోలును. తల్లీ! కలవారముకాము. భిక్షుకులము గదా!

లక్ష్మి—అయ్యా! మీయాదరణ మన్నముకంటె నాకు బలకరమైనది. ఆర్తజనశరణ్య మగుమీయాశ్రమముఁ జేరినప్పుడే నాయాయాసము తీఱిపోయినది. మీబాలుని యుపచారములచే మఱియు నానందమైనది.

బాలు—(ప్రవేశించి) నాయనగారూ! వంటయైనది లెండు.

బ్రహ్మ—(ఆశ్చర్యముతో) అప్పుడే వంటయైనదా? ఎట్లు?

బాలు—స్నానము చేయుచుండ మనవి చేసెదను. ఆమెకుఁ బొద్దెక్కినది. శీఘ్రముగ లెండు. అమ్మా! నీవును లెమ్ము.

(అందఱు నిష్క్రమింతురు.)

ప్రదేశము—దేవాలయపరిసరము.

ప్రవేశము—భోగశీల, ధర్మశీల.

ధర్మ—సోదరీ! నీయభీష్టము సిద్ధించినదా?

భోగ—సంపూర్ణముగ నాకు మనశ్శాంతి కలిగినది.

నాఁడు మొదలుగ నానిఱు పేదదంపతుల నిలయ
ము సంపన్నుల నిలయమగుచున్నది.

సీ. రాజు పంపె నటంచు రజతఖండంబులు,
రడ్డి పంపె నటంచు రాజనాలు,
రాణి పంపె నటంచు రవికలుఁ జీరలు,
సాలె పంపె నటంచు సాలువులును
వైశ్యుఁ డంపె నటంచు వలసిన వస్తువుల్,
కరణమంపె నటంచుఁ బెరుఁగునేయి
కాఁపు పంపె నటంచుఁ గాయగూరలుఁబండ్లు,
దొరలు పంపి రటంచు దోవతులును,

గీ. దినదినంబును బట్టించుకొనుచు వచ్చి
యర్పణము చేసి పోయెడు నట్టివారి
యనుపమోత్సాహరవము మిన్నంటిపోవ
నలరుచున్నది పేదబ్రాహ్మణు గృహంబు.

ఆపేదరాలానాఁటియర్ధరాత్రిమున నదృశ్యమై
పోవుటచే వాదంపతులామెకొఱకే పరితపించిపోవు
చున్నారు ఆమెష్టల్లనిపాదములఁ దలఁచుకొని త
ల్లడపడుచున్నారు. పాప! మామె శ్రీమహాలక్ష్మి
యని వారి కెట్లు తెలియును?

ధర్మ—ఆనందతన్మయత్వమున నీవన్నియును మఱచిపోవుచున్నావు. ఆదేవి నిన్నటిరాత్రి వారికి స్వప్నమునఁ బ్రత్యక్షమై నేను శ్రీమహాలక్ష్మి నని చెప్పినట్లు నీవు వినలేదా? నేఁడు వారు శుక్రవారవ్రతము చేయఁగడఁగుట యూమె యూనతినే కాదా!

భోగ—ఔను. ఈవిధముగాఁ బ్రతిశుక్రవారము నైదుసంవత్సరములు చేయవలయునఁట కాదా?

ధర్మ—అయిదుగురు ముత్తైదువలకుఁ దలలంటిపోసి చీరల అవికల నొసంగి మృష్టాన్నముల భుజియింపఁజేసి యథేచ్ఛముగ దక్షిణతాంబూలములచే సంతుష్టిపఱచుచుండవలయును.

భోగ—లక్ష్మీకటాక్షమునఁ గృతార్థులగు నాదంపతుల కిదియొక లెక్కలోనిది కాదు.

గీ. సంపద లొసంగు శుక్రవారంపునోము
నోఁచునది; నోముమన్న దానుతగుణాఢ్య,
పంకజాలయ, శ్రీదేవి, భక్తిపూర్ణ
హృదయు లాదంపతులు, వారికేమికొదవ?

ధర్మ—అదిగోఁ బుణ్యసతీ పరివృతులై యాదంపతులు పుత్త్రిసహితముగ దేవీసందర్శనమునకు

దేవళమునకు వచ్చుచున్నారు. మన మచ్చటి మహోత్సవముల నదృశ్యులమై యాలోకించి యానందితము రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

ప్రదేశము—దేవాలయాంతర్భాగము.

ప్రవేశము—బ్రహ్మసోమయాజి, శాంతమ్మ, ఆనందుఁడు, మఱికొందఱు పుణ్యస్త్రీలు.

(సోమయాజియు శాంతమ్మయు దేవికి హారతిఁ బట్టియుండఁగా నానందుఁడు ఘంటానాదముచేయుచుండును.)

(అందఱు)

గీ. మంగళము సర్వలోక సమ్మాననీయ !
మంగళము సర్వశక్తి సంపత్ప్రకాశ !
మంగళము కరుణాంచితాపాంగ పూర!
మంగళము విష్ణుభామ ! రామాలలామ!

జయము ! మహాలక్ష్మి ! జయము ! (అనివిజయధ్వనులు చేయుదురు.)

(అనంతరము దేవీమూర్తినుండి)

ఓ పుణ్యదంపతులారా ! పుత్త్రసహితులగు మీకు శుభ మగుఁగాక !

సీ. ఆర్తస్వరంబులో నమృతసంగీతంబు
నాలకించిన పుణ్యులయ్య మీరు!
నిఱుపేదతనములో నిధినాయకత్వంబు
చూఱలాడిన మహీసురులు మీరు!
ప్రాఁతపేలికలలోఁ బసిఁడిచేలంబుల
తళుకుఁ గాంచినమహాత్తములుమీరు!
అతికష్టజలధిలో నానందరమతోడ
మాటలాడిన మహామహులు మీరు!

తే. అతిథులందు ననదలందు నార్తులందు
నాత్మసాదృశ్యముం గాంచు ననఘు లీరు!
ధన్యతములార! మీకు మీతనయునకును
నాయురారోగ్య విభవంబు లగునుగాక!

ఇంకను మీ కేమి కావలయును?

బ్రహ్మ—
శాంత— } (చేతులు జోడించుకొని) తల్లీ!

గీ. సత్యశౌచదయాధర్మ శమదమాది
సద్గుణసముద్రు లగుభక్తసత్తములకు
నందఁగా రాని నీకృపాపాంగదృష్టి
బడయఁగల్గితి, మిం కేమి వలయునమ్మ!

బ్రహ్మ—అమ్మా! అయిన నిట్లగుఁగాక!

గీ. ధరణి యీతిబాధలు లేక తనరుఁగాక!
ప్రజల యన్యోన్యవైరముల్ పాయుఁగాక!
కవిత, రాజపోషణమునఁ గ్రాలుఁగాక!
నీతిపాలనమున రాజు నెగడుఁగాక!

శాంత—

గీ. కాంతలకు భూషణంబులకంటె నీప్సి
తార్థములకంటె భోగభాగ్యములకంటె
నిండుప్రాణంబుకంటె నన్నింటికంటె
మగనియానతియే ప్రియంబగునుగాక!

(దేవిమూర్తినుండి) తథాస్తు! తథాస్తు! తథాస్తు!

అందఱును—తథాస్తు! తథాస్తు! తథాస్తు!

(అందఱు నిష్క్రమింతురు.)

☞ ఇది బడిపిల్లలకొఱకు వ్రాయఁబడి యానంద వాచకమునఁ జేరియున్నది. (1913-14.)

ప్రథమభాగము సంపూర్ణము.